





# కొంచెం ఇష్టం
# కొంచెం కష్టం






పొత్తూరి విజయలక్ష్మి








# రచయిత్రి ఇతర రచనలు









# కొంచెం ఇష్టం
# కొంచెం కష్టం

(ఆంధ్రభూమి దిన పత్రిక కాలమ్)

పొత్తూరి విజయలక్ష్మి

శ్రీ రిషిక పబ్లికేషన్స్

హైదరాబాదు

***Konchem Ishtam - Konchem kashtam***

A column published in Andhrabhoomi, Daily

By **Pothuri Vijayalakshmi**

© P. Vijayalakshmi

*First Edition* : 2013

*Price* : ₹. **120/- $ 10**

*For Copies* :

**Sri Rishika Publications**
&
**All leading Book Shops**

*Book Production* :
**T. Muralidhar Gowd**
9393 176 552

*D.T.P.*
**B. Suvarna**
*Literacy House, AMS, Hyderabad -500007*

*Cover Concept:*
**Sarasi**

*Cover Design*
**T. Mallesh**

*Published by* :
**Sri Rishika Publications**
Flat No. 201; Vikasini Apartments
2-2-1121/3 & 3A, New Nallakunta,
Hyderabad - 500 044
e-mail:pvlakshmi8@gmail.com
Ph : 040-2763 7729

*Printed at :*
**Karshak Art Printers**
(*Multicolour Printers & Designers*)
40-APHB, Vidyanagar, Hyderabad - 500 044
Ph : 040-2761 8261

# పరిచయం

శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి గారితో పరిచయం ముప్పై సంవత్సరాల క్రితం కలిగింది. మా భారతీయ విజ్ఞాన సంస్థలో తెలుగు సాంస్కృతిక కార్యక్రమాల బాధ్యత వహించే పరిశోధనా విద్యార్థి శ్రీ బసిరెడ్డి సుధాకరరెడ్డి ఒకరోజు అతి ఉత్సాహంగా వడిగా వచ్చి శ్రీవారికి ప్రేమలేఖలు రాస్తూ వుంటారే ఆ పొత్తూరి విజయలక్ష్మిగారు ఇప్పుడు బెంగుళూరులోనే వుంటున్నారుట. మన సమితిలో మాట్లాడిద్దాం అన్నాడు.

ఆంధ్రప్రభ వారి ద్వారా ఆవిడ చిరునామా సేకరించి ఫోనులో పరిచయం చేసుకుని పై ఆదివారం మా ఇన్స్టిట్యూట్‌కి పన్ చాంగాల పతాభిగారి ప్రసంగం వుంది దానికి రండి అని ఆహ్వానించాను.

ఆవిడ పతీసమేతంగా రావడంతో సభకి నిండుదనం వచ్చింది. ఆయన ఆరడుగుల ఆజానుబాహుడు. ఆవిడ ఆయనకి ఈడూజోడూ. సభకి వారిని మా సభ్యులకి పరిచయం చేశాను. ఆవిడ భర్త పేరు శివరావుగారు.

శివరావుని సాగదీస్తే శ్రీవారు అవుతారని మాకు అర్థం అయింది.

ఆ తరువాత ఒక సభలో ఆవిడను శ్రీవారికి ప్రేమ సంభాషణ అనే అతి కష్టమైన. అతి దుర్లభమైన విషయంపై మాట్లాడమన్నాం.

శ్రీవారంటే భర్త. భర్తలను నాలుగు భాగాలుగా విభజిస్తే అంటూ మొదలు పెట్టి చాలా సరదాగా మాట్లాడారు. ఆవిడ ఉపన్యాసం ఒక ప్రవాహం.

నవ్వించే చాతుర్యం ఆవిడకి సహజాభరణం.

ఆవిడ రచనలుకూడా మనతో మాట్లాడతాయి. ఆవిడది శబ్దాశ్రయ హాస్యం కాదు భావ ప్రధానం. నిజ జీవితంలోని సంఘటనలను హావభావాలతో ప్రత్యక్ష పురాణంలా చెప్తూవుంటే కడుపుబ్బ నవ్వుతూ మరోపక్క ఆవిడ చేసిపెట్టిన పకోడీలు తింటూ వినడం ఒక గొప్ప అనుభవం.

మనం కొందరు హాస్య రచయితల్ని కలుసుకొన్నప్పుడు వారి నోటివెంట ఒక్క జోకైనా వస్తుందేమో విందాం అని ఆశపడుతూ వుంటాం. వాళ్ళేమో నోట్లో మట్టిగడ్డ పెట్టుకున్న మొండి చంటి పిల్లల్లాగా నోరే విప్పరు.

విజయలక్ష్మిగారు అలాకాదు. ఆవిడని పలకరిస్తే చాలు ప్రవాహంలా జోకులు పొర్లుకొస్తాయి. ఏ సాహిత్య సభలోనూ హాస్యం గురించి పల్లెత్తుమాట పలకని గంభీర కథకులు, విమర్శకులు కూడా ఆవిడ సమక్షంలో (భోజరాజు సమక్షంలో కవుల్లాగా) ప్రభావితులైపోయి, గంటలకొద్దీ నవ్వుతూ మాట్లాడ్డం నాకు తెలుసు. హాస్యం ఒక రోగం. అదో అంటువ్యాధి. She Carries the germs of humer always. ఎంతో మంది రచయితలు వారింటికి వెళ్ళి కమ్మటి భోజనం చేసి మరింత కమ్మని కబుర్లు విని మనసారా నవ్వుకుని వస్తారు. అందుకే ఆ దంపతులు స్నేహితుల పరిధి పెరుగుతూనే వుంటుంది ఎల్లప్పుడూ.

ఒక సందర్భంలో అంత్యప్రాస గురించి మాట్లాడుతూ "తెల్లావు వేసింది నల్లపేడ ఆ క్షణమే వచ్చాను నిన్ను చూడ" అని ఒక పాట పల్లవి వుంది ఒక సినిమా స్క్రిప్ట్‌లో అన్నాను. ఆవిడ ఆశ్చర్యంగా చూశారు.

"అచ్చే ఈ పాట నేను రాయలేదు చాలా కాలం క్రిందట జయంతి అనే రచయిత రచయిత్రి రాసిన స్క్రిప్టు సిద్ధంగా వుంది సినిమా తియ్యండి అనే కళాకళపు సినిమా కథలోది ఈపాట" అన్నాను.

ఆ జయంతిని నేనే అన్నారు విజయలక్ష్మిగారు వినయంగా. ఆశ్చర్యపోయాను. నేను ఆ జయంతి అభిమానిని అని చెప్పుకున్నాను. మొదట్లో జయంతి అనే కలం పేరుతో కథలు రాశారు విజయలక్ష్మిగారు.

హాస్య రచయిత్రిగా పేరు ప్రఖ్యాతులు గడించుకున్న విజయలక్ష్మిగారు పొగ, మేరాభారత్ మహాన్ వంటి గొప్ప హాస్యేతర కథలు కూడా రాశారు. ఇప్పుడు 'కొంచెం ఇష్టం, కొంచెం కష్టం' అనే కాలమ్ రాశారు.

విజయలక్ష్మి గారి రచనల్లో వుండే లక్షణాలన్నీ ఈ కాలమ్‌లో కూడా పుష్కలంగా వున్నాయి. చక్కని భాష, తెలుగు నుడికారాలు, చమక్కులు, చమత్కారాలు వ్యంగ్యపు చురకలు ఎన్నో వున్నాయి.

పందిరి పాతిన నాడు వున్న ఉత్సాహం పదహారోజుల పండుగ నాడు వుండదని చెప్పారు.

మనం పందిరి గుంజకి అయినా పరిచయం చేసుకుంటాం. ఇప్పటి పిల్లలు అలాకాదు. ఎవరి మూడ్స్ వారికే. ఎవరి ఆటలు వారికేలా తయారయ్యారని బాధపడతారు.

సినిమాల్లో కథ తిరునాళ్ళలో తప్పిపోయిన గుంట వెధవలాగా కాసేపిటూ కాసేపటూ అని చెప్పే ఇన్‌సైడర్ ఆవిడ.

ముఖాముఖీ పరామర్శలాగిపోయి ముఖ పుస్తక పరామర్శలు వచ్చాయని వాపోతారావిడ.

ఈ కాలమ్‌లో ఇంగ్లీషు జంటిల్‌మన్ సిండ్రోమ్‌లో బాధపడుతున్న భర్త, పారబోసి విత్తుకునే పనిమంతురాలైన ఇల్లాలూ వున్నారు. కొడుకూకోడలూ, కూతురూ, అల్లుడూ, మనవడూ మనవరాళ్ళూ కూడా వున్నారు.

మరి విజయలక్ష్మి గారి కుటుంబంలో భర్తగారి గురించి మాట్లాడేసుకున్నాం శిరి అమ్మ అనే కూతురూ శీనుపండు అనే అల్లూడూ. కంప్యూటర్ ప్రవీణుడైన కొడుకూ, రాధా అనే కోడలూ వున్నారు. మనవళ్ళు వున్నారు.

ఇందులో ఆవిడ చెప్పే విషయాలు ఆవిడ చూసినవే. కనుక ఆవిడ అనుభవాలే కామోసు.

ఈ పుస్తకంలో ఆవిడ చెప్పిన గొప్ప విషయాలు ఎన్నో వున్నాయి. అవన్నీ నేనెందుకు చెప్తాను? చెప్పనుగాక చెప్పను. అలా చెప్పుకుంటూపోతే ఆవిడ నాకన్నా గొప్ప రచయిత్రి అన్న విషయం ఏమరుపాటున ఒప్పేసుకోనూ?? అందుకే నేను చెప్పను. మీరే చదివి తేల్చుకోండి.

బెంగుళూరు
20 జూన్ 2013

**కవనశర్మ**

# ధన్యవాదాలు

నవలలు, కథలు, రాశాను గానీ కాలమ్ రాయటం ఇదే మొదలు. కాలమ్ రాయడంలో అనుభవం కాకపోయినా నాకు అవకాశం ఇచ్చి "కొంచెం ఇష్టం - కొంచెం కష్టం'' కాలమ్ రాయించిన ఆంధ్రభూమి దినపత్రిక సంపాదకులు శ్రీ ఎమ్.వి.ఆర్. శాస్త్రిగారికి, అడిగిన వెంటనే అంగీకరించి ముందుమాట రాసిన ప్రముఖ రచయిత శ్రీ కవనశర్మగారికి కృతజ్ఞతలు.

మా శ్రీ రిషిక పబ్లికేషన్స్ నుంచి వెలువడుతున్న ఏడవ పుస్తకం ఇది. మొదటి పుస్తకం నుండి ఇప్పటిదాకా అన్ని బాధ్యతలూ తనపైనే వేసుకుని పుస్తకాలను అందంగా తయారు చేసి ఇస్తున్న 'పుస్తకశిల్పి' శ్రీ తాళ్ళపల్లి మురళీధర్‌గౌడుగారికి, డి.టి.పి. చేసిన లిటరసీహౌస్, ఆంధ్రమహిళాసభ వారికి, అందమైన ముఖచిత్రాన్ని రూపొందించిన ప్రముఖ చిత్రకారులు శ్రీ సరసి గారికి కృతజ్ఞతలు.

కాలమ్ వెలువడుతున్నంతకాలం ప్రతివారం శ్రద్ధగా చదవి మెయిల్స్ ద్వారా ఫోన్ ద్వారా తమ స్పందనని తెలియజేస్తూ నాలోని ఉత్సాహాన్ని ఇనుమడింప చేసిన పాఠకులకు ధన్యవాదాలు.

ఎప్పుడూ నా అండగా వుండి అన్ని విధాలా సహకరిస్తున్న నా కుటుంబ సభ్యులకు, 'ఇంకా రాయండి' అని ప్రోత్సహించే నా సాహితీ మిత్రులకు, నా రచనలను ప్రచురిస్తున్న పత్రికలవారికి, పుస్తక విక్రేతలకు నా కృతజ్ఞతలు.

**పొత్తూరి విజయలక్ష్మి**

# సూచిక


పేజీ నం.

1. సూపర్ డూపర్ హిట్టు... 9
2. పార్టీకి వచ్చిన తిమింగిలం 12
3. దేవుడే దిగివస్తే... 15
4. పొమ్మంటే పోతుందా... 17
5. మీరెందుకొచ్చారు? 20
6. దేభ్యం 23
7. స్టోర్ రూం నించీ డబ్బు సంపాదన 26
8. మా ఏడుపు మేము ఏడుస్తాం 29
9. నుమాయిష్ వైరాగ్యం 32
10. కంప్యూటరూ – కాల్ సెంటరూ 35
11. సర్టిఫికెటు ఉందా? ఐతే ఓకే! 38
12. ఇదిలాగే జరుగుతుంది 41
13. వింతలూ – విడ్డూరాలు! 44
14. రాకోయీ అతిథీ మా ఇంటికీ! 47
15. బొమ్మ ఇచ్చిన బహుమతి! 50
16. సిరిగల వారినే సిరి వరిస్తుంది 53
17. ముద్దుగారే యశోదా 57
18. సుఖంగా బతకాలనుకుంటున్నావా? అయితే చంపేయ్ 60
19. పదం కాని పదం 63
20. గంభీరమైన సమస్య 66
21. కొత్త కౌంటర్ 69
22. ఎవరిగోల వారిది 72
23. వీకెండొచ్చేసింది బాబోయ్ 75
24. ఉచితానుచితాలు 78
25. అటకల్లేని అమెరికా 81

| | |
|---|---|
| 26. ప్రజా సేవలో ఇస్త్రీ పెట్టె | 83 |
| 27. అమ్మయ్య గండం గడిచింది | 87 |
| 28. మరి ఈ వెర్రి వెధవల మాటేమిటి? | 90 |
| 29. ఎదుటి మనిషికి చెప్పేటందుకే | 93 |
| 30. అతుకుల బొంతలు | 96 |
| 31. ఏదీ మనకు గుర్తింపు? | 99 |
| 32. గణితంలో ఉద్దండ పండితులు | 103 |
| 33. వి'చిత్ర' వేషధారణ | 106 |
| 34. మన చేతుల్లో ఏముంది? | 109 |
| 35. నేను కూడా కొనుక్కుంటా | 113 |
| 36. ఇప్పుడు మీ వంతు | 116 |
| 37. చింతపండుతో పండుగ | 120 |
| 38. ఇది చండికల (చండీరావుల) దేశం | 123 |
| 40. సమాచారం దొర్లిపోతోంది | 126 |
| 41. బొత్తిగా దైవాధీనం బతుకులు | 129 |
| 42. గృహ ప్రవేశం | 133 |
| 43. ఈ ఐడియా మన జీవితాలని మార్చేస్తుంది! | 137 |
| 44. తాళం వేస్తారు జాగ్రత్త | 141 |
| 45. బహుమతుల కష్టాలు | 145 |
| 46. సంగీత గండం | 149 |
| 47. మీకెందుకూ నేనున్నాగా... | 153 |
| 48. చక్కగా పద్ధతిగా | 157 |
| 49. కొత్త కొత్త వంటలు | 161 |
| 50. భరించలేనంత భద్రత | 163 |
| 51. వెతుకుల బతుకులు | 167 |
| 52. ఎంతెంత దూరం? | 171 |
| 53. పిచ్చబొట్టు | 174 |
| 54. మా మహిళా దినోత్సవం | 178 |
| 55. కావలసిన వస్తువులు | 182 |
| 56. నంబికొండా ఏం సాయం? | 186 |

# సూపర్ డూపర్ హిట్టు...

**ఇం**ట్లోకి వచ్చాను. " ఫోన్లేమైనా వచ్చాయా?" అని అడిగాను. ఎందుకంటే అలా అడగకపోతే వాళ్ళు మర్చిపోతారు. చెప్పరు.

"అవును వచ్చాయి. ఏదో బ్యాంకు వాళ్ళు అప్పిస్తామన్నారు. ఇంకెవరో భాగ్యలక్ష్మిగారబ్బాయి వాళ్ళ తాలూకట. రేపు వాళ్ళ సినిమా ప్రత్యేక ప్రదర్శన. ఆ తర్వాత విజయోత్సవమూనట. మిమ్మల్ని తప్పకుండా రమ్మన్నారు. మళ్ళీ ఫోన్ చేస్తారుట" అంది మా పనమ్మాయి. భాగ్యలక్ష్మి నా బాల్య స్నేహితురాలు. దాని పుత్రరత్నం బబ్లూ.

ప్రాణం ఉసూరుమనిపించింది. మొన్ననేగా రిలీజైంది. ఇవ్వాళ్ళింకా మూడోరోజు. అప్పుడే విజయోత్సవమా??? ఏమిటో మా బబ్లూగాడి సినిమా ఈసారైనా బతికి బట్టకడుతుందేమో అనుకున్నా. ఈసారీ ఫట్టుమంది. మొదటిది 'మరో మనసు'. రెండోది 'నువ్వు నవ్వు లవ్వు' ఇది. 'గొబ్బి-మరదలుపిల్ల' ముచ్చటగా మూడోదైనా ఆడితే బాగుండేది. కానీ ఇదీ విజయోత్సవం దిశగా దూసుకు పోతోంది.

టివి. ఆన్ చేశా. ఓ ఛానల్‌లో అప్పుడే కుర్చీవేసుకుని కూర్చున్నారు గొబ్బెమ్మ మరదలు పిల్ల చిత్రం యూనిట్. బబ్లూగాడు ఎర్ర టీషర్టేసుకుని కూర్చున్నాడు. "మా సినిమా విజయం సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. ఇందుకు అఖిలాంధ్ర ప్రేక్షకులకీ నమస్సుమాంజలులు" అంటున్నాడు బబ్లూ. మంచి ఫీల్ ఉన్న పిక్చరుగా తెగ పొగిడేస్తున్నారు అంటున్నాడు మ్యూజిక్ డైరెక్టరు. "ఇట్ గివ్స్‌మీ లాట్ ఆఫ్ శాటిస్‌ఫాక్షన్ అంటున్నాడు" స్టోరీ రైటరు. "ముహూర్తం రోజునే హిట్ అనుకున్నాం గానీ మరీ ఇంత హిట్టని మేము గెస్ చెయ్యలేకపోయాం" అంటున్నాడు హీరో. "నా విజయం వెనక మా అమ్మ ఆశీర్వాదం ఉంది..." అన్నాడు బబ్లూ. ఇంకా ఆ సినిమా సూపర్ డూపర్ హిట్టు గురించి మాట్లాడుకుంటున్నారు అందరూ.

ఇక లాభం లేదు. ఓసారి వెళ్ళి మా భాగ్యాన్ని పలకరించి రావాలి. లేకపోతే అది ఫీలైపోతుంది. కాఫీతాగి బయలుదేరా... వాళ్ళిల్లు బంజారా హిల్స్‌లో. వెళ్ళేసరికి హాల్లోనే కూర్చుని ఉంది భాగ్యం. నన్ను చూడగానే పేలవంగా నవ్వింది. "చూసావుటే" అంది దీనంగా. "ఆ సినిమా చూళ్ళేదు గానీ పరిస్థితి చూస్తూనే ఉన్నా! ఏం చేస్తాం. వూరుకో" అని ఓదార్చాను. "వీడికి పిచ్చేమిటే నా ఖర్మ కాకపోతే. నలుగుర్లో నవ్వులపాలు అయిపోతున్నా" అంది భాగ్యం. నిజమే మరి దాని బాధ దానిది. ఈ సినిమా రిలీజ్ కోసం అమెరికానించల్లావచ్చింది.

"ఊరందరిదీ ఓదారీ, ఉలిపికట్టెది ఓదారీ" అన్నట్టు తయారైంది మా బబ్లూగాడి వ్యవహారం. సామాన్యంగా తండ్రులూ, తాతలూ ఇక్కడుండి పిల్లలు అమెరికా పోతారు. కానీ బబ్లూగాడి విషయంలో అది కాస్తా తారుమారైపోయింది. వాడి తాతలూ, తండ్రులు అంటే తండ్రి, పెత్తండ్రులూ, పినతండ్రులూ అందరూ ఏనాడో అమెరికా వలస పోయారు. తల్లిదండ్రులకి బబ్లుగాడు ఒక్కడే సంతానం. తగలేసినంత డబ్బుంది వాళ్ళకి. అక్కడే ఏ ఉద్యోగమో, వ్యాపారమో ఏడిస్తే బానే ఉండేది. మరిదెలా అంటుకుందో వీడికి సినిమా పిచ్చి పట్టుకుంది.

ఏమాటకామాటే చెప్పుకోవాలి. వాడికి మంచి ఐడియాలే ఉన్నాయ్. తెలివితేటలూ ఉన్నాయ్. వాడు తీసిన సినిమాలు కూడా మరీ అంత దారుణంగా ఏం లేవు. ఏదో సంసారపక్షంగా బానేఉన్నాయ్. మరి అదేమిటో ఏ ఒక్కటీ ఆడలేదు.

పాపం భాగ్యం బెంగపడిపోతోంది. "ముప్పైదాటాయి. డబ్బు పోతే పీడాపోయింది. వీడిలా సినిమా వెనకాల సినిమా తీస్తూ ఉంటే ఎట్లాగే? పెళ్ళి చేసుకుని సెటిల్ అవ్వాలి కదా! అంతా నా ఖర్మ. వీటితోటి వాడేగా మా అక్కకొడుకు టింకూ గాడు. వాడు ట్రావెల్ ఏజన్సీ, వీడు సినిమాలు ఒక్కసారే మొదలెట్టారు. వాడేమో ఆరుకార్లతో మొదలెట్టి ఇప్పుడు అరవై కార్లు తిప్పుకున్నాడు. వీడేమో ఇదిగో ఇలా! ఎలా చావమంటావే?" అని మొత్తుకుంటోంది.

మేము మాట్లాడుకుంటూ ఉండగానే వచ్చాడు బబ్లూ. నన్ను చూడగానే వాడి మొహం వాడిపోయింది. ధైర్యం చెప్తూ నాలుగు మాటలు మాట్లాడాను. "రివ్యూల్లో చూశారా ఆంటీ ఎలా ఏకేశారో? నేను హీరోయిన్‌కి లంగా ఓణీ వేశానుట. ఈరోజుల్లో అలా ఎవరుంటున్నారు? చాలా అన్ నేచురల్‌గా ఉంది అన్నారు. ఇదేమైనా బావుందా?

మరి పెద్ద పెద్ద హీరోలు పందిరిమంచం తలకింద నించీ, పరశురాముడి గొడ్డలి తీసి డజన్ల లెక్కన మర్డర్లు చేస్తూ ఉంటే అందులో ఈ క్రిటిక్స్‌కి అన్నాచురాల్టీ కనిపించలేదా?'' అన్నాడు ఉక్రోషంగా.

"అది కాదు బబ్లూ. పందిరి మంచం కింది నుంచీ పరశురాముడి గొడ్డలేం ఖర్మ అటకమీంచీ బుల్డోజరు దించి, దానితో వందలాదిమందిని తొక్కి చంపేసినా అడిగే వాళ్ళుండరు. ఎందుకంటే వాళ్ళ దగ్గర్నించీ అంతకు మించి ఆశించరు జనాలు. చూసేస్తారంతే."

"మరి ఆ సినిమాలు బ్రహ్మాండంగా ఆడేసి బాక్సాఫీసుని బద్దలుకొట్టేస్తున్నాయి కదుటే" అంది భాగ్యం.

"అదంతా అయోమయం వ్యవహారం లేవే? ఆడేదీ, ఆడించేదీ అని పాటలో చెప్పినట్లూ అన్నీ వాళ్లే చూసుకుంటారు. అవన్నీ మనకంతు పట్టవు" అనేశా.

"మరి మా వంటివాళ్ళం ఏమైపోవాలి?" అన్నాడు బబ్లూ.

"ఈ సినిమాలు, గట్రా మానేసి ఏ వ్యాపారమో చూసుకో. లేదంటావా నీ ఖర్మ. సినిమాలు తీసి ఇలాగే విజయోత్సవాలు చేసుకో" అని చెప్పేశా. ❑

# పార్టీకి వచ్చిన తిమింగిలం

సాయంత్రం పార్కులో వాకింగ్ చేసి బెంచీ మీద కూర్చున్నా! నాక్కాస్త దూరంలో కొందరు పిల్లలు చేరి చిలోపోలోమని కబుర్లు చెప్పుకుంటున్నారు. పిల్లలు కబుర్లు వినడం అంటే అప్పటి రోజుల్లో రేడియో సిలోన్‌లో వచ్చే బినాకాగీత్ మాల వింటున్నట్లు ఉంటుంది నాకు. వాళ్ళ మాటలు శ్రద్ధగా వింటున్నా.

'మొన్న మా మామయ్య వాళ్ళింటికి వెళ్ళాం. వాళ్ళింటి దగ్గర పెద్దనీటిగుంటలో మొసలి వచ్చింది తెలుసా! చెప్తున్నాడు అబ్బాయి.

"అలాగా! నువ్వు చూశావా" అడిగారు మిగిలిన పిల్లలు.

"ఆఁ చూశా! ఎంత పెద్దగా ఉందో! లక్కీగా మేం వున్నవైపే వచ్చి త్రీ ఫోర్ టైమ్స్ తలపైకి పెట్టి చూసింది" మరింత ఉత్సాహంగా చెప్పాడు వాడు.

"అబ్బ, నువ్వు చాలా లక్కీ మేమూ టీవీలో చూశాం. నువ్వయితే నిజంగా చూసేశావు" అన్నారు వాడివంక ఆరాధనగా చూస్తూ. వాడు చాలా గొప్పగా ఫీలైపోయాడు.

పక్కనున్న మరో అబ్బాయికి ఇదంతా చూస్తుంటే ఉక్రోషం వచ్చినట్టుంది. "నువ్వు మొసలిని చూశావ్. నేను తిమింగిలాన్ని చూశా!" అనేశాడు.

"తిమింగిలాన్నా? ఎక్కడా?" అన్నారందరూ ఆశ్చర్యంగా.

"మా సుధీర్ వాళ్లింటికి పార్టీకొచ్చింది" అన్నాడు. అందరూ నవ్వేశారు. నాకూ నవ్వాగలేదు.

"ఎందుకు నవ్వుతారు?" అన్నాడు వాడు కోపంగా.

"తిమింగిలం అంటే వేల్ కదా! బిగ్గెస్ట్ ఏనిమల్. అది పార్టీకెలా వస్తుంది? ఊరికే స్టోరీలు చెప్పకు" అంటూ ఏడిపించారందరూ.

"స్టోరీ ఏం కాదు. వచ్చింది గాడ్ ప్రామిస్". ఆ పిల్లాడికి ఏడుపొక్కటే తక్కువ.

నాకూ అయోమయంగా ఉంది. వాళ్ళనందర్నీ దగ్గరికి పిలిచా! పరుగున వచ్చేశారు.

"ఏవిట్రా నాన్నా? తిమింగలం పార్టీకి రావడం ఏమీటీ?" అని అడిగా.

"నిజమేనాంటీ! నాకో ఫ్రెండున్నాడు. వాడిపేరు సుధీర్. వాడికో అంకుల్ ఉన్నాడు. ఆ అంకుల్‌ని ఆ మధ్యన ఎసిబి వాళ్ళు పట్టుకున్నారుట. ఏసిబీ వలలో చిక్కిన తిమింగిలం అని పేపర్లో రాశారు. సుధీర్ నాకు చెప్పాడు. భలే మా అంకుల్ తిమింగిలంట. ఆయన్ని ఎసిబీ వాళ్ళు పట్టుకున్నారట. అని సరదాపడ్డాడు." నేను మా డేడీతో చెప్పా.

"అవున్రోయ్. నిజమే... పేపర్లో వేశారు. అయితే ఆ తిమింగిలం మీ ఫ్రెండ్ వాళ్ళ అంకులా?" అన్నాడు డేడీ. లాస్ట్‌మంత్ మా సుధీర్ బర్త్‌డే పార్టీకి పిలిచాడు. నేను వెళ్ళా. సుధీర్ ఓ అంకుల్‌ని చూపించి అడుగోరా ఆయనే తిమింగలం అంకుల్ అన్నాడు సీక్రెట్‌గా.

పార్టీకి ముందు ఒరే పార్టీకి ఆ తిమింగిలం అంకుల్ వస్తాడు. అందరి ఎదుటా ఆయన్ని తిమింగిలం తిమింగిలం అన్నావంటే చంపేస్తాం అని చెప్పారుట సుధీర్ వాళ్ళ డేడీ వాళ్ళు. అందుకే సీక్రెట్‌గా చెప్తున్నా అన్నాడు మా సుధీర్!" అంటూ కథ మొత్తం చెప్పేశాడా పిల్లాడు.

"నిజం మొసలి మొసలే గానీ, అంకుల్ తిమింగిలం ఎలా అవుతాడు?" అని వాదించాడు మొసలిని చూసిన అబ్బాయి.

మరి తిమింగిలం కాకపోతే పేపర్లో ఎందుకు రాస్తారని? వాడి వాదన.

కాసేపు సీరియస్‌గా వాదించుకుని కాంప్రమైజ్ అయిపోయారు!

"ఒరే! మరి ఆ మొసలిని పట్టుకుని ఏం చేస్తారు చంపేస్తారా?" ఒక అబ్బాయి అడిగాడు.

"చంపరు. జూలో వదిలేస్తారుట!" సమాధానం చెప్పాడు ఇంకో అబ్బాయి.

"మరి మీ సుధీరు వాళ్ళ తిమింగిలం అంకుల్ని పట్టుకున్నారు కదా! ఆయన్ని ఎక్కడ వదిలేస్తారు?" అడిగాడు ఒకడు.

"ఏమో మరి?" అని బుర్రగోక్కున్నాడు తిమింగలం కథ చెప్పిన అబ్బాయి.

"ఆంటీ! మీరు చెప్పండి. తిమింగిలం అంకుల్ని పట్టుకున్నారు కదా! ఎక్కడ వదిలేస్తారు?" అని అందరూ నన్నడిగారు.

"ఇలాటి తిమింగిలాలకు స్పెసిఫిక్‌గా జూలూ అవీ ఉండవు కదా! అందుకనే పట్టుకొన్నట్లే పట్టుకుని పట్టుకున్న చోటే వదిలేస్తారు. అందుకే కదా బంగారూ... ఆ తిమింగిలం అంకుల్ పార్టీకి వచ్చాడు" అని చెప్పేశా.

బాలలంటే మన భావి భారత పౌరులు కదా! వాళ్ళని ఇప్పటినించే ఎడ్యుకేట్ చెయ్యడం పెద్దలుగా మన బాధ్యత. వాళ్ళని భ్రమలో ఉంచకూడదు. నిజం దాచకూడదు. ఉన్నది ఉన్నట్లు చెప్పేస్తే మన పద్ధతులన్నీ వాళ్ళకి చక్కగా అర్థం అవుతాయి. భవిష్యత్తులో అయోమయం ఉండదు. ❑

# దేవుడే దిగి వస్తే...

**హ**మ్మో ఇంకేమైనా ఉందీ! దేవుడిని ప్రత్యక్షంగా చూడాలంటే ఎంత అర్హత ఉండాలి. ప్రహ్లాదుడు, ధ్రువుడు, వంటి భక్తశిఖామణులు తట్టుకుని నిలబడగలిగారు గానీ, మామూలు వాళ్ళకి గుండాగి పోతుంది.

మన మొరలన్నీ వింటాడో లేదో అని ఓ వైపు అపనమ్మకంతోనే పూజల్ని చేసేస్తున్నాం. కాబట్టి ఈ మాత్రంగానైనా వున్నాం. ఖచ్చితంగా వింటాడు అనే నమ్మకం ఉంటే ఇలా ఉండదు సమాజం!

కాస్త పేరు, ప్రఖ్యాతీ ఉన్న ప్రతీ ఆలయంలోనూ నిత్య పూజలు యథావిధిగా జరుపుతుంటారు. ఉత్సవాలు చేస్తుంటారు. బ్రహ్మోత్సవాలూ చేస్తుంటారు. ధ్వజారోహణం నాడు సమస్త దేవతలనూ, ఆ ఉత్సవానికి ఆహ్వానిస్తారు. సాంగం సాయుధం సపరివార సమేతంగా విచ్చేసి ధ్వజారోహణం దాకా ఉండమని ప్రార్థిస్తారు. అంతా బానే ఉంది.

ఉత్సవాలలో ఏదోరోజు ఆస్థానం జరుగుతూ ఉండగా దేవుడు ప్రత్యక్షమై భక్తులారా ఇవాల్టి హుండీ ఆదాయం ఎంత చెప్పారు సరే. బావుంది. మరి తరతరాలుగా ఉన్న నా మడిమాన్యాల విషయం ఏమిటీ? నాతో బాటు మిగిలిన దేవతలంతా కూడా వచ్చిఉన్నారు. వారి వారి దేవాలయాల మడిమాన్యాల లెఖ్ఖ కూడా చెప్పండి అని చిద్విలాసంగానే ప్రశ్నిస్తే ఎలా ఉంటుంది?

ఊహించుకుంటేనే భయంకరంగా లేదూ!

'భక్తురాలా! ఆదివరకు చక్కగా శుక్రవారం పరమాన్నం, బొబ్బట్లూ వగైరా పిండివంటలన్నీ నైవేద్యం పెట్టేదానివి. నీ మొగుడికి మధుమేహం వచ్చాక ఎప్పుడు చూసినా పులిహోరా, గారెలేనా? నీకేమైనా బుద్ధి ఉందిటే అని అమ్మవారు కోప్పడితే!! ఏ గంగలో దూకాలి? నిజానికి అందర్లోకీ అతి మంచి దేవుడు మన గణపయ్య. ఏ శుభకార్యం ప్రారంభించినా ఆయన్ని తల్చుకుంటే చాలు. భారమంతా తనమీదే వేసుకుని

ఆ కార్యం నిర్విఘ్నంగా జరిపిస్తాడు. కాసిని ఉండ్రాళ్ళూ, ఇన్ని శనగలూ నైవేద్యం పెడితే చాలు. పొంగిపోతాడు. అందుకే వినాయకుడంటే మనకంత ప్రీతి. ప్రతి వాళ్ళింట్లోనూ అయిదారు వినాయకుడి బొమ్మలుంటాయి. పెళ్ళైతే చాలు కనీసం పాతిక విగ్రహాలు బహుమతి రూపంలో వస్తాయి. ఏడాదికోమారు ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు జరుపుకుంటాం. ఊరూరా, అడుగడుగునా వినాయకుడి పందిళ్ళే. పూజల దాకా బానేవుంది. ఎటొచ్చీ నిమజ్జనమే అటూ ఇటూ అయిపోతుంది. అప్పటిదాకా ఉన్న భక్తి, శ్రద్ధా, ఓపికా, ఉత్సాహం మరికాసేపుంటే బావుండుననిపిస్తుంది. మరీ విగ్రహం పూర్తిగా నీట మునగక ముందే సుత్తులూ, శేనాలు పట్టుకుని మీదపడిపోతుంటే ఆ గణపయ్య హఠాత్తుగా ప్రత్యక్షమైతే ఎలా ఉంటుందో??

నీ మొహం మండా? కాస్తాగండ్రా మీ ఆత్రం మండిపోను! అని నవ్వుతూనే మందలించడూ!

ఆమధ్య నాకో అనుభవం అయింది. దేవుడు ప్రత్యక్షం అయ్యాడు. వివరంగా చెప్తాను. మావి రైల్వే క్వార్టర్లు. అరెకరం స్థలంలో ఉండేవి. ఇంటి చుట్టూ చెట్లూ, పుట్టలూ ఉండేవి.

దీపావళి వెళ్ళగానే ఓ మంచి పుట్టని ఎంచుకుని పనివాళ్ళకు పురమాయిస్తే ఆ పుట్టచుట్టూ ఉన్న గడ్డీగాదం చెక్కేసి శుభ్రంగా అలికేసి సిద్ధం చేసేవాళ్ళు. నాగులచవితినాడు పొద్దున్నే చక్కగా ముగ్గులేసుకుని, పీటవేసుకుని కూర్చుని శ్రద్ధగా పూజ చేసేదాన్ని. చిమ్మిలి, చలివిడి, అరటిపళ్ళూ నైవేద్యం పెట్టి, గ్లాసెడు ఆవుపాలు పుట్టలో పోసేదాన్ని. అలాగే ఆ ఏడాదీ చేశాను.

మర్నాడు పొద్దున అటువెళ్తుంటే ఆ పుట్టపక్కన బారెడు పొడుగు ఉన్న పాము జరజర పాకుతూ కనిపించింది. నా పైప్రాణం పైకే పోయింది. పరుగున వచ్చి ఇంట్లో పడ్డా. అదే ఆఖరు. ఇక ఆ తర్వాత ఎప్పుడూ పుట్టలో పాలు పొయ్యడానికి సాహసించలేదు. నామీద దయతల్చి పంచమినాడు ప్రత్యక్షం అయ్యాడు గానీ, చవితినాడే పూజా సమయంలోనే ప్రత్యక్షం అయితేనో? తల్చుకుంటేనే వెన్నులోంచి వణుకొచ్చేస్తుంది. అందుకే దేవుళ్ళు ప్రత్యక్షం కాకుండావుంటేనే వాళ్ళకీ సుఖం. మనకూ సుఖం. ❑

# పొమ్మంటే పోతుందా...

**మా** ఇంటికొచ్చాడో పెద్దాయన. పద్ధతీ పాడూ తెలిసినవాడే. ముందుగా ఫోన్ చేసి చెప్పిన టైముకి ఓ పది నిముషాల తర్వాత వచ్చాడు. మంచి నీళ్లూ, కాఫీ ఇచ్చాను. నా గురించి యోగక్షేమాలు అడిగాక 'అమ్మా ఇక మీరు నడుం కట్టుకోవాలి' అన్నాడు.

'ఇప్పుడేం ఖర్మ. నాలుగేళ్లుగా కట్టుకుంటూనే వున్నా, మెడకే ఇంకా రాలేదు' అన్నా.

ఆయనకి అర్థం కాలేదు. 'ఏమిటీ ఏం కట్టుకుంటున్నారు?' అని నన్నే అడిగాడు.

'అదేనండీ బెల్టు నడుముకి కట్టుకుంటూనే వున్నా...' అని చెప్పాను.

"ఛఛ.. అది కాదు. మీరో గొప్ప పని చెయ్యాలి. ప్లాస్టిక్ వాడకం ఆపమని ఉపన్యాసం ఇవ్వాలి' అన్నాడు.

'అలాగా! ఎక్కడా?' అని అడిగాను.

వాళ్ల అపార్ట్‌మెంట్లో వినాయక చవితి చేస్తున్నారుట. తొమ్మిది రోజులూ ప్రోగ్రామ్‌లట. అందులో భాగంగా ఓ రోజు నేను మాట్లాడాలిట. 'ప్లాస్టిక్ వాడొద్దని చెప్పి వాళ్లలో చైతన్యం కలిగించాలి. మీరు చెప్తే దాని ఎఫెక్టు బావుంటుంది' అన్నాడు.

'అయ్యో అవశ్యం. అంతకంటేనా! కాకపోతే ఏం చెప్పాలో నాకే తెలీదు. వాళ్లకేం చెప్పను?' అని అడిగాను.

'అదేమిటి? ఇంత చిన్న విషయం తెలీదా?' ఆశ్చర్యపోయాడాయన.

'తెలియదు. మీరు చెప్పండి. వాళ్లకి నేను చెప్తా' అన్నాను.

'కూరలకి ప్లాస్టిక్ కవర్లు వాడరాదు. గుడ్డ సంచీలు పట్టుకెళ్లాలి. ఆ మాటే ఘట్టిగా చెప్పండి'.

'సరే, కూరలకి ప్లాస్టిక్ సంచులు వాడద్దు. మరి పాలు? అవ్వెలా? పాలు సంచీలో తెచ్చుకోలేం కదా? అడిగాను.

‘పాల కవర్లు రీసైకిలు అవుతాయి కదా!’ అన్నాడు.

‘ఏ సైకిలు అయినా అవీ ప్లాస్టిక్ కవర్లే కదా! అన్నా.

బుర్ర గోక్కున్నారు. ‘ప్రస్తుతానికి పాల విషయం పక్కన పెట్టండి’ అన్నారు.

‘అలానే పక్కనపెడదాం. నెక్ట్స్ నిత్యావసర వస్తువులు. ఉప్పులూ, పప్పులూ, సూపర్ మార్కెట్లలో ప్లాస్టిక్ కవర్లలోనే అమ్ముతారుగా. వాటి విషయం ఏమిటి?’ అన్నా.

తలొంచుకుని గంభీరంగా ఆలోచించారాయన.

‘ప్రస్తుతానికి ఆ విషయం కూడా పక్కన పెడదాం’ అన్నాడు.

‘మరి మంచినీళ్లు అని కూడా ప్లాస్టిక్ సీసాల్లో పొట్లాల్లో అమ్ముతున్నారు కదా!’ అన్నాను. ఆ విషయం కూడా పక్కన పెడదాం! అన్నాడు.

‘అన్నీ పక్కన పెడితే ఇంక నేను ఉపన్యాసం ఏం ఇవ్వనూ?’ అంటే ఆయనకి చాలా కోపం వచ్చింది. ‘వితండ వాదం అంటే ఇదే. కాస్త పేరొస్తే చాలు. ఇదుగో ఇలా తల తిక్కగా వ్యవహరిస్తారు. మీ దగ్గరికి రావడం నాదీ బుద్ధి తక్కువ’ అనేసి నిష్క్రమించాడు.

ఆయనక్కోపం వస్తే దానికి నేనేం చెయ్యనూ? మరి సమస్య భయంకరమైనది. మన జీవితంతో పెనవేసుకు పోయిన ప్లాస్టిక్‌ని నిషేధించడం అంటే సామాన్యమా? దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్య కదా! అటువంటి గంభీరమైన సమస్యని పరిష్కరించుకోవాలంటే రిలే పరుగు పందెంలాగా అందరూ తమ శక్తిని వినియోగించి ప్రయత్నిస్తేనే విజయం వైపు దూసుకెళ్లగలరు. మధ్యలో ఒహడు చేతులెత్తేస్తే శ్రీమద్రమా రమణ గోవిందో హరి.

ప్లాస్టిక్ వాడకం ఆపడం అంత తేలిక కాదు. నిష్ణాతులైన వారు ఓ ప్లాన్ వెయ్యాలి. కొనేవాళ్లు, అమ్మేవాళ్లు, ఆఫీసర్లు, గవర్నమెంటూ అందరూ ఏకమై కాస్త చిత్తశుద్ధితో ఆ పథకాన్ని గౌరవించాలి. ఆచరించాలి. అప్పుడు ప్లాస్టిక్ సమస్య తొలగిపోతుంది. అదీ కొన్నేళ్ళ తర్వాత!

అలా కాకుండా ఏదో అల్లాటప్పాగా ప్లాస్టిక్ వాడడం నిషేదం అని సినిమా హాళ్లలో సైడ్స్ వేసేసి హాల్లోనే చిప్స్ పేకెట్లూ అమ్ముతుంటే... సభలు పెట్టి ప్లాస్టిక్

వాడకండి మహాజనులారా అని ఉపన్యాసాలిచ్చి బయట ప్లాస్టిక్ కప్పులో టీ సర్వ్ చేస్తుంటే... ఎక్కడికి పోతుందీ ప్లాస్టిక్? నిను నీడని నేనే అన్నట్లు మన వెంటనంటే ఉంటుంది. ఇప్పుడాయన పిలిచాడు కదా అని తగుదునమ్మా అని నేను పోయి వినాయకచవితి పందిట్లో ఉపన్యాసం ఇచ్చి ఆనక వాళ్లు ప్లాస్టిక్ కప్పులో అందించిన ప్రసాదం నోట్లో వేసుకుని ప్లాస్టిక్ గ్లాసులో నీళ్లు తాగి వాళ్లిచ్చిన బహుమానం ప్లాస్టిక్ కవర్లో పెట్టుకుని ఫోటోకి పోజులిస్తే చూసిన వాళ్లంతా పిచ్చి పీనుగ అని నన్ను చూసి నవ్వుకోరూ?

కాదూ కూడదు ప్లాస్టిక్ వాడకం ఇప్పుడర్జంట్‌గా నిర్మూలించాల్సిందే అంటే ఓ పని చెయ్యచ్చు. ప్రతివాళ్లూ రోజుకింత ప్లాస్టిక్ అయినా వాడకపోతే శిక్షిస్తాం అని రూలు పెడితే వద్దన్న పని చెయ్యడం మన రక్తంలోనే వుంది కాబట్టి కొంతలో కొంత ప్రయోజనం ఉండొచ్చు. ఆ దిశగా ఆలోచిస్తే సరి? ❑

# మీరెందుకొచ్చారు?

సాయంత్రం ఆరింటికి ఒక సభకు వెళ్ళాల్సి వచ్చింది. కొన్ని కొన్ని పన్లు నచ్చకపోయినా చచ్చినట్లు చెయ్యాలి. హాల్లో పాతికమందిపైనే ఉన్నారు. అంతమంది ఉన్నారంటే సభ కిటకిటలాడుతున్నట్లే అనుకోవచ్చు.

ఆరింటికి సభ అని ఆహ్వాన పత్రికల్లో వేశారు గానీ ఆలస్యంగా ఏడింటికి మొదలు పెట్టారు. ఒకాయన వేదికమీదికి వెళ్లి ఒక్కొక్కరినే వేదికపైకి సగౌరవంగా ఆహ్వానించాడు. పన్నెండుమంది వేదికనలంకరించారు. మరో మూడు కుర్చీలు ఖాళీగా ఉన్నాయి వాళ్ళింకా రాలేదుట. రాగానే తిన్నగా వేదికమీదికే వస్తారు అని హామీ ఇచ్చి సభాకార్యక్రమం మొదలు పెట్టారు.

ముందుగా ప్రార్థన. ఇద్దరు పిల్లలు చక్కగా పరికిణీ ఓణీలు వేసుకుని ప్రార్థన పాడారు. ముందు ప్రాక్టీసు చెయ్యలేదేమో చెరోదారీ అయిపోయింది.

అందర్నీ స్టేజిమీదికి ఆహ్వానించినాయన ఇక ముందు జరగాల్సిన కార్యక్రమాన్ని అధ్యక్షుల వారు జరిపిస్తారు అనేసి వెళ్ళి కుర్చీలో కూర్చుని మంచినీళ్ళబాటిలు తీసుకుని గడగడ నీళ్ళు తాగేశాడు.

అధ్యక్షుల వారు మైకు అందుకున్నారు. ఈనాటి సభకు ముఖ్య అతిథి, గౌరవ అతిథి, మామూలు అతిథి, ప్రధాన వక్త, ఇంకో వక్త, మరో వక్త అంటూ వేదిక మీదున్న వారందరినీ వాళ్ళ బిరుదులూ, ఇంటిపేర్లూ ఏ మాత్రం పొల్లుపోకుండా చేర్చి సంబోధిస్తూ ఆహ్వానం పలికారు. ఓ పావుగంట మాట్లాడి ఇంకా మాట్లాడాల్సింది చాలా వుంది గానీ, ఇంకా మాట్లాడాల్సిన వారు చాలా మంది ఉన్నారు కాబట్టి నేనింతటితో ముగిస్తున్నానని మరో వ్యక్తికి మైకందించారు.

ఆయన లేచి గౌరవనీయులు అంటూ మళ్ళీ ప్రవర మొదలు పెట్టాడు.

"అమ్మా పన్నెండు పన్నెండ్లు ఎంత?" నా పక్కనున్నాయన అడిగాడు.

"నూటనలభై నాలుగు" చెప్పాను.

భారంగా నిట్టూర్చాడు. "ఇప్పుడు మనం నూటనలభై నాలుగుసార్లు పేర్లే వినాలి. అవిగాక ఉపన్యాసాలుండనే ఉన్నాయి." అన్నాడు దీనంగా.

మా రోజుల్లో ప్లాస్టిక్ గ్లాసులుండేవి కాదు. ఇంట్లో ఏదైనా శుభకార్యానికి అవసరం అయితే ఏ సత్రం నుంచో గ్లాసులు అద్దెకు తెచ్చేవాళ్ళు. గ్లాసుల మీద 'వాసవి కన్యకాపరమేశ్వరి సత్రం' అనో, 'బృందావన సత్రానికి వేపా సుబ్బారావు గారి జ్ఞాపకార్థం వారి కుమారుడు వేపా కృష్ణమూర్తి గారి ధర్మం" అనో చెక్కించి ఉండేవి. అప్పట్లో పెళ్ళిళ్లలో వధూవరులకు స్టీలు సామాన్లే చదివించేవారు. వక్కపొడి భరిణ ఇచ్చినా, రెండిడ్లీలు పట్టే స్టీలు ప్లేటిచ్చినా దానిమీద చిరంజీవి సౌభాగ్యవతి సీతాలక్ష్మిని వివాహ సందర్భంలో ఆశీర్వదించి గణపవరం బాబాయి దక్షిణామూర్తి బాలా త్రిపుర సుందరి పిన్ని ఇచ్చినది అని పేరు వేయించేవారు.

ఆ తరువాత అలా పేర్లేయించడం మానేశారు. అప్పట్లో పాత్రల మీద పేర్లు వేసినట్లు ఇప్పుడు సభల్లో పాల్గొన్నవారిని వాళ్ళ బిరుదులూ, సన్మానాలు తగిలించి సంబోధించడం ఆనవాయితీగా మారిపోయింది. దాంతో వేదికమీదున్న వాళ్ళ పేర్లే కొండవీటి చాంతాడంత పొడవై పోయి అసలు విషయాన్ని మింగేస్తున్నారు. ప్రేక్షకులకి విసుగొచ్చేస్తోంది.

నా పక్కనున్నాయన బాధా అదే! అందుకే పన్నెండో ఎక్కం గుర్తు చేసుకుంటున్నాడు పాపం. "ఇప్పటి పన్నెండే గానీ.. ఇంకొంత మంది రావాలిట కదా! మరప్పుడు మనం పధ్నాలుగో ఎక్కమో, పదిహేనో, పదహారో ఎక్కమో గుర్తు చేసుకోవాలి" అన్నాను.

"అదో గొడవుంది కదా! మర్చేపోయా" అన్నాడాయన దీనంగా.

"మీరెందుకొచ్చారండీ ఈ మీటింగుకీ?" అని అడిగా.

"అదుగో ఎడంవైపు నించీ రెండో మనిషి ఈ మధ్యనే ఏవో ఆస్తి గొడవలొస్తే మధ్యవర్తిగా సాయం చేశాడు. సభ ఉంది రమ్మన్నాడు. మానేస్తే బావుండదు కదా! నా అవసరానికాయన సాయం చేశాడు. మరి నేనూ ఏదో సాయం చెయ్యాలిగా అందుకే వచ్చా. మరి మీరెందుకొచ్చారు?" అని అడిగాడు.

"కుడివైపు చివర్న కూర్చున్నాయన మా మేనల్లుడికి పెళ్ళి సంబంధం చూస్తున్నాడు. ఈ మీటింగుకొస్తే పిల్ల ఫొటో, జాతకం ఇస్తానన్నాడు. మీటింగు మొదలెట్టక ముందే

వచ్చాను. ఫొటో ఇస్తారా అంటే కూర్చోండి. సభ అయ్యాక ఇస్తాను. తొందరేం? అన్నాడు. అందుకే కూర్చున్నా" అని చెప్పాను.

మరో పదినిమిషాలు అయ్యాక ప్రెస్‌వాళ్లు సంచీలు సర్దుకుని వెళ్ళిపోయారు. హాల్లో పదిమంది మిగిలారు నాతో కలిపి. నాలాగా వాళ్ళకీ వేదిక మీదున్న వాళ్ళతో ఏవో లావాదేవీలూ, మొహమాటాలూ ఉండే ఉంటాయి. అందుకే కూర్చున్నారు.

నా పక్కనున్నాయనికి బొత్తిగా తోచడం లేదు కాబోలు అటుపక్కనున్న పెద్ద మనిషిని పలుకరించి "మీరెందుకొచ్చారు?" అని అడుగుతున్నాడు. ❑

# దేభ్యం

'నిన్న నీకిచ్చిన డబ్బు ఎక్కడుంది?' అడిగారు మా ఆయన. 'నా హ్యాండ్ బ్యాగ్‌లో వుంది' అన్నా... 'దేభ్యం బ్యాగ్‌లోనా' అన్నారు. నాకు వొళ్లు మండిపోయింది. దెబ్బలాట వేసుకున్నా... వున్న మాటేగా అన్నారు అని తండ్రిని వెనకేసుకొచ్చాడు మా అబ్బాయి. 'దేభ్యం నాకో తల నొప్పిగా తయారైంది. అసలు విషయం ఏమిటంటే మా భాగ్యం కొడుకు బబ్లూ సినిమాలు తీస్తూ ఉంటాడూ మీకు గుర్తున్నాడా? అతగాడు ఆరు నెలల కిందట నాకు ఫోన్ చేసి 'ఆంటీ సినిమా ప్లాన్ చేస్తున్నా. మీరు స్టోరీ తయారు చేస్తారా?' అన్నాడు.

నాకు బుర్ర తిరిగిపోయింది. 'ఏమిటీ పిల్లాడు? ఇన్నిసార్లు తలబొప్పి కట్టినా బుద్ధి రాలేదా? ఆ మాటే అంటే పోగొట్టుకున్న చోటనే రాబట్టుకోవాలిట... మంచి విలువలుగల సినిమా తీస్తాడుట. ఓర్పు నశించిపోయింది. చెడామడా చివాట్లు పెట్టా.

ముందు నడుస్తున్న ట్రెండ్‌కి తగ్గట్టు సినిమా తియ్యి. హిట్ కొట్టి నిన్ను నువ్వు ప్రూవ్ చేసుకో. అలా ఒకటి రెండు హిట్లు కొట్టాక ఇక నీ ఇష్టం. ఎన్ని ప్రయోగాలైనా చెయ్యొచ్చు. నేనిట్లాగే తీస్తా. చూస్తే చూడండి. చస్తే చావండి అనచ్చు. అంతేగానీ మొదట్లోనే ప్రయోగాల జోలికి పోవద్దు అన్నాను. ఇంకా చాలా సలహాలు చెప్పాను. ఏ మూడ్‌లో ఉన్నాడో చెప్పినవన్నీ శ్రద్ధగా పాటించాడు.

ఆరు నెలలు కష్టపడి సినిమా తీశాడు. ఫస్ట్ కాపీ రాగానే నన్ను పిలిచాడు. వెళ్లాను. సినిమా మొదలయింది. అంతా ఒక పద్ధతి ప్రకారం నడిచిపోతోంది. మొదటి సీన్లో హీరో పది అంతస్తుల బిల్డింగ్ మీద నుంచి దూకి మొక్కజొన్న కండె కొనుక్కుని హీరోయిజం ప్రదర్శించాడు. హీరోయిన్ తెర మీదికి వచ్చింది. ఓ ఆరేడు సీన్ల దాకా వొళ్లు మాత్రమే చూపించి ఆ తరువాత మొహం చూపించింది. చిన్న చిన్న బట్టలు వేసుకుంది. హీరోయిన్‌కే ఇంత పొదుపుగా బట్టలు వేస్తే ఐటం డాన్సు పిల్లకి ఏం వేస్తారా అని టెన్షన్ పడ్డాను. కానీ మేనేజ్ చేసేశారు.

సినిమాలో ఉండాల్సిన లక్షణాలు అన్నీ ఉన్నాయి. కథ తిరణాలలో తప్పిపోయిన పిల్లాడిలాగా కాసేపు అటు కాసేపు ఇటు పోతోంది. పాటల్లో సాహిత్యం పచ్చి పాలల్లో వెన్నలాగా మ్యూజిక్‌లో కలిసిపోయింది. అదీ తెలుగు పాటో కాదో చచ్చినా అర్థం కావటం లేదు. తోచీ తోచనమ్మ తోడికోడలి పుట్టింటికి వెళ్లిందని సామెత చెప్పినట్లూ ఏం చెయ్యాలో తోచనప్పుడల్లా ఓ పాట పెట్టేశారు. పాటల్లో హీరోకి గంగిరెద్దులాగా బోలెడన్ని బట్టలు వేసి హీరోయిన్‌కి రెండు గుడ్డ పీలికలు చుట్టబెట్టారు.

చార్ అణా మురుకూ బారా అణా మసాలా అన్నట్లూ కామెడీ గుప్పించి వదిలిపెట్టారు. ఇక కథ విషయానికి వస్తే అదీ ప్రేమ  కథ కాబట్టి హీరో హీరోయిన్‌ని పిచ్చిగా ప్రేమించేశాడు. చాలా పొదుపుగా బట్టలు వేసుకుని... నోరిప్పితే ఛండాలమైన భాష మాట్లాడుతూ... చూడటానికే వికారంగా ఉంది. ఆ పిల్ల దాని వ్యవహారం. మరి హీరోకి మాత్రం అదంతా అందంగానే ఉంది. ఆవిడ కోసం ఓ డజను మందిని చంపేసి మరో పాతిక మందిని వికలాంగులుగా చేసేశాడు. ఆవిడ ఛీ కొట్టినా ఏబ్రాసి వెధవలాగా కాళ్ల మీద పడి ప్రేమో ప్రేమో అని ఏడిచాడు.

ఆఖరికి ఆవిడ వేరుసెనక్కాయలు తెమ్మంటే విమానంలోంచి చేలోకి దూకేసరికి ఆవిడకి జ్ఞానోదయం అయింది. ఇతగాడిని పెళ్లి చేసుకుంది. శుభం కార్డు పడేసరికి అసలు మనం ఎవరం ఎక్కడున్నాం అని అయోమయంలో పడ్డాను. ఓ కప్పు కాఫీ తాగి తేరుకున్నా. 'బావుంది సినిమా. దారిన పడ్డావు బబ్లూ' అన్నా. ఇలా తియ్యాలయ్యా సినిమా అని మెచ్చుకున్నా. సంతోషించాడు. ఇక సినిమాని ఎలా ప్రమోట్ చేస్తున్నాడో కూడా చెప్పాడు. ఆడియో రిలీజ్ వగైరాలన్నీ చేశాడు. సినిమా రిలీజ్ అయ్యాక పోటీలు వగైరాలు కూడా పెడతారుట.

సినిమా చూసి వీళ్లు అడిగిన ప్రశ్నలకి సమాధానాలు చెప్పిన వారిలోంచి కొంత మందిని ఎంచి వాళ్ల ఫోటోలు పంపమంటారు.  అలా వచ్చిన ఫోటోలలో పది మందిని ఎంపిక చేసి ఆంధ్రాలో పది మంది ఉత్తమ దేభ్యాలు వీళ్లే అని ప్రకటిస్తారు. వాళ్లకీ ఇంకొకరిని తోడు ఇచ్చి నాగార్జునసాగరూ శ్రీశైలం రెండు రోజుల విహార యాత్ర ఏర్పాటు చేస్తారు. ఖర్చులన్నీ వీళ్లవే.

సినిమా రిలీజ్ అయింది. బాగానే పోతోంది. మా భాగ్యం అమెరికా నించి వచ్చేసింది. పుత్రోత్సాహంతో పొంగి పోయింది. అమ్మయ్య ఈ సినిమా కూడా మూడో

రోజే విజయోత్సవానికి రెడీ అయిపోతోందేమో అని భయపడ్డాను. మొత్తానికి బానే ఆడుతోంది అంది.

ప్రతి పనికి ఓ పద్ధతి ఉంటుంది. ఆ ప్రకారం నడుచుకుంటే బావుంటుంది. అంతేగాని స్వంత తెలివితేటలు ఉపయోగిస్తే అధోగతే. ఆ మాటే చెప్పాను భాగ్యంతో. నువ్విక్కడ వున్నావ్ నీకు అన్నీ తెలుసు. నీ సలహా పాటించి వాడు దారిన పడ్డాడు. నీ మేలు మర్చిపోలేను అంది.

అంతేకాదు నాకు చాలా ఇంపార్టెన్స్ ఇచ్చింది. అందులో భాగంగానే ఉత్తమ దేభ్యం పోటీల్లో విజేతలను ఎంచే బాధ్యత నామీదే పెట్టింది. మరో ఇద్దరు జడ్జీలని తోడు తీసుకుని నేను భాగ్యం పది మంది దేభ్యాలను ఎంచాం.

ఈ దేభ్యాల గోల ఏమిటి అనుకుంటున్నారా? మా బబ్లూ సినిమా పేరు. అదేగా మరి దేభ్యం?! ఇది సక్సెస్ అయిన సందర్భంలో మరో రెండు చిత్రాలకు శ్రీకారం చుట్టాడు. వాడికి ద అనే అక్షరంతో మొదలయ్యే పేర్లు కలిసి వస్తాయిట. ఎవరో గొప్ప న్యూమరాలజిస్ట్ చెప్పారుట. అందుకే దగుల్బాజీ, దురద అనే టైటిల్స్ రిజిస్టర్ చేయించేశాడు.

బబ్లూ నా పట్ల కృతజ్ఞతతో నాకు బోలెడన్ని బహుమతులు ఇచ్చాడు. చీరెలు, సెల్‌ఫోను, హ్యాండ్ బ్యాగ్, చెప్పులు ఇలా ఎన్నో.

ఆ వస్తువులని సినిమా పేరుతోనే వ్యవహరిస్తున్నారు ఇంట్లో వాళ్ళు. వద్దన్నా వినటం లేదు. 'దేభ్యం సెల్‌ఫోన్ తీసుకెళ్తున్నావా? దేభ్యం చీర కట్టుకో నీకు బావుంటుంది. అంటుంటే నాకు చిరాగ్గా ఉంది. ఏదో నా ఫ్రెండ్ కొడుకు గౌరవంతో ఇచ్చాడు. మధ్యలో వీళ్ల ఎగతాళి ఏమిటి?

ఇప్పుడే ఇలా ఉంది. మరి మా బబ్లూ భవిష్యత్తులో తీసిన సినిమాలు కూడా సక్సెస్ అయి నాకు ఇల్లు, కారు కొనిపెడితే దగుల్బాజీ ఇల్లు, దురద కారు అంటారా వీళ్ళు?! ❑

# స్టోర్ రూం నించీ డబ్బు సంపాదన

**మ**ధ్యాహ్నం ఫోన్ మోగింది. ఎవరో ఫలాని పాట రింగ్‌టోన్‌గా కావాలంటే ఫలాని నెంబరుకు ఎస్ఎంఎస్ చెయ్యమనో, ఫలాని తార గురించి తెలుసుకోవాలంటే ఫలాని నెంబరుకు ఫోన్ చెయ్యమనో చేసుంటారు. మామూలు వాళ్లెవరూ ఇలా మిట్టమధ్యాహ్నం ఫోన్ చెయ్యరు. ఆగకుండా ఘణఘణ మోగుతుంటే తియ్యక తప్పలేదు. హలో అన్నాను.

'కంగ్రాట్స్ మేడమ్. మీకు లాట్రీ వచ్చింది.' అందో అమ్మాయి.

'లాట్రీ టికెట్లు కొనే అలవాటు నాకు లేదు. ఎక్కడా షాపింగూ చెయ్యలేదు. మరి లాట్రీ ఎలా వచ్చిందమ్మా?' అని అడిగాను.

'మేము లాట్రీలో కొన్ని ఫోన్ నెంబర్లు సెలక్ట్ చేస్తున్నాం. అందులో మీ నెంబరొచ్చింది. మీరు ఈ నెంబరుకి ఫోన్ చేస్తే డీటెయిల్స్ చెప్తారు' అందా పిల్ల.

నిద్రెలాగా తేలిపోయింది. కాస్త కాలక్షేపం అయినా అవుతుందని ఆ నెంబరేదో నోట్ చేసుకుని ఫోన్ చేశాను.

'కంగ్రాట్స్ మేడమ్. మీరు ఐదు వేల రూపాయల సామాన్లు లాట్రీలో వచ్చాయి. డెలివరీ ఛార్జెస్ అయిదొందల ఎనభై రూపాయలు కడితే మీ ఇంటికే పంపిస్తాం' అని చెప్పిందో అమ్మాయి.

'ఏం వస్తువులొచ్చాయమ్మా?' అని అడిగాను.

'నోట్ చేసుకోండి మేడమ్. మొదటిది నడుముకి కట్టుకునే బెల్టు. అది కట్టుకుంటే నడుం నొప్పి తగ్గుతుంది. ఇంకా కొవ్వు కూడా కరిగిపోతుంది. రెండోది క్రిస్టల్ లాకెట్ చెయిన్. అది మెళ్లో వేసుకుంటే తెలివితేటలు పెరిగిపోతాయి. మూడోది బొద్దింకల మందు. అది వంటింట్లో పెడితే బొద్దింకలన్నీ పారిపోయి ఆర్నెల్ల దాకా తిరిగి రావు.

నాలుగో వస్తువు సీడీకేసు. దీనితో మూడు సీడీలు ఫ్రీ. రామ్‌గోపాల్‌వర్మ ఆగ్, మణిరత్నం విలన్, పవన్ కల్యాణ్ కొమరం పులి...' చెప్తోంది ఆ పిల్ల.

నవ్వాగలేదు నాకు. ఫోన్ పెట్టేశాను.

'ఏవిటా నవ్వు? పిచ్చెక్కిందా?' అంటూ మందలించారు మా బాస్.

హాల్లో కొచ్చేసి తనివితీరా నవ్వుకున్నాను. ఎన్ని ట్రిక్కులో కదా వ్యాపారానికి.

డోర్ బెల్ మోగింది. తలుపు తీశా. రాజు వచ్చాడు. నెలకి ఒకసారి వచ్చి ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు తుడిచి స్టోర్ రూం సర్ది వెళ్తూంటాడు.

మా స్టోర్ రూం అక్షయ పాత్ర లాంటిది. ఈ నెల సర్ది బస్తాడు చెత్త బయట పారేస్తాం. మళ్లీ నెల తిరిగేసరికి మరో బస్తాడు  చెత్త పోగవుతుంది.

ఫ్యాన్లూ లైట్లు తుడిచి స్టోర్ రూం మీద పడ్డాడు రాజు. నేనూ అక్కడే కుర్చీ వేసుకుని కూర్చున్నాను. అది తీసెయ్.. ఇది పారెయ్ అని చెప్తున్నాను. కిందటి నెలంతా పండగలూ పేరంటాలూ... పిల్లలొచ్చి వెళ్లారు. బోలెడంత షాపింగ్ చేశారు. పండుగల సందర్భంగా షాపుల వాళ్లు ఫ్రీ గిఫ్ట్‌లు ఇచ్చారు. అవన్నీ నా నెత్తినే పడేసి పోయారు పిల్లలు.

ఓ కాడ గిన్నె. కాడ బరువు. గిన్నె తేలిక. స్టౌ మీద పెడితే పక్కకి వొరిగి పోతోంది. పచ్చిమిర్చి తరిగే కట్టరు. ఓ చిన్న గోడ గడియారం. తారీకులు మార్చే టేబుల్ కేలండరు. ఇంకా పేరంటాల కెళ్లినపుడు వాళ్లు వాయనం ఇచ్చిన ప్లాస్టిక్ ప్లేట్లు, వెదురు బుట్టలూ... ఆ మధ్యన ఏదో చైనీస్ షాపుకెళ్లి మా ఆయన కొన్ని వస్తువులు కొనుక్కొచ్చారు. అవి చూసేందుకే తప్ప వాడేందుకు పని కిరావు. నీళ్లు తెర్లబెట్టి అందులోనే టీ పొడి కూడా వేసేస్తే డికాషనొచ్చే కెటిల్, చప్పట్లు కొడితే కీచు కీచు మనే చిలుక బొమ్మ. ఇలాంటివే ఓ అరడజను వస్తువులు ఏదైనా అరవై రూపాయలేగా పడుంటాయి అని పట్టుకొచ్చారు.

వాటన్నింటినీ చూస్తుంటే ఓ ఐడియా వచ్చింది నాకు. 'అవన్నీ ఇటు పక్కగా పెట్టు రాజా' అన్నా. ఏదో గుడ్డేటుగా కొన్ని ఫోన్ నెంబర్లకి ఫోన్ చేసి మీకు లాట్రీ వచ్చింది. డెలివరీ ఛార్జెస్ మూడొందలే అని. వాటిల్లో కొన్ని వస్తువులు పేక్ చేసి వాళ్లిళ్లకి పంపితే ఎలా ఉంటుందీ? ఆ పనికి మా రాజు ఉండనే ఉన్నాడు. నేనంటే చాలా విశ్వాసం మా రాజుకి. ఇవి పట్టుకెళ్లి ఫలానా చోట ఇచ్చిరా రాజా ఛాయ్ పైసలిస్తా అంటే కాదనడు.

ఓ ఇద్దరు ముగ్గురు పిచ్చి సన్నాసులు దొరికినా చాలు. పబ్బం గడిచి పోతోంది. ఇటు చెత్తా వదిలిపోతోంది. నాలుగు డబ్బులూ వస్తాయి. ఏం డబ్బు చేదా? కూరలో, పాలో కొనుక్కోవచ్చు.

ఈ మధ్య 'ఇంట్లో కూర్చునే డబ్బు సంపాదించండి' అని హోరెత్తించేస్తున్నారు కదా. ఇదీ అందులో భాగమే. తప్పేం కాదు. బిలో ప్రిస్టేజ్ కానే కాదు. స్టోర్ రూంలో కూర్చుని డబ్బు సంపాదన. శుభస్య శీఘ్రం. వెంటనే లేచి ఫోన్ తీసుకున్నా. ఒక నెంబరు డయల్ చేశా. అదిగో రింగ్ అవుతోంది. మరి సెలవా? ❑

# మా ఏడుపు మేము ఏడుస్తాం

**ఒ**క నాయకుడు రాజీనామా చేస్తున్నాడుట అనేవార్త ఛానెల్స్‌లోనూ హెడ్‌లైన్స్‌లో వచ్చింది. మా నెత్తిన పిడుగు పడినట్లయింది. మా సీతాపతి మామయ్య, సుందరమ్మ అత్తయ్య వెంటనే లేచి గుండెదడ వచ్చినప్పుడు వేసుకునే మాత్ర వేసేసుకున్నారు. అది ఎమర్జెన్సీ మెడిసిన్. వేసుకోకపోతే ప్రాణాలు పోతాయి. మా తమ్ముడేమో డీప్ బ్రీతింగ్ మొదలు పెట్టాడు. మనసుకి చాలా బాధ కలిగినప్పుడు అలా డీప్ బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్ చెయ్యమని యోగా టీచరు చెప్పాడుట.

సొజ్జప్పాలు చెయ్యనా, పాలపూరీ వండుకుందామా అని అడిగింది, మా మరదలు. ఆ రెండూ అమృతంలా వండుతుంది ఆవిడగారు. ఈ వార్త తెలియకముందు విందులూ వినోదాలూ చేసుకుందామనే అనుకున్నాం. "పగవాడు చచ్చినా పరమాణ్ణం వండుకోకూడదు అంటారు. ఇటువంటి ఆపత్సమయంలో తీపి పిండివంటలేం వండుకుంటాం? వద్దులే" అనేశాను. ఎవరికీ మనసులు బాగాలేవు. మరి విషయం అటువంటిది. దుఃఖం వచ్చేస్తోంది. చుట్టాలింట్లో పెళ్ళి ఉంది. ఆ సందర్భంగా మా ఇంటికి నలుగురూ వచ్చారు. సరదాగా కాలక్షేపం చేద్దాం అనుకున్నాం. మా ఖర్మ కాలి ఇప్పుడే ఈ విషాద సంఘటన జరిగింది. "ఏమిటలా ఏడుపుమొహం వేశావ్" అన్నారందరూ! ఏడవక ఏం చెయ్యనూ... పరిణామాలు ఊహించుకుంటేనే భయంగా ఉంది. నాయకుడు రాజీనామా చెయ్యడం అంటే మాటలా? సినిమాకి సెన్సార్ సర్టిఫికెట్‌లా, ప్రయాణం అనుకోగానే రైలు టిక్కెట్టు కొనుక్కోవడం లాగా, పెళ్ళికి పసుపు దంచడం లాగా జరుగబోయే మహానాటకానికి ఇది ఆరంభం మాత్రమే.

వెనకటికి మా ఊళ్ళో దేవుడి ఉత్సవాలు జరిగినప్పుడు భారీగా ప్రసాదాలు పంచే వాళ్ళు. ఊరిజనం అంతా క్యూలో వచ్చి ప్రసాదం తీసుకునే వాళ్లు. ఓసారి తీసుకున్న వాళ్ళు తిని వెళ్లిపోయేవాళ్లు కాదు. బావి దగ్గరికెళ్ళి చెయ్యి, మూతీ కడుక్కుని వచ్చి మళ్లీ క్యూలో నిలబడే వాళ్లు. ఎవరైనా గుర్తుపట్టి "అదేవిట్రా ఇప్పుడేగా తిని

వెళ్ళావు. మళ్ళీవచ్చావేం" అని నవ్వుతూ అడిగితే ఇందాకొచ్చింది నేను కాదు మా అన్నయ్య– అని దబాయించేవాళ్ళు. నిజం వాళ్ళకీ తెలుసు. వీళ్ళకీ తెలుసు. అందుకే నవ్వేసి వూరుకునేవాళ్ళు.

అదే విధంగా ఇలా రాజీనామాలు చేసినవాళ్ళు ఇంటికెళ్ళి వ్యవసాయం, పుస్తక పఠనం చేసుకుంటారా?? ఛ...ఛ... అమంగళం ప్రతిహత మగుగాక. మళ్ళీ బై ఎలక్షన్లలో పోటీకి నామినేషను వేసేసి నానా అవస్థాపడి నెగ్గేసి ప్రమాణ స్వీకారం చేసేసి గానీ ఊపిరి పీల్చుకోరు. మరింతటి భాగ్యానికీ రాజీనామా ఎందుకు అంటే అప్పుడు మాకు జరిగిన అన్యాయానికి కడుపు మండి రాజీనామా చేసేశాం. జనం మళ్ళీ నన్నే గెలిపించారు. ఇదుగో ఇప్పుడు చూపిస్తా నా గొప్పతనం అంటారు. మొదటిదానికి మొగుడు లేడు కడసారి దానికి కల్యాణం అన్నట్లు నిజంగా ప్రజలకి ఏదైనా మంచి చెయ్యదలుచుకుంటే మొదటిసారి గెల్చి పదవిలోకి వచ్చినప్పుడే చెయ్యొచ్చుగా! దాని కోసం రాజీనామా చేసి, మళ్ళీ పోటీ చేసి, మళ్ళీ పదవిలోకి వచ్చీ, ఎందుకీ నాటకం?

అసలైనా మనదీ బుద్ధి తక్కువ. ఎప్పుడో స్వతంత్రం వచ్చినప్పుడు పెట్టుకున్న రూల్స్ ఏ మాత్రం మార్చకుండా అవే పట్టుకు వేలాడుతున్నందుకు ఈ శాస్తి జరగాల్సిందే. ఎవరైనా పరీక్ష తప్పినా ఏ అనారోగ్యం కారణంగానో పరీక్ష రాయలేక పోయినా దాని ఫలితం అనుభవించాల్సిందే. మర్నాడే ఆ పిల్లాడి కోసం బల్లా కుర్చీ వేసి ప్రత్యక్షంగా పరీక్ష పెట్టరు.

మరి రాజీనామా ఇచ్చిన వాళ్ళకు అలాంటి నిబంధనలేం ఉండవు. వాళ్ళకోసం వెంటనే మళ్ళీ ఎలక్షన్లు పెడతారు. రాజీనామా చేసిన నాటినించే మళ్ళీ పోటీచేసే అవకాశం కల్పిస్తారు. అలా వీల్లేదు. మధ్యలో "రాజీనామా చేస్తే మళ్ళీ జనరల్ ఎలక్షన్లు వచ్చేదాకా ఆగాలి. అప్పుడు కావలిస్తే పోటీ చెయ్యొచ్చు" అని రూలు పెడితే రాజీనామా అనే పదం నిఘంటువు నుండి తొలగిపోతుంది. మొండి పిల్ల అలిగి పుట్టింటికి పోయినట్లు ఊ అంటే రాజీనామా చేసే సంప్రదాయానికి తెరపడుతుంది.

మేం రాజీనామా చేస్తే మీకేం బాధ అంటారేమో! మాకు కాక ఇంకెవరికీ? మా టాక్స్ డబ్బులే కదా వారెన్నిసార్లు మధ్యంతర ఎన్నికలు నిర్వహించినా?! ఒక్క ఎలక్షన్‌కీ ఖర్చు పెట్టే డబ్బుతో ఆగిపోయిన ప్రాజెక్ట్ పూర్తి చేసుకోవచ్చు. ఆ డబ్బుతో పరమ ఘోరంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు జీవం పొయ్యొచ్చు. చిన్న పిల్లలకు మధ్యాహ్న

భోజనంలో కమ్మటి భోజనం పెట్టొచ్చు. ఇంకా ఎన్నెన్నో చెయ్యొచ్చు.

అయినా నా తెలివి తక్కువగానీ మోట సామెత చెప్పినట్లు ప్రజానీకం మీద వాళ్ళకు దృష్టే వుంటే మనదేశం ఇలా ఉండేది కాదు.

మీకంతగా పదవులు పడకకపోతే పదవులకు రాజీనామా కాదు, రాజకీయ సన్యాసం చేసి వెళ్ళి ఇళ్ళల్లో కూర్చోండి. మీ కాళ్ళు కడిగి ఆ నీళ్ళు నెత్తిన చల్లుకుంటాం. మా పిల్లలకి మీ పేర్లు పెట్టుకుంటాం– అని చెప్పాలనిపిస్తోంది.

ఇలాంటి పాలకులూ, మనలాంటి ప్రజలూ ఉన్న మన ఖర్మ భూమికి అయిదేళ్ళకి ఒకసారి ఎన్నికలు చాలు. కరువులో అధికమాసాల్లాగా ఇలా చీటికీ మాటికీ మధ్యంతర ఎన్నికలు కూడా తోడైతే మట్టికొట్టుకు పోతాం!" అని ఆక్రోశం బయట పెట్టుకున్నది మరదలు.

ఈ జనారణ్యంలో మనలాంటివాళ్లు ఎంత ఏడిచినా అది అరణ్య రోదనే! అన్నాడు మా సీతాపతి మామయ్య.

"దేశంలో ఇన్ని సమస్యలుండగా చీటికీ, మాటికీ బై ఎలక్షన్స్ రాకుండా ఉంటే చాలా దేవుడా– అనే స్థితికి దిగజారిపోయాం కదా అక్కయ్యా!" అన్నాడు మా తమ్ముడు దీనంగా.

మా అందరికీ ఏక కాలంలో కళ్ళనీళ్లొచ్చాయి! ❑

# నుమాయిష్ వైరాగ్యం

**కొ**త్త సంవత్సరం వచ్చేసింది. కొత్త సంవత్సరం వస్తూ వస్తూ ఎగ్జిబిషన్‌ని వెంటబెట్టుకొస్తుంది.

ఫ్రెండ్స్ ఫోన్‌చేసి ఎగ్జిబిషన్‌కి వెళ్తున్నారా అని అడిగారు.

"ఆ! ఏం వెళ్తాం? ఇంట్లో అన్నీ ఉన్నాయి. తినే ఓపికా లేదు. తిరిగే ఓపికా లేదు" అన్నాను.

"మేమూ డిటో డిటో. అప్పట్లో అంటే ఏడాదికోసారి వచ్చేది ఎగ్జిబిషన్. దానికోసం ఏడాదంతా ఎదురు చూసే వాళ్లం. ఇప్పుడలా కాదుకదా. ఎప్పుడూ ఏదో ఓ ఎగ్జిబిషన్ జరుగుతూనే ఉంటుంది పీపుల్స్ ప్లాజాలో. ఇక శిల్పారామంలో అయితే నిత్య కల్యాణం పచ్చతోరణం" అన్నారు వాళ్లు.

"అవును అదీగాక లేపాక్షివారి సిల్క్ చీరల ఎగ్జిబిషన్ ఏడాది పొడుగునా ఎక్కడో ఓ చోట నడుస్తునే ఉంటుంది కదా! ఇంకేం కొంటాం? అలమరలు తీస్తే మీద పడుతున్నాయి బట్టలు. కిందటేడాది ఎగ్జిబిషన్‌లో కొన్న దుప్పట్లే ఇంకా వాడలేదు. ఈ ఏడు వెళ్లం" అని చెప్పేశాను.

వెళ్లదల్చుకోలేదు కూడా. జనవరి మొదటివారం అంతా న్యూ ఇయర్ గ్రీటింగ్స్ చెప్పుకోడాలూ హడావుడి సరిపోయింది.

రెండోవారం అంతా పండగ హడావుడి. భోగిపళ్లు, బొమ్మల కొలువులు... సందడి సందడిగా గడిచిపోతుంది.

మూడోవారం అంతా ఖాళీగా విసుగ్గా గడిచింది. ఏదో ఆరాటం. మనసులో ఏదో అలజడి. ఏదో వెలితి.

చూస్తుండగానే జనవరి నాలుగోవారం వచ్చేసింది.

ఇక లాభం లేదు. ఓసారి వెళ్లి చూసొద్దాం. కొనొద్దు. వూరికే వెళ్లి ఓ రౌండు

కొట్టి వచ్చేద్దాం అనుకున్నాం. నలుగురైదుగురం కలిసి జనవరి ఆఖరివారంకి వెళ్లాం. టికెట్ కొనుక్కున్నాం.

ఎగ్జిబిషన్‌కి సామాన్యంగా స్వంత వాహనం తెచ్చుకోం. అక్కడెక్కడో ఆపి పార్కింగ్‌కి బోలెడంత చెల్లించి డ్రైవ్ చేసిన వాళ్లు కాళ్లీడ్చుకుంటూ వచ్చేసరికి మనకు ఓపిక చచ్చిపోతుంది. అందుకే ఎగ్జిబిషన్‌కి మాత్రం ఆటోలోనే వెళ్లడం అలవాటు ఆదినుంచీ.

ఎవరికోసం వెయిట్ చేసే అవసరం లేదు కాబట్టి వెంటనే లోపలికి వెళ్లాం.

మాయాబజారు సినిమాలోలాగా బారులు తీరి ఉన్నాయి షాపులు. అన్ని షాపులవాళ్లు రండి అమ్మగారు! ఆయియే మేడమ్. ప్లీజ్ కమిన్ అంటూ మూడు భాషల్లోనూ పిలుస్తున్నారు.

ఎగ్జిబిషన్‌కి వెళ్లగానే రైలెక్కడం ఓ ఆనవాయితీ. కాబట్టి ముందు అటు వెళ్లాం. ఈసారి రైలు లేదంటే లేదని కాదు. ఉంది ఆకారం మారింది. పట్టాలు పీకేశారు. రోడ్ మీద టైర్లతో నడుస్తుంది. ఏది ఏమైనా ఆ సరదా వేరు.

రైలెక్కి దిగిపోతే సగం ఎగ్జిబిషన్ చూసేసినట్టే. ఇక కాలి నడకన తిరగడం మొదలుపెట్టాం. బొమ్మల షాపుల దగ్గర నుంచి కదలం అని మొండికేస్తున్న పిల్లలు, సామదాన దండోపాయాలు ఉపయోగిస్తున్న తల్లిదండ్రులు. ఒకచేత్తో పీచుమిఠాయి పట్టుకుని బొమ్మలవంక ఆశగా చూస్తూ ముందుకు కదులుతున్న చిన్నారులు.

ప్రతి చీరల షాపు దగ్గర ఆగి బేరం చేస్తున్న ఇల్లాళ్లు, జేబుల్లో ఉన్న పర్సును దృష్టిలో ఉంచుకుని ఓసారి పూర్తిగా తిరిగి చూసి అప్పుడు తీరిగ్గా షాపింగ్ చేద్దాం అని ప్రేమగానే చెప్పి తీసుకువెడుతున్న మగవాళ్లు.

అవన్నీ చూస్తుంటే ఎన్నో పాత జ్ఞాపకాలు. అప్పట్లో మాకూ ఇలాంటి అనుభవాలే ఎదురయ్యేవి. గాజుల షాపులు కిటకిటలాడిపోతున్నాయి. అప్రయత్నంగా ఆగిపోయి ఎగ్జిబిషన్‌లో షాపింగ్‌కి శ్రీకారం చుట్టాం. అదో మత్తు. అదో మైకం.

రాను రానంటూనే చిన్నదీ అన్న సినిమా పాటలాగ వద్దు వద్దనుకుంటూనే ఒకళ్లని చూసి ఇంకొకరికి మనసై ఏవేవో కొనేశాం. చేతులు బరువెక్కి పోయాక అప్పుడు ఒంటిమీదకి తెలివి వచ్చింది. కొనడం చాలు. ఇక తినడం మొదలు పెడదాం అనుకున్నాం. ఓ బెంచీమీద కూర్చుని వచ్చీపోయే జనాన్ని చూస్తూ మిర్చి బజ్జీలు, మంచూరీ, నూడిల్స్ అన్నీ కొనుక్కుని తిన్నాం. కాఫీ కూడా సేవించాం.

సంచులు మోసుకుంటూ గేటు దగ్గరకు బయలుదేరాం. ఫౌంటెన్ దగ్గర ఆగి ఓ బెంచీ ఖాళీ అయ్యేదాకా వెయిట్ చేసి కూర్చుని ఎగ్జిబిషన్‌లో ఆఖరి ఘట్టం ఐస్‌క్రీమ్ తినడం కోసం ఉపక్రమించాం.

మాలో ఒకరిద్దరు మాకొద్దు షుగరుంది అంటూంటే 'ఆ! ఉంటే ఉంది అది వుండేదే గానీ పోయేది కాదుకదా! ఒక పూటకి ఏం కాదు. అసలైనా ఐస్‌క్రీమ్ తినకుండా ఎగ్జిబిషన్ నుంచి ఎలా వెళ్తాం? ఇప్పుడున్న ఓపిక కూడా ఉండదు వచ్చే ఏటికి' అని నచ్చచెప్పి ప్రోత్సహించి అందరం ఐస్‌క్రీమ్ కొనుక్కుని తినేశాం.

మరి కాసేపు అక్కడే కూర్చుని కాళ్లీడ్చుకుంటూ సంచులు మోసుకుంటూ గేటు దాటి బయటికొచ్చి అతి కష్టం మీద ఆటో దొరకపుచ్చుకుని ఇంటికొచ్చిపడ్డాం.

అలిసి పులుసుకూర అయిపోయామో ఒళ్లెరగకుండా నిద్రపోయాను. మర్నాడు తెల్లారి తెచ్చిన సంచులన్నీ విప్పి కొన్న సామాన్లన్నీ ముందేసుకుని కూర్చున్నా. మొదటిది కూరలు తరిగేది. అది పనిచెయ్యదని తెలిసి కూడా మన కళ్లెదురుగుండానే ఆ కుర్రాడు అన్ని కూరగాయలూ అవలీలగా తరిగేస్తుంటే మోజుపడి కొనేస్తాం. ప్రస్తుతం అదే జరిగింది. ఉల్లిపాయపెట్టి సర్రున కోసేసరికి ఏ భాగానికా భాగం ఊడొచ్చేసింది. పీడాపోయింది అని అవతలపారేశా.

ఎనిమిదో నంబరు చెప్పులు కొనుక్కుంటే ఏడో నంబరు వచ్చాయి. దుప్పటీ దిండు గలీబులు మారిపోయాయి. గాజులు ఓసైజు పెద్దవి వచ్చాయి. సర్లే ఎవరికైనా ఇవ్వచ్చు అని అవన్నీ సంచిలో వేశా. దుప్పట్లు మాత్రం బానే ఉన్నాయి.

లోపలికెళ్లి అలమార్లోంచి కిందటేడు ఎగ్జిబిషన్‌లో కొన్న దుప్పట్లు బయటికి తీసి కొత్తవాటిని ఆ స్థానంలో సర్దేశాను. పన్లన్నీ ముగించుకుని తీరిగ్గా కూర్చుని అయిన ఖర్చు లెక్క వేసుకుంటే గుండె గుభేలుమంది.

ఛ. వెధవపన్లు, వచ్చే ఏడాదినుంచీ వెళ్లకూడదు ఎగ్జిబిషన్‌కి– అని గట్టి నిర్ణయం తీసుకున్నా.

ఆ మధ్యాహ్నం మా చెల్లెలు ఫోన్ చేసింది. అక్కయ్యా ఎగ్జిబిషన్‌కి వెళ్దామా? అంది. నే వెళ్లి వచ్చాను అంటే అలా ఎందుకెళ్లావే? ఫిబ్రవరి ఆఖరి వారంలో వెళ్తే బోలెడు చవగ్గా దొరుకుతాయి అన్నీ– అని చాలాసేపు చెప్పింది.

సర్లే నువ్వెళ్లేటప్పుడు ఫోన్ చెయ్ అన్నా. ❑

# కంప్యూటరూ - కాల్ సెంటరూ

**మా** ఇంటర్‌నెట్ కనెక్షన్‌కి ఏదో ప్రాబ్లమ్ వచ్చింది. అసలు కంపూటర్ని చూస్తేనే అత్తగార్ని చూసినట్లుగా ఉంటుంది నాకు. అందుకే ఇంట్లో కంప్యూటరున్నా తప్పుకు తిరుగుతూ ఉంటే మా పిల్లలు కోప్పడ్డారు. అదేం కరుస్తుందా? ఈ రోజుల్లో కంప్యూటర్ రాకపోతే శుద్ధ వేస్ట్ కేండిడేట్ కింద లెఖ్ఖ- అని నా ప్రాణం తీసి కంప్యూటర్‌ని పరిచయం చేశారు.

ఫండమెంటల్స్ మాత్రమే నేర్చుకున్నా. మెయిల్స్ చెక్ చేసుకోవడం, మెయిల్ ఇవ్వటం, వెబ్ మేగజైన్లు చదువుకోవడం వంటి ఏబీసీడీలు మాత్రమే నేర్చుకున్నా!

కంప్యూటర్ కరుస్తుందా అంటారు మా వాళ్లు. కరవదుగానీ పిచ్చి ప్రశ్నలన్నీ వేస్తుంది. 'నువ్వు ఈ ప్రోగ్రామ్ నించీ బయటికి వెళ్ళిపోవాలనుకున్నావా?' అని అడుగుతుంది. అవునంటే 'మరోసారి ఆలోచించుకో' అంటుంది. ఆలోచించుకున్నా అన్నా కదలదు.

'నీ నిర్ణయం వల్ల నీ డేటా అంతా చెరిగిపోవచ్చు. జాగర్త' అని హెచ్చరిస్తుంది. దాంతో నాకు భయం వేస్తుంది. మా ఫేమిలీ డేటా మొత్తం అందులోనే వుంది. అది చెరిగిపోతే ఎట్లా? అందుకే మళ్లీ పిల్లల దగ్గరికి పరిగెడితే వాళ్లు విసుక్కుంటారు. ఆ కంప్యూటరూ నువ్వూ ఏకమై మా ప్రాణాలు తోడేస్తున్నారు. దానికెలాగూ స్వంత తెలివితేటలు లేవు. నీకు ముందే లేవు. అని వచ్చి ఓ బటన్ నొక్కేస్తారు. నా ముందు వెధవ్వేషాలు వేసిన ఆ కంప్యూటర్ వాళ్ల ఎదుట నోరెత్తదు.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటీ అంటే 'ఇంటర్‌నెట్ కనెక్షన్ సరిగా రావడం లేదు. కంప్లయింట్ ఇవ్వు' అని నాకే ఆర్డరు వేశారు మా వాళ్లు.

ఫోన్ దగ్గర కూర్చుని పియానో వాయించడం మొదలుపెట్టా. పియానో అని ఎందుకన్నానంటే కాల్‌సెంటర్లకి ఫోన్ చేయడం అంత తేలికేం కాదు. ముందు నెంబరు నొక్కమంటారు. వాళ్లొచ్చి మరో నెంబరు నొక్కమంటారు. ఆ విధంగా పాత సినిమాల్లో

హీరో పియానో వాయించినట్లూ అనేకానేక నెంబర్లు నొక్కాక గానీ అసలు వాళ్లు దొరకరు. ఎట్టకేలకు నాకు అసలు వ్యక్తి దొరికాడు.

'గుడ్‌మాణింగ్ మేడమ్' అన్నాడు. ఇలాంటి విషయాల్లో ఇంగ్లీషులో మాట్లాడను. ఒకటి చెప్పబోయి ఇంకోటి చెప్తానేమో అని భయం. అందుకనే మాతృభాషనే నమ్ముకుంటా.

'నమస్కారం' అన్నా. వెంటనే ఆ కుర్రాడూ తెలుగులోనే సంభాషణ ప్రారంభించాడు.

'నా పేరు సంజయ్. మీ పేరండీ?'

'విజయలక్ష్మి'

'నమస్కారం విజయలక్ష్మిగారూ! మీరెందుకు ఫోన్ చేశారో తెలుసుకోవచ్చా?'

'కంప్యూటర్ ఆన్ చేయగానే...' అంటూ సమస్య అంతా వివరించాను.

'అలాగా విజయలక్ష్మిగారూ! ఇటువంటి సమస్య ఇంతకు ముందెప్పుడైనా వచ్చిందా?'

'అది వరకోసారి వచ్చిందండీ'

'అప్పుడేం చేశారు విజయలక్ష్మిగారూ?'

'ఇలాగే మీకు ఫోన్ చేశాను'.

'అప్పుడు మేము ఏం చేశాం విజయలక్ష్మిగారూ!'

'బాగు చేయించారండీ'.

'అలాగా విజయలక్ష్మిగారూ! ఇప్పుడూ బాగు చేయిస్తాం. మీ కంప్లయింట్ నెంబరు రాసుకుంటారా?'

'చెప్పండి రాసుకుంటా'

'రాసుకోండి విజయలక్ష్మిగారూ! మూడూ ఏడూ సున్నా ఏడూ ఏడూ... రాసుకున్నారా?'

'రాసుకున్నానండీ'.

'ఇరవై నాలుగ్గంటల్లోగా మీ సమస్య తీరిపోతుంది విజయలక్ష్మిగారూ' ఇంకా మనం మాట్లాడుకోవలసిన విషయాలు ఏమైనా ఉన్నాయా?'

'ప్రస్తుతానికేం లేవండీ'.

'మరి విజయలక్ష్మిగారూ మా సేవల మీ అభిప్రాయం చెప్తారా?'

'బాగానే ఉన్నాయండీ'.

'సరే విజయలక్ష్మిగారూ! మీ సమస్య తీరగానే మేమే మీకు చెప్తాం. అలా చెప్పకపోతే ఆ విషయం మీరు మాకు చెప్పండి మళ్లీ.'

'అలాగేనండీ'

'విజయలక్ష్మిగారూ! మాతో మాట్లాడినందుకు ధన్యవాదాలు. మా సేవలను వినియోగించుకుంటున్నందుకు కృతజ్ఞతలు. మీ దినం బాగా జరగాలని కోరుకుంటున్నాను విజయలక్ష్మిగారూ. మరి సెలవు!' అని ఫోన్ పెట్టేశాడు.

మంచీ, మర్యాదా అన్నీ బానే ఉన్నాయి. కాపోతే మీ దినం బాగా జరగాలనడమే కాస్త మనసుకి కష్టం కలిగించింది. ఏం చేస్తాం? అది కాల్ సెంటరు భాషా, మర్యాదానూ!

❑

# సర్టిఫికెట్టు ఉందా? ఐతే ఓకే!

'సెల్‌ఫోన్‌లో ఫ్రెండ్‌తో హస్కుకొడ్తున్నా...

'అమ్మా! పోలీసాయన కారాపమన్నాడు' అన్నాడు డ్రైవరు.

సెల్‌ఫోన్ కట్‌చేసి చూశా. నిజమే కారు పక్కకి తియ్యమని సైగ చేస్తున్నాడు ట్రాఫిక్ కానిస్టేబుల్. పక్కకి తీసి ఆపాడు డ్రైవరు.

విండో దగ్గరికొచ్చాడు పోలీసు. 'పొల్యూషన్ సర్టిఫికెట్ ఏదీ?' అన్నాడు డ్రైవరుని. డ్రైవరు నా మొహం వంక చూశాడు. మాకు పర్మినెంట్ డ్రైవర్ లేడు. కాల్ డ్రైవరుని పిలుస్తాం అవసరం అయినప్పుడల్లా'.

"ఎక్కడో ఉంటుంది చూడు!" అన్నా.

"ఎక్కడుందీ? లేదు. మూడొందలు ఫైను కట్టండి" అన్నాడు పోలీసు. కారు దిగాను.

"ఫైను దాకా ఎందుకులెండి సార్! వ్యవహారం. ఎక్కడో ఉంటుంది. నువ్వు వెతకవయ్యా డ్రైవర్ బాబూ" అన్నా!

"మర్చిపోయారేమో రెన్యువల్ చేయించడం" అన్నాడు పోలీసాయన.

"సమస్యే లేదు. అలా మర్చిపోడం మా ఇంటా వంటా లేదు. మేము కట్టాల్సిన టాక్సులూ, గట్రా లాస్ట్ డేట్‌కి మూడు నెలల ముందే కట్టేస్తాం. ముందు డబ్బు కట్టి ఆ తర్వాత క్రెడిట్‌కార్డులో వస్తువులు కొంటాం. అంత ముందు జాగర్త ఉంది మాకు" అని చెప్పాను.

"దొరికింది. ఇదిగో ఈ మూల అంటించారు" అని అరిచాడు డ్రైవర్.

పోలీసు సణుక్కున్నాడు. "ఎక్కడో మూలగా అతకబెడితే మాకేం కనిపిస్తుంది. ఎదురుగా అద్దానికి అంటించండి" అన్నాడు కాస్త చిరాగ్గా.

“అలా ఎదురుగా అంటిస్తే డ్రైవ్ చేసేవాళ్ళకి ఇబ్బంది అని ఇలా అంటించారేమో. ఇక మీదుట జాగర్త పడతాం” అని హామీ ఇచ్చాను.

అంతలో హఠాత్తుగా పొగ మేఘంలా కమ్మేసింది. ఓహో, ముందు జాగర్తగా మిట్ట మధ్యాహ్నం పూట కూడా దోమల మందు కొడుతున్నారేమో అనుకున్నా, కానీ ఆ వాసన, ఆ ఘాటూ వేరు. మరి కాసేపటికి కళ్ళు కనిపించడం మానేశాయి. కళ్ళజోడు మసకబారింది. కళ్ళజోడు తీసి తుడుచుకుని మళ్ళీ ధరించి చూస్తే ఓ వాహనం పోతోంది. అదే వాహనమో ఆచూకీ తెలియకుండా దాని వెనకాలంతా పొగ.

“పోలీసు గారూ! అలా చూస్తూ నిలబడ్డారేం?” అని అడిగాను.

ఆ పోలీసు మొహం స్వర్ణకమలం సినిమాలో సాక్షి రంగారావు మొహంలాగా పొగమారిపోయింది. “మేమెప్పుడూ ఇలాగే నిలబడతాం!” అన్నాడు మొహం తుడుచుకుంటూ.

“మామూలుగా నిలబడతారు సరే.. ఆ పొగ బండి పొగను చిమ్ముకుంటూ పోతుంటే ఆపి పొల్యూషన్ చెక్ చెయ్యాలిగా...” అని అడిగా.

“ఎందుకూ? ఆ బండికి సర్టిఫికెట్టుంది” అన్నాడు.

“మాకు బండే కనిపించలేదు. మీకు సర్టిఫికెట్టు ఎలా కనిపించిందండి. మీ కళ్ళకేమైనా దివ్యశక్తులు వున్నాయేమో అని అనుమానం” అని అడిగేశాను.

“ఆ బండి రోజూ ఇదే వేళ్టికి ఇటే పోతుంది. మళ్ళీ సాయంత్రం ఇటు వస్తుంది” చెప్పాడాయన.

“మరలా తిరుగుతుంటే ఎలా వదిలేస్తున్నారు?” మళ్ళీ అడిగా.

“చెప్పాంగా.. ఆ బండికి సర్టిఫికెట్టుంది!” అన్నాడు ఇంకా మొహం తుడుచుకుంటూనే.

“మీ సర్టిఫికెట్టు చల్లగా ఉండా! పొగ భూతంలా ఉన్న ఆ బండి మొహానికి సర్టిఫికెట్టు ఎవరిచ్చారండీ? కళ్ళకి స్పష్టంగా కనిపిస్తుంటేనూ? తీసి పక్కన పడెయ్యాలి కదా! ఆ బండీని” మళ్లీ అడిగా.

“అలా ఎందుకు పడేస్తాం?” అన్నాడు.

"మరి స్ఫటికంలా ఉన్న నా కారుని పక్కన ఆపేసి ఎందుకు చెక్ చేస్తున్నారు?" నాకు చిరాకొచ్చేస్తోంది.

"మీ దగ్గర పొల్యూషన్ సర్టిఫికెట్టు లేదేమో అని డౌటు వచ్చింది" చెప్పాడు.

"మహాప్రభో! మీ థియరీ నాకర్థం కావడం లేదు. మీ బాధ్యత ఏమిటసలు? పొల్యూషన్ లేకుండా చూడ్డమా? సర్టిఫికెట్టుందో లేదో చూడ్డమా?" అని అడిగాను.

తలొంచుకుని మొహం తుడుచుకుంటూ "ఇహ మీరు వెళ్ళొచ్చు. సర్టిఫికెట్టు మాకు కనిపించేలా అతికించండి" అని విసుగ్గా చెప్పి అసలు విషయం చెప్పకుండా దాటేశాడు.

అంతలోనే ఇంకో పొగబండి ముందెళ్ళిన దాని తాత లాటిది పొగ మేఘాలు వెదజల్లుతూ దర్జాగా వెళ్ళిపోయింది. మళ్ళీ అందరం కళ్ళుజోళ్ళు, మొహాలూ తుడుచుకున్నాం.

"పోలీసు గారూ, పోలీసు గారూ ఇంకో పొగబండి వెళ్ళిపోతోందండీ" అన్నాను ఇంకా ఆశ చావలేదు నాకు.

"అబ్బా మీరిక వెళ్ళండి మేడమ్. ఆ బండికీ పొల్యూషన్ సర్టిఫికెట్టుంది!" విసిగించకండి. మమ్మల్ని మా వర్కు చేసుకోనివ్వండి" అని మొహం తుడుచుకుంటూ విసుక్కున్నాడు.

కారెక్కేశా. మా కారుని కదలమని చెయ్యూపి మా వెనక రాజహంసలా వస్తున్న కొత్త హోండా సిటీ కారుని పక్కకి రమ్మని పొల్యూషన్ సర్టిఫికెట్టు వుందా లేదా అని పరీక్షిస్తున్నాడు పోలీసు!!! ❑

# ఇదిలాగే జరుగుతుంది

**కొ**త్తనీరు వస్తే పాతనీరు కొట్టుకుపోతుంది.

అలాగే పాతమాటలు ఎన్నో కాలగర్భంలో కలిసిపోయాయి. కొత్త పదాలు పుట్టుకొస్తున్నాయి. అప్పట్లో నిరుడు అనే పదం ఉండేది. ఇప్పుడు పోయినేడాది, కిందటేడు అని వాడుతున్నాం. నిర్లిప్తత, ఉదాసీనత వంటి పదాలు అన్నింటికీ బదులుగా డల్‌గా ఉంది అని ఒక్క పదం వాడేస్తున్నారు. మాయాబజార్లో ఘటోత్కచుడు చెప్పనే చెప్పాడుగా మనుషులు పుట్టించకపోతే కొత్త కొత్త పదాలు ఎలా వస్తాయి అనీ!

ఇప్పుడు అంత సీన్ లేదు అనే పదం చాలా విరివిగా వాడబడుతోంది.

అప్పట్లో జంధ్యాలగారు సృష్టించిన పదం సుత్తి ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందింది. అందరూ ఎంతో అభిమానంతో సుత్తిని స్వంతం చేసేసుకున్నారు. హాయిగా వాడుకున్నారు.

అవన్నీ ఒకెత్తు అయితే ఈ మధ్యకాలంలో వాడుకలోకి వచ్చిన ఒక పదం ఊహించలేనంత ఫేమస్ అయిపోయింది. ఆ పదం ఎంతో మందికి నాలుక కొసనే వుంటోంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఛానెల్స్ వాళ్ళూ, విలేకరులూ ఆ పదాన్ని ఆధారం చేసుకొని జీవనం సాగిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.

ఆ ఒక్కపదం తొలగిస్తే ఇప్పుడు ఇరవైనాలుగ్గంటలూ కొనసాగే వార్తల ఛానెల్స్‌లోని వార్తలు పన్నెండుగంటలకి మించి రావు.

సగం భారాన్ని తన భుజస్కంధాల మీద మోస్తున్న ఆ పదం ఏమిటో అనుకుంటున్నారా! నాలుగక్షరాల పదం.

అదే 'జరిగింది' అనే పదం.

ఆ ఒక్క పదం... ఒకే ఒక్క పదం ఛానెల్స్‌కి ఊపిరి అయిపోయింది. ఓ కాపు కాస్తుంది. ఆ జరగడం లేకుండా క్షణం జరగదు.

గతంలో ఫలానివారు వచ్చారు. ఫలానివారు వెళ్ళారు– అని మాత్రమే వార్తల్లో విశేషాలు చెప్పేవారు.

ఇప్పుడలా కాదు. వార్తల విధానమే మారిపోయింది.

ఫలానివారు రావటం జరిగింది. ఫలానివారు వెళ్ళడం జరిగింది.

ఇలా ప్రతి వాక్యంలోనూ విధిగా జరగటం జరుగుతూ వుంటుంది.

ఇలా ప్రారంభం అవుతాయి బ్రేకింగ్ న్యూస్‌లు.

ఇవ్వాళ కూడా మామూలుగానే తెల్లవారడం జరిగింది. నానక్‌రాం గూడాలో మామూలుగానే జనం రోడ్లమీదికి రావటం జరిగింది. ఉదయం పదిగంటలకి ఒక లారీ పుల్‌లోడుతో రోడ్ల మీద పోవడం జరిగింది. ఎదురుగా ఓ సెవెన్‌సీటరు ఆటో కూడా పుల్‌గా జనాన్ని ఎక్కించుకుని వస్తూ ఉండటం జరిగింది.

అమితవేగంతో ఎదురెదురుగా వస్తున్న ఆ రెండు వాహనాలూ గుద్దుకోవటం జరిగింది. పెద్దశబ్దం రావడం జరిగింది. ఘోరమైన ప్రమాదం జరిగింది. వెంటనే రెండువైపులా ట్రాఫిక్ కిలోమీటర్ల మేర స్తంభించడం జరిగింది. క్షతగాత్రుల రోదనలు మిన్నుముట్టడం జరిగింది. గాయపడినవారిని వెంటనే హాస్పిటల్‌కి తరలించడం జరిగింది.

వారికి వైద్యం అందజేయడం జరిగింది. వారికి ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పడం జరిగింది.

ఇదిలా ఉండగా నానక్‌రామ్‌గూడ స్థానిక నాయకులు ఈ రోడ్లు ఇరుగ్గా వుండటంవల్ల ప్రమాదం జరిగిందనీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పడం జరిగింది. స్థానిక ప్రజలు కూడా ప్రభుత్వ వైఖరిని దుమ్మెత్తిపొయ్యడం జరిగింది. అలా జరుగుతూ వుంటుందా వార్త.

ఎక్కడైనా సభలు అయితే అక్కడా జరుగుతుంది వార్త వ్యాఖ్యానం. గజానంద్ గారికి అవార్డ్ సభ జరిగింది.

ప్రముఖులు వస్తున్నందున ఏర్పాట్లు ఘనంగా చెయ్యడం జరిగింది. ముఖ్య అతిథి ప్రసాద్‌గారు ఒక అరగంట ఆలస్యంగా రావడం జరిగింది. మరో ప్రముఖులు రాజారావుగారు అనివార్య కారణాలవలన రాకపోవడం జరిగింది. సభ ప్రారంభంలో చిరంజీవి నమ్రతి చక్కగా నాట్యం చెయ్యడం జరిగింది. అనంతరం అధ్యక్షుల వారు

ఉపన్యాసం ఇవ్వడం జరిగింది. ఆ తర్వాత ముఖ్య అతిథుల వారు సుదీర్ఘోపన్యాసం చెయ్యడం జరిగింది. సభలోనివారందరూ అవార్డు గ్రహీతను పొగడడం జరిగింది. మొత్తం మీద సభ ఆద్యంతం ఆసక్తిదాయకంగా జరిగింది.

అలా ఉంటుందన్న మాట.

ఇదీ అదీ అనే కాదు. ప్రపంచంలో ఎక్కడ ఏ మూల ఏం జరిగినా ఇక్కడ చక్కగా చెప్పడం జరుగుతుంది. ❑

# వింతలూ - విడ్డూరాలు!

**ఈ** ప్రపంచంలో మనకు తెలియని విషయాలు ఎన్నెన్నో ఉంటాయి. అసలా మాటకొస్తే ఉన్న విషయాల్లో మనకు అయిదోవంతు తెలిస్తే గొప్పే. కాకపోతే మనకు మాత్రం తెలియదా అని ఆశ్చర్యపోయే సంఘటనలు ఎదురైపోతేనే ఇంత ఫూల్స్‌మా మనం అనిపిస్తుంది.

నాకు అలాంటి అనుభవాలు చాలాసార్లు ఎదురయ్యాయి. ఎన్నో వింత అనుభవాలు! హిమాలయాల్లో ఉక్కపోస్తుందని నాకు తెలియదు. వెళ్లి చూశాక నాకు తెలిసింది. మంచులేని సమయాల్లో చెమటలు కారిపోతాయని. వేసవిలో అక్కడా నూలు దుస్తులే ధరించాలని గ్రహించాను.

మరో అనుభవం. మాకు తెలిసిన వాళ్లమ్మాయికి పెళ్లి కుదిరింది. ఆ పెళ్లివారు పెట్టిన షరతు చూసి అంతా తెల్లబోయాం. వాళ్లేం కట్నకానుకలు అడగలేదు. గొంతెమ్మ కోరికలు కోరలేదు. కాకపోతే పెళ్లికి మల్లెపువ్వు కనిపించడానికి వీల్లేదన్నారు. మాకు అర్థం కాలేదు. వేసవికాలం పెళ్లిలో అడుగడుగునా మల్లెపూలే కనిపిస్తాయి కదా! అదేవిటండీ ఎందుకలా? అంటే చెప్పారు. వాళ్లింట్లో అందరికీ మల్లెపూలంటే ఎలర్జీట. ఒకరికీ ఇద్దరికీ కాదు. ఆ ఇంటి పేరు గలవాళ్లు అందరికీ అదే కంప్లయింటుట. కింకర్తవ్యం?

అన్ని విధాలా బాగున్న సంబంధాన్ని మల్లెపూల కారణంగా మానెయ్యలేం కదా! సరే అన్నాం. తీరా ఆచరణలోకి వచ్చాక తెలిసింది అదెంత కష్టమో. పూల మండపం అలంకారానికి మల్లెపూలు వాడొద్దంటే పూల వాడు చాలా గొడవ చేశాడు. పూలజడ, పూలదండలు, అన్ని విషయాల్లోనూ ప్రత్యామ్నాయం వెతుక్కోవాల్సి వచ్చింది.

మేము సరే, ఆడ పెళ్లివాళ్లం కాబట్టి వాళ్లడిగినట్లే చేశాం. పెళ్లికొచ్చిన అతిథులు చక్కగా మల్లెపూలు పెట్టుకొచ్చేసరికి మేము తీసుకున్న జాగ్రత్తలన్నీ వేస్ట్ అయిపోయాయి. పెళ్లివారంతా ఒకటే తుమ్మడం మొదలుపెట్టారు. ఒకరూ ఇద్దరూ కాదు. బస్సు జనం.

ఆపూ స్టాపూ లేకుండా తుమ్ముతుంటే ఆ ధాటికి కళ్యాణ మండపం కప్పు వూడి కింద పడుతుందేమో అని భయం వేసింది మాకు. వాళ్ల వైపు పురోహితుడికి ఇదంతా అలవాటే కాబోలు వూరుకున్నాడు గానీ, మావైపు పురోహితుడు అయ్యో అయ్యో అపచారం అని లబలబ లాడాడు.

మేళాల వాళ్లు కూడా హరి హరీ అనుకుని వీలైనంత తారాస్థాయిలో వాయించి ఇక చాతకాక చేతులెత్తేశారు. ఫర్వాలేదు ఈ సందడి కూడా శుభమే మాకు. కానివ్వండి అని పెళ్లిపెద్ద తుమ్ముతూనే ధైర్యం చెప్పాడు.

పెళ్లి జరిగిపోయింది. కాపురానికి వెళ్లి వచ్చిన ఆ పిల్ల కూడా మల్లెపువ్వు కనపడగానే తుమ్మడం మొదలుపెట్టేసరికి హమ్మయ్య వాళ్లల్లో కలిసిపోయింది అనుకున్నాం. మల్లెపూలంటే ఇంటిల్లిపాదికీ అలెర్జీ ఉండడం వింతే మరి.

ఇటీవలే ఇంకో విచిత్రం ఎదురైంది.

మా చుట్టాలింటికి వెళ్లాం. వాళ్లింట్లో ఓ బుజ్జి కుక్క పిల్ల ఉంది. చూడ్డానికలా పిల్లలా ఉన్నా దానికి వయసు బాగానే ఉందిట, మూడేళ్లు పగ్‌జాతి కుక్క. ఆమధ్య హచ్ నెట్ వర్క్ కంపెనీ అడ్వర్టయిజ్‌మెంట్‌లో పిల్లాడి వెంటనీడలా తిరుగుతూ వుంటుందే! అదిగో అలాంటి కుక్కపిల్ల. దాని ధర ముప్ఫై వేలుట.

కరుస్తుందా అంటే అబ్బే కరవటం కాదు అరవడమూ తక్కువే. ఇంట్లో మనిషిలా ఉంటుంది అన్నారు వాళ్లు. చాలా మందికి ఒకచోట చేరితే కాలక్షేపానికి ఏం కొరత? రాత్రి పొద్దుపోయేదాకా కబుర్లు చెప్పుకుని అందరం తలోచోటా సర్దుకొని పడుకున్నాం.

హాల్లో నేనూ, మా పెద్దత్తయ్యా, కుక్కా పడుకున్నాం.

కబుర్లు చెప్తూనే నిద్రపోయింది మా పెద్దత్తయ్య. కొత్త చోటుకదా నాకు ఒక పట్టాన నిద్రపట్టదు. అటు దొర్లీ ఇటు దొర్లీ అవస్థపడితే కాస్త కన్ను మూతపడింది. అంతలోనే మెలకువ వచ్చేసింది.

గురక శబ్దం భయంకరంగా వినిపిస్తోంది. అలా ఇలా కాదు ఇల్లెగిరిపోయేలా! ఎవరైనా గురకపెడితే నాకు నిద్రపట్టదు. రైలు ప్రయాణాల్లో నాకు పూర్తిగా జాగారమే.

ఎవరా ఇలా గురక పెడుతుంది అనుకుని చూశా. మా పెద్దత్తయ్య నిశ్శబ్దంగా నిద్రపోతోంది. ఆవిడే కాదు అందరూ నిద్రపోతూనే ఉన్నారు. నాకు మాత్రం చెవులు పగిలిపోతున్నాయి. ఎవరా ఈ గురకాసురుడు అని కుతూహలంతో మూడు పడగ్గదుల

దగ్గరా నిలబడి విన్నాను. గదుల్నిండా జనం ఉన్నా ప్రశాంతంగానే ఉంది వాతావరణం.

గురక మాత్రం ఇంకా పెరిగింది. ఎవరా ఎవరా అని వెతికి చూసేసరికి తెలిసింది. అలా గుర్రెట్టి నిద్రపోతోంది మనిషి కాదు ఆ కుక్కపిల్ల. ఆశ్చర్యం వేసింది నాకు. దగ్గరకెళ్లి మరీ చూశా. నేను పక్కనే నిలబడ్డా దానికి చీమ కుట్టినట్టు కూడా లేదు. నిశ్చింతగా గుర్రెట్టి నిద్రపోతోంది. మనిషి అలికిడి అయితే చాలు చివాల్న లేచి గుర్రుగా చూసి మొరిగేకుక్కలనే చూశాను గానీ ఇలా పరాయి మనిషి పక్కన నిలబడ్డా గుర్రెట్టి నిద్రపోయే కుక్కను నా జన్మలో చూడలేదు.

ఆ రాత్రంతా పదిసార్లు తిరిగి దాని గురక వింటూ గడిపి ఏ తెల్లవారుజాముకో నిద్రపోయాను. తెల్లవారి నేను లేచిన తర్వాత అరగంటకి లేచింది కుక్కపిల్ల. బద్ధకంగా ఒళ్లు విరుచుకుని పాలు తాగింది.

ఏమిటిది! రాత్రంతా గుర్రెట్టి నిద్రపోయింది? అని అడిగితే చెప్పారు వాళ్లు. ఆ జాతి అంతేనంట. సమ్మర్‌లో తక్కువేగానీ వింటర్లో బాగానే గుర్రెట్టి నిద్రపోతుందిట. అవడానికి కుక్కే అయినా కుక్క లక్షణాలు ఉండవట. కొత్తవాళ్లు వస్తే అరవడం గట్రా చెయ్యదుట. దానికి చిరాకేస్తేనే అరుస్తుందిట. కాకపోతే చాలా ఫ్రెండ్లీగా ఉంటుందిట. అది వరకు లేదుగానీ ఆ అడ్వర్‌టైజ్‌మెంట్ తర్వాత ఆ జాతి కుక్కపిల్లకి బోలెడంత గిరాకీట. ముప్ఫైనుండి యాభై వేల దాకా వుంటుందిట వాటి ధర.

నాకు భలే సరదావేసింది. కుక్కలు గుర్రెట్టి నిద్రపోతాయని తెలుసుకున్నాను కదా! అని సంతోషించాను. ❑

# రాకోయీ అతిథీ మా ఇంటికి!

గత వారం రోజులుగా మాకు కంటిమీద కునుకు లేకుండా చేసిన సమస్యకి పరిష్కారం దొరికింది. హమ్మయ్య అనుకున్నాం. ఆ దేవుడు కరుణించాడు. ఆపద గట్టెక్కింది... అని ఆనందించాం. ఎలాగైనా ఆ 603 ఓనరు దయాహృదయుడు. కాకపోతే ఈ రోజుల్లో ఇలాంటి సాయం ఎవరు చేస్తారు– అని ఆయన్ని మెచ్చుకున్నాం. ఆయన ఆపద్బాంధవుడిలాగా ఆదుకోబట్టి సరిపోయింది గానీ, లేకపోతే అన్యాయం అయిపోయేవాళ్ళం. సమస్య అంత గంభీరమైనదే మరి.

మా ఫ్లాట్లు వైశాల్యం పదకొండు వందల చదరపు అడుగులు. మూడు పడగ్గదులు, డ్రాయింగ్ రూమ్, డైనింగ్ హాలు, వంటిల్లు, స్టోర్ రూము, పూజగది. ఇంటికి తగ్గట్టు సామాన్లు ఉన్నాయి. మా పాత ఫ్రెండ్స్ రెండు జంటలు లక్నోనుంచి వచ్చి నాల్రోజులుంటామని ఫోన్‌చేసి చెప్పారు. మా గుండె తారుమంది. ఈ రోజుల్లో ఇంటికి ఎవరైనా వచ్చి ఓ రోజుంటారంటే సామాన్యమా? సునామీ వచ్చినట్లేగా! ఇవేం పాతరోజులు కావుకదా!

అప్పట్లో అంటే ఇళ్ళు ఖాళీగానే వుండేవి. నవారు మంచాలు, చాపలూ ఉండేవి. ఒకటో రెండో ఇనుప మడత కుర్చీలుండేవి. పది మంది వచ్చినా ఏమీ ఇబ్బంది ఉండేది కాదు. నేలమీద పడుకునే వాళ్ళు. అసలా మాటకొస్తే అన్ని శు భకార్యాలూ, పెళ్ళిళ్ళతో సహా ఇళ్లల్లోనే జరిగేవి. ఎంతమంది వచ్చినా ఆదుకునేది ఇల్లు. అంతగా అవసరం అయితే ఇరుగూ, పొరుగూ ఆదుకునేవాళ్ళు.

ఇప్పుడలా కాదు. ఇంటినిండా గున్న ఏనుగుల్లా సామాన్లు, వేలకు వేలుపోసి కొన్న సామాన్లకు ఉన్న గీర్వాణం అంతా ఇంతా కాదు. అవసరం వస్తే డజనుమంది మనుషులు ఒక గదిలో సర్దుకోగలరు గానీ ఈ సామాన్లకు మాత్రం వేటి గది వాటికుండాల్సిందే. ఇంకో చోట ఇమడవు.

సోఫా దగ్గర బీరువాను పెట్టలేం. మంచం పక్కన డైనింగ్ టేబుల్ వెయ్యలేం. ఆ అడ్జస్ట్‌మెంట్ ఊహించుకుంటేనే వికారంగా ఉంటుంది. మంచాలున్నాయంటే అంగుళం కూడా అటూ, ఇటూ జరగవు. గదినిండా ఆక్రమించుకునే ఉంటాయి. ఎత్తిపెట్టే అవకాశం అసలే వుండదు. ఈ భారీ వస్తువులకు తోడు గన్‌మెటల్ విగ్రహాలూ, ప్లాస్టిక్ పూల స్టాండులూ ఇంటి మూలలన్నీ ఆక్రమించుకుని కూర్చుంటాయి.

కాబట్టి ఇంట్లో వాళ్లుకాక అదనంగా మరో మనిషి వస్తే శ్రీమద్రమారమణ గోవిందో హరి! మరి అటువంటి పరిస్థితిలో ఒకరు ఇద్దరు కాదు నలుగురు మనుషులొచ్చి నాలుగు రోజులుంటారంటే ఏ గంగలో దూకాలి?

రావద్దంటే బావుండదు. చాలా ఆత్మీయులు. దిక్కుమాలిన సామాన్లు ఇంటినిండా ఆక్రమించుకోకుండా వుంటే వారి రాక ఎంతో ఆనందంగా ఉండేది మాకు. మరిప్పుడేం చెయ్యడం? వచ్చిన వాళ్ళని ఎక్కడ ఉంచడం?

పిల్లలని మా దగ్గర పడుకోబెట్టుకుని ఒక గది ఖాళీ చేయించగలం. కానీ నలుగురొస్తున్నారు కదా! పోనీ మేమూ పిల్లలు హాల్లో సర్దుకుంటాం రూమ్‌లు ఇచ్చేద్దాం. అన్నాడు కొడుకు కోడలూ, మరి బాత్‌రూమ్ సమస్య ఉంది. బాత్‌రూమ్‌లు పడగ్గదులూ పడుగు పేకలాగా ఉంటాయి కదా! అదీగాక హాలులో సోఫా పక్కన పడుకోటం సాధ్యం కాదు. అంతజాగా లేదు. వాళ్ళని ఇంటిదగ్గర్లో ఏదైనా హొటల్లో వుంచుదామా అనుకున్నాం. కానీ రాకరాక వస్తున్న వారిని హొటల్లో దింపడానికి మనసొప్పలేదు. పోనీ మేమిద్దరం పిల్లల్ని తీసుకుని హొటల్‌కి వెళ్తాం అన్నాడు అబ్బాయి.

ఇంటికి చుట్టాలొచ్చే టైముకి నేను కాస్త హొటల్‌కి పోతే అత్తయ్యగారొక్కరే అన్నీ చూసుకోవాలి. అదీగాక పిల్లల పుస్తకాలూ, యూనిఫాంలూ సరంజామా మొత్తం ఎక్కడికి మోసుకుపోతాం అంది కోడలు. ఆ మాటా నిజమే.

మీరొస్తున్నారని మా పిల్లలు హొటలుకి పోయారని చెప్తే పాపం వాళ్ళు బాధ పడరూ! బాత్‌రూమ్ విషయంలో ఎలాగో సర్దుకుందాం.

సామానంతా ఎవరింట్లోనైనా పెట్టి హాలు ఖాళీ చెయ్యచ్చు అనుకున్నాం. కానీ ఎవరింట్లో పెడతాం? అందరివాళ్ళూ ఇలాగే ఉంటాయి.

ఎవరైనా మన దగ్గరికొచ్చి మా సోఫా, డైనింగ్ టేబుల్ ఓ వారం రోజులు మీ ఇంట్లో పెట్టుకుంటారా? అని అడిగితే బావురుమని ఏడ్చేస్తాం! అందరి ఏడుపూ అదే కదా మరి!

సమస్య ఎలా పరిష్కరించుకోవాలి? ఇంటికి దగ్గర్లో ఏవైనా గెస్ట్‌హౌస్‌లు ఉన్నాయేమో అని వెతికాడు మా అబ్బాయి. ఎక్కడా దొరకలేదు. అయిదు కిలోమీటర్ల దూరంలో ఉందిట. ఒకటి. కానీ దాని ధర మాకు అందుబాటులో లేదు. అదీగాక చాలా దూరం అవుతుంది. అవతల సమయం దగ్గర పడుతోంది. మరో వారంలో వాళ్ళొచ్చేస్తారు.

ఏం చెయ్యాలా? అని తలబద్దలు కొట్టుకుంటూ ఉంటే మా వాచ్‌మేన్ ఓ వార్త చెప్పాడు. 603 ఫ్లాటులో ఉన్న వాళ్ళు ఖాళీ చేస్తున్నారుట! వెంటనే ఆ ఓనరు ఫోన్ నెంబరు సంపాదించి రిక్వెస్ట్ చేశాం. ఆయన ముందు కాస్త నసిగాడు.

రెండ్రోజులాగి చెప్తానన్నాడు. రెండ్రోజులయ్యాక మరో రెండ్రోజులాగి చెప్తానన్నాడు. మేమూ వదల్లేదు. స్వాతిముత్యం సినిమాలో కమల్‌హాసన్ సోమయాజులు వెంట పడ్డట్టు ఆ ఓనరు వెంట పడ్డాం. మా గోల భరించలేక సరే వాడుకోండి అన్నాడు. వెంటనే పరవాణ్ణం వండుకు తిని పండుగ చేసుకున్నాం.

గుండె మీద బరువు దించినట్లయింది. ఆ పదిరోజులూ వాడుకున్నందుకు లెక్కగట్టి ఆ ఓనర్‌కి ఇవ్వచ్చు. ఆ పోర్షను క్లీన్ చేయించి అద్దెకి పరుపులూ మంచాలూ తెప్పించి వాళ్ళకి వసతి ఏర్పాటు చెయ్యొచ్చు. చవకలోనే తెమిలిపోతుంది. హోటల్లోనో, గెస్ట్‌హౌస్‌లోనో దింపామనే అప్రతిష్ఠా తప్పుతుంది.

మర్నాడు వాళ్ళొస్తారనగా అన్ని ఏర్పాట్లు ముగించి ఇంట్లో కొచ్చి మంచంమీద నడుం వాల్చాను. సమస్య చక్కగా పరిష్కారం అయినందుకు సంతోషంగా ఉన్నా జీవితం మరీ ఇంత ఇరుకు అయిపోయిందేవిట్రా భగవంతుడా అని దుఃఖం కలిగింది. ❑

# బొమ్మ ఇచ్చిన బహుమతి!

**పొ**ద్దున్న తొమ్మిది గంటలు అయింది. మా కోడలు నడినెత్తిన ముడిపెట్టుకొని నైటీతోనే కూర్చుని సుడోకు పజిల్ నింపుతోంది. "అదేమిటే పిల్లా! ఆఫీసుకెళ్ళవా?" అంటే "ఇవ్వాళ శలవు పెట్టాను" అంది.

మర్నాడు వాళ్ళ మారేజీడే. మరి ఈపూటే ఎందుకు పెట్టిందా శెలవు– అని అనుమానం వచ్చింది గానీ ఏమో దానిష్టం అని అడగలేదు.

మగవాళ్ళు వెళ్లిపోయారు. మా అత్తగారు "అమ్మడూ నువ్వు రెడీనా" అంటూ హాల్లోకొచ్చారు. "ఆ నేను ఎప్పటి నుంచో రెడీ" అంది కోడలు పేపరు పక్కనపడేసి.

ఆవిడ వంటింట్లోంచి చిన్న గిన్నెతో నూనె వెచ్చచేసి పట్టుకొచ్చారు. కుర్చీలో కూర్చున్నారు. ఆవిడ ముందు నేలమీద కూర్చుంది అది. జుట్టు విప్పి నూనె మర్దనా చేస్తూ ఏవేవో కబుర్లు చెప్పుకుంటున్నారు.

నేను లేచి నా స్నానం, పూజ ముగించి గుడికెళ్ళొస్తా అని చెప్పి వెళ్లిపోయాను. గంట తర్వాత వచ్చి బెల్ కొడితే అత్తయ్య గారొచ్చి తలుపు తీశారు. చీరె సగం తడిసిపోయింది. మొహంలో అలసట. ఏమిటిది? చీరంతా ఇలా తడిపేసుకున్నారేం అంటే నవ్వేసి కోడలిగదిలోకి వెళ్లి పోయారు. మరో పావుగంట తర్వాత వచ్చి తన గదిలోకి వెళ్లిపోయారు. మరో పదినిమిషాల తర్వాత గదినించి బయటికి వచ్చింది కోడలు.

దాన్ని చూసి ఆశ్చర్యపోయాను. మెరుగుపెట్టిన బంగారంలా మెరిసిపోతోంది. నిద్రొస్తోంది. ఏదో తినేసి పడుకుంటా అని వంటింట్లోనే కంచంలో వడ్డించుకుని అక్కడే తినేసి వెళ్లి పడుకుంది. అత్తయ్యగారూ పూజా పునస్కారం వాయిదా వేసి స్నానం చేసి భోంచేసి నిద్రకు పడ్డారు.

సాయంత్రం నాలుగింటికి వచ్చాడు మా అబ్బాయి. గదిలోకి వెళ్లి బయటికొచ్చాడు. "మా ఆవిడ మొద్దులా నిద్రపోతోందేం?" అని అడిగాడు.

"ఏమో నాకేం తెలుసు? నీ భార్యని అడుగు. లేకపోతే మీ బామ్మనడుగు" అన్నా. ఆవిడ అప్పుడే వచ్చి హాల్లో కూర్చున్నారు. "బామ్మా! నీ మనవరాల్ని లేపు. మేము బయటికి వెళ్లాలి. నేను బేంకుకి వెళ్ళొస్తా" అన్నాడు.

"నువ్వెక్కడకి వెళ్ళక్కర్లేదు లేరా!" అంటూ చిన్నగా నవ్వింది ఆవిడ. "నా మాట మీద నమ్మకంలేకపోతే మీ ఆవిడనే అడుగు" అన్నారు.

వాడు అయోమయంగా చూసి లోపలికెళ్లాడు. నాకు ఓర్పు నశించిపోయింది. "ఏమిటీ? ఏం నడుస్తోందీ" అని అడిగాను. "ఏం లేదే. రేపు వీళ్ల పెళ్లిరోజు కదా! పెళ్ళానికి ఇంగ్లీషు తలంటి బహుమానంగా ఇద్దామనుకున్నాడుట" అన్నారు.

"ఇంగ్లీషు తలంటి బహుమానం ఇవ్వడం ఏమిటి?" అర్థం కాక అడిగాను.

"అవునుట... అదేమిటో చెప్పారమ్మా సా అనో పా అనో ఏమిటో నాకు గుర్తులేదు. దానికేమో బోలెడంత ఖర్చవుతుందిట. ఓసి వెర్రితల్లీ ఈ మాత్రం దానికి ఎక్కడికో పోవాలిటే అని చక్కగా తలకి నువ్వుల నూనెతో మర్దనా చేశాను. ఒంటికి నువ్వుల నూనెరాసి, పచ్చి పెసలు మిక్సీలో వేసి అందులో పసుపు, పాలూ కలిపి నలుగుపెట్టి, కుంకుడు కాయలతో తలంటి పోశాను. అంతే" అన్నారావిడ.

దంపతులిద్దరూ బయటికొచ్చారు. అదింకా నిద్రమత్తుగానే ఉంది. మా అత్తగారి పక్కనే కూర్చుంది.

బామ్మా! ఈవిడగారిని స్పాకి తీసికెళ్దాం అనుకున్నా. నువ్వు తలంటిపోశావుట. కదా... ఇక వద్దంటోంది" అన్నాడు.

"అవును. అమ్మమ్మగారి తలంటితో పోల్చుకుంటే ఆ స్పా బలాదూరు. ఒళ్లు మనసూ కూడా హాయిగా ఉన్నాయి. గాల్లో తేలిపోతున్నట్లు వుంది. అమ్మమ్మగారూ నెలకోసారి ఇలా తలంటి పొయ్యాలి మీరు" అంది.

"నెలకోసారేం ఖర్మ. నువ్వు నాకు దొరకాలే గానీ వారానికోసారి పోస్తాను. నువ్వు ఒప్పుకుంటే చక్కగా పెసలూ, బావంచాలు, పచ్చి పసుపు, కచ్చూరాలూ కలిపి సున్నిపిండి తయారు చేస్తా. దాంతో నలుగు పెట్టుకుంటే ఇంకా మెరిసిపోతావ్" అన్నారు ఆవిడ.

"నిజంగానా!" అంది కోడలు.

"అవునే అమ్మడూ! మా రోజుల్లో ఈ ఇంగ్లీషు తలంట్లు ఎక్కడుండేవి? ప్రతి

శుక్రవారం తలకి ఆవదం అంటుకుని, ఆ సున్నిపిండితో నలుగు పెట్టుకుని తలంటు పోసుకునేవాళ్లం. కుంకుడు కాయల్తో పాటు గుప్పెడు మందారాకు కూడా కలిపితే పట్టుకుచ్చులా వుండేది జుట్టు" అంటూ గత వైభవాన్ని వివరించారు.

"అయితే మీ సౌందర్య రహస్యం ఇదన్నమాట. ఈ వయసులోనూ ఇంత చక్కగా వున్నారు మీరు అనుకుంటూ వుంటాను" అంది కోడలు.

"ఏమైనా నాకు బోలెడంత డబ్బు ఆదా చేశావు బామ్మా! అదంతా నీకు ఇచ్చేస్తాను. చీరె కొనుక్కో" అన్నాడు అబ్బాయి.

"నాకెందుకురా వెర్రి నాగమ్మా? ఆ ఇంగ్లీషు తలంటికి ఖర్చు చేసే డబ్బుతో నీ పెళ్లానికే ఏదైనా కొనిపెట్టు. చూసి సంతోషిస్తాను. నాకంతకంటే ఏం కావాలిరా?" అన్నారావిడ.

భార్యాభర్తలిద్దరూ గారంగా ఆవిడ భుజాల మీద తల వాల్చుకున్నారు. వాళ్ళిద్దర్నీ దగ్గరకు తీసుకుని ముద్దు చేశారావిడ.

నా వెనుక తరాన్నీ, ముందు తరాన్నీ అలా చూస్తుంటే పట్టరానంత సంతోషం కలిగింది నాకు. ఈ జన్మకీ సంతోషం చాలు– అని తృప్తి పడ్డాను. ❑

# సిరిగల వారినే సిరి వరిస్తుంది

**చం**టిగాడు స్కూల్ నుంచి రాగానే పేచీ మొదలు పెట్టాడు. దొర్లి దొర్లి ఏడుపు.

పిల్లలు మంకుపట్టు పట్టి మారాం చెయ్యడం సహజమే.

కానీ స్కూల్ నించి రాగానే పేచీపెడితే అంతా అస్తవ్యస్తం అయిపోతుంది. రాగానే అన్నం తిని కాసేపు కార్టూన్లు చూసి హెూమ్‌వర్క్ చేసుకుని ఆడుకుని పెందలాడే నిద్రపోతాడు.

పేచీ పెడితే అన్నం తినడు. ఏడిచి ఏడిచి ఏదీ కానివేళ నిద్రపోతాడు. ఆ వేళంతా తిక్కగా ఉంటాడు.

ఒక్కడే పిల్లాడని బోలెడంత గారాం చేస్తారు వాడి అమ్మానాన్నా! కొండమీది కోతిని కావాలన్నా కొని తెస్తారు. అదే అలవాటైపోయింది వాడికి. తను అడిగింది ఇవ్వకపోతే వూరుకోడు. ఏడిచి మొత్తుకుని సాధిస్తాడు.

వాళ్ళ అమ్మేమో వాడికి నయానా భయానా చెప్పాలని చూస్తుంది. ప్రస్తుతం అదే నడుస్తోంది.

"ఎలాగూ వాడు అడిగింది సాధించక మానడు. నీకు కొనకా తప్పదు. ఆ భాగ్యానికి ఎందుకే ఇంత హైరానా? అదేదో ఇప్పుడే కొనిస్తే సరిపోతుంది కదా!" అని సలహా చెప్పాను.

"మీరొకరూ... నా ప్రాణానికి ఏమిటి కొనిచ్చేది? వాడేం కావాలనుకుంటున్నాడో తెలుసా?" విసుక్కుంది కోడలు.

"ఏమో నాకేం తెలుసు?" అన్నా.

"ధోనీని కొనుక్కుంటాడుట" అంది.

“మరదే కొనిపెట్టు” అంటే “నేను వాగి చావలేను మీతో” అనేసి వాడిని గదిలోకి లాక్కుపోయింది.

ఇహ అది దొరకదు నాకు. సాయంత్రం సుపుత్రుడు వచ్చాక అడగాలి. వాడొచ్చాడు. ఇద్దరూ పిల్లాడిని తీసుకుని ఓ రౌండేసి తిరిగొచ్చారు. వాడికోసం బోలెడన్ని వస్తువులు కొన్నారు. వాడు మంచి హుషారుగా ఉన్నాడు.

“ఇంతకీ వాడు అడిగింది కొన్నారుట్రా?” అని భోజనాల సమయంలో అడిగాను. తింటూ నవ్వేడేమో కొరబోయింది. “ఏంటమ్మా? కొనేది? వాడు క్రికెటర్ ధోనీని కొనుక్కుంటానని మారాం చేశాడు” అన్నాడు. ధోనీ అంటే సూపర్ మేనో, స్పైడర్ మేనో లాంటి బొమ్మలను కున్నా. ఈ గొడవ నాకర్థం కాలేదు. “క్రికెటర్‌ని కొనుక్కోవడం ఏమిట్రా?” అంటే ఈసారి అందరూ నవ్వేశారు.

“ఇప్పుడిలా అయిపోయింది గానీ, అప్పట్లో మీ అమ్మ పులి. పెందలాడే వంట చేసుకుని టి.వి. ముందు కూర్చుని క్రికెట్టు చూసేసి నాకు ఆఫీసుకి ఫోన్‌చేసి ఎప్పటి స్కోరు అప్పుడు చెప్పేసేది” అన్నారు మా ఆయన.

లారెల్ అండ్ హార్డీ సినిమాలో ప్రపంచ యుద్ధం ఆగిపోయిన తర్వాత కూడా ఎన్నో సంవత్సరాలు కవాతు చేస్తూంటాడు గుర్తుందా. అలా పాపం ఎక్కడో ఉండి పోయారు అత్తగారు” అంది కోడలు.

అది చెప్పింది నిజమే. అప్పట్లో శ్రద్ధగా చూసేదాన్ని క్రికెట్టు. ఆ తర్వాత ప్రతిరోజూ క్రికెట్టే. దాంతో ఆసక్తి తగ్గిపోయింది. మధ్యలో ఒకటి, రెండు సార్లు చూశాను. గానీ అసలు తక్కువ, ఆర్భాటం ఎక్కువా అన్నట్లు చిన్న చిన్న గుడ్డలు వేసుకుని గ్రామదేవత జాతర్లో గణాచారిలాగా చిందులు తొక్కే చీర్ గర్ల్స్ హడావుడి చూసి ఇక మళ్లీ ఆ జోలికి పోలేదు.

భార్య తల్లిని అలా హేళన చేసేసరికి పాపం అనిపించింది కాబోలు, భోజనాలు కాగానే “అమ్మా ఇట్రా నిన్ను కాస్త ఎడ్యుకేట్ చెయ్యాలి” అని పక్కన కూర్చోబెట్టుకున్నాడు మా అబ్బాయి.

“అమ్మా! మరీ... ఆటలు పోటీల కోసం పెద్దపెద్ద వాళ్లు ప్లేయర్లని వేలం పాటలో కొనుక్కుంటారు. కోట్లు కోట్లు పాడతారు” అన్నాడు.

“ఎందుకు? కోట్లు పెట్టుకొని కొనుక్కుని ఏం చేసుకుంటార్రా?” అని అడిగా!

"అలా కొనుక్కున్న వాళ్ళందర్నీ ఓ టీములో వేసి ఆడిస్తారు!"

"కొనుక్కోడం ఎందుకు? మామూలుగానే ఆడతారుగా? అప్పట్లో కపిల్‌దేవ్‌నీ, గవాస్కర్నీ ఎవరు కొనుక్కున్నారూ? వాళ్ళు ప్రపంచ రికార్డులు బద్దలు కొట్టేలా ఆడేశారు కదా!" నాకేం అర్థం కావటం లేదు.

"అప్పుడా పద్ధతి వేరు. ఈ మధ్యనే వచ్చిందిలే ఈ పద్ధతి".

"మరి వాళ్ళు పెళ్లాం బిడ్డలని వదిలేసి కొనుక్కున్న వాళ్ళ వెంట వచ్చేస్తారా?" అని అడిగాను.

"అట్లా ఏం రారు... వాళ్ళ తరఫున ఆడతారంతే."

"మరి కొనుక్కోకపోతే ఆడరా?"

"ఎందుకాడరూ? ఇండియా టీమ్‌కి ఆడతారు!"

"ఇండియాకి ఆడేవాళ్ళని మళ్లీ డబ్బు పెట్టి కొనుక్కుని మరీ ఆడించడం ఎందుకురా పందెం గుర్రాల్లాగా?"

"నావల్ల కాదే బాబూ... నీకు చెప్పటం. ఏం జరుగుతుందో చెప్తాను గానీ ఎందుకు  జరుగుతోందీ అంటే నేనేం చెప్పి చావనూ!"అని విసుక్కున్నాడు.

కోడలమ్మ రంగప్రవేశం చేసింది. "నేనేమైనా అంటే మా తల్లీకొడుకుల మధ్య తలదూర్చకు అంటారు. ఆవిడకు అర్థం అయ్యేలా చెప్పడం మీ తరం కాదు. మీకున్న తెలివి కూడా వూడిపోతుంది. నేర్పింది చాలుకానీ పదండి!" అని మొగుడిని మందలించి అక్కడి నించీ పంపేసింది.

"మీకెందుకు ఈ వివరాలు? చక్కగా ఫ్రెండ్స్‌కి ఫోన్లో కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చెయ్యండి" అని ఓ ఉచిత సలహా నా మొహాన పారేసి వెళ్లిపోయింది.

నా పరిస్థితికి జాలేసింది కాబోలు "నేను చెప్తా శ్రద్ధగా విను" అని క్రికెటర్లని వేలంపాటలో కొనుక్కునే విధానం అంతా వివరంగా చెప్పేరు మా శ్రీవారు.

అసలు విషయం అర్థం అయ్యాక మనసంతా పాడైపోయింది.

మన దేశంలో క్రికెట్టు ఆటకున్నంత క్రేజ్ అంతా ఇంతా కాదు. ఆట ఆడగా వచ్చే డబ్బు కూడా అలా ఉంచి, అడ్వర్‌టైజ్‌మెంట్ల ద్వారా బోలెడంత గడిస్తున్నారు ఆటగాళ్ళు. ఇక గెలిస్తే వాళ్ళని బహుమతులతో ముంచెత్తుతారు. క్రికెట్టుకి బ్రహ్మరథం పడుతూ ఉంది దేశం మొత్తం.

వేయి ప్రభలతో వెలిగిపోతున్న వాళ్ళకే మళ్లీ కోట్లు ముట్టచెప్పే బదులు ప్రతిభ వుండీ అతీగతీ లేకుండా పడివున్న ఇతర క్రీడాకారులు లెక్కలేనంత మంది ఉన్నారు. పతకాలు గెల్చుకుని కూడా ఏ విధమైన సాయమూ అందని వాళ్ళు అసంఖ్యాకంగా ఉన్నారు.

వారి వారి క్రీడలను మెరుగు పరచుకునేందుకు కనీసావకాశాలు కూడా లేకుండా అనాథల్లా పడున్న ఆటగాళ్ళెంతో మంది ఉన్నారు. వీళ్ళని కూడా తగిన రీతిన ప్రోత్సహించవచ్చు కదా అనిపిస్తోంది. కోట్లు, లక్షలూ కుమ్మరించకపోయినా వారికి కావలసిన సదుపాయాలు కలిగిస్తే సానపట్టిన వజ్రాల్లా మెరిసిపోరూ!

వేలంపాటల్లో మనదేశపు క్రికెట్టు ఆటగాళ్ళకే కాక పరాయి దేశాల వాళ్ళనీ కొనుక్కుంటున్నారు అంటే కన్నత్త గాలికి కొట్టుకుపోయింది. పిన్నత్తకి పెట్టండి పిండ ప్రదానం అని సామెత చెప్పినట్లు లేదూ??? ❑

# ముద్దుగారే యశోదా

**మా** పిన్ని కూతురు శైలజ ఫోన్ చేసింది.

దాని కూతురు స్మిత గృహప్రవేశం. రాకపోతే నా మీద ఒట్టే అంది.

అది నాకు చాలా దగ్గర బంధువు. అంతకు మించిన స్నేహం కూడా ఉంది మా మధ్య. అదీగాక స్మిత కూడా ఆమ్మా... ఆమ్మా... అంటూ ఎంతో ఆప్యాయంగా ఉంటుంది. దానికి కొడుకు పుట్టి మూడేళ్ళైనా నేను చూడనే లేదు.

ఏ విధంగా ఆలోచించినా తప్పకుండా వెళ్ళాల్సిన వేడుక.

కాకపోతే వాళ్ళ కొత్త ఇల్లు ఎక్కడో గచ్చిబౌలీ దాటిన తరువాత. ముహూర్తం తెల్లవారుజామున నాలుగింటికి. ముహూర్తం టైముకి ఆ వేళప్పుడు అంతదూరం వెళ్ళడం అసంభవం. రాత్రే వెళ్లి పడుకుందామంటే కొత్త ఇల్లు.

వాళ్ళంతా బెంగుళూరు నించీ వచ్చారు. హెూటల్లో రూమ్ తీసుకుని ఉంటున్నారు. మరి మేం వెళ్తే ఇబ్బంది అవుతుంది. అన్ని విధాలా ఆలోచించి తెల్లవారాక వెళ్ళి సత్యనారాయణ వ్రతం చూసి, భోజనాలు చేసి వద్దాం అనుకున్నాం.

మర్నాడు ఫంక్షన్ అనగా శైలజ ఫోన్ చేసింది. ఆ ఇంటికి దగ్గర్లోనే గెస్ట్ హవుస్‌లో రూమ్‌లు బుక్ చేశారుట. "సాయంత్రం చీకటి పడకుండా వచ్చేయ్. ఇక్కడే డిన్నర్ కూడా. కేటరింగ్ వాళ్ళకి చెప్పేశాం. మనవాళ్ళంతా వస్తున్నారు. చాలా రోజులయింది అందరం కలిసి. సరదాగా కాలక్షేపం చేద్దాం" అని చెప్పింది.

మాకూ సరదా వేసింది. వెంటనే పెట్టె సర్దుకుని బయలుదేరి వెళ్లాం. ఆ గెస్ట్ హవుస్ చాలా బావుంది. ఎవరో ఎన్.ఆర్.ఐలు కట్టించి అద్దెకిచ్చారుట. రూమ్ రెంట్ కూడా రీజన్‌బుల్‌గానే వుందిట. ఒక్కో రూమ్ పదిహేను వందలు.

శైలజ, స్మిత ఎంతో ఆదరంగా ఆహ్వానించారు. వాళ్ళు కొన్న సామాన్లన్నీ చూపించారు. స్మితకి ఒక్కతే ఆడపడుచు. ఆ అమ్మాయి కోసం చిన్న వెండి బిందె

కొన్నారు. దగ్గర బంధువులకందరికీ మైసూర్ క్రేప్ చీరెలు. మిగిలిన పేరంటాళ్ళకి వెండి దీపాలు. ఇక వాళ్ళ స్వంతానికి కొనుక్కున్న బట్టలైతే చెప్పనక్కర్లేదు. అన్నీ డిజైనర్ శారీస్.

శైలజా వాళ్ళది కలిగిన వ్యవహారం. దాని భర్త ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో ప్రిన్సిపల్. శైలజ మేథ్స్ లెక్చరర్. 'కె సెట్' స్టూడెంట్స్‌కి కోచింగ్ క్లాసులు నడుపుతుంది. ఉదయం, సాయంత్రం బేచ్‌లు బేచ్‌లుగా వస్తూనే ఉంటారు స్టూడెంట్స్.

దానికిద్దరు కూతుళ్ళు. పెద్దది లహరి. అమెరికాలో సెటిలైపోయింది.

రెండోది స్మిత. అదీ, దాని భర్త ఇద్దరూ బెంగుళూరు ఐ.ఐ.ఎమ్‌లో చదివారు. ఇద్దరికీ చాలా మంచి జీతాలు. బెంగుళూర్లో ఒక ఫ్లాట్, ఒక డూప్లెక్స్ ఇల్లు కొనుక్కున్నారు. వాళ్ళ అత్తవారూ ఆ ఊరే. ఆవిడ గైనకాలజిస్ట్. మామగారు జనరల్ సర్జన్.

హైదరాబాద్ కూడా చాలా ఫాస్ట్‌గా డెవలప్ అవుతోంది. ప్రాపర్టీ వుంటే మంచిదని డీలక్స్ ఫ్లాట్ కొన్నారు. రెండు వేల చదరపు అడుగుల ఇల్లట. హంగులూ, ఆర్భాటాలూ అన్నీ ఉన్న గేటెడ్ కమ్యూనిటీలో ఉంది. అన్నీ కలిపి ఒకటి దాటింది అమ్మా అని చెప్పింది స్మిత సంతోషంగా.

దాని కొడుకు అఖిల్‌కి మూడో ఏడు. చూట్టానికి రెండు కళ్ళూ చాలవు అన్నట్లు వున్నాడు. మూడో ఏడు. ఆ వయసుకే బోలెడన్నీ మాటలొచ్చాయి. పాటలూ వచ్చు.

నీ పేరేవిట్రా అంటే అఖిల్ అని చెప్పాడు. అమ్మపేరు చిమిత. నాన్నపేరు భరతవాజ (భరద్వాజ). వాళ్ళు బెంగుళూరులో యలహంత దగ్గరుంటారుట. వాడికి బందారుదుంతల కులా... ఒత్తి పప్పూ, ఐచుకీమూ ఇష్టంట.

సినిమాలూ చూస్తాడుట. పాటలు కూడా వచ్చుట. పాడరా అంటే వెంటనే రెడీ అయిపోయి పాడేశాడు.

"దీల దీల దీల మన చాగలేదురా!" అని మగధీరలోని పాట పాడేశాడు. ఇంకోటి పాడరా అంటే వెంటనే తయారైపోయాడు.

"చూడొద్దంతున్నా... చూత్తూనే వున్నా!" అని పోకిరి పాట పాడేశాడు.

వాడి ఆటపాటల్తో మైమరచిపోయాం. నవ్వలేక సతమతం అయిపోయాం. అందరం వాడిని వాగించడమే.

మర్నాడు ఫంక్షన్ బాగా జరిగింది. చాలామంది వచ్చారు. లంచ్ కూడా చాలా గ్రాండ్‌గా ఉంది. భోజనాలు అయ్యాక ప్రయాణం అయ్యాం.

స్మితా ఈసారైనా మా ఇంటికి వచ్చి ఓ పూట వుండి వెళ్ళవే అంటే సాయంత్రం ఫ్లైట్‌కే వెళ్ళాలి అమ్మా. అతి కష్టం మీద రెండ్రోజులు శలవు దొరికింది అంది.

"అవునే అక్కయ్యా... లక్షలు సంపాదనలన్న పేరేగానీ ప్రాణానికి సుఖం లేదు. పొద్దునే వెళ్తే రాత్రే రావడం" అంది శైలజ.

అఖిల్ గాడు అక్కడే ఉన్నాడు. వాడిని ఎత్తుకున్నాం. కొత్త లేదు వెధవాయికి.

"అఖిల్ నువ్వు నా దగ్గర వుండిపోరాదుట్రా?" అని అడిగాను.

"ఓ... వుంతా... మలీ మీ ఊల్లో కెచ్ వుందా?"

చక్రాల్లాంటి కళ్ళు మరింత పెద్దవి చేసి ముద్దుగా అమాయకంగా అడిగేశాడు!

కలుక్కుమంది నా మనసు. "అదేవిట్రా నాన్నా! నీకు క్రెష్ ఎందుకురా మా ఇల్లుందిగా!" అంటే నవ్వేశాడు.

"ఇంతిలో వుంతారా ఏంతి? క్రెచ్‌లోనే ఉండాలి. అదయిపోయేదాకా మమ్మీ వచ్చేదాకా ఇంకో ఆంతీ వాల్లింతికి వెళ్లిపోవాలి" అన్నాడు.

"ఏమిటే స్మితా ఇదీ?" అంటే

"ఏం చెయ్యమంటావు అమ్మా... ఓ సారి ఆఫీసుకి వెళ్ళాక ఎప్పుడొస్తామో నాకే తెలీదు. క్రెష్ వాళ్ళమో ఠంచనుగా ఆరింటికి మూసేస్తారు. పక్కనే మాకు తెలిసిన వాళ్ళ ఇల్లుంది. ఆరు లోపల నేను రాకపోతే క్రెష్ ఆయా అక్కడ దిగబెట్టేస్తుంది. నేను అక్కడికి వెళ్లి ఇంటికి తీసుకొచ్చేస్తా!" అంది స్మిత.

"ఎంత? ఇంకో ఆర్నెల్లు పోతే ప్లే స్కూల్లో వేసేస్తాం! స్కూలు అయిపోగానే ఏ గిటారు క్లాసుకో పంపిస్తే సరిపోతుంది. ఏం చేస్తాం మరీ? మాకేమో తీరి చావదు. ఓపిక వున్నప్పుడే నాలుగు డబ్బులు సంపాదించుకోవాలి కదా!" అంది శైలజ.

"ఇదంతా ఎవరికోసం ఆమ్మా! వాడి ఫ్యూచర్ కోసమే కదా" అంది స్మిత

ఎవరడిగారో పాడమని. అఖిల్ పాడుతున్నాడు.

"ముద్దుగారే యచోదా!" ❑

# సుఖంగా బతకాలనుకుంటున్నావా? అయితే చంపేయ్

గంటనుంచి ఊదరపెట్టేస్తున్నాడు భరత్.

ఉద్యోగంలో ఏదో చీకాకులట. బాస్ తిక్క వెధవట. పోనీ ఈ జాబ్ వదిలేద్దామంటే మళ్ళీ మంచి జాబ్ దొరుకుతుందో లేదో అని భయంట. అన్నీ చెప్పి “ఏమిటి పిన్నీ ఈ గొడవలన్నీ పడలేను. సుఖంగా ఏ సన్యాసుల్లోనైనా కలిసిపోవాలనుకుంటున్నా” అన్నాడు.

“అటువంటి సన్నాసి ఆలోచనలు చెయ్యకు. సన్యాసుల్లో కలిస్తే ఏం వస్తుంది బూడిద? అంతకంటే మంచి మార్గం చెప్తాను” అన్నాను.

“మాతల్లి... మాతల్లి, అదేమిటి చెప్పి పుణ్యం కట్టుకో చచ్చి నీ కడుపున పుడతా” అన్నాడు.

“నువ్వు చావటం నా కడుపున పుట్టటం ఇవన్నీ అయ్యే పన్లేనా. వెధవ వాగుడూ నువ్వూ” అని విసుక్కున్నాను.

“ఏదో మాటవరసకి అన్నాలే. ఇంతకీ నేనేం చెయ్యాలో చెప్పు” అన్నాడు. ఓ మర్డర్ చేసేయ్ అన్నాను.

అదిరిపడ్డాడు. “నీకు ఎగతాళిగా ఉందా పిన్నీ నన్ను చూస్తుంటే” అన్నాడు.

“ఎగతాళి కాదురా! సీరియస్‌గా చెప్తున్నా. నిజంగానే మర్డర్ చెయ్. చాటుమాటుగా కాదు. పట్టపగలు అందరూ చూస్తుండగా ఎవరినైనా వేసేయ్. పబ్లిక్ ప్లేస్‌లోనో, కెమెరాలు చూస్తుండగా ఇద్దర్నో ముగ్గురినో వేసేశావనుకో ఇక నీకు ఢోకా లేదు” అన్నాను.

“ఏమిటి పిన్నీ నీ మాటలు?” ఏబ్రాసి మొహం వేసుకుని అడిగాడు.

"అవున్రా. మన దేశంలో నేరస్థుడి ప్రాణాలకి ఉన్నంత విలువ ఇంకెవరికీ ఉండదు. నేరం చేసి పట్టుబడితే ఇక రాజభోగమే. వాళ్లకి అనుమానం కలిగితే చావబాది నిజం కక్కిస్తారుగానీ రుజువులూ సాక్ష్యాలూ పటిష్ఠంగా ఉండి గనుక పట్టుబడితే చాలు. వాళ్ల పిలక నీ చేతిలో ఉన్నట్లే.

"విచారణ సమయంలో నీ కసిదీరా వాళ్లని బంతాడుకోవచ్చు. నేను చెయ్యలేదనొచ్చు. అలా మర్డరు చేసేటప్పుడు నా మానసిక స్థితి సరిగా లేదనవచ్చు. అసలా కెమెరాలో ఉన్నది నేను కానే కాదు, మనిషిని పోలిన మనిషుంటాడు అనొచ్చు. ఎవరో నా చేత చేయించారు, అలా చేయించిన వాళ్లకి పెద్ద తలకాయలతో సంబంధం వుందని ఓ రాయివేసి తేనెతుట్టెని కదపవచ్చు. చెప్పాగా నీ ఇష్టం!"

"మరి విచారణ పూర్తయి శిక్షపడితేనో?" అని అడిగాడు.

"నేను నాలుగు ముక్కల్లో చెప్పానుగానీ విచారణ అంత త్వరగా పూర్తవుతుందిట్రా నీ వెర్రిగానీ. పదేళ్లో పన్నెండేళ్లో పడుతుంది. అంతకాలం నిన్ను పండక్కివచ్చిన అల్లుడిలా చూసుకుంటుంది ప్రభుత్వం. నీమీద ఈగ వాలితే వాళ్ల ఉద్యోగాలెగిరిపోతాయి కాబట్టి నిన్ను కంటికి రెప్ప లాగా కాపాడుకుంటారు.

అప్పుడు ఉరిశిక్ష లేదా యావజ్జీవ కారాగార శిక్ష వేస్తారు. నువ్వు హైకోర్టుకి అపీల్ చేసుకోవచ్చు. అలా కొంతకాలం నడుస్తుంది. నీ దశ తిరిగితే హైకోర్టు వాళ్లు కింద కోర్టుని మీ నిర్ణయం సరి కాదు మళ్ళీ విచారించమని మందలిస్తారు. మరికొంత కాలం నిశ్చింతగా ఉండొచ్చు. చివరాఖరికి నీకు శిక్ష ఖాయం చేశాక మానవ హక్కులవాళ్ళు జీవకారుణ్యం వాళ్లు వచ్చి అడ్డుపడి నిన్ను ఆదుకుంటారు. మళ్ళీ కొంతకాలం గడిచిపోతుంది.

ఇవన్నీ అయ్యేసరికి నీకు అదుగో ఇదుగో అని అరవై ఏళ్ళొచ్చేస్తాయి. అప్పుడు శిక్ష ఖరారుచేస్తే నా వయస్సుని దృష్టిలో పెట్టుకుని నన్ను శిక్షించండి అని బతిమాలుకోవచ్చు. నీ కేసు జెన్యూన్ కాబట్టి కన్సిడర్ చేసే అవకాశాలున్నాయి. కాదూ శిక్ష వేసే తీరుతాం... అంటే కూడా ఏం మించిపోదు. నువ్వు ప్రెసిడెంట్‌కి ప్రాణభిక్ష పెట్టమని అర్థించవచ్చు. వారికి మనసు కరిగినా కరగవచ్చు.

లేదూ శిక్షలు అమలు జరుపవచ్చు. అంత వయసొచ్చాక యావజ్జీవమే వేస్తారు సాధారణంగా. శేష జీవితం అక్కడ గడపవచ్చు. ఏ జంజాటం లేకుండా వృద్ధాప్యం గడిచిపోతుంది.

“కాదూ ఉరే తీశారనుకో. ఏం మాయరోగం? ఇంత కాలం హాయిగా గడిచిపోయింది. దేవుడు నాకిదే రాశాడు అని తాడుకి వేలాడు” అని చెప్పాను.

“అబ్బా ఇంత మతలబు వుందా పిన్నీ. నాకు తెలీదు” అన్నాడు.

“నీ మొహం. నిండా పాతికేళ్ళు లేవు. ఇవన్నీ నీకేం తెలుస్తాయి? మేము చాలా కేసులు చూశాం. చూస్తున్నాం. ఇంకా ముందు ముందు ఇంకెన్నో కేసులు చూస్తాం. అనుభవంతోనే చెప్తున్నా. నేనిచ్చింది ఔట్‌లైను మాత్రమే. నీ తెలివి తేటలు ఉపయోగించి ఇంకాస్త పటిష్ఠంగా ప్లాను వేసి ఇంకా గొప్ప క్రిమినల్‌గా నాటకం ఆడావనుకో నీ రొట్టె విరిగి నేతిలో పడ్డట్లే”.

చూడ్డానికిలా పీలగా ఉన్నాడు గానీ సామాన్యుడు కాడు. ఇప్పుడు పట్టుబడ్డారు కాబట్టి తెలిసింది గానీ వారి ఖాతాలోకి అదివరకే బోలెడన్ని మర్డర్లున్నాయి అని గౌరవిస్తారు. జైల్లోనే సెల్‌ఫోన్ వగైరా హంగులన్నీ ఇస్తారు. అలా అలా నిన్ను రాజకీయాల్లో చేర్చేసుకునే అవకాశాలు కూడా ఉంటాయి అన్నాను.

“అబ్బా వింటూంటేనే ఒళ్ళు పులకరించి పోతోంది పిన్నీ!” అన్నాడు భరత్.

‘మరింకేం ఈసారికిలా కానిచ్చేయ్!” అన్నా. ❑

# పదం కాని పదం

**రో**డ్డుమీద హఠాత్తుగా ఎదురైంది ఒకావిడ "ఇక్కడున్నారేం పాపం?" అని పలుకరించింది.

ఆవిడెవరో గుర్తురాలేదు నాకు! కానీ అంత ఆదరంగా పలుకరించడం నాకు నచ్చింది. ఈ రోజుల్లో రోడ్డుమీద నడవడం పాపమేగా మరి!

'మొన్న మీ ఇంటి కొచ్చాం. మీరింట్లో లేరు పాపం' అంది.

అదీ నిజమే. ఈ మధ్య బాగా బిజీ అయిపోయాను. క్షణం తీరికా లేదు. దమ్మిడీ ఆదాయం లేదు అన్నట్లుగా వుంది. ఎవరో గుర్తుకు రావడం లేదు గానీ నా శ్రేయోభిలాషి లాగానే ఉంది. నా మీద సానుభూతి చూపిస్తోంది.

"అమ్మాయి దగ్గరికి వెళ్లారుటగా పాపం?" అనేసరికి అప్పుడు అనుమానం వచ్చింది. "వాళ్ళంతా బావున్నారా 'పాపం!' అనేసరికి నిర్ధారణ అయిపోయింది. 'పాపం' అనేది ఆవిడ ఊతపదం. మరో నాలుగు మాటలు పాపం... పాపం. అంటూనే మాట్లాడి తన దోవన వెళ్లిపోయింది.

ఈ ఊతపదాల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. చిత్ర విచిత్రంగా ఉంటుంది ఆ ఊతపదాల వాళ్ళతో మాట్లాడుతూ ఉంటే. నాకు తెలిసిన వాళ్ళలో చాలామందికి ఊతపదాల జాడ్యం వుంది.

మాకు అత్తయ్యవరసైన ఒకావిడకి ఊతపదం 'ముష్ఠి'.

"మీ మామయ్యగారు ఆ ముష్ఠి ఆఫీసొదిలి ఓ పట్టానరారు. నిన్న సినిమాకెళ్ళాం. అదో ముష్ఠి సినిమా. మా పక్కింటివాళ్ళు మహా పేచీకోరు మనుషులు. తెల్లారిందగ్గర్నించీ ముష్ఠి గోల" అని గడగడ మాట్లాడేసింది.

మరో పిన్నిగారి ఊతపదం 'ఏదో సామెత చెప్పినట్లు' బానే వుందమ్మా నీ గొడవ. ఏదో సామెత చెప్పినట్లు ఎంతకీ తెమలదేం వంటవనీ? అంటూ ఉంటుంది. "ఏం

సామెత పిన్నీ" అని అడిగితే ఆవిడకి చాలా కోపం వచ్చేస్తుంది. 'ఏదో సామెత' మాటవరసకి అంటే అదేఏ పట్టుకుంటావేం ఏదో సామెత చెప్పినట్టూ" అని మండిపడుతుంది.

ఆవిడకి అంత పెద్దఊత పదం అయితే, మా భట్టిప్రోలు మామయ్య ఊతపదం చాలా చిన్నమాట. 'ఏది?' ఆ రెండక్షరాల పదంతోనే ఎదుటివాళ్ళకి వెర్రెక్కించేస్తాడు.

"నిద్రలేచేనా 'ఏది'? పేపరొచ్చిందా 'ఏది'? సరిగ్గా అప్పుడే మీ అత్తయ్య వచ్చింది ఏది? కూరలు తీసుకురమ్మని గోల చేసింది ఏది? నా కొళ్ళు మండుకొచ్చింది ఏది? రెండు తగిలిద్దామనుకున్నా ఏది? కానీ ఎందుకులే కొరివితో తలగోక్కోవడం ఏది? అని వూరుకున్నా ఏది?" అంటూ దడదడ వానకురిసినట్లు మాట్లాడేస్తాడు.

మాయదారి సంత, పీడాకారం, ఇలాటి గమ్మత్తైన ఊతపదాలుంటాయి. కొన్ని ఊతపదాలు కొంపలంటిచేస్తాయి.

ఉదాహరణకి ఓ పెద్దమనిషి అలాంటి ఊతపదం ఉపయోగించడం అలవాటు. ఆయన ఊత పదం మీరు చెప్పినట్టూ 'మీరు చెప్పినట్లూ, ఆ గోపాలంగారమ్మాయి అష్టావక్రంగా ఉంటుంది. మీరు చెప్పినట్లూ ఆ సీతాపతిగారు మహా కంత్రీ మనిషి" అంటూ వుంటే శ్రీరామచంద్రా మేం ఎప్పుడు చెప్పాం?" అని నెత్తీనోరూ మొత్తుకునే వాళ్ళు ఎదుటివాళ్లు.

మా పార్వతీశం తాతయ్యగారు ఊరి పెద్ద. ఆయనంటే అప్పట్లో అందరికీ అలివిమాలిన భయభక్తులుండేవి. పొద్దున్నే కంచుగిన్నెడు కాఫీతాగి వాకిట్లో అరుగుమీద కూర్చునేవారు. ఆయన ఊతపదం 'శుభం'.

వచ్చేపోయే వాళ్ళందర్నీ పలుకరించేవారు. "ఎవర్రా అదీ? నువ్వట్రా వెంకట్రమణా! ఊరెళ్తున్నావా? శుభం! వెళ్లిరా!

ఏవిట్రా అబ్బాయి ఆ చేతిలోది? తియ్యగుమ్మడి కాయా? శుభం! ధప్పళం చేయించుకుని తిను" అంతవరకూ బాగానే ఉంది. కొన్నిసార్లు మాత్రం బెడిసి కొట్టేది వ్యవహారం!

"ఏవిట్రా గోవర్ధనం? మీ ఆవిడకి వ్యాధి తిరగబెట్టిందిటగా? శుభం..."

"ఎవరదీ మాధవుడు కాదూ? మీ వాళ్ళకి ఈ ఏడూ పంటలు పోయాయిటగా! శుభం".

"పిల్లాడు పరీక్ష తప్పాడా? శుభం" అనేసేవారు అలవాటు కొద్దీ. మేము పుట్టెడు

కష్టంలో ఉంటే ఈయనకి వెటకారంగా ఉంది. ఏళ్ళొచ్చాయి ఎందుకూ ఏడవనా అని నిందించేవాళ్ళు.

ఇవన్నీ ఒకెత్తు అయితే మరో విచిత్రమైన జంట ఒక్కటీ ఒకెత్తు. ఆయన ఊతపదం 'ఎందుకని అడగండి?' ఆవిడ ఊతపదం 'మరడక్కండి?'

వాళ్ళింట్లో వాతావరణం నిలయ విద్వాంసుల లయవిన్యాసంలా ఉండేది. ఇద్దరికీ బోలెడంత బంధుప్రేమ.

ఎవరైనా ఇంటికెళ్తే చాలు వాళ్ళ మొహాలు దివిటీల్లా వెలిగిపోయేవి.

"రండి రండి ఇవ్వాళొచ్చి మంచి పని చేశారు! ఎందుకని అడగండి?" అనేవాడాయన.

"నిజమే! నిన్నగానీ వచ్చుంటేనా? 'మరడక్కండి' అనేదావిడ".

"అబ్బో వారం రోజుల నించీ ఒహటే హడావుడి ఎందుకని అడగండి?"

"సున్నాలేయించాం ఇంటికి. ఆ బాధలు బాధలా! 'మరడక్కండి". ఎదుటివాడికి అడిగే పనీ లేదు. చెప్పే పనీ లేదు. వింటూ కూర్చుంటే చాలు. కావలిసినంత కాలక్షేపం.

ఈ ఊతపదాల వారు ప్రమాదకరమైన వ్యక్తులూ కారు. సంఘ విద్రోహులూ కారు. కానీ చాలా తలనెప్పులున్నాయి వీళ్లతో. కొన్ని సందర్భాలలో వీళ్ళని ఎవాయిడ్ చేస్తారు. పీనుగ, శార్ధం, పిండాకూడు, నా బొంద, ఇలాంటి ఊతపదాలు వాడేవాళ్ళని ఏదైనా శుభకార్యానికి పిలవాలంటే ఒకటికి పదిసార్లు ఆలోచిస్తారు. శుభమా అని వేడుక చేసుకుంటూ ఎందుకొచ్చిన గొడవ. వచ్చిన దగ్గర్నించీ అపశకునం మాటలూ వాళ్ళూనూ. శుభలేఖ వేశాం అందలేదా అనో... ఫోను చేశాం ఎవరూ ఎత్తలేదు అనో... సాకు చెప్పి తప్పించుకుందాం... అనుకుంటారు.

ఏది ఏమైనా ఏ ఊతపదం లేకుండా మాట్లాడే వాళ్ళు లక్కీఫెలోస్. ❑

# గంభీరమైన సమస్య

**తె**ల్లవారి లేస్తే సవాలక్ష సమస్యలు. రాజకీయాలూ, స్కామ్‌లూ, గ్లోబల్ వార్మింగ్ వంటి గంభీరాతి గంభీరమైన సమస్యలని వదిలేస్తే ప్రస్తుతం ఎంతోమందిని పట్టి పీడిస్తున్న గంభీరమైన సమస్య ఒకటి ఉంది.

అది బరువు సమస్య. అదివరకు రోజుల్లో ఈ సమస్య అంతగా వేధించేది కాదు. నడివయసు వచ్చాక ఆడా, మగా అందరూ ఒళ్ళు చేసి గునగునా నడిచేస్తూ హాయిగా వుండేవాళ్ళు. కాకపోతే వాళ్ళకి తగిన శారీరక శ్రమ ఉండేది కాబట్టి మరీ గుండ్రంగా వుండేవాళ్ళు కాదు. లావెక్కామన్న బాధగానీ ఈ బరువు భవిష్యత్తులో మన కొంప ముంచేస్తుందేమో అనే భయంగానీ వుండేవి కావు.

సుఖంగా తింటూ తిరుగుతూ వుండేవాళ్ళు.

ఇటీవల కొద్ది దశాబ్దాలుగా ఈ బరువు గుండె మీద బరువుగా మారిపోతోంది. ఎవర్ని కదిలించినా లావెక్కిపోతున్నాం. ఎలా తగ్గాలో తెలియడం లేదని ఒకటే గోల.

మరి సమస్యలు తలెత్తగానే దానికి పరిష్కారం కూడా వచ్చేస్తుంది కదా. అలాగే ఈ బరువు బాధితుల బాధనివారణార్థం సవాలక్ష మార్గాలు. ఎక్సర్‌సైజ్ చెయ్యడానికి అనేకానేకమైన సాధనాలు. వాకింగ్ చెయ్యండి. యోగా చెయ్యండి. జిమ్‌కి వెళ్ళండి... అంటూ బోలెడు సూచనలు.

అవన్నీ చేస్తే కచ్చితంగా బరువు తగ్గేమాట నిజమే. కానీ అంత ఓపికా, తీరికా ఎవరికున్నాయి ఈ రోజుల్లో. అందులోనూ ఆ వాకింగులూ అవీ రెగ్యులర్‌గా చెయ్యాలి. ఓ రోజు చేసి పదిరోజులు మానేస్తే ఏం ఫలితం ఉంటుంది?

ఏమాటకామాటే చెప్పుకోవాలి ఈ అధిక బరువు ఎంతో మందికి జీవనోపాధి కల్పిస్తోంది. ఎన్నెన్నో సాధనాలు మార్కెట్లోకొచ్చేశాయి. ఏ టీవీ ఛానెల్లో చూసినా అనాయాసంగా సునాయాసంగా బరువెలా తగ్గాలో సూచించే ప్రకటనలు గంటలకొద్దీ

ప్రసారమవుతూనే ఉంటాయి. నడుముకి కట్టుకునే బెల్టు, చేతికి అంటించుకునే స్టిక్కరూ, నోళ్ళలో కలుపుకొనితాగే పౌడరూ. ఎన్నో... ఎన్నెన్నో...

పేపరు తీస్తే చాలు "లావు, పొట్ట తగ్గించబడును".

"మా దగ్గరికి వస్తే చాలు మిగిలినవన్నీ మేం చూసుకుంటాం. నలభై రోజుల్లో పదిహేను కిలోలు తగ్గండి."

"ఆరు గంటల్లో ఆరంగుళాల చుట్టుకొలత కచ్చితంగా తగ్గించబడును" వంటి ప్రకటనలు అసంఖ్యాకంగా కనిపిస్తాయి.

ఒకసారి వచ్చిన ఒళ్ళు తగ్గడం మాటలు కాదు.

ముందు నోరు కట్టేసుకోవాలి. మన తెలుగువాళ్ళకి అలవిమాలిన తిండి తాపత్రయం. కమ్మగా వండుకుని కడుపునిండా తిని ఈ జీవితానికి ఈ సుఖం చాలు అనుకునే అలవాటు మనది.

డొక్క మాడ్చుకుని ఆకులూ అలములూ తింటూ జీవనం సాగించడం అంటే ప్రాణాంతకం కదా!

ఎలాగైనా బరువు తగ్గుదాం... డైటింగ్ చేద్దాం... అని గట్టిగా నిర్ణయించుకుని డైటింగ్ మొదలు పెట్టిన మూడోరోజే పెళ్ళికో పార్టీకో వెళ్ళాల్సి వస్తుంది. దాంతో డైటింగ్ కాస్తా కొండెక్కుతుంది.

ఈ మధ్యన అన్నీ తింటూ బరువు తగ్గండి... అనే ప్రకటనలు చూసి పరుగున వెళ్ళి వాళ్ళదగ్గర వాలిపోతున్నారు జనాలు.

తీరా వెళ్తామా! వాళ్ళేమో వీళ్ళని తూకంవేసి చూసి ఏం ఫర్వాలేదు. మీకంటే ఆరు రెట్లు ఉన్నవాళ్ళకు కూడా కరీనాకపూర్లా చేసేసి పంపేశాం. మీరో లెఖ్ఖా? ఇదిగో ఇంతవుతుంది బరువు తగ్గడానికి అని ఓ అయిదంకెల సంఖ్యను కాయితం మీద వేస్తారు. పొద్దున ఓ గంటా, సాయంత్రం ఓ గంటా మా దగ్గర కొచ్చి ఎక్సర్‌సైజులు చెయ్యాలి. ఆయిల్ మసాజ్‌లూ, ఆవిరి స్నానాలూ వుండనే వుంటాయి.

ఇక భోజనం విషయానికొస్తే అన్నీ తినొచ్చు. కొన్ని మాత్రం మానెయ్యాలి. ఇడ్లీ, దోసె, పూరీ, ఉప్మా వగైరాలు మానెయ్యాలి. ఊరగాయల జోలికి పోకూడదు. వరి అన్నం మాటెత్తకూడదు. పప్పూ, ఉప్పూ, పంచదారా, పెరుగూ, మైదా, శనగపిండీ నిషిద్ధం స్వీట్లను కల్లోకూడా ముట్టుకోకూడదు. చింతపండు వాడకూడదు.

బంగాళాదుంపా, దొండకాయా, వంకాయ, బెండకాయా, ఇతర దుంపకూరలూ తినకూడదు. కాఫీ, టీలు తాగకూడదు... అని పెద్దలిష్టు చదువుతారు. అవన్నీ వినేసరికి మనకు నీరసం వస్తుంది.

అదేమిటి? మరన్నీ తింటూనే బరువు తగ్గండి అని ప్రకటన ఇచ్చారు కదా? అని నిలదీసి అడిగితే...

“ఇప్పుడు మాత్రం తినొద్దన్నామా? గోధుమ అన్నం తినండి. బార్లీ జావ తాగండి. గోధుమ గడ్డి తినండి. పచ్చి కూరలు, పళ్ళరసాలు మీ ఇష్టం”! అంటారు.

ఆ కాడికి ఇంత డబ్బు తగలేసి మీ చుట్టూ తిరగడం ఎందుకటి? ఇన్ని మానేస్తే ఇంట్లో కూర్చునే బరువు తగ్గచ్చు అని ఓ దణ్ణం పెట్టి ఇంటికొస్తాం.

కానీ వాళ్ళు చెప్పినవి తిని వద్దన్నవి మానేద్దాం అనుకుంటే ఇంట్లో ఉన్న మొగుడూ పిల్లల సహా కరించద్దూ? మన ఒంట్లో ప్రవహించేది పతివ్రతల రక్తమే అయినా మొగుడికి వేపుడుకూరలు పెట్టి మనం గోధుమ గడ్డి ఏం తింటాం?

ఏది ఏమైనా ఈ బరువు బాధితులకి మనశ్శాంతి లేకుండా పోతోంది. మన దేశకాల పరిస్థితులను అనుసరించి ఈ బరువు అనే సమస్యని గాలికొదిలేస్తే భేషుగ్గా ఉంటుంది.

ఒకసారొచ్చిన బరువు అంతతేలిగ్గా తగ్గదని అందరికీ తెలుసు. ఈ బరువు తగ్గించే పద్ధతినే బేన్ చేసి పారేస్తే ఉన్నంత బరువుతోనే సుఖంగా సంతోషంగా వుంటాం మన పూర్వుల లాగా, అలా బేన్ చేస్తే బరువు తగ్గిస్తామంటూ వ్యాపారులు చేసే వాళ్లు దండెత్తి వస్తారా? అల్లర్లు చేసి అలజడి సృష్టిస్తారా? ఎవరి మాట వినాలో తెలియక ప్రభుత్వం తలబాదుకుంటుందా? ఏమిటో అన్నీ సమస్యలే! ❑

# కొత్త కౌంటర్

**ఈ** నెలల్లో పెళ్లిళ్లికు మహా ఆఫర్ అంటూ పేపరు తియ్యగానే ప్రకటనలు ప్రత్యక్షమయ్యాయి.

ఓ వచ్చేసిందా పెళ్లిళ్ల సీజన్ అని మెంటల్‌గా ప్రిపేరయ్యాం.

ఈ నెల ప్రత్యేకంగా సరుకులు తెప్పించుకోనక్కర్లేదు. ఎక్కువగా బయటే చేస్తాంకదా భోజనాలు. ఈ మాటే మా కిరాణాకొట్టు అబ్బాయికి ఫోన్‌చేసి చెప్పేశాం. లేకపోతే ఠంచనుగా తలుపుతట్టి పేకెట్లు నట్టింట్లో పెట్టి వెళ్లిపోతాడు. ఇన్నేళ్లనుంచీ తెప్పించుకుంటున్నాం కదా మరి మా ఇంటి సరకుల పట్టీ అతనికి కంఠతా వచ్చు.

బట్టలు అన్నీ సిద్ధంగా ఉన్నాయా అని చెక్ చేసుకున్నాను. బజారుకెళ్లినప్పుడు ఓ పాతిక గిఫ్ట్‌కవర్లు తెచ్చి ఇంట్లో పెట్టారు మా ఆయన.

పెళ్లిళ్ల కెళ్లడానికి ప్రిపేరయ్యాం. మొదటి శుభలేఖ కంప్యూటర్‌లో వచ్చింది. ఆ తర్వాత ఫోన్లు, పోస్టులో కార్డులూ. ఇంటికొచ్చి పిలుపులూ. పెళ్లికెళ్లాల్సిన వివరాలు జాగ్రత్తగా పెట్టుకున్నాం. అలా పెట్టుకోకపోతే అటు సాగర్‌రోడ్డు దగ్గరున్న మ్యారేజ్ హాలుకి బదులు ఇటు గుడిమల్కాపూర్ గార్డెన్‌కి వెళ్లిపోతే కష్టం కదా మరి. అందులోనూ ఈ మధ్య మా ఇద్దరికీ మతిమరుపు దినదిన ప్రవర్ధమానంగా అయిపోతూంది. అందుకే ముందు జాగ్రత్తగా చాలా ఏర్పాట్లు చేసుకుంటున్నాం అస్తవ్యస్థ పడకుండా.

రేపెక్కడికీ? పొద్దునా? సాయంత్రమా? పిల్ల పెళ్లా? పిల్లవాడివైపనా అనుకుని రెడీ అయిపోతున్నాం.

వెన్యూ, మనుషులూ మారుతారుగానీ మిగిలినవన్నీ డిటో డిటోయే కదా! భయంకరమైన ట్రాఫిక్, పార్కింగ్‌కి నీడవున్న చోటుకోసం వెతుకులాట. లోపలికి వెళ్లగానే సంప్రదాయ దుస్తులు ధరించిన ఆడపిల్లల ఆహ్వానం, కూర్చోగానే మోడ్రన్ డ్రెస్ వేసుకున్న మగపిల్లలు ఇచ్చే వెల్‌కమ్ డ్రింక్‌లూ అన్నీ రొటీన్‌గా జరిగిపోతూ ఉంటాయి.

మన ఊళ్ళో ఓ వింత ఆచారం వుంది. బెల్లం జీలకర్రా పెట్టగానే క్యూకట్టేసి వెళ్లి అక్షింతలు వేసి భోజనానికి వెళ్లిపోతారు. పొద్దున ఎనిమిదింటి ముహూర్తం అయినా అంతే. సాయంత్రం ఆరింటికి ముహూర్తం అయినా అంతే. ఆకలేసి కాదు. అక్షింతలు వేసి భోజనం చేసేస్తే వచ్చిన పనైపోతుంది. వెళ్లిపోవచ్చు.

పదింటికి ముహూర్తం. క్యూలో వెళ్లి మండపం దగ్గర నిలబడ్డ తల్లిదండ్రులను అభినందించి "అదిరిపోయాయి ఏర్పాట్లు. కళ్ళు తిరిగి పోతున్నాయి" అనేసి రొటీన్‌గా నాలుగు మాటలు మాట్లాడాం.

"ఏదో మీ అభిమానం! భోంచేసి వెళ్లండి' అన్నారు వాళ్ళు రొటీన్‌గా.

అక్కడినుంచీ కదిలి భోజనాల హాలుకి వెళ్లాం. పీక్ అవర్‌లో అమీర్‌పేట దగ్గర వాహనాల్లా ఉన్నారు డైనింగ్‌హాల్లో జనం. ప్లేట్ పుచ్చుకుని చుట్టూ చూసేసరికి కాస్త ఆశ్చర్యం వేసింది నాకు. హాల్లో ఓ మూల రకరకాల క్రిమికీటకాల బ్యాక్‌డ్రాప్‌తో ఓ కౌంటర్ వుంది.

భోజనాల హాల్లో ఈ క్రిమి కీటకాల గోలేమిటి అని పరీక్షగా చూశాను. అవన్నీ డ్రాగన్ బొమ్మలు. ఎందుకీ హడావుడి అని దగ్గరికి వెళ్లి చూశాను. అది చైనీస్ ఫుడ్ కౌంటర్. స్ప్రింగ్‌రోల్స్, మంచూరీ, క్రిస్ఫ్ బేబీకార్న్, చైనీస్ ఫ్రైడ్ రైస్, వగైరా వంటలన్నీ వున్నాయి. పెనాల మీద కాలేసి ఆ తర్వాత వేడి చేస్తున్నారు. చింతాకులంత కళ్లు, నోట్లో పచ్చటి పళ్లూ; స్కర్టూ, కోటూ వేసుకున్న చైనీస్ పిల్లలు. మరి వాళ్ల నెక్కడినుంచీ పట్టుకొచ్చారో? మనం వెళ్లి నిలబడగానే చింగ్‌పింగ్‌చాంగ్ అంటూ చైనీస్ భాషలో ఏం కావాలని అడుగుతున్నారు.

అతిథులకి రాదుకదా చైనీస్ భాష. లిటిల్, తోడాసా, రెండు ముక్కలు వెయ్యమ్మాయ్ ఊరికే రుచి చూడ్డానికి అని మనకొచ్చిన భాషలోనే అడుగుతున్నారు మనవాళ్లు. సానుకూలంగానే స్పందిస్తున్నారు వాళ్ళు.

అప్పుడర్థమైంది నాకు. మరో కొత్త పద్ధతి దిగబడిపోయింది. చాట్ కౌంటర్‌లోని కుర్రాడు రాజస్థానీ దుస్తులు ధరించి మన ముందు క్యా క్యా అని తెలుగు రానట్టు యాక్షన్ చేస్తాడు. మనం ఇటు తిరగ్గానే అదుర్స్‌లో జూనియర్ ఎన్‌టిఆర్‌లా విరగదీశాడ్రా అని పక్కనున్న వాడితో కబుర్లు చెప్తాడు.

ఇప్పుడు ఈ చైనీస్ కౌంటర్ చూస్తుంటే నా గుండె పీచు పీచుమంటుంది. అవియల్ ముందు అయ్యరుగారూ, రసగుల్లాల దగ్గర బెంగాలీ కట్టుతో బాబూమోషాయ్ నిలబడతారేమో భవిష్యత్తులో.

అంతటితో ఆగితే ఫర్వాలేదు. ఆలోచనలు ఇంకా కొత్త పుంతలు తొక్కి బీచ్‌ఫుడ్ కౌంటరొకటి పెట్టి అందులో పదార్థాలు వడ్డించడానికి బీచ్ దుస్తులు ధరించిన పిల్లల్ని నిలబెడితే!!

హతోస్మి!? ❑

# ఎవరిగోల వారిది

నేను అమెరికా ప్రయాణం పెట్టుకున్నా... అబ్బే... ఎవరూ సన్మానం చేస్తామని పిలవలేదు. కోడలు సందడి చేసింది. అందుకే అమెరికా యాత్ర. వీసా తేలిగ్గానే వచ్చేసింది. ముందు జాగ్రత్తగా ఓ బండెడు డాక్యుమెంట్లు సిద్ధం చేయించుకుని పట్టుకెళ్ళా వీసా ఆఫీసుకు.

ఊరూ పేరూ అడిగి వీసా ఇచ్చేసాం పొమ్మన్నారు. మిమ్మల్ని చూడగానే మీ మంచితనం వాళ్ళకి అర్థం అయిపోయి ఉంటుంది. అందుకే ఏ ప్రశ్నలూ అడగలేదు అన్నారు అస్మదీయులు. ఇప్పుడందరికీ తేలిగ్గాన్నే ఇచ్చేస్తున్నారు వీసాలు. అమెరికావాళ్ళ దగ్గర డబ్బులు లేవు. వాళ్ళ ఆర్థిక పరిస్థితి ఏమీ బాగుండలేదు. అందుకే పిలిచి మరీ ఇస్తున్నారు వీసాలు. ఇందులో మీ గొప్పేమీ లేదు అన్నారు తస్మదీయులు.

ఏమైతేనేం వీసా వచ్చేసింది. టికెట్ బుక్ చేసుకుని విమానం ఎక్కేశాను. ఎయిర్ ఇండియావారి విమానం. అంతా మనవాళ్ళే. విమానం ఎక్కాక చూస్తే ఎంచక్కా మన తిరుపతి బస్‌స్టాండులో ఉన్నట్టు ఉంది.

చికాగోలో దిగాను. సుపుత్రుడు వచ్చాడు అయిదారు కిలోలల బరువున్న కోట్ తీసుకుని. "ఇది వేసుకో లేకపోతే చలికి గడ్డకట్టిపోతావు" అన్నాడు. కారెక్కాం. "సీట్ బెల్ట్ పెట్టుకో" అన్నాడు. "పర్వాలేదులే లైట్ తీసుకో" అన్నాను.

"ఇంకానయం ఇక్కడ రూల్స్ అంటే రూల్సే. అందరూ పాటిస్తారు. లేకపోతే కాప్ వచ్చి టికెట్ ఇస్తాడు" అని హెచ్చరించాడు.

కారు బయలుదేరింది. కుతూహలంగా చూసాను చుట్టూరా. అడవి ఊళ్ళో ఉందో... ఊరే అడవిలో ఉందో అర్థం కాలేదు. ఆకురాలు కాలం చెట్లన్నీ బోడిగా ఉన్నాయి. ఇళ్ళూ కార్లూ తప్పించి మనుషులు కనిపించటం లేదు. మొదట్లో వింతగా అనిపించినా తరువాత అలవాటయింది.

జనం బయటికి రారు. ఎలా వస్తారు? భరించలేనంత చలి. దానికితోడు ఎముకలు కొరికే ఈదురు గాలి. అందుకే మగ్గవేసిన మామిడిపళ్ళలాగా ఇంట్లోనే ఉంటారు. ఎండ వస్తే అప్పుడు వస్తారుట. అలా బయటికి వచ్చిన మనుషులని కూడా మన ఇష్టం వచ్చినట్లూ పలుకరించకూడదట. "అమ్మా! చూడు నీ గురించి నాకు బాగా తెలుసు. పందిరిగుంజతో కూడా పరిచయం చేసుకుని కబుర్లు చెప్పేస్తావు. కాని ఇక్కడ అలా చెయ్యకూడదు. ఓ చిరునవ్వు నవ్వేసి ఊరుకోవాలి. వాళ్ళు పలుకరిస్తే క్లుప్తంగా మాట్లాడు" అంటూ వచ్చిన రోజునే హితబోధ చేసాడు మా అబ్బాయి

ఎలాగో కాలక్షేపం చేస్తున్నాను. ఎదురుచూస్తున్న ఆ శుభదినం రానే వచ్చింది. పాపాయి పుట్టింది. హాస్పిటల్కి వెళ్ళాను. ఒక్కో గదిలో ఇద్దరు చొప్పున ఉన్నారు. మా కోడలి రూంలో ఇంకో ఆవిడ ఉంది. ఆవిడకి బాబట.

నర్సులూ, డాక్టర్లూ వచ్చి పోతున్నారు. రూం ఇరుగ్గా ఉంది. బయటికి వచ్చి సోఫాలో కూర్చున్నాను. నా పక్కన వచ్చి కూచుంది ఓ తెల్లావిడ. ఆవిడే పలుకరించింది. మా రూంలో ఉన్న పేషెంట్ ఆవిడ కూతురట.

నా గురించి అడిగింది. మా అబ్బాయికి పాప పుట్టింది అని చెప్పి అటుగా వెళుతున్న నా సుపుత్రుడ్ని చూపించాను. బాగున్నాడు అని మెచ్చుకుంది. వాళ్ళిద్దరికీ పెళ్ళయిందా? అని అడిగింది. అదిరిపడ్డాను. పిల్ల పుట్టింది అని చెప్తుంటే పెళ్ళయిందా అంటావేం పిచ్చిపీనుగా... నీకేమైనా మతిపోయిందా అని దెబ్బలాడాలనిపించింది.

సర్లే దేశం కాని దేశంలో పరాయి వాళ్ళతో గొడవ ఎందుకు అనుకుని అయింది అని చెప్పేసాను.

మా అమ్మాయికి ఇంకా పెళ్ళి కాలేదు అంటూ మొదలెట్టి తన కూతురి గురించి చెప్పుకొచ్చింది. ఈ పిల్లాడు నాలుగో సంతానమట. పెళ్ళి కాలేదుట. పిల్లలంతా తల్లి దగ్గరే ఉంటారుట. వింటూ ఉంటే ఆశ్చర్యం వేసింది. ప్రస్తుతం ఆ పిల్ల పక్కన ఉంది. చంటి వాడిని చూసి మురిసిపోతున్న అతగాడు కూతురి బాయ్ ఫ్రెండ్‌ట. మూడేళ్ళ నించి కలిసి ఉంటున్నారట.

మేము మాట్లాడుకుంటూ ఉండగానే ఓ పెద్దాయన ముగ్గురు పిల్లలని వెంటబెట్టుకుని వచ్చాడు. వీళ్ళు నా కూతురి పిల్లలు అంది. ఆయన వాళ్ళ తాతగారా? అంటే కాదు నా బాయ్ ఫ్రెండ్ అంది. నాకు నోట మాట రాలేదు. ఆ తరువాత ఆవిడ నన్ను కొన్ని ప్రశ్నలడిగింది.

నాకు ప్రాణం చచ్చిపోయింది. నర్సులు, డాక్టర్లు వెళ్లిపోయారు. రూం ఖాళీ అయింది. అందరం లోపలికి వెళ్ళాం. బాలింతరాలు ఆవిడ బాయ్‌ఫ్రెండ్. పసివాడిని చూసి తెగ సంబర పడిపోయారు. ముద్దులు పెట్టుకుని ఫోటోలు తీసుకున్నారు.

ఆవిడకి పెళ్ళి కాలేదట. నలుగురు పిల్లలట– అని మా వాళ్ళతో చెప్పాను. పక్కనించి ఆవిడ మాటలు వినిపించాయి.

ఆవిడ కొడుకు పిల్లట. కొడుక్కి పెళ్ళి అయిందిట. ఆ తల్లికి కూడా పెళ్ళి అయిందిట. ఆవిడకి ఇద్దరు పిల్లలుట– ఇద్దరికీ ఫాదర్ ఒకడేనట. అంటూ నా వివరాలు తన వాళ్ళతో చెప్తోంది. ❑

# వీకెండొచ్చేసింది బాబోయ్

**శు**క్రవారం రాత్రి మా ఇంట్లో ఓ చిన్నసైజు మీటింగుంటుంది.

రేపేం చేద్దాం అని చాలా సుదీర్ఘమైన చర్చ జరుగుతుంది. నిజంగా అదో శేషప్రశ్న. అయిదురోజులూ బుర్రలు వేడెక్కిపోయేలా పనిచేసిన ఈ పిల్లలకి మరి ఆటవిడుపు కావాలి కదా! శనాదివారాలు కాస్త రిలాక్స్ ఐతే మళ్లీ సోమవారం నుండి రొటీను.

బయటికి వెళ్ళాలి? కానీ ఎక్కడికీ? ఎప్పుడు? ఎలా? ఈ విషయాల మీద ఏకాభిప్రాయం కుదరడమే ప్రళయం. మహా ప్రళయమూ.

పది ఆలోచనలు చేసి చివరికి ఓ చోటికి వెళ్ళాలని నిర్ణయించుకుంటారు. గతంలో సినిమాలకి వెళ్లేవాళ్లు. ముందుగా టికెట్లు బుక్ చేసుకుని పిల్లలకి ఐస్‌క్రీములో, పిజ్జాలో లంచం ఇచ్చి వాళ్ళనింట్లో పెట్టి భార్యా, భర్త వెళ్ళొచ్చేవాళ్లు. ఆ తర్వాత "ఛ పిచ్చి సినిమాలు. అవి చూస్తుంటే ఉన్న తెలివి కూడా వూడిపోతోంది. ఆ హేంగోవరు నాల్రోజులైనా తగ్గడం లేదు. డబ్బుపోయి శని పట్టింది అన్నట్లుంది" అని విసుక్కుని మానేశారు.

దేవాలయాలకీ, గ్రంథాలయాలకీ వెళ్ళే అలవాటెలాగూ లేదు ఈ కాలం పిల్లలకి. ఫ్రెండ్సింటికి వెళ్లరు. వాళ్ళూ వీకెండ్ మూడ్‌లో వుంటారు కదా! బంధువు లింటికి ఏ విందులకో, శుభకార్యాలకో తప్పించి మామూలప్పుడు వెళ్ళరు.

ఇక మిగిలింది ఒక్కటే షాపింగ్ మాల్. అక్కడికే వెళ్దాం అని నిర్ణయించుకుంటారు. ఏ షాపింగ్ మాల్‌కి వెళ్ళాలి? అని కాసేపు చర్చించి ఏదో ఒకటి అని నిర్ణయించుకుంటారు.

పగలంతా తలంట్లూ, పెండింగ్ పనులూ వగైరా వ్యవహారాలుంటాయి. మధ్యాహ్నం కాసేపు విశ్రాంతి. సాయంత్రం వెళ్ళాలి మాల్‌కి. మాల్ అనగానే మా ఇద్దర్నీ బయల్దేర దీస్తారు. మరి వీకెండ్‌లో మాల్‌కి వెళ్ళాలంటే మందీ మార్బలం ఉండాలి. మనిషి సాయం లేకుండా వెళ్తే కష్టం.

నాలుగింటికి అనుకుని ఫోన్లతో మాట్లాడీ తీరిగ్గా రెడీ అయి ఆరింటికి బయలు దేరతారు.

వర్షం పడగానే ఉసుళ్ళు బయటికి వచ్చినట్లు శనివారం సాయంత్రం జనం అంతా రోడ్లమీదే వుంటారు. బంపర్ టు బంపర్ ట్రాఫిక్.

గమ్యం చేసేసరికి గంటన్నర పైగా పడుతుంది. మేము పిల్లలని పెట్టుకుని కూర్చుంటాం. వాళ్ళు అంతా తిరిగి వస్తారు. ఆఖరుగా రెస్టారెంట్‌కి వెళ్లాం. ఖాళీ సీట్లకి కాపలా కాసే డ్యూటీ మా వారిది.

ఒక్కరే తంటాలుపడి ఆరు కుర్చీలకీ కాపలా కాస్తుంటారు.

ఎవరికేం కావాలో అడిగి, వెళ్ళి డబ్బు చెల్లించే క్యూలో నిలబడుతుంది కోడలమ్మ. మా అబ్బాయి నన్నూ, పిల్లల్నీ పదార్థాల క్యూలలో నిలబెట్టి తనూ ఓ క్యూలో నిలబడతాడు.

కోడలు డబ్బు కట్టి ఎవరం ఏ క్యూలో ఉన్నామో వాళ్ళ చేతిలో ఆ కూపన్ పెట్టి వెళ్లి మామగారికి సాయం చేస్తుంది సీట్లు కాపాట్టంలో.

దోసె, పావ్‌భాజీ, బర్గర్, నూడిల్స్, ఛోలా భటూరా, వెజ్ ఫ్రైడ్ రైస్ ఇలా అందరం తలోరకం ఆర్డరిస్తాం. ఏ పదార్థం ముందు దొరికితే ఆ పదార్థం పుచ్చుకుని మా చోటికి వెళ్తాం. నలుగురం మనుషులం ఆరు పదార్థాలూ కాబట్టి నేనూ మా అబ్బాయీ, మరొకరు క్యూలో నిలబడాలి. ఆఖరి పదార్థం చేతికొచ్చేసరికి మొదట తీసుకున్నవాళ్లు తినేసి ఓ కునుకు కూడా తీస్తారు.

ఘన పదార్థాలు అయ్యాక ద్రవపదార్థాలు. వాటికిద్దరు చాలు. వాళ్ళిద్దరే వెళ్ళి కాఫీ, కూల్ డ్రింకూ, ఐస్ క్రీమూ అన్నీ ట్రేల్లో పెట్టి పట్టుకొస్తారు.

మేము తింటూ వుంటే పదిమంది వచ్చి 'అయిందా ఇంకా ఏమైనా తింటారా' అని అడిగి పోతారు. మామీద ప్రేమతో కాదు. సీటు ఖాళీ అవుతుందేమో అని ఆశతో.

మేము కుర్చీకి అటూ ఇటూ జరిగినా వచ్చి వాలిపోతారు. వాళ్ళని తిట్టుకుంటూ ఎలాగోలా ముగించి బయటపడతాం. కొంపకి చేరతాం.

ఏమిటో యుద్ధానికెళ్ళినట్లు వుంది గానీ, భోజనానికి వెళ్లినట్లూ లేదు. ఓ దోసె వేసి పెడతావా? అంటారు మా బాస్. అలాగే అని పెనం వెయ్యగానే వచ్చేస్తారు పిల్లకాయలు. "ఏమిటో దోసా? ఎవరికీ? ఇందాక అక్కడే ఇంకో ఐటమ్ తింటే

పోయేదిగా. సర్లే నాకూ ఓటి వెయ్" అంటాడు పుత్రరత్నం. భర్తతో బాటే భార్య. వెంటే పిల్లలూ.

"ఒక్కోసారి అమ్మా అన్నం వుందా కాస్త ఆవకాయ కలిపి రెండు ముద్దలు పెట్టరాదూ" అని అడిగి తలో ముద్దా తింటారు.

అవును మరి లంక మేతకీ, గోదావరి ఈతకీ చెల్లు అన్నట్లు వారాంతంలో ఆ సంతలోకి వెళ్ళి తిన్న ఆ కాస్తా ఇంటికొచ్చేసరికే అరిగిపోతుంది. ఈ హైరానా పడే బదులు ఇంట్లో కూర్చోవచ్చు. కానీ అలా కూర్చోరు మరి వీకెండా మజాకానా?? ❑

# ఉచితానుచితాలు

**మా** చిన్నతనంలో మా అమ్మ కూరగాయలు బేరం చేసేది. వాకిట్లో కొచ్చిన కూరలమ్మాయి దగ్గర కూరలుకొని ఏమిటది? మరీ బంగారం తూచినట్లే తూస్తున్నావ్... అని దెబ్బలాడి మరికాస్త సరుకు వేయించేది. ఆ తర్వాత వెయ్ కొసరు అని మరో కాయ తీసుకునేది.

ఆ తర్వాత కొద్దిరోజులకు సబ్బుపొడితో చెంచా ఉచితంగా ఇస్తే మా అమ్మ ఏనుగెక్కినంత సంబరపడి పోయింది. చేతులు పడిపోయేలా సబ్బుతో రుద్దకుండా వేడినీళ్ళలో ఇంత పొడివేసి బట్టలు నానబెట్టి ఉతికేసుకోవడమే సుఖం అనుకుంటూ ఉంటే దాంతోపాటు దుక్కలాటి చెంచా కూడా ఇచ్చారు అని మాకు విసుగెత్తేలా చెప్పింది.

ఆ తర్వాత కాఫీపొడితో గ్లాసు ఉచితం. తలనూనెతో దువ్వెన ఉచితం. మూడు సబ్బులు కొంటే సబ్బుపెట్టె ఉచితం. ప్రతీ వస్తువుతోనూ మరో వస్తువు ఉచితం. అలా ఉచితం లేని వస్తువులను ఎవరూ కొనడానికి ఇష్టపడేవాళ్ళు కాదు.

ఆ తర్వాత మరో పద్ధతి వచ్చింది. మిక్సీకొంటే దాంతోబాటు కుక్కరు. వాటరు ఫిల్టరు, ఇడ్లీస్టాండు వగైరా బోలెడన్ని వస్తువులు ఉచితం.

మిక్సీ కొనండి. పదహారు వస్తువులు ఉచితంగా పొందండి అనే ప్రకటనలు పేపర్ల నిండా కనిపించేవి. విరగబడి కొన్నారు జనాలు. ఈ పదహారు వస్తువులూ పనిచేసేవి కావు. ఆ మిక్సీకూడా నెలకి పదిహేను రోజులు రిపేరు షాపులోనే ఉండేది. అప్పుడు జనాలకి జ్ఞానోదయం అయింది. కానీ అప్పటికే జరగాల్సిన అనర్థం జరిగిపోయింది.

ఆ తర్వాత జనం తెలివి మీరారు అని గ్రహించి ఇంకో పద్ధతి ప్రవేశ పెట్టారు. 20% ఎక్కువ, 30% ఎక్కువ అని అమ్మే సరుకుకే కాస్త కొసరువేసి అమ్ముతున్నారు. అదీ బాగానే వుంది. పనికిరాని ఉచిత వస్తువులకంటే పని కొచ్చే పదార్థం మరికాస్త ఇస్తున్నారు– అని ఆనందపడ్డారు ప్రజలు.

ఇక ఇప్పుడు ఎక్కడ చూసినా ఉచితాలే. అసలుకంటే వడ్డీయే అధికంగా చెల్లిస్తారు కదా అప్పు తీసుకున్న వాళ్ళంతా. అలాగే అసలుకంటే ఉచితాలే ఎక్కువైపోయి ప్రాణాంతకంగా తయారవుతున్నాయి.

హద్దుమీరితే ఏదైనా తలనొప్పిగా తయారవుతుంది. షాపింగ్ చేయడం అంటే అందరికీ సరదా, ఆనందం గతంలో. ఇప్పుడు షాపింగ్ అంటే ఆనందం మాట అటుంచి విసుగొచ్చేస్తుంది. "రెండు కొనండి. ఆరు ఇంటికి తీసుకెళ్ళండి" అని ఆఫరుంటుంది. ఆ విషయం మనం షాపులోకి వెళ్ళేదాకా తెలియదు.

ఒక షర్టు, పేంటు కొనగానే ఇంకోటి కొంటే ఇంకా నాలుగు ఫ్రీ అంటారు. ఆశ పాపిష్టిది కదా. అందుకే ఇంకోటి కొంటాం. ఆ తర్వాత ఇంకో నాలుగు ఎంచుకుంటారు ఆపనే అతికష్టం. మహా కష్టం. మనకు నచ్చినవి మన సైజులో దొరకవు. మనక్కావలసిన సైజులో నచ్చినరంగు లుండవు. రెండూ కుదిరిన వాటికి ఆఫరుండదు. వెళ్ళిన వాళ్లకి వెతకలేక నీరసం వచ్చేస్తుంది. సర్లే ఏదో ఒకటి అని ఎంచుకుని ఆరు శాల్తీలు మోసుకుని ఇంటికొచ్చి లెక్క చూసుకుంటే అప్పుడు అసలు సంగతి అర్థం అవుతుంది. రెండుకొని ఆరు ఇంటికి తీసుకొచ్చుకునే ధరలోనే ఆరూ మనకి నచ్చినవి కొనుక్కోవచ్చని. కానీ అప్పటికీ కాలాతీతం అయిపోయిందిగా.

మరోరకం ఆఫర్లుంటాయి. వెయ్యిరూపాయలు పెట్టుకుని కోటి రూపాయల బహుమానాలు గెల్చుకోండి. ఇల్లు, కారు, టీవీలు, ఫ్రిజ్‌లు ఇలా ఎన్నో కళ్ళు తిరిగిపోయేటన్ని బహుమానాలు. కిలో బంగారం, కిలో వెండి, వజ్రాల ఆభరణాలు ఒకటి కాదు ఎన్నో... ఎన్నో... బహుమతులు.

ఖరీదు చేసిన ప్రతి రెండొందల రూపాయలకీ ఒకటి చొప్పున వెలకట్టి కూపన్లు ఇస్తారు.

షాపింగ్‌చేసి క్యూలో నిలబడి బిల్ చెల్లించి మళ్లీ క్యూలో నిలబడి ఈ రశీదు చూపించి మన పేకెట్ తెచ్చుకునేసరికి ఓపిక అయిపోతుంది. తర్వాత మన బిల్లుని బట్టి గుప్పెడు కూపన్లు ఇస్తారు. అవన్నీ నింపి అక్కడున్న పెట్టెలో వెయ్యాలి. నిలబడి కూపన్లు నింపలేరు కాబట్టి షాపువాళ్ళే ఓ పొడుగాటి బల్లవేసి దారాలు కట్టిన బాల్‌పాయింట్ పెన్నులు కూడా అందుబాటులో ఉంచుతారు. మళ్లీ దానికోసం పెద్ద క్యూ క్యూలో నిలబడి మనవంతు వచ్చేసరికి ఓపిక పూర్తిగా హరించుకుపోతుంది. "ఏమిటో దిక్కుమాలిన తాపత్రయం! కూపన్లు నింపడమే తప్ప ఈ బహుమానాలు

మనకేం వస్తాయా? చస్తాయా? అసలే మనవి ఐరన్ లెగ్స్" అనుకుంటూనే మొక్కుబడిగా ఆ కూపన్లన్నీ నింపి పెట్టెలో పారేస్తాం. పైన తథాస్తు దేవతలుంటారుట. ఏడుస్తూ వ్యవసాయం మొదలుపెడితే కాడీ మోకు దొంగలు ఎత్తుకెళ్లారని సామెత చెప్పినట్లు మనం నింపిన కూపనుకి ఇల్లో, కారో, బంగారమో, లాటరీలో వస్తుందని ఆశాభావంతో ఆత్మవిశ్వాసంతో కూపన్లు నింపితే అదృష్టదేవత తలుపు తడుతుందేమో గానీ విసుక్కుంటూ సణుక్కుంటూ నింపితే ఏం వస్తాయి బహుమతులు?

సరే ఈ ఉచితానుచితాల సంగతి కాస్త పక్కన పెడితే ఓ విషయం గమనించాలి. బట్టలకీ, ఎలక్ట్రానిక్ వస్తువులకీ ఆఫర్లు గుప్పిస్తున్నారు బాగానే ఉంది. కానీ బియ్యం, ఉప్పులూ, పప్పులూ, నూనె, చింతపండు వంటి నిత్యావసర వస్తువులమీద మాత్రం ఏ ఆఫర్లూ వుండవు. ఆఫర్ల మాట దేవుడెరుగు. నాణ్యత లోపం కనిపిస్తోంది. లిస్ట్ పుచ్చుకుని బజారుకెళ్తే నాలుగైదు సరుకులైనా స్టాకు లేదనే సమాధానం వస్తోంది. ఇది ప్రమాద హెచ్చరిక కాదుకదా!

అనవసరపు ఆర్భాటాల సందడిలో పడిపోయి అసలు అవసరాలని నిర్లక్ష్యం చేస్తున్నామా?

ఉచితానుచితాలు ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ గొడవలో పడి అసలు మాట మర్చేపోయా. అన్నింటికంటే బ్రహ్మాండమైన ఆఫరు ఓటి వుంటుంది. అది కేవలం మన దేశంలోనే లభిస్తుంది.

ఎలక్షన్లలో తండ్రిని ఎన్నుకుంటే తండ్రితో పాటు కొడుకు ఉచితం. లేడీని ఎన్నుకుంటే ఆవిడతో పాటు ఆవిడ భర్త ఉచితం. మనం ఎంచుకున్న వారితోబాటు వారి దగ్గర బంధువులంతా కూడా ప్రజాసేవ చేస్తారు.!!!

ఇది కాదె భాగ్యమిది గాదె సుఖమూ!!! ❑

# అటకల్లేని అమెరికా

**"అ**టకలు లేకపోవటం ఏమిట్రా వెర్రి నాగమ్మా!" అన్నాను. చెప్పద్దూ... భలే నవ్వొచ్చింది. అటకలు లేకుండా ఇల్లు ఉంటుందా ఎక్కడైనా?

"నేను వెర్రి నాగమ్మని కాదు. నువ్వే తిక్కమ్మవి" అన్నాడు మా అబ్బాయి.

అసలు విషయం ఏమిటంటే నేను తీసుకెళ్ళిన సూట్‌కేసులు ఖాళీ చేసి ఎక్కడ పెట్టాలా అని ఆలోచిస్తుంటే "అటక మీద పెట్టెయ్యండి" అన్నాను.

"ఇక్కడ అటకలు ఉండవు" అన్నాడు. ఇద్దరం చాలా సేపు వాదించుకున్నాం.

తీరాచూస్తే వాడు చెప్పింది నిజమే. అమెరికాలో ఇళ్ళు మనలా లారీలకొద్దీ ఇసుకా, సిమెంటూ పెట్టి కట్టరు. చెక్కముక్కలతో కట్టేస్తారు. పాతకాలం జానపద చిత్రాలలో సెట్టింగుల్లాగా ఉన్నా దిట్టంగానే ఉంటాయి. కాకపోతే ఒకటి... డబ్బాల్లాగా డబడబ లాడిపోతూ ఉంటాయి.

ఇంట్లో మనుషులు నడుస్తుంటే ఇళ్ళు అదిరిపోతూ ఉంటాయి. బాత్రూంలో పంపు తిప్పితే జలపాతం దగ్గర నిలబడినట్టు ఉంటుంది. ఇల్లు అంత సున్నితంగా. ఉంటుంది. కాబట్టి మిగిలినవన్నీ అందుకు అనుగుణంగానే ఉంటాయి. ఇంట్లో స్టోరేజి స్పేస్ చాలా తక్కువ ఉంటుంది. అందుకే వీళ్ళు ట్రాష్ అంటూ ఎప్పటి చెత్త అప్పుడు పారేస్తారు. ఖాళీ సీసాలు, పాత పేపర్లూ నెలలకొద్దీ పోగేసి పెట్టరు. మన దేశంలో అయితే చెత్త అంతా ఇంట్లో పోగేస్తారు. అసలు అక్కడకూడా అటకలు లేకుండా ఇళ్ళు కడితే చెత్త పేరుకుపోదూ... అన్నాడు. నవ్వు వచ్చింది. వాడి తలకాయ. అటకల గొప్పతనం వాడికేం తెలుస్తుంది? వూరికే నలుగురు మనుషులు ఉన్న కుటుంబానికి ఐదో ఆరో బెడ్‌రూములు కట్టేసుకోగానే సరి పోతుందా?

అటకలు లేని ఇల్లూ ఓ ఇల్లేనా? అటక ఉంటే ఆ అందమే వేరు.

మా ఇంట్లో ఎంత సామాను ఉంటుందో అంతకు రెట్టింపు అటకమీద ఉంటుంది. మా ఐశ్వర్యం అంతా అటకమీదే ఉంది. ఎందుకంత చెత్త? ఏళ్ళ తరబడి వాడని

వస్తువులన్నీ అవతల పారెయ్యచ్చుకదా! అని ఇంట్లో వాళ్ళు విసుక్కుంటారు. నాక్కూడా అదే అనిపిస్తుంది. ఓ మనిషిని మాట్లాడి అటక ఎక్కిస్తాను. అక్కడ ఏం ఉన్నాయో చూసాక కదా ఏం పారెయ్యాలో నిర్ణయించేది? అందుకే ముందు అక్కడ ఉన్న సామానంతా దించి కింద పెట్టమంటాను. ఒక్కో వస్తువు కిందికి దిగుతుంది. అవన్నీ చూస్తుంటే టైం మెషీన్‌లో ఎక్కడికో వెనక్కి వెళ్ళిపోతున్నట్లు ఉంటుంది. ఇత్తడి గంగాళాలు, గుండిగలు, పులుసు కలాయి అడ్డెడు, తవ్వెడు మొదలుకుని గిద్దెడు బియ్యం ఉడికే గిన్నె దాకా అన్ని సైజుల గిన్నెలు, గోకర్ణాలు, కూరలగుత్తి, నేతి జాడీలు, కార్తీక మాసం వెలిగించే రకరకాల దీపాలు, రాగి కాగులు, ఒకటా రెండా?

ఆ రోజుల్లో కేటరింగ్ లేదు కాబట్టి ఇంత భారీ సామాను పోగేసే వాళ్ళు. ఇప్పుడెందుకు అమ్మేస్తే సరి అంటారు అందరూ. అమ్మటం ఎంతసేపు? కాని మనస్సొప్పదు అవన్నీ చూస్తుంటే ఎన్నో పాత జ్ఞాపకాలు. పెద్దవాళ్లందరూ గుర్తుకొస్తారు. కళ్ళనీళ్ళు తిరుగుతాయి. పోనీ పాత సామాన్లకి విలువ ఉంది. ఇప్పుడు కాక పోతే మరో రెండేళ్ల తరువాత అమ్మేసి కరెన్సీగా మార్చుకోవచ్చు. మార్కెట్‌లో దమ్మిడీకి చెల్లని వస్తువులు కూడా చాలా ఉన్నాయి.

మూడు గడియల ట్రంకు పెట్టె. దాన్నిండా ఎప్పుడో ఆడపిల్లలు బొమ్మల కొలువు పెట్టుకున్న నాటి బొమ్మలు. పాత తొట్టె ఉయ్యాల అదెప్పటిదో? మరి నా బుద్ధి తెలిసేనాటికే ఉంది అంటుంది ఎనభైయవ పడిలో ఉన్న ఆడపడుచు. రోకళ్ళు, జాడీలు, కుంపట్లు మనకు చోటు లేక అటకమీద పడేసాం గానీ, స్థలం ఉంటే ఓ మ్యూజియం ఏర్పాటు చేసుకోవచ్చు. అదేమిటో వెధవ సెంటిమెంటు. అదంతా అమూల్యమైన సంపదలాగ అనిపిస్తుంది. ఏదీ పారెయ్యడానికి మనస్సొప్పదు. పోన్లే వీటికి అన్నం పెట్టాలా? నీళ్ళు పొయ్యాలా? పైన పడుంటాయి... అని అన్నీ పైన సర్దుకుని చెప్తాను. ఇంతోటి భాగ్యానికి ఓ మనిషికి రోజు కూలీ ఇల్లంతా దుమ్ము ధూళి– అని విసుక్కుంటారు. ఇంట్లో వాళ్ళు అలా విసుక్కోటం మా వంశంలో అలవాటే.

పాపం మా అత్తగారు నాతో చెప్పుకునేవారు. “పారెయ్ పారెయ్ అంటారు... ఎలా పారేస్తాం? మా మామగారి పెళ్ళినాటి కాళ్ళు కడిగిన పళ్ళెం, మా పెళ్ళినాటిది, మీ పెళ్ళినాటిది ఉన్నాయి. రేపు నీ కొడుకు పెళ్ళినాటిది కూడా చేరాలి, మనం తెచ్చుకున్న పసుపు చెంబుల జాబితాలో నీ కోడలు తెచ్చే పసుపు చెంబు వచ్చి చేరాలి. ఈ మగవాళ్ళ మాటలకేంలే... అవన్నీ మనం పట్టించుకోకూడదు” అనేవారు. నాకు కూడా అలాగే అనిపిస్తుంది. నా తరం ఇలా గడిస్తే చాలు. ఆ తరువాత నందోరాజా భవిష్యతి. ❑

# ప్రజా సేవలో ఇస్త్రీ పెట్టె

**ఇం**ట్లో బట్టలు కుప్పలా పేరుకుపోతున్నాయి. నాకు చిరాకొచ్చేసింది.

"ఇదే ఆఖరు కబురు. రాకపోతే నేను వేరే మనిషిని చూసుకుంటాను. తర్వాత మళ్లీ వచ్చి నా దగ్గర ఏడిచినా ఏం ప్రయోజనం వుండదు" అని కబురు పెట్టేను.

ఆ కబురు అందగానే వచ్చేశారు విశ్వనాథ్, నరసమ్మ.

"ఏవైపోయారిద్దరూ?" అని అడిగాను!

"ఈ మధ్య మనం శానా బిజీ అయిపోయాం కదండీ ఆయ్" అంది నరసమ్మ.

"అవునండీ... మరి మనం మీటింగులకెళ్ళాలి కదండమ్మగారూ ఆయ్!" అన్నాడు విశ్వనాథ్.

నవ్వాలో... ఏడ్వాలో అర్థం కాలేదు నాకు. వాళ్లనిలాగే వదిలేస్తే సర్వనాశనం అయిపోతారేమో అని భయం వేసింది. బ్రెయిన్‌వాష్ చెయ్యాల్సిన సమయం వచ్చిందని అర్థం అయింది.

ఆరేడేళ్ళుగా మా ఇంట్లో బట్టలు వీళ్లే ఇస్త్రీ చేస్తున్నారు. భీమవరం దగ్గర ఏదో పల్లెటూరు నించీ బతుకు తెరువుకోసం ఇక్కడికొచ్చారుట పదేళ్ళకిందట. ఇద్దరాడ పిల్లలు. కుటుంబం యావత్తూ చూడముచ్చటగా వుంటారు ఎప్పుడూ నవ్వుతూనే ఉంటారు. ఓ బిల్డింగ్‌లో వాచ్‌మేన్‌గా వుంటున్నాడు విశ్వనాథ్. గేటు ఎదురుగానే బల్ల వేసుకుని ఇస్త్రీ చేస్తుంటాడు. నరసమ్మేమో బిల్డింగు బయట రోడ్డుపక్కనే పైన తడిక వేసుకుని బల్ల పెట్టుకుని ఇస్త్రీ చేస్తుంది.

వంటపనీ పెద్దగా పెట్టుకోదు. పొద్దున్నే వీధి చివర బండీ మీద నుంచి ఇడ్లీలు కొనుక్కొచ్చి తినేసి పిల్లల్ని స్కూల్‌కి పంపించి ఇస్త్రీ పెట్టెలు వేడిచేసి పనిమొదలు పెడతారు. మధ్యాహ్నం ఇంత అన్నం వుడకేసుకుని హొటల్నించి కూరా, సాంబారు కొనుక్కొచ్చుకుని తినేస్తారు. పిల్లలు స్కూలు నించి వచ్చాక ఇస్త్రీ బట్టలు మూటలు కట్టి

వాళ్ళ చేత ఇళ్ళకి పంపేస్తారు. ఎప్పటి డబ్బులు అప్పుడే పుచ్చేసుకుంటారు. రాత్రి ఏడింటికి పెట్టెలు ఆర్పేసి బల్లలు తీసేసి ఇంటికి పోతారు.

చూడముచ్చటైన సంసారం వాళ్ళది. నరసమ్మ గోదావరి జిల్లా యాసతో మధ్యలో ఓ ఇంగ్లీషు పదం వేసి మాట్లాడుతుంటే భలే సరదా నాకు. ఏద్దైనా అవసరం పడితేగానీ రాదు.

అయిదేళ్ళ కిందట ఓ రోజు వచ్చి “అయిదొందలు కడితే ఇళ్ల స్థలాలిస్తారటండీ. మనకి ఇల్లుంటే సేఫ్టీ కదండీ మరీ. అయిదొందలియ్యండి ఆయ్” అని అడిగి పట్టుకుపోయింది.

మరోసారి వచ్చి “అప్పుడు మనం డబ్బు కడితే పేరు రాసుకున్నారు కదండీ ఆ కాయితాలన్నీ ఎక్కడో పోయాయిటండీ... మళ్లీ అయిదొందలు కడితే ఆ కాయితాలు మళ్లీ ఇస్తారుటండీ.. ఈసారి కేర్‌ఫుల్‌గా వుంటారట్లెండి ఆయ్” అని మళ్లీ అయిదొందలు పట్టికెళ్లింది.

ఆ తర్వాత ఓసారి కనపడి “ఇచ్చేవారేనేమోనండీ ఇళ్ల స్థలాలు. మరి ఆ గవర్నమెంటు పడిపోయిందట కదండీ... మనది శానా బేడ్ లక్కండీ ఆయ్” అంది.

“మరి అక్కడికే వెళ్లి అడక్కపోయావా అంటే” ఏం తిరుగుతానండీ? మన వర్కు పాడైపోతాదికదండీ. దొంగలు దోచుకుపోయారనుకున్నావండీ. ఆయ్” అంది నవ్వేస్తూ.

అలా పూలనావలా సాగిపోతున్న వాళ్ళ సంసారంలో హఠాత్తుగా దుమారం రేపింది. ఆ మధ్య ఏవో ఎన్నికల సందర్భంగా ప్రచారానికి వచ్చిన ఓ ప్రజా నాయకుడు రోడ్డుమీద ఆగి, నరసమ్మ చేతిలోంచి ఇస్త్రీ పెట్టె గుంజుకుని ఇస్త్రీ చేశాడుట. ఆ వార్త ఫొటోతోసహా లోకల్ న్యూస్ పేపర్లలో వచ్చేసింది. అందరం చూశాం. ఆనందించాం.

విశ్వనాథ్, నరసమ్మల సంబరం అంతా ఇంతా కాదు. ఫోటోలు పుచ్చుకుని తెలిసిన వాళ్ళందరికీ చూపించుకున్నారు. మా దగ్గరి పేపర్లు అడిగి తీసుకుని వాళ్ళ ఊరికి కూడా పంపించారు.

“ఆయ్ బాబో... అంతటి గొప్పోరు మన కొట్టు దగ్గరాగిపోయిన మన ఇస్త్రీపెట్టె తీసుకుని ఇస్త్రీ చేశారంటే గ్రేట్ కాదాండి మరీ! ఆయ్” అని మెలికలు తిరిగిపోయింది నరసమ్మ.

ఆ తర్వాత ఆయన వాళ్ళ పాలిట దేవుడైపోయాడు. ఆయనకే ఓటు వేస్తాం అని మరికొంత మందిని కూడా వెంటబెట్టుకుని మరీ వెళ్లారుట గానీ వీళ్ళివరి పేర్లు లేవుట ఓటరు లిస్టులో. రేషను కార్డు పేపర్లో ఫోటో చూపించారుట గానీ ఏమీ లాభం లేకపోయిందిట.

ఆ కేండిడేటు డిపాజిట్ కూడా దక్కకుండా ఓడి పోయాడు.

"మనందరం ఓటేసుంటే ఆయనగారు గెలిచే ఓరేనండీ. మనవోట్లు లేకపోవటం గొప్ప డేంజరైపోయిందండీ. ఆయ్" అని బాధపడింది నరసమ్మ.

"పోతే పోన్లే. ఆదీగాక ఇవేం పెద్ద ఎలక్షన్లు కావు. ఏవో మామూలు ఎన్నికలే కదా!" అని ఓదార్చాను. ఆయనగారు ఓడిపోయినా వాళ్ళిద్దరికీ ఆయనమీద భక్తి పిసరంతైనా తగ్గలేదు. పని మానేసి చీటికి మాటికి ఆయన దగ్గరికి పోయి పలుకరించి రావడం, ధర్నా చేస్తుంటే వెళ్ళి అరిచి రావడం చేస్తున్నారు.

అదివరకు పఠంలా ఇస్త్రీ చేసేవాడు విశ్వనాథ్. ఇప్పుడు అన్నీ మడతలే... అని అందరూ కంప్లయింట్ చేస్తున్నారు. ఇలా అయితే కష్టం అయిపోతుంది. అందుకే మందలించాలనుకున్నా...

చూడండి ఆయన్ని వదిలేసి మీపని మీరు చూసుకోండి. లేకపోతే అన్యాయం అయిపోతారు! అన్నా.

"మరి మనదగ్గరికొచ్చి ఇస్త్రీ చేశారు కదండీ. మనవంటే చాలా అభిమానవండీ. చూడగానే నవ్వుతూ పలుకరిస్తారండీ ఆయ్!" అన్నాడు విశ్వనాథ్.

"అప్పుడు ఆయన అవసరం కాబట్టి ఇస్త్రీ చేశారు. పక్కవీధిలో కిరాణాకొట్లో ఉల్లిపాయలు తూచారు. గుడిపక్క సందులో ఇంట్లో దూరి వాళ్ల పిల్లలని ఎత్తుకుని ఆడించారు. మరి వాళ్ళంతా మీలాగా పనులు మానేసి ఆయనెంట తిరుగుతున్నారా? ఇక నవ్వడం పలుకరించడం అంటావా ఓడిపోయారు కాబట్టి మీమీద అంత అభిమానం. గెలిచి వుంటే మీ మొహం చూడరు" అని చెప్పాను.

"అప్పుడు మానేసిన ఇళ్లస్థలాలు ఇప్పిస్తానన్నారండీ" అంది నరసమ్మ.

"ఇప్పించాక అప్పుడు ఆయన చుట్టూ చేరి భజన చేయండి. ఇప్పటి నించీ ఎందుకు?" అన్నా. బుర్రగోక్కున్నారు ఇద్దరూ...

"అయితే... ఇప్పుడు మనం ఏం చెయ్యాలండీ?" అన్నాడు విశ్వనాథ్.

"ఆయన గారిని ఆయన ఖర్మానికి వదిలేసి అదివరకులాగా శ్రద్ధగా మీ పని మీరు చేసుకోండి. లేకపోతే రోడ్డున పడతారు. పిల్లలు గలవాళ్ళు పిచ్చిపన్లు చెయ్యద్దు. మీ మంచికోరి చెప్తున్నా. కాదు ఆయన వెంటే వుంటాం అంటే మీ ఇష్టం.

ఈసారి ఇటొచ్చినప్పుడు ఆ ఇస్త్రీపెట్టె పార్టీ ఫండు కోసం అని పట్టుకుపోతారు ఆయన. అప్పుడు మీ తిక్క కుదురుతుంది" అన్నా కచ్చితంగా.

"అమ్మగారు మంచోరు. మనం బావుండాలనే అనుకుంటారు. అమ్మ చెప్పినట్టూ వినటం. మనకు బెటరు ఆయ్" అంది నరసమ్మ.

హమ్మయ్య అనుకున్నా... ❑

# అమ్మయ్య గండం గడిచింది

**మా** అబ్బాయి ఫ్రెండ్స్ ఈ ఆదివారంనాడు భోజనానికి వస్తారుట. ఆ హడావిడిలో ఉన్నారు శనివారం నించే. అదేం సంతర్పణా కాదు. సమారాధనా కాదు. వచ్చేది ముగ్గురు మనుషులు. భార్య, భర్త, తొమ్మిదేళ్ళ పిల్లవాడు. ఏర్పాట్లు ఏముంటాయి? ఇల్లు శుభ్రంగా సద్దుకోవటం... మరో నాలుగు రకాల వంటలు చెయ్యటం అంతే. అదెంతోసేపు పట్టదు. కాని సమస్య అది కాదు. వేరే ఉంది.

ఆ వచ్చే వాళ్ళకి ఓ పిల్లాడు ఉన్నాడు. మా యింట్లో మా మనవడున్నాడు. వాడికి పదేళ్ళు. అదే అసలు సమస్య. పిల్లలు ఒక చోట చేరితే సర్వం మర్చిపోయి ఆడుకోడం. ఇల్లు పీకి పందిరేసి రామచంద్రప్రభో వీళ్ళు పిల్లలు కాదు పిశాచాలు అని పెద్దవాళ్ళు విసుక్కోవడం, ఆటలు చాలు ఇక రండిరా అని బతిమాలటం.. చచ్చినా రాము పొమ్మని వాళ్ళ మారాములు ఇదంతా గత వైభవం. మరా మారిన కాలంతో బాటు సమస్యలూ మారిపోతున్నాయి. ఆ వచ్చే పిల్లవాడితో మర్యాదగా బిహేవ్ చెయ్యాలి. మన పిల్లాడు వచ్చే అతిథుల ముందు మన పరువు తియ్యకుండా చూసుకోవాలి. అదంత తేలిక పని కాదు. అతి కష్టమూ... మహా కష్టమూ కూడా! అందుకే కిందా మీదా పడుతున్నారు వీళ్ళు. నా ప్రాణం ఉసూరుమంది.

పిల్లలు కాలంతో పాటు మారిపోతున్నారు. పరిస్థితులు అలా ఉన్నాయి మరి. ఇప్పుడు అన్నీ గూళ్ళే. ఇళ్లు లేవు కదా పిల్లలు పరుగులుపెట్టి ఆడుకునేందుకు. బారెడు జాగా లేకపోవడంవల్ల ఇంట్లోనే మగ్గటం. స్కూలుకి, ట్యూషన్‌కి వెళ్ళొచ్చేక ఇక వెళ్ళే చోటు ఉండదు. ఇంట్లో బొమ్మలతో ఆటలు. కాస్త బుద్ధి తెలిసాక టి.వి. కంప్యూటరు. వీటితోనే కాలక్షేపం. వీటికే అంకితం. పొద్దస్తమానం ఆ జడ పదార్థాలతో కాలక్షేపం చేసి వీళ్ళూ జడపదార్థాలుగా మారిపోతున్నారు. ఒకటే బద్ధకం. ఎక్కడికి రమ్మన్నా రారు. మాల్స్‌కి, సినిమాలకి అంటే బయలుదేరతారు గానీ బంధు, మిత్రుల ఇళ్ళకి

రమ్మంటే రాము పొమ్మంటారు. సామదాన భేద దండోపాయాలు ఉపయోగించి తీసుకెళ్తే అక్కడ చుక్కలు చూపిస్తారు.

బోరు కొడుతోంది అంటారు. టివిలో కార్టూన్లు పెట్టమని పేచీ పెడతారు. ఎవరితోనూ మాట్లాడరు. చెప్పినమాట వినరు. పెట్టింది తినరు. అరగంట కాగానే పోదామని పేచీ. వాళ్ళ సణుగుడు భరించలేక ఎందుకు వచ్చాంరా భగవంతుడా అని తల బాదుకొంటారు అమ్మానాన్నలు.

వేరేవాళ్ళ ఇంటికే బాధలు ఇలా ఉంటే... ఎవరైనా మనింటికి వచ్చినా తలనొప్పే. ఈ పిల్లలు వచ్చిన వాళ్లతో కలవరు. వాళ్ళ గదిలో దూరి కూచుంటారు. హాల్లో టీవీ ముందు కూర్చుని ఎద్దంత సౌండ్‌తో కార్టూన్లు చూస్తారు. ఆపమంటే అలిగి కూర్చుంటారు. “విసిగిపోయి ఏవిటిది? ఈ బాబు వచ్చాడు కదా ఆడుకో అని కోప్పడినా సుఖం ఉండదు. ఏం ఆడుకోను? అప్పుడోసారి ఇలాగే ఓ అబ్బాయి వస్తే ఆడుకో ఆడుకో అన్నారు. నన్నే తిట్టారు. ఆ రాక్షసుడికి నీ బొమ్మలు ఎందుకు ఇచ్చావు? అన్నారా లేదా? అని వీళ్ళ పరువు బజార్న పెడతారు. ఇక వీళ్ళపని గోవింద. వచ్చిన వాళ్లకి సర్ది చెప్పుకోలేక సతమతం అయిపోతారు. ఈ కాలం పిల్లలని కోప్పడితే సుఖం లేదు. పెద్దవాళ్ళకే పళ్ళు రాల్తాయి. బతిమాలో, బుజ్జగించో పబ్బం గడుపుకోవాలి.

ప్రస్తుతం మా ఇంట్లో అదే ప్రోగ్రాం నడుస్తోంది. వచ్చే అతిథుల ముందు తమ పరువు నిలబెట్టుకుని, ఆ పిల్లాడితో కలిసి ఆడుకోమనీ... అలా అని ఖరీదైన బొమ్మలు ఇచ్చి పాడు చెయ్యొద్దని చెప్తున్నారు. వాడు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాడు. బేతాళుడిలాగా ప్రశ్నలతో చంపుకు తింటున్నాడు.

వాళ్ళు ఎందుకు వస్తున్నారు? ఎప్పుడొస్తున్నారు? ఎంతసేపు వుంటారు? మరి నేను అప్పుడు టీవీ చూడాలి కదా? ఆ వచ్చే అబ్బాయి టీవీ అడుగుతాడేమో? ఎలా? అంటూ పీక్కు తింటున్నాడు. వచ్చిన వాళ్ళముందు గుడ్‌బాయ్ లాగా బిహేవ్ చేస్తే నాకు ఏం ఇస్తారు? అని లంచం అడుగుతున్నాడు. చాక్లెట్ వద్దు పిజ్జా కావాలి. ఐస్‌క్రీం కావాలి అని బేరాలు ఆడుతున్నాడు.

వసుదేవుడు గాడిద కాళ్ళు పట్టుకున్నట్టు వాడి అమ్మా నాన్న అన్నిటికీ సరే అంటున్నారు. వాళ్ళ తిప్పలు చూసి నా కడుపు తరుక్కుపోయింది. ఎప్పుడూ ఇంతే... ఇంటికి ఎవరైనా రావడం భయం ఈ ప్రహసనం జరగాల్సిందే. ఎలాగైతేనేం వాడితో

ఒప్పందం కుదుర్చుకున్నారు. అయినా భయంగానే ఉన్నారు. వాడు ఆఖరి నిముషంలో మాట మార్చడని ఏమిటి గ్యారంటీ? అతిథులు వచ్చి వెళ్ళేదాకా బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిందే.

ఆదివారం రానే వచ్చింది. లేచిన వేళ మంచిది. అంతా సవ్యంగా జరిగింది. పై గొడవలు లేకుండా సరదాగా గడిచిపోయింది. వాళ్ళు చెప్పిన టైముకే వచ్చారు. పిల్లాడితో వాళ్ళ లాప్‌టాప్ తెచ్చుకున్నారు. ఆ పిల్లాడు మా గదిలోను, మా మనవడు వాడి గదిలోనూ కూర్చుని గేమ్స్ ఆడుకున్నారు. ఉన్న కాసేపూ హాయిగా గడిపేసి వాళ్ళు వెళ్ళిపోయాక 'హమ్మయ్య గండం గడిచింది' అని ఊపిరి పీల్చుకున్నారు మా వాళ్ళు. ❑

# మరి ఈ వెర్రి వెధవల మాటేమిటి?

**తె**లిసిన వాళ్ళ ఇంట్లో పెళ్ళికి వెళ్ళాను. దూరపు బంధువు కనిపించింది. వాళ్ళ అబ్బాయికి ఏడాది కిందట పెళ్ళి అయింది. కుశలప్రశ్నలు అయ్యాక ఎలా ఉంది కోడలు? ఏమైనా విశేషమా? అని అడిగాను. అవును విశేషమే. చాలా గొడవలు అయ్యాయి. విడాకులకి అప్లై చేస్తున్నారు అంది. నాకు తల తిరిగిపోయింది. నా ఎక్స్‌ప్రెషన్ అర్థం అయిపోయింది కాబోలు... చెప్పుకొచ్చింది మీ దగ్గర ఏవో స్టోరీలు చెప్పి బుకాయించాలని చూడటం ఆ తరువాత నిజం తెలిసి మీరు అయ్యో అనుకోవటం... ఎందుకండీ ఇదంతా? దాచాలని చూసినా నిజం దాగదు కదా. ప్రేమించాను అన్నాడు. ఈ రోజుల్లో కులగోత్రాలు ఎవరు పట్టించుకుంటున్నారు? అని మాకు మేము నచ్చజెప్పుకుని పెళ్ళి చేశాం. కట్నాలు అడగటం పాత పద్ధతి అని ఖర్చులు కూడా పెట్టుకుని పెళ్ళి చేస్తాం. నన్నే కాదు మా అమ్మని నాన్ననీ కూడా గౌరవించాలి అని కోడలు అంటే వియ్యాలవారికి అడుగులకి మడుగులు వత్తాం. మీ వంటలు నాకు నచ్చవు అంటే ఆవిడ వంటలే తిన్నాం. మీతో ఉండలేను అంటే వేరు కాపురం ఉండమన్నాం. అలాగే ఉన్నారు కూడాను. అయినా విడాకులు తప్పడం లేదు. బాధ మనసులోనే దాచుకుందేమో నవ్వుతూనే చెప్పింది. నాకు చాలా ఇబ్బందిగా అనిపించింది. చల్లగా అక్కడి నించి జారుకున్నాను.

భోజనాల దగ్గర మరో దూరపు బంధువులు కనిపించారు. ఆయన ఆవిడ కూతురు అల్లుడు మనవడు కొడుకు అందరూ ఆదరంగా పలకరించారు. ఆ అబ్బాయిని బాబు అంటాం అందరం. మీ ఆవిడ రాలేదా? అన్నానో లేదో అందరూ మొహాలు ముడుచుకుని అక్కడినుంచి తప్పుకున్నారు.

పక్కన ఉన్న మా చెల్లెలు "ఏమిటే అలా అడిగేసావు? వాళ్ళసలే బాధల్లో ఉంటేను' అంది చిరాగ్గా? ఏమయిందీ అంటే ఇంకా ఏం కావాలి? పెళ్ళి కాస్తా పెటాకులు అయింది అంది. తిన్నగా చెప్పు అంటే చెప్పింది. అసలు ఆ పిల్ల కాపురానికి రాలేదు. పెళ్ళి కాగానే అతను ఆఫీసు పని మీద ఆరు వారాలు ఫారెన్ వెళ్ళాల్సివచ్చిందట.

వెంట రమ్మంటే నాకు సెలవు దొరకదు అన్నదిట. బాబు ఒక్కడే వెళ్ళొచ్చాడు. అబ్బాయి వచ్చాడు మీ అమ్మాయిని కాపరానికి పంపించండి అని వీళ్ళు ఫోన్‌చేస్తే ఆ పిల్ల తండ్రి వచ్చి "మా అమ్మాయికి ఈ పెళ్ళి ఇష్టం లేదు విడాకులు తీసుకుంటుంది" అని తీరిగ్గా చెప్పాడుట. వీళ్ళు కుమిలిపోతున్నారు. ఒక్కడే కొడుకు. వాడి జీవితం అలా అయిపోతే గుండెకోతే కదా. ఒకళ్ళతో ఒకరికి పడలేదు అనుకునేందుకు కూడా లేదు. అసలు కాపురానికే రాలేదు. ఇప్పుడు నలుగురిలోనూ నవ్వులపాలు... మింగలేక కక్కలేక బాధ పడుతున్నారు అంది.

నాకు దుఃఖం వచ్చింది. మంచివాళ్ళు. బాబుకి మంచి జాబ్. ఏ బాదరబందీలు లేని కుటుంబం. బాబు పెళ్ళికి మేము వెళ్ళాం. పెళ్ళిలో పిల్ల మొహాన కళాకంతీ లేవు. బాత్‌రూంలో పడింది. కాలు బెణికింది అన్నారు. ఆరు నెలలు అయింది పెళ్లికి వెళ్ళొచ్చి ఇంతలోనే ఇంత కథ నడిచిందా? ఏమిటిది? లేచి ఎవరి మొహం చూసానో ఇలాంటి విషయాలు వింటున్నాను అని బాధ వేసింది.

ఆ మాటే అంటే మా చెల్లెలు కూడా బాధపడింది ఏం చేస్తాం? ఈ రోజుల్లో ఇవన్నీ కామన్ అయిపోతున్నాయి. ఇప్పుడు బాబు జీవితం అన్యాయం అయిపోయింది కదా? అలా వదిలేసి ఊరుకోలేరు. మళ్ళీ పెళ్ళి చెయ్యాలంటే మాటలా? ఎంత మందికి ఎన్ని విధాలా సంజాయిషీలు చెప్పుకోవాలి? ఎన్ని తంటాలు పడాలి? అయినా ఆ పిల్లకి ఇష్టం లేకపోతే ఈ గొడవంతా ఎందుకు? అప్పుడే చెప్పేస్తే పోయేదిగా అంది.

ఏమిటి అన్యాయం? మన సమాజంలో వివాహ వ్యవస్థ ఇంత ఓటిగా, గాజు వస్తువు లాగా తయారైంది. ఎందుకని? గతంలో ఎవరికైనా ఎరిగిన వాళ్ళకు పెళ్ళి సంబంధాలు చెప్పాలంటే చాలా సరదాపడిపోయి నడుం కట్టుకుని మధ్యవర్తిత్వం వహించి పెళ్ళిళ్ళు చేయించేవాళ్ళు. మంచి సంబంధం కుదిర్చారు– అని వాళ్లూ సంబరపడిపోయేవాళ్ళు. ఇప్పుడు ఎవరికైనా పెళ్లి సంబంధం చెప్పాలంటే భయపడిపోతున్నారు. ఏదైనా తేడా వస్తే జీవితాంతం మనల్ని సాధిస్తారని, అబ్బే మాకెవరూ తెలియదండి– అని తప్పుకుంటున్నారు.

అప్పట్లో అయ్యో వాళ్ళు తెలియపోవటం ఏమిటి? వాళ్ళ పిన తల్లి కూతురు మా ఆడపడుచుకి తోడికోడలేగా. వాళ్ళా! మాకు బాగా తెలుసు. వాళ్ళ అక్కగారు మేమూ పక్కపక్కనే ఉన్నాం పాతికేళ్ళు– అని రికమండేషను చేసే రోజులు పోయాయి. ఇప్పుడు చక్కగా పిల్ల, పిల్లాడు మాట్లాడుకుంటున్నారు. అభిప్రాయాలు అడిగి తెలుసుకుంటున్నారు.

ప్రేమించుకుంటున్నారు. అయినా ఫలితం శూన్యం. గతంలో ఆడ పిల్లలకి మాత్రమే సమస్యలు వుండేవి. ఇప్పుడు మగపిల్లలు వాళ్ళని కన్న నేరానికి వాళ్ల తల్లిదండ్రులు సతమతం అయిపోతున్నారు.

ఆడపిల్లల తల్లిదండ్రులు మా అమ్మాయికి ఇంటి పని రాదు. కోపం, చిరాకు ఎక్కువ. మాట అంటే పడదు అని పెళ్ళిచూపుల్లోనే కుండ బద్దలు కొట్టినట్టు చెప్పేస్తున్నారు.

అన్నిటికి అంగీకరించి ఒప్పుకుంటున్నారు పిల్లాడి అమ్మా, నాన్న. ఒప్పుకున్న నేరానికి ఎన్నో రకాలుగా సర్దుకుపోతున్నారు. కోడలి కృపా కటాక్షం కోసం తంటాలు పడుతున్నారు.

వాళ్ళ మంచితనం అలుసుగా తీసుకుంటున్నారు కోడళ్ళు. ఏవో సాధింపులు... ఏమైనా అంటే కోపాలు. పుట్టింటిని ఆకాశానికి ఎత్తేసి, అత్తింటిని లోకువ చెయ్యటం. మీకు వంటరాదు. మా అమ్మ కమ్మగా వండుతుంది... అని అత్తగారితోను, మీకు లోకజ్ఞానం లేదు అని మామగారితోను మొహంమీదే చెప్పటానికి జంకటం లేదు. నిజం చెప్పాలంటే గతంలో లాగా ఇప్పటి కోడళ్లకి అత్తింటి బాధ్యతలు ఉండటం లేదు. అన్ని అమర్చి ఉంటున్నాయి అత్తవారింట్లో. ఇద్దరు పిల్లలున్న ఇంట్లో ఆడపిల్ల పెళ్ళి చేసుకు వెళ్ళిపోతే వచ్చిన కోడలిని పువ్వులా చూసుకుంటున్నారు. ఇద్దరూ మగపిల్లలే అయితే ఇక చెప్పే పనే లేదు. అయినా ఇమడలేక ఆపసోపాలు పడిపోతున్నారు. ఆడపడుచుతో పడదు సరే. వీళ్ళ ఖర్మ. కట్టుకున్న మొగుడితో కూడా పడకపోతే ఏమిటి గత్యంతరం? విడాకులేనా? ఆ తరువాత మరోటి... ఎన్ని పెళ్లిళ్ళు చేసుకోవాలి?

ప్రేమించి చేసుకున్న పెళ్లిళ్ళు ఫెయిల్ అయి పోతున్నాయి. పెద్దవాళ్ళు కుదిర్చినా.. బెడిసికొడుతున్నాయి. పెద్దవాళ్ళు పూనుకుని నచ్చచెప్పినా వినరు. తాము పట్టిన కుందేటికి మూడేకాళ్ళు. ఫలితం పెళ్ళి అంటే గాలిలో దీపంలా తయారై పోయింది. తుమ్మితే ఊడిపోయే ముక్కులా అయిపోతోంది. కట్టుకున్నవాడు కాల్చుకు తింటూ ఉంటే భార్య జీవితం నరకమే. మరి భార్య కాల్చుకు తింటూ ఉంటే మగవాడి గతి ఏమిటి? ఎవరితో చెప్పుకోవాలి?

ఆలోచిస్తున్న కొద్దీ బుర్ర వేడెక్కి పోయింది. వాళ్ళకి చెప్పి బయట పడ్డాను. కారు దగ్గరికి వెళ్తుంటే కనిపించాడు బాబు. నన్ను చూసి తల వంచుకుని వెళ్ళిపోయాడు.

చెయ్యని నేరానికి శిక్ష అనుభవిస్తున్న ఆ బిడ్డని చూసి కడుపు తరుక్కుపోయింది. ❑

# ఎదుటి మనిషికి చెప్పేటందుకే

**పొ**ద్దున్న పది గంటలు అయింది. ఫోను మోగింది. తీసి 'హలో' అని అవతలి కంఠం విని ఆశ్చర్యపోయా. ఆ మనిషి నాకు మిత్రువు కాదు... అలా అని శత్రువూ కాదు. మా అభిప్రాయాలు కలవవు. ఎక్కడైనా ఎదురుపడితే మొక్కుబడిగా పలుకరించుకుంటాం అంతే. ఈవిడ నాకెందుకు ఫోన్ చేసిందబ్బా అనుకున్నా. బాగున్నారా? అన్నా.

'ఆ... మీరు బాగున్నారా? మీరు నాకు ఓ ఇన్ఫర్మేషన్ ఇవ్వాలి' అంది. నమ్మశక్యం కాలేదు. 'నేనా?? మీకా?' అన్నా.

'అవును. మీ ఎరికలో కమ్మగా చలిమిడి చేసే స్వగృహ షాప్ ఉందా?" అంది. ఇక ఆశ్చర్యపోయే ఓపిక కూడా లేక ఊరుకున్నా. 'మంచి చలిమిడి కావాలి... ఎవరైనా తెలుసా మీకు?' రెట్టించింది. 'బోలెడు ఉన్నాయి ఇంతకీ ఎవరికి చలిమిడి?' అడిగాను.

'నాకే. మా అమ్మాయికి ఏడో నెల వచ్చింది. సూడిదలు ఇవ్వాలి. నాకివన్నీ నచ్చవు... కాని ఆడపిల్ల విషయంలో తప్పవుగా ఇవన్నీ... అందులోనూ మా వియ్యాల వారు పురాతనం మనుషులు. పాత పద్ధతులు. వియ్యంకుడు మంచివాడే. వియ్యపురాలే దొంగ పీనుగ. ఆ కొంపలో ఆవిడదే పెత్తనం... అన్నిటికీ పేర్లు పెడుతుంది.' అంది ఆవేశంగా.

ఏం మాట్లాడను? పక్కా నాస్తికుడు వచ్చి "అభిషేకం చేయించుకోవాలి. శివుడి గుడికి దారెటు?" అంటే నోట మాట రాకుండా బిగుసుకుపోమా? ఇదీ అంతే. అంతటి మనిషి మామూలు ఆడదానిలాగా సూడిదలు, గాడిదలూ, చలిమిడి, చిమ్మిలి అని మాట్లాడుతుంటే కచ్చితంగా ప్రళయం రాదూ మరి?

'ఏమండీ తెలుసా?' మళ్లీ అడిగింది. షాక్ నించి ఇంకా తేరుకోలేదు. ఈ అయోమయంలో తప్పుడు సమాచారం ఇస్తానేమోనని భయం వేసింది.

ఆలోచించి 'పది నిమిషాల్లో ఫోన్ చేస్తా...' అని చెప్పి ఫోన్ పెట్టేసి గ్లాసుడు నీళు గటగట తాగేసాను బుర్ర పని చెయ్యడం మొదలుపెట్టింది. అప్పట్లో ఓ ఉద్యమం వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా దుమారం లేపింది. కొంతమంది స్త్రీలు పూనుకుని స్త్రీలకు జరిగే అన్యాయాలకి విరుద్ధంగా నోరు విప్పారు. సమాజం మీద ధ్వజమెత్తారు. స్త్రీలను చైతన్యవంతులని చేయాలని నడుం కట్టుకున్నారు. ఎన్నెన్నో విషయాలు తెలియజెప్పారు.

మీరంతా ఇల్లాళ్లు కారు. కూపస్థ మండూకాలు... మగవాడి దౌర్జన్యానికి బానిసలు. మీ మెళ్లో ఉన్నవి తాళిబొట్లు కావు. ఉరితాళ్లు. ఆ బంధాలన్నీ తెంచుకోండి– అని దిశా నిర్దేశం చేశారు. అంతవరకూ గుట్టుగా వున్న రహస్యాలు ఎన్నో వెలికితీశారు. ఆడపిల్ల జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలెన్నో కళ్లకు కట్టినట్లు వర్ణించారు. నెలనెలా వచ్చే ఇబ్బందులు, పెళ్ళయ్యాక శోభనం రోజున ఇబ్బందులు.. తరవాత మొరటు మొగుడితో కాపురం... కష్టాలు... పురిటినొప్పులూ...

పిల్లకి పాలివ్వటంలోని సమస్యలు అన్నీ వివరించారు. ఇన్ని సమస్యలు ఉన్నాయా అని ముక్కున వేలేసుకుంది సమాజం. కొంతమంది మగవాళ్లు కూడా ఇంతకాలం మాకు ఈ విషయాలన్నీ తెలియవు. మా అదృష్టం బావుంది. నేటి కాలానికి వీళ్లంతా పూనుకుని మాకు ఇవన్నీ తెలిసేలా చేశారు.

ఇంకా ఇలాంటి విషయాలు చెప్తే బావుండు– అనుకున్నారు. అనుసరించారు. ఆరాధించారు.

ఎవరైనా ఏదైనా కొత్త పని మొదలుపెడితే ప్రశంసలు మాత్రమే కాదు విమర్శలూ వెన్నంటే ఉంటాయి.

కొంతమంది మగవాళ్లు తిట్టిపోశారు. ఏవిటిది? దాచాల్సిన విషయాలు కొన్ని ఉంటాయి. ఉదాహరణకి నిన్న పెళ్లికి వెళ్లొచ్చాం. ఫుడ్ బాగోలేదు. అవస్థ పడ్డాం అని చెప్తే చాలదా? వచ్చాక ఒకటే కడుపునొప్పి... గుడగుడ. రాత్రంతా ఎత్తిన చెంబు దించకుండా పదిసార్లు వెళ్లనూ రానూ. అదే పని అని విడమరిచి చెప్పాలా? చండాలం కాపోతేను... అని మొత్తుకున్నారు.

కొంతమంది ఆడవాళ్ళు ఇదేమిటో బాగానే ఉందే అనుకుని కూడా బానిసత్వమో బండలో పెళ్లి చేసుకున్నాం. ఇలా అడ్జస్ట్ అయిపోదాం. ఈ సంసారం వదిలేసి మళ్లీ ఇంకో చోటు వెతుక్కుని వొంటరిగా బోరు కొడితే మరో మగతోడు వెతుక్కోవాలి. ఆ మగవాడు మొదటి పెళ్లివాడైతే ఫరవాలేదు గానీ అదివరకే పెళ్లై వుంటే ఆ పెళ్లాం,

పిల్లలూ మన మీద పడి ఏడవటం. అది మాత్రం తలనొప్పి కాదా. అంతోటి భాగ్యానికి ఇక్కడే ఉండి జీవితం గడిపితే చాల్లే అని సర్దుకుపోయారు.

కొంతమంది అసలు ఏం పట్టించుకోకుండా చూసీ చూడనట్లు ఊరుకున్నారు.

ఇప్పుడు ఈ సొద అంతా ఎందుకు చెప్పానంటే ఇప్పుడు నాకు ఫోన్ చేసిన ఆవిడ ఆ సిద్ధాంతాన్ని నమ్ముకున్న మనిషి. మగవాళ్లని చీల్చిచెండాడి పారెయ్యాలని, మగవాడి జులుం భరిస్తూ బతకటం అంత నీచమైన పని మరొకటి లేదని గతంలో చాలాసార్లు ఉపన్యాసాలు ఇచ్చింది.

మరి అటువంటి మనిషి కూతురికి పెళ్లిచేసి ఆ పిల్లని ఒక పురుషాధముడికి కట్టబెట్టడం ఎందుకో? తల్లి నమ్మిన సిద్ధాంతం కూతురు కూడా నమ్మాలని రూలేం లేదు. పెళ్ళి చేసింది సరే అన్ని ఆచారాలు చాదస్తంగా పాటించడం ఏమిటి? అవన్నీ అలా వుంచి సాటి ఆడది అయిన వియ్యపురాలిని పట్టుకుని గయ్యాళి దొంగపీనుగా అనటం ఏమిటి? అదే కొరుకుడు పడటం లేదు. మళ్లీ ఫోను మోగింది. మళ్లీ ఆవిడే. అడ్రస్ చెప్పాను. థాంక్స్ చెప్పి కాసేపు వియ్యపురాలిని, ఆవిడ కూతురిని తిట్టి సీమంతానికి రమ్మని పిలిచి ఫోన్ పెట్టేసింది.

అవును మరి. ఇంకొకరికి చెప్పటం అంత తేలిక కాదుగా మనం ఆచరించటం.

మన సినీ కవులు ఆ మాట చక్కగా రూపంలో ఏనాడో స్పష్టంగా చెప్పనే చెప్పారు.

ఎదుటి మనిషికి చెప్పేటందుకే నీతులు వున్నాయి. ❑

# అతుకుల బొంతలు

**అ**ప్పట్లో సినిమాలు జానపద చిత్రం, సాంఘిక చిత్రం, పౌరాణిక చిత్రం అంటూ వేరువేరుగా ఉండేవి. ఏ కేటగిరీకి తగ్గ ప్రేక్షకులు ఆ కేటగిరీకి ఉండేవాళ్లు.

అప్పట్లో వచ్చే సినిమాల సంఖ్య పరిమితం కాబట్టి వచ్చిన అన్ని సినిమాలూ అందరూ చూసినా ఎవరి అభిరుచిని బట్టి వారు తమకు నచ్చిన సినిమాని మరో అరడజను సార్లు చూసి ఆనందించేవాళ్ళు.

కొందరికి పౌరాణికాలంటే పిచ్చి. లవకుశ, శ్రీకృష్ణ తులాభారం పాతికసార్లు చూసినవాళ్ళు నాకు తెలుసు. కొందరికి విఠలాచార్య సినిమాలంటే వీరావేశం వచ్చేసేది. రోజు విడిచి రోజు కాంతారావు సినిమాలు చూసే కుర్రకారు ప్రేక్షకులు చాలామందే వుండేవాళ్ళు. ఇక సాంఘిక చిత్రాల మాట చెప్పనక్కర్లేదు. మాంగల్య బలం, మిస్సమ్మ, గుండమ్మ కథ ఇలాటి సినిమాలు పదే పదే చూసి ఆనందిస్తూనే వుండేవారు.

ఇవన్నీ కాక మహిళా చిత్రాలని వేరుగా ఉండేవి. ఆద్యంతం కష్టాలూ, కన్నీళ్ళూనూ. ఒక ఆట అవగానే హాల్లో నిండిన కన్నీళ్ళు తోడి బయట పారబోసి తరువాత ఆటవేస్తారని అప్పట్లో జోకులు వేసుకునేవారు.

ఇప్పుడు ఆ ట్రెండు అంతా మారిపోయింది. సంధియుగం కదా మరి! అన్నీ కలిపి ఒకటే సినిమా. ఒకే టిక్కెట్టుమీద అన్నిరకాల సినిమాలు చూసిన ఆనందం పొందే అవకాశం దక్కింది ఈ తరం ప్రేక్షకులకి.

టికెట్టు కొనుక్కుని హాల్లోపలికి వెళ్ళి కూర్చుంటే సినిమా మొదలవుతుంది. కాలేజీలో చదువుకుంటున్న హీరో పక్కింటి పిల్లని ప్రేమించి ఫారెన్ బైక్‌మీద ఎక్కి పాటలు పాడేస్తూ వుంటాడు. ఆ పిల్ల సుముఖత చూపించక వీడిని ఏడిపిస్తూ వుంటుంది. లేదా ఆ పిల్లకి అంగీకారం అయితే పెద్దవాళ్ళు శనిగ్రహాల్లా అడ్డుపడి వాళ్ళని కాల్చుకు తింటూ ఉంటారు.

అదుగో అలాటి సమయాల్లో తెరమీది దృశ్యం మారిపోతుంది. వాళ్ళల్లో ఎవరికో పునర్జన్మ గుర్తొచ్చి సాంఘికం కాస్తా జానపదంలాగా మారిపోతుంది. రాజులు, కోటలు, దండయాత్రలు, యుద్ధాలు భలే సరదాగా వుంటుంది. చివర్లో మరో రెండురీళ్లు ఉందనగా ఆ కథంతా మారిపోయి మళ్లీ వాస్తవంలోకి వచ్చేస్తుంది. మళ్లీ హీరో హీరోయినూ జీన్సు పేంటు వేసుకుని డ్యూయెట్ పాడేస్తారు.

కథ సుఖాంతం.

మరికొన్ని సినిమాల్లో అయితే ఓ అరగంట సినిమా గడిచేసరికి హీరోయిన్‌కి దయ్యం పడుతుంది. ఇక చెప్పేదేముంది? కథ రేసుగుర్రంలా పరిగెడుతుంది.

దయ్యం పడితే మాటలా మరి! వదలగొట్టడానికి ఓ భూత వైద్యుడు కావాలి. ఆ భూత వైద్యుడికి బోలెడంత సరంజామా వుండాలి. ముగ్గులూ, పుర్రెలూ, వేప మండలూ, నిమ్మకాయలూ, ఖాళీ సీసాలు, భీతావహం పుట్టించేలా ఓ క్షుద్రదేవతా విగ్రహం, జుట్టు విరబోసుకున్న శిష్యగణం, మహా ప్రభో సందడే సందడి.

ఇవన్నీ జానపద చిత్రంలో అయితే అతికినట్లు సరిపోతాయిగానీ సాంఘిక చిత్రంలో ఎబ్బెట్టుగా వుంటాయి కదా! అందుకని అవన్నీ మూఢనమ్మకాలు అని కొట్టి పారేసేందుకు ఒక బవిరి గడ్డం ప్రొఫెసరు గారుంటారు. వారి సరంజామా వారికుంటుంది. ఓ అసిస్టెంటు, చిన్న లేబరేటరీ, అందులో పొగలు చిమ్ముతూ గాజు పరికరాలూ, పుస్తకాలు, భూతద్దం దయ్యం కాదు పాడూ కాదు ఆ పిల్లకి చిత్తచాంచల్యం అని వాదిస్తూ వుంటారు.

ఇద్దరూ కలిసి ప్రేక్షకులకి పిచ్చెక్కించి అయోమయావస్థ కలిగించి ఇక సినిమా అయిపోయింది పొమ్మంటారు. ఏదో చూశాం బానే వుంది. అది సాంఘికం అయితే మనకెందుకు, జానపదం అయితే మనకెందుకు? ఏ రాయి అయితేనేం పళ్ళు రాలగొట్టుకునేందుకు– అని సరిపుచ్చుకుంటారు ప్రేక్షకులు. అది సాంఘిక జానపదం.

మరికొన్ని సినిమాల్లో దేవుడు, అమ్మవారు పైనించి దిగివచ్చి సగం సినిమా భారాన్ని తమ భుజాలమీద వేసుకుంటారు. మంత్రాలు, మహిమలు, పూజలు, దుష్టశిక్షణ, శిష్టరక్షణ అక్కడితో కథ ఆగిపోతుంది. అప్పుడది సాంఘిక పౌరాణికం.

మరికొన్ని సినిమాలు పైన చెప్పిన అంశాలన్నింటికీ అతీతంగా వుంటాయి. అవి పిచ్చి సినిమాలు. ఇంగ్లీషులో స్టైలుగా సైకోసినిమాలు అనచ్చుగానీ నిజానికి అవి పిచ్చి సినిమాలే.

వాటిల్లో నాయకుడికి నాయకత్వలక్షణాలు వుండవు సరికదా ప్రమాదకరమైన పిచ్చి లక్షణాలుంటాయి. హత్యలు చేస్తాడు. ఆడవేషాలు వేసుకు తిరుగుతాడు. దొంగతనాలు చేస్తాడు. అదో పిచ్చిగోల. అలాంటి ప్రమాదకరమైన వ్యక్తులని గుండేసి కాల్చి చంపాలి. కానీ పాపం వాడు చేసే వెధవ పనుల వెనక ఏదో బలమైన కారణం ఉంది అని ఆ పిచ్చి వెధవల్ని వెనకేసుకొచ్చి దుర్మార్గుడిపట్ల సానుభూతి కలిగించి కథ ముగిస్తారు. ఏదో మారే కాలంతో మనంకూడా మారాలి కదా! సాంఘికం, పౌరాణికం, జానపదం అని విడివిడిగా వుండాలని అత్యాశకి పోకుండా ఒకే విడతలో అన్నీ కలిపి చూసేస్తే వదిలిపోతుంది గొడవ.

ఇలా ఇప్పుడొస్తున్న సినిమాల గురించి మాట్లాడుతుంటే నాకో సంఘటన గుర్తుకొస్తోంది. అప్పట్లో పెళ్ళిళ్ళలో పెళ్ళిబట్టలు కుట్టిన టైలరు మిగిలిన ముక్కలన్నీ అతుకేసి ముప్పై ఆరు ముక్కల రవికె అని ఓ జాకెట్టు కుట్టేవాడు. ఆ జాకెట్టుని వియ్యపురాలికి ఇచ్చి హాస్యాలు ఆడేవారు ఆడపెళ్ళివారు. ❑

# ఏదీ మనకు గుర్తింపు?

**‘ప**నిమంతులారా ఏం చేస్తున్నావే’ అంటే ‘పారబోసి ఎత్తుకుంటున్నా’ అందిట వెనకటికి ఓ భాగ్యశీలి.

మన గుర్తింపు కార్డుల వ్యవహారం చూస్తుంటే అచ్చంగా అలానే అనిపిస్తుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా చాలా ఏళ్ళపాటు ఈ గుర్తింపు విషయాన్ని ఎవరూ పట్టించుకోలేదు. మా చిన్నతనంలో అయితే మాకెవ్వరికీ డేట్ ఆఫ్ బర్త్ రికార్డే ఉండేది కాదు. ఎస్.ఎస్.ఎల్సీ పరీక్షల సమయంలో అవసరం వచ్చేది పుట్టిన తేదీ. అప్పుడు పిల్లలు వెళ్ళి ‘అమ్మా నేనెప్పుడు పుట్టాను’ అని అడగటం, దానికి వాళ్ళేమో ‘నువ్వా? విజయనామ సంవత్సరం, ఆషాడ శుద్ధ పంచమినాడు తెల్లవారు జామున పుట్టావు’ అని తెలుగు పంచాంగం ప్రకారం చెప్పడం జరిగేది.

కొంతమందికి అదీ గుర్తుండేది కాదు. ‘పెద్ద గాలివాన నాటికి నీకు ఆరోనెల. గోవాడ తీర్థం అయిన పది రోజులకి నువ్వు పుట్టావు. మన చిట్టి పిన్నిగారి చింతామణికీ నీకు ఆర్రోజులేగా తేడా!’ అని కాకిలెక్కలు చెప్పేవాళ్ళు. హెడ్ మాస్టరు పూనుకుని పరీక్షలకు సరిపోయేలా లెక్క చూసి ఉజ్జాయింపుగా పుట్టిన తేదీలు నిర్ణయించేవారు.

మరి ఆ తర్వాత పరిస్థితులు మారాయి. వ్యవసాయాలూ, వ్యాపారాలు పోయి ప్రతివారికీ ఉద్యోగాలు. అందుకే విధిగా పుట్టిన రోజు రాసిపెట్టే వాళ్ళు. ఎస్.ఎస్.ఎల్సీ సర్టిఫికెట్ మీద వేసిన డేట్ ఆఫ్ బర్త్ ప్రకారం రోజులు వెళ్ళమారిపోయేవి.

ఆ తర్వాత పాస్‌పోర్టు చేయించుకోండి అని ఒకరు సలహా ఇస్తే మాకెందుకు పాస్‌పోర్ట్ మేమేం విదేశాలకి వెళ్తామా అన్నాం. విదేశాలకి వెళ్ళాలని రూలేం లేదు. మనం భారతీయులం అని గుర్తింపు అన్నారు. అలాగే చేయించుకున్నాం. అప్పట్లో అది ఓ రామబాణంలా పని చేసింది. బ్యాంక్ ఎకౌంట్ ఓపెన్ చెయ్యాలన్నా, కొత్త గేస్ కనెక్షన్ కొనాలన్నా పాస్‌పోర్ట్ చూపిస్తే చాలు. సలామ్ కొట్టి వెంటనే మన పని పూర్తి చేసేవాళ్లు.

అద్దైపోయింది. ఆ తర్వాత పేన్ కార్డు వుండాలన్నారు. సరే అనీ చేయించాం. రేషను కార్డు వుండాలన్నారు. మన ఆదాయాన్ని బట్టి మనకెలాగా రేషనివ్వరు కదా! రేషన్ లేనిచోట రేషను కార్డు ఎందుకు అని వూరుకున్నాం. అలా కాదు రేషను కార్డుంటేగానీ గ్యాస్ సిలెండరు ఇవ్వరుట అని చెప్తే పరుగున వెళ్ళాం. అక్కడంతా తిరణాలలాగ వుంది. రెండ్రోజులు ప్రదక్షిణలు చేసి ఎలాగైతేనేం ఫొటో తీయించుకుని రేషను కార్డు తెచ్చుకున్నాం. ఆ రేషను కార్డు కోసం కరెంటు బిల్లూ, టెలిఫోన్ బిల్లూ రుజువులుగా సమర్పించుకున్నాం. అమ్మయ్య అనుకుంటూ వుండగానే ఓటరు గుర్తింపు కార్డు కావాలన్నారు. వాటి కోసం మేము పడిన పాట్లు చెప్తే కరుకుగుండెలు గలవాళ్ళైనా కుళ్ళికుళ్ళి ఏడుస్తారు.

ఓరోజు వాళ్ళొచ్చి తలుపుతట్టి వివరాలు రాసుకుని ఓటరు కార్డుకోసం అంటే టిక్కెట్లు బుక్ చేసుకున్న సినిమా ప్రోగ్రాం కేన్సిల్ చేసుకుని ఇంటిల్లిపాదీ వివరాలిచ్చాం. మళ్ళీ మూడు నెలల తర్వాత వచ్చారు. గతంలో రాసుకున్న వివరాలు పోయాయి. మళ్ళీ చెప్పండి అన్నారు. ఆ వేళ మా ప్రయాణం. అయినా ఓటరు కార్డు ముఖ్యం కదా అని వాళ్ళకన్నీ చెప్పి ఆఖరు క్షణంలో పరిగెట్టి రైలెక్కాం. అవీ పోయాయట. మీ ఏరియాలో ఫలాని అప్లై చెయ్యండి అన్నారు. చేశాం. మా ఖర్మకొద్దీ అవీ పోయాయి. పోస్టాఫీస్‌లో డ్రాప్ బాక్స్‌లో పడెయ్యమన్నారు అప్లికేషన్లు. అలాగే పడేశాం.

ఎలక్షన్లు పదిరోజుల్లోకి వచ్చినా అతీగతీ లేదు. మరో రెండు రోజుల్లో ఎన్నికలనగా ఇవ్వాళ తెచ్చి ఇచ్చారు గుర్తింపు కార్డులు. అందులోని నా ఫొటోకీ నాకూ ఒక్క పోలికా లేదు. అంత చిన్న ఫొటోలో ముఖ కవళికలు కనిపించవు. అదీ మనకు అలవాటే. ఆ కార్డులో నా పేరు విజయలక్ష్మి పోతురావు అని పడింది. అదేమిటో ఇప్పటికీ అంతుపట్టదు నాకు. ఆ కార్డు పుచ్చుకుని వెళ్ళి ఓటేశాం. మరి అంత గొప్ప గుర్తింపు కార్డు లేకపోతే మనం అనర్హులం కదా!

ఇప్పుడు కొత్తగా ఆధార్ కార్డులుట. ఎవడు తీసుకుంటాడులే. మనం భారతీయులం అని నిరూపించడానికి దస్తాడు రుజువులున్నాయి అని బద్ధకించాం. మళ్ళీ మరో మడతపేచీ పెట్టారు. ఆధార్ కార్డుంటేగానీ గ్యాస్ ఇవ్వడం అని ప్రకటించారు. ఊ అంటే గ్యాస్ ఇవ్వడం అని బెదిరింపు ఒకటీ. గ్యాస్ లేకపోతే ఎలా? మళ్ళీ కుంపట్లూ, బొగ్గులూ అయినా వాడుకోవాలి. లేకపోతే కట్టెల పొయ్యిమీద వంట చెయ్యాలి. ఇదంతా

అయ్యేపని కాదని ఆధార్ కార్డుకోసం ప్రయత్నాలు ప్రారంభించాం. ముందు వెళ్ళి అప్లికేషన్ తెచ్చుకుని నింపి ఇవ్వాలి. వాళ్ళు ఫలనాప్పుడు రమ్మంటారు. వెళ్ళి వేలి ముద్రలూ, కంటిపాపల ఫొటోలూ ఇచ్చేస్తే ఓ నెంబరిస్తారు. కార్డేమో ఇంటికి పంపుతారుట.

మా ఏరియాలో ఆధార్ కేంద్రం మారుమూల ఓ సందులో వుంది. రెండు ఆటోలు ఎదురెదురు వస్తే అంతే సంగతులు. అక్కడికి వెళ్ళి చూస్తే గుండె చెరువైపోయింది. కర్రపోటు వేసుకుంటూ వృద్ధులూ, చిన్నపిల్లలూ, స్త్రీలూ, పురుషులూ వయోభేదం లేకుండా అందరూ వచ్చారు అక్కడికి, గంటల కొద్దీ పడిగాపులు పడుతున్నారు. దుఃఖం వచ్చింది నాకు.

ఎనభై ఏళ్ళ వృద్ధుడు ఈ సమయంలో తన గుర్తింపు కోసం ఓ కార్డుమీద ఆధారపడాలా? అదివరకు వున్నవి పనికిరావా? ఎందుకింత హైరానా! బయట దేశాలలోగా అందరికీ ఒక నెంబరుండాలి. సరదాపడి ఈ పద్ధతి ప్రవేశపెట్టారే అనుకుందాం. దానికి యాభై ఏళ్ళ దాకా వయోపరిమితి నిర్ణయిస్తే ఆ పైవాళ్ళకు ఈ తిప్పలు తప్పుతుంది కదా! పెద్ద వయసులో వాళ్ళనెందుకు కాల్చుకు తినటం. కాదూ కూడదూ రూల్స్ రూల్సే అంటే ఇంతమందిని ఆ ఇరుకు సందుల ఆఫీసులకి రప్పించే బదులు వాళ్ళే వచ్చి ఆ వేలిముద్రలేవో ఇంటి దగ్గరే తీసుకోవచ్చుగా. అందుకోసం కావలిస్తే మనిషికి యాభై రూపాయలో వందరూపాయలో వసూలు చేసినా అందరూ సంతోషంగా ఇస్తారు. వాళ్ళకి కావలసిన వివరాలు సేకరించి ఆ కార్డు ఇంటికే పంపించలేరా? ఏం హౌస్ టాక్సులు, ప్రాపర్టీ టాక్సులూ కట్టమని బిల్స్ ఇంటికి పంపించటం లేదా? ఇదీ అంతే. అది సులువు కూడాను. అందరూ పొలోమని ఓ ఆఫీసుకి పోయి పని పూర్తి చేసే సమయం కంటే తక్కువ సమయంలో వాళ్ళు ఇంటి దగ్గరికొచ్చి వివరాలు సేకరించవచ్చు. టెక్నాలజీ ఇంతగా డెవలప్ అయిన ఈ రోజుల్లో ఆ కంప్యూటర్లు, ఆ సామగ్రి మొబైల్ వేన్‌లో పెట్టుకుని తిరగడం అసాధ్యం ఏమీ కాదు.

అసలెందుకో ప్రజలను ఇబ్బంది పెట్టకుండా పనులు చెయ్యచ్చని మన వాళ్ళకి ఎప్పుడూ ఆలోచనలే రాదు. ఇంత శ్రమ పడ్డాం. రేషన్ కార్డ్, కరెంటు బిల్లూ వగైరా గుర్తింపు సమాచారం అందించి కొత్త కార్డు కోసం అప్లై చేసుకున్నాం. ఆ కార్డు మన

అసలు పేరుతో అసలు అడ్రస్‌తో మన దాకా వస్తుందా? లేకపోతే మరో నాలుగు సార్లు తిరగాలా? వచ్చినా ఆ కార్డెంతకాలం పనికొస్తుంది? ఈలోగా ప్రభుత్వాలు మారిపోయి, ఈ ఆధార్ పనికిరాదు. ఇది చూపించి మరో గుర్తింపు కార్డు తీసుకోండి. లేకపోతే గ్యాసివ్వం. అంతేకాదు కరెంట్ కట్ చేస్తాం. నీటి కనెక్షన్లు నిలిపేస్తాం- అని బెదిరిస్తే మన గతి ఏమిటి? చచ్చేదాకా గుర్తింపు కార్డుల కోసం యాతన తప్పదా? ఈ పుణ్యభూమిలో పుట్టడం మన ఖర్మ అని మరోసారి గొంతెత్తి పాడుకుందామా? ❑

# గణితంలో ఉద్దండ పండితులు

**మా** ఇంటెదురుగా వుండే అమ్మాయి వాళ్లబ్బాయి రెక్కపుచ్చుకుని బరబర నా దగ్గరికి లాక్కొచ్చింది. ఏమైందో అర్థం అయిపోయింది. వాడి రిపోర్టు కార్డు వచ్చుంటుంది. అలా మార్కులు వచ్చినప్పుడల్లా వాళ్లింట్లో మారెమ్మ జాతరే. ఆ పిల్లాడు ఇంటెలిజెంటే. మిగిలిన అన్ని సబ్జెక్టులలోనూ బాగానే వస్తాయి మార్కులు లెఖ్ఖల్లో మాత్రం ఎప్పుడూ అత్తెసరు మార్కులే. వాడి మార్కులు చూసిన ప్రతిసారీ వాళ్లమ్మ బెంగ పెట్టుకుని నాల్రోజులు అన్నం తినదు.

'మా ఇంటా వంటా లేదు ఈ గొడవ. ఇలా లెఖ్ఖల్లో ముప్పైలు నలబైలు ఎవరికీ రావు. అందరికీ నైన్‌టీ పైనే. వీళ్ల నాన్న లెఖ్ఖల్లో టాపరు. మరి వీడెక్కడ సంప్రాప్తం అయ్యాడో!! పోనీ పూర్తిగా రావు లెఖ్ఖలు అంటే బుర్ర తక్కువ వెధవ అనుకుని వూరుకునేదాన్ని. ఇప్పుడు అడిగితే పన్నెండో ఎక్కం ఠకఠకా చెప్తాడు. పదిహేడు ఏళ్లు ఎంతరా అంటే నూట పందొమ్మిది అని క్షణంలో చెప్పేస్తాడు. మళ్లీ కాసేపయ్యాక అడిగితే అయోమయం. పన్నెండు రెళ్లు ఇరవై ఎనిమిది అంటాడు. పదిహేడు ఏళ్లు రెండొందల పది అంటాడు. ఇదెక్కడి పీడాకాలం. వీడినెలా ఓ దారికి తీసుకురావడం అని బోలెడు బాధపడిపోయి మళ్లీ వాడి రెక్క పుచ్చుకుని లాక్కుపోయింది.

వాళ్లమ్మ అంత ఫీలైపోతోంది గానీ నాకేం వింతగా అనిపించలేదు. కొంతమందంతే. లెఖ్ఖల్లో పూరే. మహా మహా వాళ్ల లెఖ్ఖలు చూస్తుంటేనే కళ్లు బైర్లు కమ్ముతాయి. పిల్లకాయ వీడెంత? వీడింకా చిన్న వెధవ. పెద్దైతే బాగు పడతాడేమో అని ఆశ అయినా ఉంది. మరి తలలు పండిన గణిత పండితుల మాటేమిటి? వాళ్లేం బాగు పడతారు?

ఏ వరదో, వస్తే జరిగిన నష్టం అంచనా వేసి నష్టపోయిన వాళ్లకి ఎంతెంత కాంపెన్‌సేషన్లు ఇవ్వాలో లెఖ్ఖలు కడతారు ఆ పండితులు.

గొర్రెకి పది రూపాయలు బర్రెకి వంద రూపాయలూ. మనిషి చచ్చిపోతే పాతిక వేలు. కాళ్లూ చేతులూ విరిగితే ఆరు వేలు. పూరిల్లు కూలిపోతే ఎనిమిది వందలు. అదే పెంకుటిల్లు పడిపోతే మూడు వేల అయిదొందలు. పంట నాశనం అయింది కాబట్టి ఎకరానికి రెండొందల యాభై అరటి తోటకి ఆరొందల పాతిక– అని లెఖ్ఖలు కట్టేస్తారు.

వాటిని చూసి పై వాళ్లూ వీళ్లతో ఏకీభవిస్తారు. 'అబ్బో చాలు. ఎక్కీ తొక్కీ ఈ నష్టపరిహారం. ఇంతకంటే ఎందుకేవిటీ? అనేసి ఓకే చేసేసి డబ్బులిచెయ్యండి అని ఫండ్స్ రిలీజ్ చేస్తారు. ఈ తతంగం అంతా పూర్తయి ఆ డబ్బు నష్టపోయిన వారికి చెల్లించేసరికి మరో రెండు వరదలొచ్చిపోతాయనుకోండి. అది వేరే విషయం. మళ్లీ లెఖ్ఖల్లోకి వస్తే.

సరే ఏం చేస్తాం. మనదసలే పేద దేశం. కాబట్టి పొదుపరితనం వాళ్లకి అలవాటేమోలే అనుకుందామంటే అదీ కాదు.

ఎక్కడైనా ఆట పోటీలు జరిగినప్పుడు వాళ్లు చూపించిన జమా ఖర్చులేమిటో తేడాగా వున్నాయి మహా ప్రభో కాస్త చూడండి అంటే చూస్తారు. మూడు వారాల్లో నివేదిక ఇవ్వండి అంటే ఎందుకన్నాళ్లూ వారంలోనే ఇచ్చేస్తాం అంటారు. అలానే ఇచ్చేస్తారు కూడా.

ఆటల పోటీల ఖర్చుల జాబితా ఇలా ఉంటుంది– 'కోడిగుడ్డు ఒక్కటీ వంద. కోడి వెయ్యి. పదిహేను బాత్ రూముల్లో విరిగిపోయిన వాష్‌బేసిన్లు మార్చడానికి అయిన ఖర్చు పది లక్షలు. పది మంది కమిటీ మెంబర్ల ఫలహారాలకీ భోజనాలకీ అయిన ఖర్చు పాతిక లక్షలు– చీపుళ్లకీ గచ్చు తుడిచే గుడ్డలకీ అయిన ఖర్చు రెండున్నర లక్షలు– అని సాగిపోతుంది.

మళ్లీ గణిత పండితులు ఒకచోట కూడతారు. వాళ్లు శ్రద్ధగా రాసిన ఆ లెఖ్ఖలన్నీ వీళ్లు శ్రద్ధగా చూస్తారు. అంతా సవ్యంగానే ఉంది.

నిజం చెప్పాలంటే ఈ కరువు కాలంలో ఆ మాత్రం అవవా ఏమిటీ? అంతా ఓకే అని రిపోర్టు ఇచ్చేస్తారు.

‘మేం చెప్తూనే ఉన్నాం. అసలేం కుంభకోణం జరగలేదని. తీరి కూర్చుని ఆడిపోసుకుంటున్నారంతే. కోడిగుడ్డుకి ఈకలు పీకటం అంటే ఇదే’ అనేసి ఆ ఫైల్ క్లోజ్ చేసేస్తారు పై వాళ్లు.

ఏమిటీ కాకి లెఖ్ఖలు? అర్థం పర్థం వుందా? అని నెత్తీ నోరు బాదుకుంటాడు కామన్‌మాన్. మామూలు వాళ్లు ఎంత ఏడిచినా అది అరణ్య రోదనే.

ఎప్పటికెయ్యది ప్రస్తుత మప్పటికా మాటలాడి- అని సుమతీ శతకకారుడు చెప్పనే చెప్పాడుగా.

మాటలే కాదు. ఎప్పటికెయ్యది ప్రస్తుత మప్పటికా లెఖ్ఖలేసి అన్నట్లు లెఖ్ఖలు వేసే గణితశాస్త్ర ఉద్దండ పండితులకు హేట్సాఫ్! ❑

# వి‘చిత్ర’ వేషధారణ

**“మా**మ్మా అర్జెంటుగా ఇట్రా” అంటూ హాల్లోంచీ అరిచింది నా మనవరాలు. దానికిప్పుడు అయిదో ఏడు. బోలెడన్ని తెలివితేటలు. కబుర్లపుట్ట. మమ్మల్నందర్నీ సూర్యకాంతంలాగా సాధిస్తూ ఉంటుంది.

ఎందుకు పిలిచిందా అని వెళ్తే... టి.వి.లో ఏదో అవార్డ్ ఫంక్షన్ వస్తోంది. మొదటి వరసలో సోఫాలో కూర్చుని ఉన్నారు ముగ్గురు నటీమణులు. నడుముకి జానా బెత్తెడు కిందదాకా వుండే డ్రెస్ వేసుకున్నారు. కాలిమీద కాలు వేసుకుని కూర్చున్నారు. ఆ అదృశ్యం చూస్తుంటే కడుపులో తిప్పింది.

“నన్నూరికే తిడతారుగా. ఆ గర్ల్స్ చూడెలా కూర్చున్నారో?” అంది మా ఘటం.

ఈ మధ్య అడ్డ దిడ్డంగా కూర్చుంటూ వుంటే తిన్నగా కూర్చో అమ్మడూ అని దాన్ని మందలిస్తున్నాం.

“చాల్లే వూరుకో... వెధవ వాగుడు వాగితే నాలుగు తగిలిస్తా” అని దాన్ని కోప్పడి నోరు మూయించాను.

దాని నోరైతే మూయించాను గానీ టీవీ చూస్తుంటే నాకూ బోలెడన్ని సందేహాలు వస్తున్నాయి. నటీమణులు చిన్నకారు, అందరూ చిత్రవిచిత్రమైన దుస్తులు ధరించారు. ఆదిమానవులు కూడా అలాంటి వస్త్రాలు ధరించి వుండరేమో!”

సినిమాల్లో హీరోయిన్ ఒంటినిండా బట్ట కట్టుకునే పద్ధతికి ఎప్పుడో మంగళం పాడేశారు. మాకున్న అందాలన్నీ ఆరబోయడమే మా ఏకైక లక్ష్యం– అని బాహాటంగా చెప్పుకుంటున్నారు. ఆ పద్ధతికే ప్రజలూ అలవాటు పడిపోయారు.

సినిమా వేరు. ఫంక్షన్ వేరు. తెర మీద బొమ్మ ఎలా ఆడినా ఫర్వాలేదు. భరించవచ్చు. కానీ ఎదురుగా మనిషి అలా గుడ్డపీలికలు ధరించి తిరిగేస్తుంటే కంపరంగా వుండదూ!!

ఫేషనుగా వుండే డ్రెస్ వేసుకోకపోతే, పాత చింతకాయ పచ్చడిలా తొమ్మిది గజాల చీరకట్టుకోవాలా అంటారేమో, అక్కర్లేదు. ఫేషనుగా వుంటూ ఒళ్ళు కప్పుకునే డ్రెస్‌లు కోకొల్లలు వున్నాయి. అవి వేసుకోవచ్చు.

గతంలోనూ ఫంక్షన్స్ జరిగేవి. అవార్డు గ్రహీతలు వస్త్రధారణ విషయంలో ఎన్నో జాగర్తలు వహించేవాళ్ళు. మరిప్పుడా పద్ధతి వుందో లేదో గానీ గవర్నమెంట్ ఫంక్షన్స్‌లో అయితే డ్రెస్ కోడ్ వుండేది. ఇటువంటి దుస్తులు ధరించి రావాలి సుమా అని ముందే తెలియజేసేవారు. సభా మర్యాద అంటూ ఉండేది.

ఇప్పుడు అటువంటి మంచి పద్ధతులన్నీ తుంగలో తొక్కేసారు. ఫంక్షన్ అంటే పెద్దవాళ్ళొస్తారు. పిల్లలొస్తారు అంతో ఇంతో పేరు ప్రఖ్యాతి ఉన్న ఆడవాళ్ళు మూడొంతులు ఒళ్ళు కనిపించేలా పిచ్చి గుడ్డలు వేసుకుని వేదికమీదికి రావటం మర్యాదేనా?

ఎక్కడి నించీ దిగుమతి అయింది ఈ అలవాటు? హాలీవుడ్, బాలీవుడ్ వారిని చూసి అనుకరిస్తున్నారా? ఎందుకు? మనకు సరిపడే గౌరవప్రదమైన వస్త్రధారణ మనకు లేదా? పులిని చూసి నక్క వాత పెట్టుకోవాలా? కాదు హీరోయిన్లం మాకు ఈ మాత్రం గ్లామరుండాలంటారా? పీలికల్లాంటి వస్త్రాలు ధరించినంత మాత్రాన గ్లామరేం పెరిగిపోదు. గౌరవంగా బట్టలు కట్టుకుని పొందికగా వుంటే గ్లామరు తరిగిపోదు.

ఆ మాట కొస్తే ఆనాటి తారలెవరూ తెరమీద గానీ, తెరబయట గానీ అంగాంగ ప్రదర్శనివ్వలేదు.

వందలాది చిత్రాల్లో పనిచేసిన వారికే లేని విరగబాటు ఒకటో అరో సినిమాల్లో పనిచేస్తున్న ఈ తరం నటీమణులకు ఎందుకు? ఎవరి కోసం? ఏం సాధించాలనీ...

మనది సంస్కృతీ సంప్రదాయాలకు విలువనిచ్చే దేశం.

మనకెన్ని మైనస్ పాయింట్లు వున్నా విదేశాల్లో భారతీయులం అనగానే మనవి గౌరవంగా చూస్తున్నారంటే దానికి కారణం మన సంస్కృతి. ఆ సంస్కృతిని నిలబెట్టుకోవలసిన బాధ్యత మనందరిదీ.

ఫంక్షన్స్‌లో చక్కగా మన సంప్రదాయ దుస్థులు ధరించినంత మాత్రాన పరువేమీ పోదు. ఈ మినహాయింపు ఏమీ కాదు. సినిమాల్లో నటించినంతమాత్రాన అహర్నిశలు అందాలు ఆరబోయనక్కర్లేదు. నాదో విన్నపం. సినీ పరిశ్రమలో ఎంతోమంది

పెద్దవారున్నారు. ఆదర్శప్రాయంగా నడుస్తున్నవారు వున్నారు. వారందరూ పూనుకుని ఈ నటీమణుల వస్త్రధారణ విషయంలో కాస్త జాగ్రత్త వహిస్తే బావుంటుంది.

వాళ్ళని మందలించి చూడండి– "తల్లుల్లారా ఇలా పబ్లిక్ ఫంక్షన్స్‌కి వచ్చినప్పుడు ఫేషను ఫేషను అని మరీ గుడ్డపీలికలు చుట్టుకోకుండా కాస్త వినయంగా, మంచి బట్టలు వేసుకోండి. వీలైతే చక్కగా మన సంప్రదాయ దుస్తులు ధరించడండి, కాదంటే అధునాతనమైన దుస్తులే వేసుకోండి. ఏ బట్టలు వేసుకున్నా ఒళ్ళు కనిపించకుండా జాగర్త పడండి" అని చెప్పగలిగితే సమాజానికి మేలు చేసినవారవుతారు.

అదెలా అంటారా? మన సమాజంలో యువతకు సినీ నటీమణులు ఆరాధ్య దైవాలు. వారి పోకడలను అనుసరించే టీనేజర్స్ అసంఖ్యాకంగా ఉన్నారు. ముందు నటీమణులను సరిదిద్దితే సమాజం బాగుపడుతుందని ఆశ.

సినీరంగంలోని పెద్దలు పూనుకుని ఈ పని చేసి వీరు చెప్పింది వారు ఆచరిస్తే సినిమాల్లో కూడా హీరోయిన్ వస్త్రధారణలో మార్పు తేగలిగితేనే అటువంటి పుణ్యకార్యం చేసినందుకు వారికి ఎన్నో యజ్ఞయాగాదులు చేసిన ఫలితం దక్కుతుంది. ❑

# మన చేతుల్లో ఏముంది?

**మా** సీత పిన్ని వచ్చింది మా ఇంటికి. ఆవిడకి డెబ్బైఐదేళ్ళు. పాతకాలం మనిషి కదా. చెప్పలేనంత బంధుప్రేమ. పెద్దదాన్ని నేనేం వెళ్తాను. వాళ్ళు రావచ్చు కదా అని పంతం లేదు. ఈ మాత్రం ఓపికుందిగా, నేనే వెళ్ళి చూసొస్తా. ఖాళీగా వున్నాను కదా అని అందరిళ్ళకీ ఓపిగ్గా వెళ్తుంది. ఆవిడ ప్లానింగ్ కూడా బావుంటుంది.

ఎవరింటికైనా వెళ్ళాల్సి వస్తే ఆ చుట్టుపక్కల మరో నాలుగు విజిట్లు కూడా పూర్తి చేస్తుంది. మనవడు కార్లో ఓ దగ్గర దింపేస్తాడు. ఒరే నాయనా సాయంత్రం నన్ను ఫలానా దగ్గరికొచ్చి తీసికెళ్ళు అని చెప్పేస్తుంది. ఆ యింటినుంచి మరో ఇంటికి ఆటోలో తిరుగుతుంది. ఎక్కడా ఎక్కువసేపు ఉండదు.

అందులో భాగంగానే మా ఇంటికొచ్చింది. "వెళ్లొచ్చేవా అమ్మా అమెరికాకి?" అంది వస్తూనే. "ఆ వెళ్ళొచ్చాను పిన్ని" అన్నాను. మంచినీళ్ళు, కాఫీ ఇచ్చాను. కాసేపు కబుర్లు చెప్పుకున్నాం. "పాపాయి ఎట్లావుందీ?" అని అడిగింది. "బంగారు తల్లిలా వుంది" పిన్నీ అన్నా. "చెప్తే ఏం తెలుస్తుందీ? మనవరాలి ఫొటో చూపించవే!" అంది.

బుర్ర గోక్కున్నా. ఫొటో చూపించడం అంత తేలిక కాదుగా. మా రోజుల్లో అయితే ఫొటోలు అందుబాటులో ఉండేవి. ఎవరొచ్చినా చటుక్కున ఆల్బమ్ తీసి ఫొటోలు చూపించేవాళ్ళం. ఇప్పుడలా కాదుగా. బోలెడంత తతంగం.

నా అయోమయం అవతారం కనిపెట్టి "ఏవిటే ఫొటోలు తియ్యలేదా?" అని అడిగింది.

"అయ్యో! తియ్యకపోవడం ఏమిటీ లేబర్ రూంలోంచి తీసుకొచ్చిన దగ్గర్నించీ టిక్కు టిక్కుమని తీస్తూనే ఉన్నారు. ఒకట్లూ పదులూ కాదు వందల సంఖ్యలో ఉన్నాయి ఫొటోలు. మాకూ కొన్ని పంపించారు. అవన్నీ భద్రంగా కంప్యూటర్‌లో ఉన్నాయి" అన్నా.

"శ్రీరామ చంద్రా! మీ ఇంట్లోనూ ఈ కంప్యూటరు ఫొటోలేనా! మీ ఇల్లని ఏముందిలే. అందరిళ్ళల్లోనూ ఇదే గోల. ఫొటోలన్నీ కంప్యూటర్లలోనే ఉంటున్నాయి. మా ఇంట్లోనూ అదే భాగవతం. తీరిగ్గా ఉన్నప్పుడు ఫొటో చూసుకునే యోగం లేదుకదా. ఇంట్లో ఎవరైనా మనిషుండాలి. మనిషున్నా వాళ్ళకి తీరికుండాలి. ఇవ్వాళ కాదులే రేపు చూపిస్తా అంటారు. ఈలోగా ఉత్సాహం కాస్త ఆవిరైపోతుంది.

"మా రోజుల్లో గుండిగలూ, కళాయిలూ అటక మీంచి దించినంత హైరానా పడాలే తల్లీ! ఇప్పుడు ఫొటోలు చూడాలంటే. ఏదో పెద్దదాన్ని వచ్చాను. మళ్ళీ ఎన్నాళ్టికొస్తాను. ఫొటోలు చూసేపోతా! కంప్యూటర్ తెరిచి ఫొటోలు చూపించవే" అంది.

నాకు జాలేసింది. నా వల్ల అవుతుందా అని అనుమానం వచ్చింది.

"నీకు చాతవునా?" నేను నీళ్ళు నమల్టం గమనించింది కాబోలు అడిగేసింది. నాకు చిన్నతనం అనిపించింది. "ఆ ఫర్వాలేదులే. ఆ మాత్రం కంప్యూటరు జ్ఞానం ఉంది. రా చూపిస్తా". అని తీసికెళ్ళి కంప్యూటర్ దగ్గరకూర్చోబెట్టాను. కంప్యూటర్ ఆన్ చేశాను నాకున్న పరిజ్ఞానంతో ప్రయత్నించాను. ఫొటోలు రాలేదు.

వెంటనే కోడలికి ఫోన్ చేశా. వెంటనే తీసింది. "మీకు నిండా నూరేళ్ళు. నేనే ఫోన్ చేద్దామనుకుంటున్నా. మీరే చేసేశారు. అవియల్ తిరగమోతలో ఆవాలు వెయ్యాలా వద్దా!" అంది అమెరికా నించీ.

"అవియలూ ఆవాలూ సరే గానీ పాపాయి ఫొటోలు కంప్యూటర్లో పెట్టేరుటే?" అని అడిగా. "ఇదిగో ఇప్పుడే పెడతా. అవియల్ తిరగమోత పెట్టేసి ఫొటోలు పికాసాలో పెట్టేస్తా. చెప్పండి అవియల్‌లో ఆవాలు వెయ్యాలా?" అడిగింది.

"ఈ పిల్లలంతే ముందు వాళ్ళ పన్లు చేసుకుని గానీ మనపన్లు చెయ్యరు. వెయ్యకు. జీలకర్రా, ఎండుమిర్చీ, ఇంగువా, కరివేపాకూ అంతే" అన్నా. "సరే! ఇదుగో పది నిముషాల్లో పెట్టేస్తా ఫొటోలు. మీకు ఫోన్ చేస్తా" అని ఫోన్ పెట్టేసింది.

"కోడలికి చెప్పా పిన్నీ పెడతానంది" అన్నా. "అమెరికాలో కోడలు... ఇండియాలో అత్తా ఎంచక్కా వంటల గురించి మాట్లాడుకొంటున్నారే" అని మురిసిపోయింది. పిన్ని.

పావుగంట తర్వాత ఫోన్ చేసింది. "అత్తయ్యగారూ. యూ.ఎస్.బికి ఏదో ప్రాబ్లమ్ వచ్చింది. కెమేరాని రికగ్నైజ్ చెయ్యాలి. చెయ్యటం లేదు. చెయ్యగానే కెమెరాలోంచి

ఫొటోలు ట్రాన్స్‌ఫరై పోతాయి. అప్పుడు పెడతా పికాసాలో" అంది.

"నేను వెయిట్ చేస్తా" అన్నాను. అయిదు నిముషాల్లో మళ్ళీ చేసింది. "పాపాయి ఏడుస్తోంది. దానికి పాలు పట్టి చేస్తా" అంది. "సర్లే ముందు పిల్ల సంగతి చూడు అన్నా".

"వస్తున్నాయిటే ఫొటోలు?" అంది పిన్ని ఆశగా. నాకు జాలేసింది. వెంటనే కలకత్తా ఫోన్ చేశా. వెంటనే పలికింది మా అమ్మాయి. "అమ్మలూ చంటిదాని ఫొటోలు ఉన్నాయంటే నీ కంప్యూటర్లో" అని అడిగా.

"ఏళ్ళు రాగానే సరా? బుద్ధుండాలి" సుపుత్రిక కంఠం వినిపించింది. ఉలిక్కిపడ్డాను. "సారీ అమ్మా. ఎవడో వెధవ. రాంగ్ సైడ్‌నించీ అడ్డం వచ్చేశాడు. చెప్పు ఏవిటన్నావ్?" అంది. అది ఏ ముహూర్తాన పుట్టిందోగానీ ఎప్పుడూ అష్టావధానం చేస్తూనే ఉంటుంది.

"సీత అమ్మమ్మ వచ్చింది. పాపాయ్ ఫొటోలు చూస్తానంది" అని మొరపెట్టుకున్నా.

"ఇదుగో బజారుపని చూసుకుని ఇంటికెళ్తున్నా. చిన్నదాని ఫొటోలు నా దగ్గరున్నాయి. ఇంటికెళ్ళగానే పికాసా నించీ నీకు లింక్ పంపిస్తా. నువ్వు లింక్‌మీద కొడితే ఫొటోలు డౌన్‌లోడ్ అయిపోతాయి. చూసుకోవచ్చు. చాలా సింపుల్. మీ రోజులు కావు. ఇంతింత లావు ఆల్బమ్స్ మోసుకుని తిరగక్కర్లేదు."

"సరేలే... నువ్వెళ్ళి ఆ పని చూడు" అని దాని వాక్ప్రవాహానికి అడ్డు కట్ట వేశాను. అరగంట అయింది. అతీగతీ లేదు. ఇవతల పిన్నికి నెక్స్ట్ విజిట్‌కి టైం అయిపోతోంది. కంగారు పడుతోంది.

నేనే ఫోన్ చేశాను. తీసింది "ఒకసారి చెప్తే అర్థం కాదా! చేతకాక పోతే మానెయ్యాలి. అంతేగానీ అందర్నీ ఇబ్బంది పెడితే ఎట్లా" అని అరిచింది. "ఏవిటే ఆ మాటలూ అన్నా?!"

"అయ్యో అమ్మా నిన్ను కాదు. సర్వర్ డౌన్ అయిపోయింది. ఇప్పుడే ఇంటర్నెట్ వాడికి ఫోన్ చేసి ఛడామడా తిట్టాను. అయిదు నిముషాల్లో ప్రోబ్లమ్ ఏమిటో చూసి సరిచేస్తానన్నాడు. అది సెట్ అవగానే పికాసాలో పెట్టి నీకు లింకు పంపిస్తా."

నాకు విసుగేసింది. "నీ పికాసా పీకి పోగులు పెట్టా! ఏవిటే మీ గోల. పాపం అమ్మమ్మ రాకరాక వచ్చింది. ఫొటోలు చూస్తానంటే చూపించడానికి ఇంత హైరానా అయిపోతుంది. అవతల ఆవిడ వెళ్ళాలి" అన్నాను.

“ఓ పని చెయ్యమ్మా. అమ్మమ్మ ఈ–మెయిల్ అడ్రస్ నోట్ చేసుకో. ఆవిడకే పంపిస్తా పికాసా లింకు!” అంది.

విసుగేసింది. “అమ్మమ్మకి ఈమెయిలూ, అడ్రెసూ ఎందుకుంటాయే?” అన్నా.

“ఓస్ అదెంతసేపు క్షణంలో అమ్మమ్మకి ఈమెయిల్, అకౌంట్ ఓపెన్ చేస్తా. పికాసాలో ఫొటోలు పెట్టి లింకు అమ్మమ్మకి పంపిస్తే అమ్మమ్మ హాయిగా ఫోటోలు చూసుకోవచ్చు” అంది.

‘‘అవును. ఇప్పుడు నేను హాయిగా చూసుకుంటున్నాగా. ఇక ఆవిడ చూసుకుంటుంది” అని ఫోన్ కట్ చేశా. “ఈసారి నేను పట్టుకొచ్చి చూపిస్తాలే పిన్నీ ఫొటోలు” అన్నా మొహమాటపడుతూనే.

“ఫర్వాలేదులేవే అమ్మాయ్. పెద్దవాళ్ళం. ఆరాటపడటం తప్ప మనం ఏం చెయ్యగలం? మన చేతుల్లో ఏముందీ?” అని ఓదార్చింది. ❑

# నేను కూడా కొనుక్కుంటా

ఫ్రెండ్ ఫోన్ చేసింది. మామూలు మాటలు అయ్యాక వరలక్ష్మీవ్రతం వస్తుంది కదా, బంగారం కొంటున్నావా అంది. లేదన్నాను. అవున్లే ధరలు మండిపోతున్నాయి. ఏం కొంటాం? అంది. ఈసారి నేను బంగారం కొనదల్చుకోలేదు... ఉన్న బంగారం అంతా తాకట్టు పెట్టి డబ్బు తీసుకుందామనుకుంటున్నా.

గతంలో అయితే అలా తాకట్టు పెట్టుకోవడం చిన్నతనం. ఇప్పుడు ఇట్టే తాకట్టు పెట్టి అట్టే డబ్బు తీసికెళ్ళండి... అని బోలెడు మంది వూరిస్తున్నారుగా. నేనూ తాకట్టు పెట్టి ఆ డబ్బు వేరేచోట ఇన్వెస్ట్ చేస్తా.

ఓ చిన్న నది కొనుక్కుంటా?

ఏమిటీ నది కొనుక్కుంటావా??? నిన్ను పిచ్చి కుక్క గానీ కరిచిందా? అనుకుంటున్నారా?

ఏం కాదు. నిజంగానే నది కొనుక్కుంటా.

అసలు ఈ మాత్రం తెలివితేటలు ఆనాడే వుండుంటే నేనీపాటికి ఎక్కడో వుండి వుండేదాన్ని. పదిహేనేళ్ళ కిందట నాకు లక్ష రూపాయలు నా వాటా కింద వచ్చాయి. పిచ్చి మొద్దులాగా రెండొందల గజాల స్థలం కొనుక్కుని మిగిలిన డబ్బుతో బంగారం కొనుక్కున్నా.

ఆ స్థలం ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఏడుస్తోంది. బంగారం పిల్లలు తీసుకున్నారు. అలా తగలెట్టుకునే బదులు అప్పుడే ఓ నది కొనుక్కుని వుంటే ఎంత బావుండేది!

ఇన్నేళ్ళల్లో ఇసకా, నీళ్ళూ అమ్మేసుకుని వుండేదాన్ని. ఒడ్డున వున్న స్థలం అంతా అమ్మేసుకుని వుండేదాన్ని. వేలకోట్లు, వందల కోట్లు కాకపోయినా అరవై, డెబ్బై కోట్లు తేలిగ్గా వెనకేసుకుని వుండేదాన్ని.

నా మీదా ఎవరో కేసు పెట్టేవాళ్ళు. నా మీదా ఎంక్వైరీ వేసేవాళ్ళు.

నాలుగు అక్షరాలు పోగేసుకుని కథలు రాసే అక్కు పక్షికి అరవై కోట్లు ఎక్కడినించి వచ్చాయి? అని పేపర్లన్నింటిలో వార్తలు వచ్చేవి. ఛానెల్స్ రెండ్రోజులు పాటు నా మొహాన్నే అన్ని కోణాల్లో చూపించేవి. నాకంత అదృష్టమా? దేనికైనా పెట్టి పుట్టాలి.

పోనీ ఏం చేస్తాం? గతం గతః ఇప్పటికైనా జ్ఞానోదయం అయింది. వెంటనే ఆ దిశగా ప్రయత్నాలు మొదలు పెడితే... గంగా, గోదావరి, కృష్ణా వంటి పెద్ద నదులు కొనేశక్తి నాకు లేదు. చెయ్యేరు, పాపాగ్ని వంటి చిన్ననది కొనుక్కుంటా. పూర్తిగా కాకపోయినా కొంత భాగం కొనుక్కున్నా చాలు.

ఏం గాలి సోదరులు గని కొనుక్కోగా లేనిది నేను నది కొనుక్కుంటే తప్పా? పంచభూతాల్లో నిప్పూ, ఆకాశం, గాలీ ఎలాగూ కొనుక్కోలేం. భూమి ఇప్పటికే చాలామంది కొనేసుకున్నారు. కొండలూ, లోయలూ, గనులూ అలా ఎవరి స్థోమతనిబట్టి వేల ఎకరాలు కొనేసుకున్నారు.

ఇకపోతే మిగిలింది నీరేగా! కొనుక్కుంటా!

చాల్లే నీ మొహం అదేమైనా ఆషాఢం డిస్కౌంట్ సేల్‌లో సూక్ష్మ లోపాలు గల పట్టుచీరె కొనుక్కోవడం అనుకుంటున్నావా? అవన్నీ పెద్దవాళ్ళు చెయ్యాల్సిన పనులు అంటున్నారా. ఏం కాదు. పెద్దవాళ్ళెవరూ ఇలాంటి పనులు చెయ్యరు. చిన్నవాళ్ళే ఇలాంటివన్నీ కొనుక్కుని పెద్దవాళ్ళవుతారు.

సరే కొనుక్కుంటావు? ఎవరు అమ్ముతారు నీకు? ఇక్కడ నదులు అమ్మబడును– అని బోర్డు పెట్టుకుని కూర్చున్నారా అని హేళన చేస్తున్నారు కదూ!

ఇలాంటి వ్యవహారాలకు బోర్డులవీ ఉండవని మనందరికీ తెలుసు. అవసరం మనది కాబట్టి వెతుక్కుంటాం. ఆ మధ్య మా తోటికోడలికి చప్పి వ్యాధి వస్తే మంత్రం వేయించి వాళ్ళెక్కడున్నారా అని నాల్రోజులు గాలించాం. చివరికి ఊరి చివర ఓ సందులో వుండే ఆ మంత్రం వేసే వ్యక్తిని పట్టుకున్నాం. మంత్రం వేయించాం.

ఇప్పుడూ అంతే. వెతుకుతాం. ఆ ఫార్మాలిటీస్ అన్నీ పూర్తిచేసి గుట్టు చప్పుడు కాకుండా కొనేసుకుంటాం.

పట్టుకుంటే జైల్లో పెడతారంటారా! ఓసోస్ అలా భయపెట్టకండి. నేనేం బెదిరిపోను. రైతు కలుపు మొక్కలు పీకేసినట్లూ ప్రారంభ దశలో ఎవర్నైనా పట్టుకున్నట్టు

గానీ, పోనీ ఓ మూరెడెత్తు ఎదిగిన పిచ్చి చెట్టును కత్తితో నరికి అవతల పారేసినట్లుగానే ఎక్కడన్నా దాఖలా వుందా? ఉంటే మచ్చుకి ఒక్క ఉదాహరణ చెప్పండి చూద్దాం!.

మర్రిగింజ మహా వృక్షమై శాఖోపశాఖలుగా విస్తరించి ఊడలు దింపుకున్న తర్వాత అప్పుడు నిద్రలేచి "ఈ అన్యాయాన్ని సహించం. ఈ విషవృక్షాన్ని కూకటి వేళ్ళతో పెకలించి అవతల పారేస్తాం" అని ఓ నైఫ్ పుచ్చుకుని వెళ్తారు ఆ వృక్షం దగ్గరికి. ఇదే కదా మన ఆనవాయితీ.

ఎన్ని స్కాంలు చూడలేదూ! హమ్మో ఇన్ని వేల కోట్లు తినేశారా? అని ఎన్నిసార్లు గుండెలు బాదుకోలేదూ! కంటి తుడుపు ఎంక్వైరీలు, నెలల తరబడీ కోర్టు వ్యవహారాలూ ఎన్ని జరగలేదు!

ఎన్నో వేల పేజీల నివేదిక సమర్పించారనీ, చూసి హమ్మయ్య వాళ్ళ పాపం పండింది అని ఆనందించ లేదూ!

కేసులూ, కమిటీలూ, విచారణలూ, నివేదికలూ వంటి కంటి తుడుపు చర్యలు తప్ప ఎవరికైనా శిక్షపడడం గానీ, జైలుకెళ్ళడం గానీ, అక్రమంగా సంపాదించిన ఆస్తులన్నీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోడంగానీ ఎప్పుడైనా చూశామా?

ఒకవేళ నాలుగు రోజులు జైలుకెళ్ళి వచ్చినవారు మాత్రం నేరస్తులుగా చెలామణి అవుతున్నారా? వారి వైభోగానికి ఏమీ భంగం వాటిల్ల లేదు కదా! కబాడీ ఆటలో ఔట్ అయిన ఆటగాళ్ళు కాసేపు విడిగా కూర్చుని తోటి ఆటగాడి సాయంతో మళ్ళీ ఆటలో చేరి విజృంభించినట్లు నేరాలు చేసి పట్టుబడి జైలుకెళ్ళి వచ్చి మళ్ళీ ఉన్నతపదవులు అలంకరించటం చూడలేదా మనం?

ఇంతకీ నేను చెప్పొచ్చేది ఏమిటీ అంటే ఈ నాటకాలూ వేషాలూ వెర్రి వెధవల్లా చాలాకాలంగా చూస్తూనే వున్నాం. కడుపులో చల్ల కదలకుండా హాయిగా వుందాం. వెధవ పన్లు చేస్తే దేవుడు క్షమిస్తాడా అని దైవభక్తీ, పాపచింతనా వుండబట్టి అనామకుల్లాగా మిగిలిపోతున్నాం.

ఆ చాదస్తాలన్నీ పక్కకి పెట్టి మనమూ బాగుపడి పిల్లలకి కోట్లాదిగా ఆస్తులు, దేవుడికి నగలూ సమర్పించుకునే సమయం ఆసన్నమైంది.

అందుకే నేనిప్పుడు నది కొనుక్కుంటా నంటున్నది. సమఝైనదా?? ❑

# ఇప్పుడు మీ వంతు

సాధారణంగా ఏ తల్లి పిల్ల అయినా ఒక ఆట తప్పకుండా ఆడుకుంటారు. మూడేళ్ల పిల్ల అమ్మా దాగుడు మూతలు ఆడుకుంటారు. అమ్మా ఎక్కడ దాక్కోను? అని పిల్ల అడుగుతుంది. ఆ కుర్చీ కింద దాక్కో అని తల్లిచెప్తుంది. పిల్ల దాక్కుంటుంది. అమ్మా రెడీ అంటుంది... అప్పుడు అమ్మ కాసేపు అటూ ఇటూ వెతికి ఆఖరుకి కుర్చీ కింద చూసి అదుగో దొంగ దొరికింది అని పిల్లని పట్టుకుంటుంది. అప్పుడు పిల్ల కిలకిల నవ్వేస్తుంది. ఆ వెంటనే సందేహంగా అమ్మని చూసి అమ్మా నేను కుర్చీకింద ఉన్నానని నీకు ఎలా తెలిసింది? అని అమాయకంగా అడుగుతుంది. అమ్మ నవ్వు ఆపుకుని ఏదో సమాధానం చెప్పేస్తుంది. చిన్న పిల్ల అలా అమాయకంగా అడిగితే అదీ ముద్దుగా ముచ్చటగా ఉంటుంది.

అదే నలభై ఏళ్లవాళ్లు అడిగారనుకోండి వొళ్లు మండుకొస్తుంది. ఏం చెప్పాలో అర్థం కాదు. అదేవిటి నీ తలకాయ? నేనేగా చెప్పిందీ? అనడిగేయవచ్చు. కానీ అలా అనడానికి మొహమాటం అడ్డొస్తుంది. అందుకే ఒక వెర్రినవ్వు నవ్వేసి ఊరుకుంటాం. అదే చాలా గొప్ప వాళ్ళు అడిగారనుకోండి... బుర్రగోక్కుని దిక్కులు చూసి మరి మీరు చాలా తెలివి గలవారుకదా... కుర్చీ కింద కాక వేరేచోట దాక్కోరుకదా... అందుకే అక్కడే దాక్కుని ఉంటారని ఊహించాం– అని చెప్తాం. వాళ్ళూ కాలరు ఎగరేసుకుంటారు. మనం పళ్ళు కొరుక్కుంటాం. మన మీద మనకే కోపం వస్తుంది. కానీ ఏం చేస్తాం?

మన అందరికీ ఓ మాయరోగం వుంది. మొహమాటం. ఇంగ్లీషులో జంటిల్మన్ సిండ్రోం అంటారు. ఉన్నది ఉన్నట్టు చెప్పలేని అసమర్థత చాతకాని తనం. ఇంటా బయటా దిక్కుమాలిన మొహమాటం. లావు పాటి పిన్నిగారు వచ్చి ఈ మధ్య నేను కాస్త లావెక్కాను కదా? అంటే అబ్బే లేదు అప్పటికంటే సన్నబడ్డారు అంటాం కానీ కాస్త ఏం ఖర్మ బాగానే లావెక్కావు అని చచ్చినా చెప్పం.

వేళగానివేళ ఎవరో వచ్చి కూర్చుని సుత్తివేసి విసిగించినా అంటే ఛా మీ రాక మాకు ఎంతో ఆనందాన్ని కలిగింది... అంటాం గానీ అవును చంపుకు తిన్నావు అని పొరబాటున కూడా చెప్పం. అదుగో ఆ అలవాటే మన కొంప ముంచుతోంది. అగ్రరాజ్యాలలో ఇలా ఉండరుట. చెప్పదలచుకున్న విషయం మొహం మీద చెప్పేస్తారట. చాటున సణిగి చావకుండా ఉన్నది ఉన్నట్టూ.

కుండబద్దలు కొట్టినట్లు నిజం మాట్లాడగల ధైర్యం మనకు ఉంటే ఎంత బాగుండేది. అయినవాళ్ళూ కానీ వాళ్లూ మనకు చెవుల్లో పూలు పెట్టేవాళ్లేనా? వెర్రి వెధవల్లాగ వినబట్టే సినిమా కతలు చెబుతున్నారు? మునుపటికంటే ఇప్పుడు కాస్త నయంగానే ఉంది. చదువుకున్న వాళ్లం నోళ్లు మూసుకు కూర్చుంటున్నాం గానీ పల్లెల్లో ఈ భేషజాలు ఉండటంలేదు.

ఈ మధ్య మన నాయకులు పల్లెలకి వెళ్లి ప్రజలను పలుకరించి తద్వారా వాళ్ల అభిమానం చూరగొందాం అని ప్రయత్నించారు. అదికాస్త బెడిసి కొట్టింది. అక్కడి వాళ్ళు ఎదురు తిరిగి తిట్టిపోయడం మొదలు పెట్టేసరికి వాళ్ల జోలికి పోవడం మానేశారు. పల్లెల్లో పని పాటలు చేసుకునే ఆడవాళ్లకు ధైర్యమూ నోరూకూడా ఎక్కువే. అక్కడ వ్యవహారం బెడిసి కొట్టింది గానీ నగరాల్లో వారి మాట చెల్లుబడి అయిపోతోంది.

మన మహానగరంలో అలా ఇంటింటికి తిరగాలేరు కాబట్టి, మీ సమస్యలు మాకు తెలియజెయ్యండి... మేము పరిష్కరిస్తాం... అంటారు మన నాయకులు, అధికారులు. ఉత్తరాలు రాయమంటారు. ప్రజలకు సవాలక్ష సమస్యలు... వాళ్లు రాస్తారు. పేపర్లో వస్తాయి అవన్నీ,. ఆర్యా మా వీధిలో కుక్కలు వీరవిహారము చేయుచున్నవి... విచక్షణారహితముగా అందరినీ కరుచుచున్నవి. తక్షణమే చర్య తీసుకోగలరు.

అయ్యా మా వీధిలో దీపములు... పగలంతా వెలిగి దీపములు వెలిగించు వేళకి ఆగిపోవుచున్నవి. మా ఏరియా అంతా చీకటి గుయ్యారంగావుంది. తమరు దయచేసి పగలు బదులు రాత్రిపూట లైట్లు వెలిగేలా చెయ్యండి.

ఏలినవారికి... మా కాలనీలో చెత్త నెలకి ఒక్కసారి అయినను తొలగించుట లేదు. రోజూ కాకపోయినా కనీసం వారమునకు ఒక్కసారి అయినా తొలగించగలరు.

అలా ఎవరిగోడు వాళ్ళు వెళ్లబోసుకుంటారు. అందరికీ ఓపికగా సమాధానం చెప్తారు సదరు అధికారులు. ప్రశ్నలు వేరైనా సమాధానం మాత్రం ఒక్కటే.

వెంటనే తగిన చర్య తీసుకుంటాం. మీ సమస్య పరిష్కరిస్తాం. చర్య తీసుకున్నా తీసుకోకపోయినా హామీ మాత్రం ఇస్తారు.

ఇటీవల ఇంకో పద్ధతి వచ్చింది. ఫోన్ నెంబర్లు ఇచ్చి మీకు ఏ కష్టం వచ్చినా మాకు ఫోన్ చెయ్యండి అంటున్నారు. మీరు మీ సమస్య చెప్పండి. చిటికెలో తీరుస్తాం అని పెద్ద పెద్దవారు హామీలు ఇస్తున్నారు.

అందులో భాగంగానే ఇటీవల ఒక పేపరులో ఒక విషయం చదివాను. నా బుర్ర గిర్రున తిరిగింది.

హైదరాబాద్ నగరంలో ఎక్కడైనా రోడ్ల మీద గుంటలు కనిపిస్తే మాకు ఫోన్ చేస్తే పూడ్చిస్తాం– అని హామీ ఇచ్చారు ఏలినవారు.

చెప్పొద్దూ నాకు చాలా కోపం వచ్చింది. యమలీల సినిమాలో కోట శ్రీనివాసరావు లాగా అసలు మన గురించి వీళ్ళు ఏమనుకుంటున్నారు? అని ఏడవాలని అనిపిస్తోంది. నగరంలో ఏ రోడ్డుమీద గోతులున్నాయో ఫోన్‌చేసి చెప్పాలా? ఏం వాళ్ళు హెలికాప్టర్ మీద తిరుగుతున్నారా? లేకపోతే కళ్లకి గంతలు కట్టుకున్నారా??

అలా సర్దుకున్నాం అనుకున్నా మన నగరంలోని రోడ్ల మీద గోతులు చంద్రమండలం మీదనుంచి చూసినా కనిపిస్తాయి.

కళ్లకి గంతలు కట్టుకున్న వాహనం ఎగిరెగిరి పడి నడుములు విరిగి పోతున్నప్పుడైనా తెలియదా మన రోడ్ల చక్కదనం??

ఇంతోటి భాగ్యానికి ఫోన్లు ఫిర్యాదులు కూడానా?

ఏవిటి మరీ అంత లోకువ అయిపోయామా మనం? హుస్సేన్ సాగర్ ప్రక్షాళన కావించి పూర్వవైభవం తిరిగి తీసుకొస్తాం అంటే పాపం అదేదో దేశం వాళ్ళు డబ్బులుకూడా ఇచ్చారు. "చేతుల్లో డబ్బులుకూడా ఉన్నాయి. ఇక పనులు మొదలు పెడతారు త్వరలోనే. హుస్సేన్‌సాగర్ పక్కన ముక్కు మూసుకోకుండా నిలబడగలం" అని ఆనందించాం ఏదీ???

మూసీనదిని బాగుచేస్తాం అన్నారు. మురిసిపోయాం. ఆ మురిపెం ముక్క చెక్కలైపోయింది. ఇప్పుడు రోడ్లు బాగు చేస్తారా? అందుకే మళ్ళీ మనం ఫోన్లు చేసి చెప్పాలా? మహా ప్రభో ఇక మా వల్లకాదు. సహనానికి కూడా ఒక హద్దు వుంటుంది.

మేం ఫోన్ చెయ్యటం ఎందుకు? ఈసారి మీరే మాకు ఫోన్ చెయ్యండి. ఏ నంబర్‌కి చెయ్యం అంటారా? మీ ఇష్టం... ఏ నంబరుకి చేసినా పలుకుతాం.

నగరం మొత్తం మీద ఒక్క అర కిలోమీటరు పొడవునా గుంటలు... గతుకులు లేని రోడ్డు ఎక్కడవుందో వెతికి మాకు చెప్పండి ఫోన్లుచేసి పనిలో పని పేపర్లలో వేయిస్తే మేం వెళ్లి చూసి ఆనందిస్తాం...

గతుకులు లేని రోడ్డు చూసి దశాబ్దం దాటిపోయింది. పిల్లలకి కూడా చూపిస్తాం. పిచ్చి సన్నాసులు చూసి ఆనందిస్తారు.

కొన్ని వందల సార్లు మీకు ఫోన్లు చేసాం. ఇక మీవంతు వేయి కళ్లతో ఎదురుచూస్తూ వుంటాం. త్వరగా ఫోన్ చేస్తారు కదూ? ❑

# చింతపండుతో పండుగ

**ఈ** ప్రపంచీకరణ ప్రభావం కాదుగాని చచ్చిపోతున్నాం. ఎక్కడ ఏ మూల కొత్త పద్ధతి వచ్చినా మూడో నాటికి మనకు దిగబడుతోంది. ఆ క్రమంలోనే ఇటీవల ఓ కొత్త పండుగ వచ్చి పడింది. టమోటా ఫెస్టివల్. విదేశాల్లో ఎప్పటి నించో ఉందిట. మనకు ఇప్పుడు దిగుమతి అయింది.

అసలే మనకి బోలెడన్ని పండుగలు.

ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనన్ని పండుగలూ పర్వదినాలూ మనకు ఉన్నాయి. సంక్రాంతి, దీపావళి, ఉగాది... వంటి పాత పండుగలు మొదలుకొని రాఖీ, హెూలీ వంటి కొత్త పండుగలు. ఇక 'డే'లకి కొదువ లేదు. వేలంటైన్స్ డే, ఫ్రెండ్‌షిప్ డే, మదర్స్‌డే, ఫాదర్స్ డే... ఇలా చెప్పుకుంటూ పోతే చెప్పలేనన్ని. వెరసి నిత్య కల్యాణం పచ్చతోరణం, పుష్పక విమానంలో ఎందరు ఎక్కినా మరొక్కరికి చోటు ఉంటుందిట. అలాగే మనకూ ఎన్ని పండుగలు ఉన్నా కొత్త వాటికి చోటు ఉంటూనే ఉంటుంది.

అందుకు నిదర్శనమే ఈ కొత్త టమోటా పండుగ. టమోటా పళ్లతో ఒకరినొకరు కొట్టుకుని పండుగ చేసుకుంటారుట... అది కూడా ఎవరి ఇంట్లో వాళ్లు పండుగ పేరున ఇంట్లో ఉన్న టమోటా పళ్లతో కొట్టుకోవటం కాదుట... బోలెడు మంది పార్కులోనో మైదానంలోనో చేరి గుంపుగా పళ్లు ఒకరి మీద మరొకరు విసురుకుని సామూహికంగా పండుగ చేసుకోవాలి. ఆ ఏర్పాట్లు అన్నీ ఆ పండుగ చేసే నిర్వాహకులే చూసుకుంటారు. పాల్గొనేవారు. దానికి భారీగా డబ్బు చెల్లించి టిక్కెట్టు కొనుక్కోవాలి.

నాకు మనసు చివుక్కుమంది. తినే పదార్థం అలా పాడు చేసినందుకు బాధ కలిగిందని అనుకుంటున్నారేమో.. అలాటిదేమీ లేదు. పేరుకి మనది పేద దేశం అయినా ఆహార పదార్థాలు వ్యర్థం చేసుకోవడంలో మనం అగ్రస్థానంలోనే ఉన్నాం. దేశంలో లక్షల మంది పేదలు అన్నమో రామచంద్రా అని అలమటిస్తుంటే గోడౌన్లలో

బస్తాల కొద్దీ బియ్యం పురుగులు పట్టి పాడై పోవటం నా చిన్నప్పటి నుండీ చూస్తూనే ఉన్నాను. కాబట్టి అదీ కాదు నా బాధ. ఇవ్వాళ సంబరంగా టమోటాల పండుగ చేసుకోగానే సరిపోదు. రేపు సవాలక్ష సమస్యలు వచ్చి పడతాయి.

ఉన్నట్లుండి ఎవరికో బుర్రలో పురుగు తొలుస్తుంది. నిరసన తెలియజేస్తారు. అది కాస్తా చినికి చినికి గాలివానగా మారుతుంది. ఊరేగింపులు దిష్టిబొమ్మలు తగలేయటాలు... ఇహ ఒకటి కాదు. సమస్య జటిలం అయిపోతుంది. గతంలో ఇలా చాలాసార్లు జరిగింది కదా. కాబట్టి ప్రారంభ దశలోనే జాగ్రత్తపడటం మంచిది.

ఇంతకీ ఈ టమోటాల పండుగ విషయంలో నా బాధ ఏమిటీ అంటే టమోటా మన పంట కాదు. విదేశాల నుంచి దిగుమతి అయింది. ఇప్పుడు టమోటా అంటున్నాం గానీ మా చిన్నతనంలో రామములక్కాయ అనేవారు. ఇప్పటికీ దేవుడి నైవేద్యంలో గానీ పితృకార్యాలలో గానీ టమోటా వాడకం నిషిద్ధం. కాబట్టి మనం టమోటని మన సొంతం అనుకోలేనట్టే లెక్క. మరి శుభమా అని పండుగ చేసుకుంటూ పరాయిపంటతో కొట్టుకోవడం ఎందుకు? ఇవ్వాళ కాకపోతే రేపైనా ఈ అంశం ఎవరో లేవనెత్తక మానరు. ఇప్పుడే ఈ విషయంలో ఓ నిర్ణయం తీసుకుంటే బావుంటుంది. ఆ కొట్టుకునేది ఏదో మన పంటతోనే కొట్టుకుని పండుగ చేసుకుంటే పద్ధతిగా ఉంటుంది.

వినోదంతోపాటు జాతీయత కూడా ఉంటుంది. మనకు పరమ పవిత్రమైనది కొబ్బరికాయ. ఆ తరువాత శుభప్రదమైనది గుమ్మడికాయ. వీటితో పండుగ చేసుకుంటే అదేదో ఊళ్లో కర్రల పండుగ లాగా తలకాయలు పగిలిపోతాయి.

పండుగ పండుగలాగా వినోదంగా ఉండాలిగానీ హింసాత్మకంగా ఉండకూడదు కదా మరి. ఇకపోతే వంకాయా బెండకాయ బీరకాయా వగైరాలు పొట్లకాయా దొండకాయా సొరకాయా కాకరకాయా వగైరాలు కావలసినవన్ని ఉన్నాయిగానీ వాటితో కొట్టుకుంటే వొళ్లంతా ఖరాబు కాదు మరి. ఈ పండుగలో ఆపాదమస్తకం తడిసి ముద్ద అవాలి కదా. కాబట్టి అవీ పనికిరావు. రసభరితమైన దేశీయ ఫలం కావాలి. పండ్లలో రారాజు వంటి నూజివీడు రసాలు ఉన్నాయి గానీ భరించడం కష్టం. ధర ఎక్కువ.

ఇప్పుడు టమోటా పళ్లతో కొట్టుకోడానికే మూడువేలో ఎంతోట టికెట్టు. మరి మామిడి పళ్లతో పండుగ అంటే హీనపక్షం ఏ పదివేలో పెట్టాలి టికెట్టు ధర. ఈ పిల్లలంతా మామిడి పళ్ల ఫెస్టివల్‌కి టికెట్టు కొంటావా చస్తావా అని మనల్ని

పీక్కుతింటారు. అసలే అంతంత మాత్రం ఆర్థిక స్తోమత మనది. తాహతు చూసుకుని అడుగెయ్యాలి. మామిడి పళ్లతో పండుగ మనవల్ల కాదు.

మరి ఇక ఏం మిగిలాయి పండుగ చేసుకోడానికి?

పుచ్చకాయా కరిబూజా కూడా ఖరీదైనవే. అవీ విదేశీ పంటలే కాబట్టి లాభం లేదు.

మరెలా? ఓ ఐడియా వచ్చింది. పండుగానీ పండు చింతపండు. నవరసాలలో ప్రముఖ స్థానం వహించింది. మన సొంతం. ఆ విషయంలో ఎవరూ నోరెత్తడానికి అవకాశం లేదు. అయితే చింతపండుతో ఆ పళంగా పండుగ చేసుకోవడం కాస్త కష్టం.

కాబట్టి ముందుగా నీళ్లల్లో నానబెట్టి సలక్షణంగా పండుగ చేసుకోవచ్చు.

సరదాగానూ ఉంటుంది. భవిష్యత్తులో ఎవరూ వేలెత్తి చూపించే అవకాశంగానీ ఉద్యమాలూ నిరసనలూ చేసే ప్రమాదంగానీ ఉండవు.

కాబట్టి ఇక నుండీ టమోటాలతో కాకుండా చింతపండుతో కొట్టుకుని పండుగ చేసుకుందాం. ❑

# ఇది చండికల (చండీరావుల) దేశం

**మ**న పురాణాల్లో ఓ పాత్ర వుంది. స్త్రీ పాత్ర చండిక. వద్దన్న పని చెయ్యటంలో సిద్ధహస్తురాలట. ఆ పాత్ర చాలా ఫేమస్. ఆవిడ అదృష్టం బావుండి పురాణకాలంలో పుట్టి అలా ఫేమస్ అయిపోయింది. అదే ఈ రోజుల్లో పుట్టి వుంటే గుంపులో గోవింద అయిపోయి వుండేది... ఎందుకంటే తెల్లారి ఇంట్లోంచి బయట అడుగుపెడితే చాలు అడుగడుగునా చండికలూ చండీ రావులూ కనిపిస్తారు. ఈ చండీ రావు పాత్ర ఏ పురాణంలో వుంది అనుకుంటున్నారా?

ఎక్కడా లేదు, చండికకి పుంలింగం చండీరావు అని నేనే కనిపెట్టా, ఎవరూ కనిపెట్టకపోతే కొత్త మాటలెలా పుడతాయని మాయాబజారు సినిమాలో చెప్పలేదూ! వద్దన్న పని చెయ్యటమే వీరికి అలవాటు. అలా చెయ్యకపోతే తోచి చావదు వీళ్లకి. ఈ జాతివారు చండికకి వారసులు. ఇంట్లోనించీ బయటికి వెళ్ళి ఇంటికి తిరిగొచ్చేలోగా హీనపక్షం అరడజను మందైనా కనిపిస్తారు చండికావారసులు.

అర్ధరాత్రి మొదలెట్టి జబ్బలు పులిసిపోయేలా రోడ్డు శుభ్రంగా చిమ్మి తెల్లారేసరికి అద్దంలా చేస్తారు పనివాళ్లు. వాళ్లటువెళ్లగానే అమ్మ తల్లులంతా తమ తమ ఇళ్లల్లోని చెత్తంతా భద్రంగా పట్టుకెళ్ళి వీధిలో గుమ్మరిస్తారు. మరీ గొప్ప చండికలు ఓపిగ్గా వెళ్ళి ఇచ్చట చెత్త పారవేయరాదు అని రాసి ఉన్న చోటు వెతుక్కుని పారేస్తారు.

మూసీనదిలో చెత్త వేస్తున్నారని వంతెనలకి రెండుపక్కలా అంత ఎత్తున ఫెన్సింగ్ పెడితే మన చండి మొద్దులు ఆ ఫెన్సింగ్‌మీదికి కోతుల్లాపాకి చెత్త విసిరేస్తారు.

ఇక ట్రాఫిక్ విషయంలో లక్షల సంఖ్యలో వుంటారు చండిక వారసులు. రోడ్డుమీద ట్రాఫిక్ సాఫీగా సాగాలని డివైడర్ ఏర్పాటుచేస్తారు. డివైడరు ఉందంటేనే అది దాటి రాకూడదని అర్థం... అయినా కాస్త సందు చూసుకుని బైక్ యు టర్న్ కొట్టి అడ్డం వచ్చేస్తారు. అదేవిటంటే బోలెడంత పౌరుషం పొడుచుకొచ్చేస్తుంది. ఎద్దంత గొంతు వేసుకుని దెబ్బలాడతారు. ఇక్కడ మనకో సంప్రదాయం ఉంది. కారు బైక్‌కి తగిల్తే

తప్పు బైక్ వాడిదే అయినా కారు నడిపేవాడి మీద దండెత్తుతారు జనాలు. అదో యాడెడ్ అడ్వాన్టేజ్ రాంగ్ రూట్లో వచ్చే వాళ్లకి.

జంక్షన్ దగ్గర ఫ్రీ లెఫ్ట్ టర్న్ తీసుకునే సదుపాయం వుంటుంది. ఏం లాభం?? తిన్నగా వెళ్ళాల్సిన చండిక వారసులు అక్కడ తమ వాహనం ఆపేసి సైంధవుడిలా అడ్డుపడిపోతారు. ఎంత హారను కొట్టినా పుట్టెడు చెవుడు వున్నవాళ్ళలా కూచుంటారు. రోడ్డుమీద ట్రాఫిక్ ఆగిపోయి వుంటుంది.

పోలీసులు క్లియర్ చెయ్యడానికి తంటాలు పడుతూవుంటారు. అటువంటి సమయంలో చండీ వారసుడు ఒకడొచ్చేస్తాడు. ఆగినవాళ్లందరూ వెర్రి వెధవలు... నేనొక్కడినే మహామేధావిని అనుకుంటూ ఆగిన వాళ్ళనందరినీ దాటుకుంటూ దూసుకుపోయి ఎదురుగావస్తున్న ట్రాఫిక్కి అడ్డం పడిపోయి అసలే అస్తవ్యస్తంగా వున్న పరిస్థితిని మరింత దారుణంగా తయారుచేసి తమాషా చూస్తూ కూర్చుంటాడు. అయ్యో ఇలాంటి వెధవ పని చేసి ఇతరులకు ఇబ్బంది కలిగించానే అని సిగ్గు కూడా వుండదు. దున్నపోతు మీద రాళ్ల వర్షం కురిసినట్టు సెల్ ఫోన్లో మాట్లాడుతూ ఉంటాడు. ఇలాంటి శాల్తీలు మనకు అడుగడుగునా ఎదురవుతూనే వుంటారు.

అందరూ క్యూలో నిలబడితే వాళ్లని తోసుకుంటూ ముందుకి పోతారు. 'నిశ్శబ్దం పాటించుము' అన్నచోట ఎద్దంత గొంతు చేసుకుని అరుస్తారు.

కాస్త మార్పుగా ఉంటుందని ఏ విహారయాత్రకో వెళ్తాం. అక్కడా అదే గోల. ఆ గైడ్ చెప్పేది విననివ్వరు. సెల్ఫోన్లో ఎక్కడో వున్న వాళ్లతో ఒహటే కబుర్లు. సినిమా హాల్లో కూడా అంతే. తెరమీద వాళ్ళ డైలాగులు వినిపించవు. పక్కనున్న వాళ్ళ డైలాగులే గతి మనకు. వాళ్ళ జీవితంలో జరిగిన సంఘటనలు ఆటుపోట్లు అన్నీ ఏకరువుపెడతారు. డబ్బులిచ్చి టికెట్టు కొనుక్కుని సినిమా కొచ్చిన మనం ఈ సొదవినలేక చావాలి.

ఇక రైలు ప్రయాణం పేరెత్తితేనే దడ పుడుతుంది. ప్రత్యక్ష నరకం. అదివరకు రోజుల్లో రైలు ప్రయాణం అంటే సరదా వేసేది. మరి ఇప్పుడో రైలెక్కాలంటేనే కంపరం పుడుతుంది. హీనపక్షం పాతికమంది తమ తమ సెల్ ఫోన్లల్లో "ఆ ఇప్పుడే రైలెక్కా, ఇప్పుడే, కూచుంటున్నా, ఆటో దొరక్క టెన్షన్ వచ్చేసింది" అంటూ ప్రత్యక్ష ప్రసారం చేస్తూ వుంటారు. తిరునాళ్లలో వున్నట్టు వుంటుంది. జీవితం మీద విరక్తి పుట్టి రైల్లోంచి దూకెయ్యాలనిపిస్తుంది.

రైల్లో సెల్‌ఫోన్లో మాట్లాడడానికి వీల్లేదు– అని రూలుపెట్టండి అని రైల్వేవారికి విన్నవించుకోవచ్చు. కానీ అలాంటి రూలొస్తే ఇప్పుడు ఎనభై శాతం సెల్లులో సొల్లువాగుడంతా వాగే మన చండిక వారసులు నూటికి నూరుమంది కచ్చితంగా ఫోన్లో మాట్లాడేస్తారేమో అని అదో భయం.

అడుగడుగునా చండికలూ చండీరావులూ వున్నారని ముందే మనవి చేసానుకదా!

ఇటీవల నేను చూసిన ఉత్తమోత్తమ చండీరావు గురించి చెప్పి ముగిస్తాను.

ఈ మధ్య మహానంది వెళ్లాం. అక్కడి కొలను గురించి తెలుసుగా మీకు. నీటి అడుగున చిన్న నాణెంవేస్తే కనిపిస్తుంది. అంత స్వచ్ఛంగా ఉంటాయి నీళ్లు. అక్కడ బట్టలుతకడం వంటి పనులు నిషిద్ధం. వాటికోసం బయట వేరే కొలనువుంది.

తెల్లారగానే వెళ్ళాం. మేము వెళ్లినప్పుడు ఎవరూలేరు. మేము స్నానం ముగించేసరికి జనం రాక మొదలయింది. ఒకాయన నీళ్లలోకి దిగాడు. ఆయన పేరేమిటో మనకు తెలియదుగా. అందుకే ఈయన్ని మొద్దు అని అనుకుందాం. అనౌన్సుమెంట్ చేసే మనిషి అపుడే వచ్చాడు కాబోలు గరగరమని గొంతు సవరించుకుంది స్పీకరు. “యాత్రికులకు విజ్ఞప్తి– కొలనులో స్నానం చేసేవారు నూనె, సబ్బు, షాంపూ వగైరాలు వాడరాదు” అని చెప్పడం మొదలెట్టాడు.

అప్పటిదాకా తిన్నగానే వున్న మన మొద్దు మునక వేస్తున్నప్పుడల్లా ఆగిపోయి గట్టున వున్న భార్యతో ‘సుబ్బా ఆ సబ్బిటు ఇవ్వు’ అన్నాడు.

కథ కంచికి మనం చండిక వారసులున్న సమాజంలోకి. ❑

# సమాచారం దొర్లిపోతోంది

**అ**న్నింటికంటే వేగవంతమయినది ఏది అంటే మనసు అంటారు. అలాగే మరో వేగవంతమయినది పుకారు. వాయువేగంతో పయనిస్తుంది. వీడికి ఏదైనా ఓ మాట చెప్తే ఇద్దరికే చెప్తాడు– అడిగినవాడికీ అడగని వాడికీ అని కొంతమంది గురించి జోకులు వేసుకుంటూ వుంటాం. నా చిన్నప్పుడు మా తాతయ్య ఏదైనా విషయం అతి త్వరగా అందరికీ చేరాలంటే మా చిట్టిగాడికి చెప్తేచాలు. కాకపోతే ఇది చాలా రహస్యం సుమీ ఎవరికీ చెప్పకు అని తప్పకుండా చెప్పాలి అనేవారు. కబుర్లూ వార్తలూ అంటే ఇష్టపడని వాళ్ళుండరు ఈ భూమ్మీద. గతంలో అమ్మలక్కలు ఇళ్ళదగ్గరా, మగవాళ్ళు రచ్చబండ దగ్గరా కూర్చుని బోలెడు చెప్పుకునేవారు. ఆ తరువాత రేడియో తరువాత టివివచ్చాయి జన జీవనంలోకి.

అబ్బ వాడు చెప్తే విషయం కళ్ళకి కట్టినట్లూ ఉంటుంది అనుకునేవారికి నిజంగానే కళ్ళ ఎదుట కావలసినంత సమాచారం.

అంతవరకూ ఓకే. ఒక్కోసారి ఒక మాట చెప్తే సుఖంగానీ, ఒకేసారి పది విషయాలు చెప్తే ఎలా?

మామూలు వాళ్ళని ఒకేసారి ఐదు అంశాలు చూసి గుర్తుపెట్టుకోమంటే పిచ్చెక్కి చచ్చిపోరూ?

ఇప్పుడు మనందరి పనీ అలాగే ఉంది. ఏం చూస్తున్నామో అర్థం కావటంలేదు. ఏం వింటున్నామో అంతు పట్టటంలేదు. అయోమయం జగన్నాథం. తల్లోంచీ పొగలు వచ్చేస్తున్నాయి. కళ్ళెదురుగా మూడు రైళ్ళు ఒకేసారి వెళ్తున్న ఫీలింగ్... అర్థం అయిందా నేను దేని గురించి చెప్తున్నానో.

మన టివిలో ప్రసారాల గురించే!!

అక్షర రూపంలో పైన ఒక హెడ్డింగ్ వుంటుంది... కింద మూడు లైన్లు పాముల్లాగా జరా జరా పాక్కుంటూ పోతూ ఉంటాయి. మధ్యలో అసలు విషయం దృశ్య రూపంలో

వుంటుంది. యాంకర్లు వాళ్లు చెప్పాల్సింది చెప్తూ ఉంటారు. వాళ్ళు చెప్పేది వింటూ కింద మూడు లైన్లలోని మాటరూ చదవాలంటే సామాన్యులం మనవల్ల అయ్యే పనేనా?? అవధానాలు చేసేవారు మాత్రమే చెయ్యగలరు ఆ పని.

మూడూ మూడు రకాల సమాచారం అందిస్తూ వుంటాయి. ఒకటి బ్రేకింగ్ న్యూస్, దాని కింద తాజా సమాచారం, మూడో వరసలో ఆసమ్మ పోసమ్మ కబుర్లూ– అందులో ప్రకటనలు కూడా వస్తూ వుంటాయి. లావు తగ్గించబడును, ఎత్తు పెంచబడును వంటి సమాచారం. ఏ షాపుల వాళ్లు ఏమేం ఆఫర్లు ఇస్తున్నారు వగైరాలు వుంటాయి. ఇంకా జ్యోతిష్యం, వాస్తు, వగైరా విషయాలు కూడా వుంటాయి. పై రెండు లైన్లతో పోలిస్తే ఈ మూడో లైనుకి ప్రాముఖ్యం తక్కువే.

పైన వున్న రెండు లైన్లూమాత్రం నిరంతరం తాజా వార్తలను పోగేసి చెప్తూనే వుంటాయి. అయితే రైలుపట్టాల్లా ఎక్కడా కలవవు. దేని దాని దానిదే. ఏ మాత్రం పొంతన వుండదు. పైన లైన్లో రహదారి ప్రమాదాలను అడ్డుకునేలా గట్టి చర్యలు తీసుకుంటోంది ప్రభుత్వం. అందుకే ఇటీవల ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గింది... అని పోతూ వుంటుంది. కింద లైన్లో ముత్యాలంపాడు దగ్గర లారీ ట్రాక్టర్ ఢీ–ముప్ఫై మంది దుర్మరణం, సత్యాపురం దగ్గర లారీ బస్సు ఢీ– పదిమందిపోయారు, పాతిక మందికి గాయాలు– అని వుంటుంది.

ఇవ్వాళ్ల పొద్దున్న జరిగిన మహాసభలో జనం తండోపతండాలుగా వచ్చారు. నాయకుడికి జేజేలు పలికారు– అని పై లైన్లూ దొర్లుకుంటూ పోతూ వుంటే కింద లైనులో మహాసభ జనం లేక వెలవెలబోయింది... నాయకుడికి భంగపాటు... అని దొర్లుకుంటూ పోతూ వుంటుంది.

పరామర్శకి వెళ్లిన నాయకుడికి ఆడపడుచులు హారతులిచ్చారు– అని పైన వుంటుంది. కిందేమో పరామర్శ రసాభాస, కుర్చీలు విసిరారు– అని వుంటుంది.

అదంతా చూస్తూ వుంటే పాత సినిమాలో రేలంగి గిరిజా పాడిన కాశీకి పోయాను రామాహరీ పాట గుర్తుకొస్తుంది.

కొన్నిసార్లు ఆ మూడు వరసలకీ ఏ మాత్రం పొంతన వుండదు.

12 దేశాల నుండి వచ్చిన క్రీడా కారులు,

చేపలదొంగలను చితకబాదిన గ్రామస్థులు, విద్యుదుత్పత్తికి అంతరాయం అని కాసేపు,

తిరుమలలో తగ్గిన రద్దీ, మన్యంలో పెరిగిన చలి, అలరించిన ఫ్యాషన్ షో అని కాసేపు అలా పోతూ వుంటాయి. చూసేవాళ్లకి కళ్లు తిరుగుతాయి.

నాకు ఓ విషయం అర్థం కావటంలేదు. ఎందుకింత హైరానా? ఇల్లు ఇరుగ్గా వుంటే ఒకేగదిలో పదిమంది ఇరుక్కుని కూర్చుంటే పోనీలే పాపం అనుకోవచ్చు. పెద్ద మండువా లోగిలి వుండగా ఓగదిలో ఇరుక్కు కూర్చుంటాం అనడం అతి తెలివా? లేకపోతే అదో ఫ్యాషనా? రోజు మొత్తంమీద 24 గంటలు వున్నాయిగా. కొత్త వార్తలు దొరక్క చెప్పిందే చెప్పి కింద ఈ పీలికల్లో వార్తలు పరుగులు పెట్టించి జనాలకి పిచ్చెక్కించటం ఎందుకు?

నిదానంగా చెప్పేది చెప్పచ్చుగా? పరిగెత్తి పాలు తాగటం కంటే నిలబడి నీళ్లు తాగటం మంచిది కదా?

చూసేవాళ్ళకే కాదు ప్రసారం చేసేవాళ్ళకీ శ్రమే. అన్ని వార్తలని అలా దొర్లించాలంటే ఆ మాటలామరీ? ఎంత టెక్నాలజీ ఉపయోగించాలి? వాళ్ళు శ్రమపడి ఎదుటివాళ్ళని కష్టపెట్టే బదులు చక్కగా కుదురుగా ఉండేలా సమాచారం చూపిస్తే ఉభయతారకంగా వుంటుంది. కింద మూడు అడ్డ వరసల వార్తలతోనే విసిగిపోతూ వుంటే ఈ మధ్య కొన్ని చానల్స్ వారు నిలువునా కూడా కొంత సమాచారం అందిస్తున్నారు.

ప్రస్తుతం ఓ పక్క మాత్రమే వేస్తున్నారు. తెలివి మీరిపోయి అందరూ ఆ మార్గాన్నే అనుసరిస్తూ రెండోపక్క కూడా కాస్త సమాచారం వేస్తే మన పని గోవిందా.

కింద మూడు వరసలు, రెండు పక్కలా నిలువు పట్టీలూ–శివాలయంలో నందీశ్వరుడి కొమ్ములమధ్య నుండి శివుడిని చూస్తాం కదా... అలా చూడాలి అసలు వార్తలు. ఆ వైభోగం త్వరలోనే వస్తుందని నా గుండె పీచుపీచుమంటోంది. ❑

# బొత్తిగా దైవాధీనం బతుకులు

**మ**నం అందరం పొద్దున్నే నిద్ర కాఫీతాగి పేపరు తిరగేస్తూ టివి చూసేస్తూ తిని తిరిగేస్తూ ప్రశాంతంగా రోజులు దొర్లించేస్తూ ఉంటామా – హఠాత్తుగా చెరువులో రాయి విసిరి అలజడి రేపినట్టూ ఏదో వార్త పిడుగులా వచ్చి పడిపోతుంది. మన మనసులని కలవర పరుస్తుంది. దుమారంలా చుట్టుముట్టేస్తుంది. ఊపిరి తిప్పుకోకుండా చేస్తుంది.

ఎక్కడో హాస్పిటల్లో ఘోరమైన అగ్నిప్రమాదం జరుగుతుంది. అన్ని చానల్సూ మూగిపోయి చూడతగినవీ చూడకూడనివీ ఐన దృశ్యాలను కూడా పదే పదే చూపిస్తారు. కుమిలిపోతాం చూడలేక... భయంతో తల్లడిల్లిపోతాం.

మరునాడు న్యూస్‌పేపర్లు అన్నింటినిండా ఆ వార్తలే ఇంకాస్త వివరంగా మరింత విపులంగా. దామిని సింగ్ పాపం చిన్న అనారోగ్యం వస్తే హాస్పిటల్‌కి వెళ్ళింది. వెళ్ళేటప్పుడు ఆ పిచ్చి తల్లికి తెలియదు ఆస్పత్రికి కాదు యమలోకానికి వెళ్తున్నానని అని ఒకరి గురించి రాస్తారు.

వినయ్‌కుమార్ ఏడాదికి ఒకసారి చేయించుకునే మెడికల్ చెకప్ కోసం వెళ్ళి నిష్కారణంగా మంటల్లో బూడిదైపోతే ఇక ఆ సంసారానికి దిక్కెవరు? అంటూ ఇంకొకరి కథనం.. పోయినవారి ఫైల్ ఫొటోలు, ఏడుస్తున్న ఆప్తుల ఫోటోలు సేకరించి వేస్తారు.

వరదలొచ్చినా, రోడ్డు ప్రమాదాల్లో ప్రముఖుల పిల్లలు ప్రాణాలు కోల్పోయినా, భూకంపాలొచ్చినా ఈ తతంగం అంతా డిటో డిటో...

సరే! పగవాడు పోయినా పాపం అనాలి. అదీ మానవత్వం. అవన్నీ చూసి చదివి అందరం అయ్యో అనుకుంటాం. అంతటితో ఆగదు ఆ వ్యవహారం. అసలైన తతంగం అప్పుడు మొదలవుతుంది. మనం మామూలు వాళ్ళం కాబట్టి బాధపడి ఊరుకుంటాం గానీ పెద్దవాళ్ళు ఊరుకోరు.

చాలా తీవ్రస్థాయిలో స్పందిస్తారు. అట్లా ఇట్లా కాదు అందరికీ పూనకాలు వచ్చేస్తాయి. వీరభద్ర గణాల్లా ఊగిపోతారు. వాళ్ళు వీళ్ళు కాదు... ఇంట్లో జక్కుల కామేశ్వరి పెట్టుకుంటే  ఇంటి యజమానురాలికేకాక బూరెలు వేయించే వంటావిడ పున్నమ్మగారికి కూడా పూనకం వచ్చినట్టు ప్రతిపక్ష నాయకుడి మొదలుకుని ఆరుసార్లు పోటీ చేసి ఆరుసార్లూ ఓడిపోయిన వార్డు కౌన్సిలరు కాండిడేటువరకూ అందరూ రెచ్చిపోతారు.

అప్పటిదాకా కుంభకర్ణుల్లా నిద్రపోయినవారంతా నిద్ర లేచి జూలు దులుపుకున్న సింహాల్లా గర్జిస్తారు. అప్పటిదాకా వెర్రి బాగులవాడిలా వున్న కాళిదాసు అమ్మవారి అనుగ్రహం పొందగానే అపారమైన పాండిత్యంతో విజృంభించినట్టు ఒక్కసారి ఎన్నో విషయాలు గుర్తుకొచ్చేస్తాయి. రూల్సు రెగ్యులేషన్స్ అన్నీ గుర్తుకొస్తాయి. అవన్నీ ఎందుకు పాటించలేదో చెప్పమని ప్రభుత్వంవారిని నిలదీస్తారు.

వాళ్లు వెంటనే స్పందించి అసలు అలా ఎందుకు జరిగిందో కనుక్కోమని ఓ బృందాన్ని నియమిస్తారు. వాళ్ళు వెళ్లి వాకబు చేసి చూస్తారు. ప్రమాదం జరిగిన చోట వ్యవస్థ అస్తవ్యస్తంగా వుందనీ ప్రమాదం జరక్కుండా తీసుకోవలసిన జాగ్రత్తలు ఏ ఒక్కటీ తీసుకోలేదని ఆ చోట ఇంతకాలం ప్రమాదం జరక్కపోవడం చాలా ఆశ్చర్యకరంగా వుందిస్మీ అని చెప్తారు. అసలు న్యాయంగా చూస్తే ఎప్పుడో ఈ ప్రమాదం జరిగుండాల్సింది– ఇది అంతం కాదు ఆరంభం. అక్కడ ఇలాంటి ప్రమాదాలు ఇంకా బోలెడన్ని జరిగే ముప్పు పొంచి వుంది– అని ఘంటాపదంగా చెప్తారు.

అసలే రెచ్చిపోయిన జనం ఇంకా రెచ్చిపోతారు. మరికొన్ని వివరాలు వెలుగులోకి రప్పిస్తారు. ఆ భవనానికి నోటీసులు ఇవ్వలేదా అంటే ఇచ్చారు కానీ అవన్నీ బుట్టదాఖలు అయిపోయాయి. అవతలి వాళ్ళు తేలిగ్గా తీసుకున్నారు. నోటీసుల్చినా పట్టించుకోని వాళ్ళమీద మీరెందుకు చర్య తీసుకోలేదని ప్రభుత్వాన్ని నిలదీస్తారు.

ఇక గవర్నమెంటు వారికి వస్తుంది పూనకం. గతం గతః ఇకముందు గట్టి చర్యలు తీసుకుంటాం అని మాట ఇస్తారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే ప్రయత్నాలు కూడా చేస్తారు. ప్రమాదం జరిగిన భవనం వారిని అరెస్టులూ గట్రా చేసి కేసులు అవీ పెడతారు. పనిలో పనిగా అలా రూల్సు రెగ్యులేషన్సు పాటించని మిగిలిన వారందరినీ వెతికి వారందరికీ కూడా నోటీసులు ఇస్తారు. మీరు తక్షణమే తగిన జాగ్రత్తలు తీసుకుని

తగిన భద్రతా ఏర్పాట్లు చేసుకోకపోతే పరిణామం చాలా తీవ్రంగా వుంటుంది అని చాలా గట్టిగా తెలియజేస్తారు. నోటీసులు అందుకున్నవారు నోటీసు అందుకుని ఏమీచెయ్యలేక చేతులెత్తేస్తారు.

నిజమే మరి. వాళ్ళు చెప్పిన జాగ్రత్తలు తీసుకోడం అసాధ్యం. మంటలు అంటుకుంటే పారిపోవడానికి మార్గం ఏర్పాటు చెయ్యమంటారు. ఫైర్ ఇంజన్ వచ్చి ఇంటిచుట్టూ తిరిగి మంటలార్పేలా వీలు కల్పించమంటారు. ఏదైనా కట్టడం కట్టేముందు ఈ జాగ్రత్తలన్నీ పాటించమంటే అర్థం ఉందిగానీ ఎప్పుడో పదేళ్ల కిందట కట్టిన కట్టడాలికి ఇప్పుడు నోటీసులిస్తే ఆ నోటీసులు అందుకుని మాత్రం ఏం చేస్తారు? ఆటో కూడా వెళ్ళలేని సందుల్లోకి నోటీసు ఇచ్చినంత మాత్రాన ఫైర్ ఇంజను ఎలా వెళ్తుంది? అందుకే ఆ నోటీసు కాయితంతో కాయితం పడవలు చేసుకుంటారు లేదా ఏ సమోసాలో పొట్లం కట్టుకునేందుకు వాడుకుంటారు. ఇవన్నీ తాటాకు చప్పుళ్ళే అని పుచ్చుకున్న వారికీ తెలుసు. వారికి తెలుసని ఇచ్చినవారికీ తెలుసు. అదంతా ఓ పెద్ద నాటకం.

అంతే, ఈలోగా ఇంకో విపత్తు ఎదురవుతుంది. మరో సంఘటన జరుగుతుంది.

ఔటర్ రింగు రోడ్డులో ఘోరమైన ప్రమాదం జరుగుతుంది. కొంతమంది ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. మళ్ళీ మొదలు శవాలు... ఏడుపులు... కళ్లముందే కొడుకుని పోగొట్టుకున్న ఆ తల్లిదండ్రుల దుఃఖం అందరినీ కంటతడి పెట్టించింది అంటూ వార్తలు.

పోస్టుల్లో లేనివారు విరుచుకు పడటాలు అన్నీ రొటీన్‌గా జరిగిపోతాయి. రోడ్ వేసి వదిలేస్తే సరిపోతుందా. రోడ్‌కి ప్రహరీ గోడ కట్టించాలి అంటుంది ప్రతిపక్షం. అలాగే గోడ కట్టించడమే కాదు అడుక్కు ఓ మనిషిని కాపలా కూడా పెడదాం అంటుంది ప్రభుత్వం. ఈలోగా మరెక్కడో అకాల వర్షాలకు ఇల్లు అమాంతం భూమిలోకి కుంగిపోతుంది. అటు మళ్లుతుంది జనం దృష్టి.

అవును మరి... కొత్త నీరువస్తే పాత నీరు కొట్టుకోవటం సహజమేగా! అలా కొట్టుకుపోకపోయినా ఆటోమాటిక్‌గా ఆవేశాలు చల్లారి పోతాయి. పూనకాలు దిగిపోతాయి. జరిగినదంతా మర్చిపోతారు. అంతటా ప్రశాంత వాతావరణం ఏర్పడుతుంది. అది సహజమేగా!! పందిరి రాట పాతిన నాడు ఉన్న ఉత్సాహం

పదహార్రోజుల పండుగ దాటాక ఉంటుందా?

ఇలా కొత్త సమస్య రాగానే పాత సమస్యలు గాల్లోకి వదిలిస్తే సమస్యలు తీరెదెప్పుడు? అంటే అదంతే! ఇదంతా ఇలాగే జరిగిపోతూనే ఉంది. ఇకముందు కూడా జరిగిపోతూనే ఉంటుంది. పెద్దగా మార్పు ఏమీ ఉండదు.

మరి ఇలా మాటలే తప్ప క్రియాశూన్యం అయితే పాపం ఎందరో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు కదా అంటారా? ఆ!! పోతే పోయారు.. ఆయుర్దాయం తీరిపోతే మనం ఆపితే ఆగుతారా? మహానగరంలో మంటల్లో మాడిపోతారు. లేకపోతే మన్యంలో రోగం వచ్చి పోతారు... ఇంత జనాభాలో కొందరు పోతే ఏం నష్టం??

బొత్తిగా గాల్లో దీపాల్లా తయారయ్యాయి మన బతుకులు... అని దిగులు వేస్తుంది అప్పుడప్పుడు. కానీ... అంతలోనే ఇవ్వాళ బావున్నాం... రేపటి మాట రేపు చూసుకుందాం... అన్నింటికీ ఆ భగవంతుడే వున్నాడని వేదాంతం చెప్పుకుని కాలం గడిపేద్దాం. ❑

# గృహ ప్రవేశం

**తె**ల్లవారక ముందే వచ్చాడు మా శీను. వాళ్ళ ఫ్రెండ్ ఇల్లు కట్టుకున్నాడుట గృహప్రవేశం ఫలాని రోజున, హైదరాబాద్ వస్తాను, మీరు ఊళ్ళో ఉంటారా? అని ఫోన్ చేసాడు. వుంటాం. ఇంకెక్కడా దిగకు. తిన్నగా ఇంటికే వచ్చేయ్... అన్నాం. అలాగే వచ్చాడు. శీను మా కజిన్ బ్రదర్ కొడుకు, మా అబ్బాయి తోటివాడే. చాలా రోజులయింది కలిసి... బందరు లడ్డు, నల్ల హల్వాపట్టుకొచ్చాడు మాకోసం. మావాడు, వాడు కబుర్లలో పడిపోయారు.

తొమ్మిదింటికి ఇద్దరూ బయలుదేరారు. వీడు ఆఫీసుకి వాడు ఫంక్షన్కి. మళ్ళీ రాత్రికే తిరుగు ప్రయాణం. ఇంకో రోజు ఉండరా అన్నాం. అమ్మో బోలెడన్ని పన్లున్నాయి అన్నాడు. మధ్యాహ్నం త్వరగా వస్తాను అన్నాడు మా అబ్బాయి. రాత్రి హొటలుకి వెళ్ళి భోజనం చేసి వాడిని బస్సెక్కించి వీడు ఇంటికొస్తాడు. అదీ ప్రోగ్రాం. మా భోజనాలు అయ్యాక మా కోడలు బజారెళ్లి వాడి పిల్లలకోసం బహుమతులు పట్టుకొచ్చింది.

మూడింటికి వచ్చాడు శీను. అలిసి పులుసు కూర అయిపోయాడు. "అబ్బ ఎంత దూరమో, ప్రాణం పోయింది. బందరునుంచి ఇక్కడికి సునాయాసంగా వచ్చాను గానీ వూళ్ళో అక్కడికి వెళ్ళివచ్చేసరికి తాతలు తలపుకి వచ్చారు" అన్నాడు.

సరే రోలొచ్చి మద్దెలతో మొర పెట్టుకున్నట్టు వీడు మాతో సిటీ కష్టాలు చెప్తే ఎలా? అప్పటికీ టాక్సీలో వెళ్ళాడు, బస్సులో వెళ్లుంటే నోట మాట కూడా వచ్చుండేది కాదు.

"అబ్బ బొత్తిగా అన్ రూలీ ట్రాఫిక్".

వాడింకా చెప్తూనే వున్నాడు. నాకు భయం వేసింది. మా వూరి ట్రాఫిక్ గురించి మాట్లాడ్డం మొదలెడితే ఓ పట్టాన తెమలదు. చెలమలో నీటిలాగా వూరుతూనే వుంటుంది. అందుకే ఇంతకీ బాగా జరిగిందా ఫంక్షను? ఇల్లెలావుంది? అని టాపిక్ మార్చా.

బావుంది అత్తయ్యా! డూప్లెక్స్ ఇల్లు... అంటూ చెప్తూండగానే మా అబ్బాయి వచ్చాడు.

వాళ్ళు ఇచ్చారు అంటూ ఓ పాకెట్ ఇచ్చాడు శీను. అందులో బోలెడన్ని పోలిపూర్ణం బూరెలు, బోలెడంత పులిహోరా నీట్‌గా పేక్చేసి వున్నాయి. మా అందరికీ నోట్లో నీళ్లూరాయి. వెంటనే తినడం ప్రారంభించాం. ఇన్నేసి ఇచ్చారేవిట్రా? అన్నాను. చాలా మందిని పిల్చారుట. దూరం, పైగా వర్కింగ్ డే, సగంమంది కూడా రాలేదు. అందుకే అందరికీ ఇచ్చారు అన్నాడు. పోలిపూర్ణాలు తూర్పువాళ్లు అద్భుతంగా చేస్తారు. ఆ మాటే అన్నాను. అవును వాళ్ళది శ్రీకాకుళం దగ్గర పల్లెటూరు అన్నాడు.

ఇంతకీ ఇల్లెక్కడరా? అని అడిగాడు మావాడు బూరె తింటూ... చర్లపల్లి దాటాక అన్నాడు శీను. అక్కడ మాకు ఓ ప్లాటు వుంది. ఎలా వుంది ఏరియా? బాగా డెవలప్ అయిందా? వీడి ప్రశ్న.

"ఇళ్లు చాలానే వస్తున్నాయి కానీ బాగా దూరం వూరికి" వాడి సమాధానం. ఆ ప్రశ్నోత్తరాల పరంపర అలాగే సాగింది.

"అవును మెల్లిగా డెవలప్ అవుతుంది. దగ్గరలో రోడ్డుందా?"

"పక్కనే రోడ్డు వుంది, రెండో వైపు వాటర్ ట్యాంకు".

"అక్కడే మా పాట్ వుంది, వాటర్ ట్యాంక్‌కి కుడివైపు".

"ఇది కుడివైపే..."

"అయితే మా స్థలానికి పక్కలే ఇళ్లు వచ్చేస్తున్నాయన్నమాట. వెరీ గుడ్ మా స్థలం వాల్యూ పెరుగుతుంది. మా స్థలం నంబరు కూడా లక్కీ నెంబరే నంబరు 35".

వాడు ఆశ్చర్యపోయాడు. "అరె వాళ్ళ ప్లాట్ నెంబర్ కూడా 35" అన్నాడు.

బూరె తింటున్న మావాడు ఆగిపోయాడు. "అదేవిట్రా? ఇద్దరికీ ఒకే నంబరు ఎలా వుంటుంది? పొరపాటు పడ్డావు నువ్వు" అన్నాడు. కాదంటాడు వాడు. చివరికి మా ప్లాట్ లేఅవుట్ వాడి దగ్గరున్న శుభలేఖ చూస్తే తేలింది ఏమిటీ అంటే మా స్థలంలో వాళ్ళు ఇళ్లు కట్టేసుకున్నారు.

తెల్లబోయాం అందరం.

అప్పట్లో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ మంచి బూంలో ఉండేది. ఇటు షాద్‌నగర్ దాకా అటు యాదగిరిగుట్ట దాకా అంతా హైదరాబాదే. అందరూ ఎడాపెడా ప్లాట్లు కొనేసారు. వద్దు వద్దనుకుంటూనే మేమూ మూడు స్థలాలు కొన్నాం. అవసరమై లేదు

ఆసక్తి అంతకన్నా లేదు. ఓ చోట మాకు బాగా కావాల్సిన వాళ్లు పాట్లు చేసి అమ్ముతున్నాం, ఇంకొన్నే వున్నాయి, ప్లీజ్ ప్లీజ్ అంటే కొన్నాం. ఇంకోటేమో మా దగ్గర ఎవరో అప్పు తీసుకుని తీర్చలేక బదులుగా స్థలం ఇస్తాం అంటే అప్పు మినహాయించుకుని మిగతా డబ్బులిచ్చి స్థలం తీసుకున్నాం. ఇంకోటి నాదీ. మా పుట్టింటి ఆస్తులు అమ్మేసినప్పుడు నా వాటాగా యాభై వేలు వస్తే డబ్బుగా వుంటే పులుసులో పడిపోతుందని అక్కడెక్కడో స్థలం కొన్నారు.

ఈ స్థలాల కాయితాలు భద్రంగా బీరువాలో వున్నాయి. ఎప్పుడన్నా అలా డ్రైవ్‌కి వెళ్ళి ఈ మా ఆస్తులు చూసుకుని ఆనందిస్తూ వుంటాం. పెద్దగా డెవలప్ కాలేదు. ఇప్పుడు ఇలా వున్నా భవిష్యత్తులో బోలెడు ధర పలుకుతాయి.. మాకు.. ఇద్దరు మనవరాళ్ళు. ఓ స్థలం అమ్మి పిల్లలిద్దరి చదువులకి, రెండోది పెద్దదాని పెళ్ళికి, మూడోది చిన్నదాని పెళ్ళికి అనుకున్నాం.

ఎవరూ ఊహించని విధంగా హఠాత్తుగా పరిస్థితులు తారుమారు అయ్యాయి. హైదరాబాద్ రియల్ ఎస్టేటు శీర్షాసనం వేసేసింది. హైదరాబాదు విషయమే అయోమయంగా వుంది. ఎటూ తేలడంలేదు. అగస్త్యుడు రానూ రాడు వింధ్యుడు లేవనూ లేవడు అన్నట్టు వుంది వ్యవహారం.

పోనీ అయినకాడికి అమ్ముదాం అన్నా కొనేవాళ్లులేరు. సర్లే ఖాళీ స్థలాలేగా వాటికి అన్నం పెట్టాలా నీళ్లు పొయ్యాలా పడుంటాయి అనుకుంటున్న సమయంలో మేము మా చిన్నదాని పెళ్లికి కేటాయించిన మా స్థలంలో వేరేవాళ్లు ఇల్లు కట్టేశారు అనేసరికి టెన్షన్ వచ్చేసింది మాకు... ఉన్నపాటున మా మగవాళ్లు శీనుని వెంటబెట్టుకుని అక్కడికి వెళ్ళారు. ఎప్పుడో రాత్రి పదింటికి కాళ్ళీడ్చుకుంటూ వచ్చారు. వాళ్ళ దగ్గరా పక్క దస్తావేజులున్నాయి. మాకు అమ్మినవాడు దొరకలేదుట. అలా ఒక్కో స్థలం ఇద్దరు ముగ్గురికి అమ్మేసి పరారైపోయాడు.

ఏం చెయ్యటం? కేసు పెడదామా అన్నాను. కేసా? నీకేమైనా పిచ్చా? అని కోప్పడ్డారు మా బాస్. నిజమే మరి. మహా మహా కేసులకే దిక్కులేని మన దేశంలో అనామకులం.. మా స్థలం గోల ఎవరికి పడుతుంది?

కేసులు అవి అదో దండగ... వాళ్ళతో మాట్లాడి ఏదో సెటిల్ చేసుకోండి... అని సలహా చెప్పి బస్ టైం అవడంతో పరుగున వెళ్లిపోయాడు శీను.

తండ్రీ కొడుకులిద్దరూ పదిసార్లు ఓపిగ్గా తిరిగారు. పదిమంది చేరి పంచాయితీ పెట్టారట. ఇద్దరి దగ్గర పక్కా డాక్యుమెంట్లు వున్నాయి. మాకు అన్యాయం జరిగిందని అందరూ ఒప్పుకున్నారట. వాళ్లు ఇల్లు కట్టేసుకున్నారు కాబట్టి మరి కట్టిన ఇల్లు పడగొట్టటం న్యాయం కాదు కాబట్టి వాళ్ళకి సానుభూతి చూపించారట. ఆ స్థలం విలువ మూడు లక్షలట. మాకు నష్టపరిహారంగా ఓ లక్ష ఇమ్మని తీర్పు చెప్పారట.

"సరే ఏం చేస్తాం? ఆ స్థలం మనం అరవై వేలకి కొన్నాం. చచ్చినాడి పెళ్ళికి వచ్చిందే కట్నం. ఆ డబ్బిట ఇవ్వండి చిన్నదానికి గొలుసుకొంటాను" అన్నాను... డబ్బివ్వలేదు వాళ్ళు. ఇప్పుడు ఖర్చులో ఉన్నారుట, నిదానంగా ఇస్తారుట.

శ్రీమద్రమారమణ గోవిందోహరి. ఇక వాళ్లిచ్చినట్టే మేము పుచ్చుకున్నట్టే... చివరికి ఆ స్థలానికి మాకు దక్కింది పోలిపూర్ణం బూరెలు పులిహోరారానా??

మగవాళ్లు పనిలో పడిపోయి ఈ విషయం పక్కన పెట్టారు. కానీ నాకు మాత్రం కంటిమీద కునుకు లేదు. ఇదేం అన్యాయం? అందరూ ఊరుకుంటే మోసగాళ్లు మరీ విజృంభిస్తున్నారు. ఏదో ఒకటి చేసి పోరాడాలనుకున్నాను.

ముందుగా ఆ స్థలం మాది అని అందులో మేము ఇల్లు కట్టలేదని రుజువుండాలిగా. అందుకే సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్ళి మా స్థలం గురించిన వివరాలు ఇచ్చి, ఆ స్థలం ప్రస్తుతం ఏ స్థితిలో వుందో వివరించమని ఒక అప్లికేషన్ రాసి ఇచ్చి వచ్చాను. వాళ్లు వాకబు చేసి ఆ స్థలంలో ఇల్లు వుందని రాస్తారు. మా స్థలంలో మేము కట్టకుండా ఇల్లెలా వచ్చింది? అని అడుగుతాను. తీగ లాగితే డొంకంతా కదుల్తుంది. నేరస్థులంతా బయటికి వస్తారు. అదీ నా ఆశ.

కళ్ళల్లో వత్తులు వేసుకుని ఎదురుచూసాను సమాధానం కోసం. ఒకటి రెండు సార్లు ఫోన్ కూడా చేసి ఫాలో అయ్యాను. మీరు అడిగిన సమాచారం మీకు కచ్చితంగా అందుతుంది కాకపోతే నాల్రోజులు అటూ ఇటూ అంతే అన్నారు.

పదిహేను రోజుల తరువాత ఆ ఆఫీసునుంచి సమాధానం వచ్చింది. మీరు చెప్పిన స్థలం గురించి వివరాలు తెలియజేస్తున్నాం. ఆ స్థలం భద్రంగా ఖాళీగానే ఉంది అని వినయంగా తెలియజేసారు. మా స్థలంలో వేరేవాళ్లు ఇల్లు కట్టేసుకునేదాకా మాకూ తెలియదు. మా దగ్గర రిజిస్ట్రేషన్ ఛార్జీలు వసూలు చేసిన మమ్ము పాలించే ప్రభుత్వానికి తెలియదు. పవమానాసుతుడు పట్టూ... ❑

# ఈ ఐడియా మన జీవితాలని మార్చేస్తుంది!

**పా**త సినిమా కథానాయకుడు సూపర్ హిట్ పిక్చరు. ఈ సినిమాలో ఓ మంచి డైలాగు వుంది.

"నేను మాజీ కౌన్సిలరుగా మహాసేవ చేసానని జనం ఒహటే గోల పెట్టేస్తున్నారు. నా శిలావిగ్రహం ఒహటి సెంటర్లో పెట్టిస్తేస్తే ఆ గోల అణిగిపోతుంది" అంటుంది ఓ పాత్ర. నామటుకు నాకు ఆ డైలాగంటే చాలా కష్టం.

మనదేశ పౌరుల మహర్జాతకాల మహిమో లేక మన దేశం వాస్తు బాగా లేదో గానీ ఎప్పుడూ ఏదో ఓ సమస్య... పాత సమస్యలే పరిష్కారం కావు... దాన్ని మించిన కొత్త సమస్య గుండెమీద బండలా తయారవుతుంది. ఇప్పుడు ఓ కొత్త సమస్య వచ్చి పడింది. అదే విగ్రహ సమస్య. మన దేశంలో విగ్రహాల హవా నడుస్తోంది ప్రస్తుతం.

పూర్వం పెద్దలో, గురువులో పోతే వారి ఫొటో ఫ్రేము కట్టించి ఇంట్లో గోడకి తగిలించేవాళ్ళు. మరి కాస్త గొప్పవారు పోతే వారి పొలంలో పోయినవారికి సమాధి కట్టించి దానిమీద వారి విగ్రహం రాతితో చెక్కించి పెడితే అది గొప్పలో గొప్ప.

ఓయమ్మో ఎంత గౌరవమో పెద్దలంటే. అవును మరి విత్తం కొద్దీ విభవం అని చెప్పుకునేవారు అందరూ. అప్పట్లో ఎవరి ప్రేమలు వారికే పరిమితం. అంతేగాని మా తండ్రిగారి విగ్రహం నడి రోడ్డుమీద పెడతాం... మా గురువుగారి విగ్రహం జంక్షన్‌లో పెడతాం... అనే ధైర్యసాహసాలు ఎవరికీ ఉండేవికావు.

ఆ తరువాత విగ్రహాల స్థాపన అడపాదడపా జరుగుతూనే ఉండేవి. దేశ సేవ చేసి పోయిన వారి విగ్రహం ప్రతిష్ఠించటం ఆనవాయితీగా మారింది. ఒకటో అరో విగ్రహం ఆయన పుట్టినచోటనో, పోయిన చోటనో, ప్రతిష్ఠించేవారు. ఆ పోయినాయన వూరికి అంతో ఇంతో మంచి చేసిపోయాడు కాబట్టి వూరివారికీ ఏమంత అభ్యంతరం వుండేది కాదు.

ఇక తరవాత అదో వేలంవెర్రిగా మారిపోయింది. మనిషి పోయి క్రియా కర్మలు పూర్తి అయీ అవకుండానే ఇటు వారి విగ్రహ ప్రతిష్ఠలు మొదలు ఒకటి రెండు కాదు, వందలు వేలు.

ఊరురా వారి విగ్రహాలే. ఈ విగ్రహాలు ప్రతిష్ఠించాలంటే ప్రభుత్వం వారినించి పర్మిషన్ తీసుకోవాలనే నియమం గట్రా లేదు. అంతా ఇష్టారాజ్యం. ఎవరైనా ఎప్పుడైనా ఎక్కడైనా విగ్రహం నిలబెట్టేసుకోవచ్చు. ఒకసారి విగ్రహం స్థాపించబడ్డాక ఇక అదీ ఓ మాన్యుమెంట్‌లాగా కలకాలం నిలిచి ఉండాల్సిందే.

అనధికారికంగా ఆక్రమణ చేసారని చిన్నా చితకా వ్యాపారస్తుల దుకాణాలు, పేదల గుడిసెలూ పీకేస్తారుగానీ నడి రోడ్డు మీద ఠీవిగా నిలబడ్డ విగ్రహాల జోలికి వెళ్ళే దమ్ముండదు ఎవరికీ. మరీ పగవాళ్లెవరైనా వుంటే దొంగచాటుగా ఆ విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చెయ్యగలరు అంతే. అలా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించి రిపేరు చేయిస్తుంది.

ఇటీవల పోయిన వాళ్లకి విగ్రహాలు పెట్టే పాత సంప్రదాయానికి భిన్నంగా మరో అమ్మగారు ఓ కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టింది. నేను పోయాక నా విగ్రహం ఎవరు పెడతారు? నేనే పెట్టేసుకుంటా... అని దూరం ఆలోచించి ముందుచూపుతో తన విగ్రహం  తన గురువు విగ్రహం, పార్టీ గుర్తు అయిన జంతువు విగ్రహం ముచ్చటగా మూడు విగ్రహాలు వేల సంఖ్యలో అడుగడుగునా స్థాపించుకుంది. రాష్ట్రం అంతా మాయాబజారులాగా చేసి పెట్టింది.

అందుకు వెచ్చించిన డబ్బుతో ఆరు డ్యాములు కట్టుకోవచ్చు. రాష్ట్రం అంతా చక్కటి రోడ్లు వేసుకోవచ్చు. అయినా ఏదో మోటు సామెత చెప్పినట్లు ప్రజల మీద అంత అభిమానమే వుంటే వాళ్లు ప్రజా సేవకులు ఎందుకవుతారు?

మన దేశంలో రాజరికం లేదు. పేరుకి ప్రజాస్వామ్యం. అయిదేళ్లకోసారి ఎన్నికలూ.. పాటించినా పాటించకపోయినా ఎన్నికలకి ముందు సవాలక్ష రూల్సూ వున్నాయి.

ఆయా విగ్రహాలు ఓవర్‌నైట్ పెట్టబడలేదు. రహస్యమూ లేదు. బాహాటంగా బోర విరుచుకుని పెట్టించుకున్నావిడ... అప్పుడెవరూ నోరెత్తలేదు. చూసీ చూడనట్టూ ఊరుకున్నారు. ఎన్నికలొచ్చేసరికి అంతా నిద్రలేచారు.. ఇప్పుడా విగ్రహాలు గండకత్తెరగా తయారయ్యాయి. తక్షణం వాటిని తొలగించాలి అంటే అదేం అయ్యే పనికాదే!!

అసంఖ్యాకంగా వున్నాయి విగ్రహాలు. అవన్నీ పడగొట్టేసరికి మళ్లీ ఎన్నికలొచ్చేస్తాయి. అందుకని వాటన్నిటికీ ముసుగులు వెయ్యమన్నారు. మళ్లీ అదో దండగ. మళ్ళీ ప్రజల మీద అదనపు భారం.

ఇదంతా మాచెడ్డ చిరాగ్గా వుంది. అయ్యగారు ఏం చేస్తున్నారు? అంటే చేసిన తప్పులు దిద్దుకుంటున్నారు– అని సామెత చెప్పినట్టు ఎప్పుడు చూసినా జరిగిన తప్పులు దిద్దుకునే ప్రోగ్రామే నడుస్తూ వుంటే ఇక ప్రజలకు పనికొచ్చే మంచి పనులు చేసేది ఎప్పుడుటా?? సరే అవన్నీ పెద్ద పెద్ద మాటలు. ముందీ విగ్రహాలబెడద నుంచీ బయటపడటం ఎట్లా?? సిరి అంటదు గానీ చీడ అంటుతుందని సామెత చెప్పినట్టూ ఇది అన్ని రాష్ట్రాలకి అంటువ్యాధిలా పాకిపోతోంది. పిల్లలకి ఆస్తులు పోగెయ్యటం తప్ప ప్రజల గోడు పట్టించుకోని నాయకులకు కూడా అడుగడుగునా విగ్రహాలే విగ్రహాలు... ఈ విగ్రహ సమస్య ఏ ప్రాంతానికో పరిమితం కాదు కదా. ఇవ్వాళ ఓ చోట... రేపు మరోచోటా.

ఈ విగ్రహాలతో ఇంకో బెడద కూడా వుంది. ఈ అభిమానం శాశ్వతం కాదు. తాత్కాలికమే. ఇప్పుడు విగ్రహ రూపంలో పూజలందుకుంటున్న మనిషి కాస్తా రేపు అధికారం వీళ్ల చేతుల్లోంచీ వీళ్ళ తసమదీయుల చేతుల్లోకి పోతే ఈ విగ్రహం కంసుడికి కృష్ణుడిలా కనిపించే ప్రమాదం ఉండనే వుంది. చలనం లేని విగ్రహమే అయినా కంట్లో నలుసులా బాధిస్తుంది. అప్పుడు వారు ఇవన్నీ తొలగించి తమకు ఇష్టమైన వారి విగ్రహాలు పెట్టుకుంటారు!

విగ్రహాలు పిల్లలు కట్టుకున్న పిచ్చుకగూళ్ళు కావు కదా యిట్టే పడగొట్టి అట్టే కట్టేసేందుకు.. కట్టేందుకు అయినదానికి రెట్టింపు అవుతుంది పడగొట్టడానికి. బోలెడంత ఖర్చు. అదంతా మనమే చచ్చినట్టూ ఇచ్చుకోవాలి. ఈ దేశంలో ఎవరెన్ని విధాల ముచ్చట్లు తీర్చుకున్నా దానికి వెచ్చించేది ప్రజాధనమే కదా మరి!! అన్న వస్త్రాలకే అల్లల్లాడిపోయే బడుగు జీవులం. ఈ విగ్రహాల బరువు ఎలా భరిస్తాం??

ఇక లాభం లేదు మనమే పూనుకోవాలి. మన సమస్యలు మనమే పరిష్కరించుకోవాలి. తాత్కాలికమైన అభిమానాలకు బోలెడంత ఖర్చుతోకూడిన శిలావిగ్రహాలు అనవసరం. అంత స్తోమతా లేదు మనకి... మరో సరళమయిన పద్ధతి చూసుకోవాలి. నాకు ఓ మంచి ఆలోచన వచ్చింది...

ఈ మధ్య పిల్లలాడుకునే రబ్బరు బొమ్మలు విరివిగా దొరుకుతున్నాయి. చిన్న చేతి సంచీలో ఇమిడిపోతాయి. బయటికి తీసి గాలి కొడితే చక్కగా వుబ్బిపోయి అసలు రూపుకి వస్తాయి. అవైతే బావుంటాయి మనకు.

కోతులూ బాతులూ తయారుచేసినవారు మనిషి ఫొటో ఇస్తు కాస్త అటు ఇటుగా వారి పోలికలతో రబ్బరు బొమ్మ చేసి ఇస్తారు... కాకపోతే మరీ పిల్లలాడుకునే బొమ్మలాగా కాకుండా కాస్త నాణ్యమైన రబ్బరు వాడితే వాతావరణపు ఆటుపోట్లకి తట్టుకుంటాయి. పన్లో పని విగ్రహానికి వినియోగించే దిమ్మ కూడా అటువంటిదే. ప్లాస్టిక్‌తో తయారుచేయించుకుంటే ఉభయతారకంగా ఉంటుంటి. ఆ బొమ్మా ఈ దిమ్మా చిన్న సంచీలో పెట్టుకుని ఝు ఝునక ఝునారే ఝునక ఝునా ఝునారే అని ఊరేగింపుగా వెళ్లి అక్కడ పంపుతో గాలి కొట్టి విగ్రహ ప్రతిష్ఠ చేసి రావచ్చు. మైన్టేనేన్స్ కూడా ఈజీనే. రోడ్డు పక్కన వున్న మొక్కలకు ఓ వాటరు ట్యాంకరు వారానికి రెండురోజులు వెళ్లి నీళ్లుపోసి వస్తూ వుంటుంది కదా. అదేవిధంగా ఓ వాహనంలో గాలి తీసుకు వెళ్ళి ఈ విగ్రహాలకి వారానికోసారో రెండుసార్లో గాలి కొట్టి వచ్చే ఏర్పాటు చేస్తే అలా ఎంత కాలమైనా ఠీవిగా నిలబడి వుంటాయి. ప్రభుత్వం మారినా, మధ్యంతర ఎన్నికలొచ్చినా తలనొప్పులుండవు, మామూలు ఎన్నికలప్పుడు ఏదైనా మాయచేసి వాటిని కనబడకుండా చెయ్యాలన్న ముసుగుల గోల వుండదు. గాలి తీసేస్తే చాలు అప్పుడంలా అణిగిపోయి ఓ సంచీలో ఇమిడిపోతాయి.

ఆ తరవాత అంటారా? నందో రాజా భవిష్యతి. కావలిస్తే మళ్లీ గాలి కొట్టి పునఃప్రతిష్ఠ చేసుకోవచ్చు. లేదూ!! ఓ మూల గిరాటు వెయ్యవచ్చు.

మరి ఈ పద్ధతి నచ్చి ఇదే అమలు చేస్తే మాత్రం నన్ను మర్చిపోకండి. ఇది నా పేటెంటు అని నేను అనను. రాయల్టీ కూడా వద్దు నాకు ఓ యోగ్యతాపత్రం ఇస్తే చాలు... అదీ ఇవ్వకపోయినా ఈ ఐడియా అమలుపరిస్తే ఆనందిస్తాను.

నేను సైతం సమాజానికి పనికొచ్చే పని చేసా కదా అని తృప్తిపడతాను. ❑

# తాళం వేస్తారు జాగ్రత్త

**తా**ళం అనే పదానికి చాలానే వున్నాయి అర్థాలు. అందులో ఒకటి సంగీతంలోని తాళం. అదీ పూర్తిగా వ్యక్తిగత వ్యవహారం. పాడేవాళ్లు ఎవరి తాళం వాళ్ళే వేసుకుంటారు. కాబట్టి వాళ్ళవల్ల ఎవరికీ ఏమీ ఇబ్బంది వుండదు. మన పక్కింట్లో పిల్ల మరీ కర్ణకఠోరంగా పాడేస్తున్నా ఏ చెవిలో దూదో ఇయర్ ఫోనో పెట్టేసుకుని ఆ ఆపదనుంచి గట్టెక్కవచ్చు.

రెండో రకం తాళాలతోనే తలకాయనొప్పి, డేంజరు. ఈ తాళాలు వేసినా కష్టమే, తీసినా కష్టమే. ఏదైనా మనకే బోలెడంత నష్టం.

అదివరకు ఇంట్లోంచి బయటికి వెళ్ళేటప్పుడు ఇంటికి తాళం వేసి అదీ తిన్నగా వేసామా లేదో అని ఒకటికి పదిసార్లు లాగి చూసి దేవుడా మేము తిరిగొచ్చేదాకా మా ఇంటి భారం నీదే... ఎవరూ మా ఇంటి తాళం తియ్యకుండా కాపాడు– అని మనసారా ప్రార్థించి అప్పుడు బయటికి వెళ్ళేవాళ్ళం. ఓసారి రోడ్డెక్కాక ఇక ఇంటి తాళం విషయం మర్చిపోయేవాళ్ళం.

ఇప్పుడలా కాదు. రోడ్డెక్కాక కూడా తాళం భయం వెంటాడుతూనే ఉంటుంది. ఇంటికి తిరిగొచ్చేలోగా ఎవరు ఎప్పుడు ఎక్కడ తాళం వేసేస్తారో అని గుండె పీచు పీచుమంటూనే ఉంటుంది. ఫలాని చోటుకి వెళ్తున్నాం... ఇంత డబ్బు పట్టుకెళ్తున్నాం... ఓ ఎక్కీ తొక్కి అని ధీమాగా అనుకునేందుకు లేదు.

తాళాలకోసం విధిగా కొంత మనీ విడిగా వుంచుకోవాలి. కొండొకచో రెండు మూడు తాళాల కోసం కూడా సొమ్ము జాగ్రత్త చేసుకుని రోడ్డెక్కాలి. లేకపోతే మన గతి అధోగతే. అందులోనూ ఈ తాళాలదంతా అయోమయం వ్యవహారం. తాళం పడొచ్చు, పడకపోవచ్చు. మన అదృష్టం మీద ఆధారపడుంటుంది.

ఏమిటీ తాళం సుత్తి మాకు. అర్థం కావడంలేదు అనుకుంటున్నారా? ఆసచర్యం?? ఆసచర్యం!!!

మీరుండేది హైదేరాబాదులోనేనా??? మీకు కారుందా?? మరదే!! ఆ కారు తాళం గురించే నేను చెప్తోంది. అబ్బా!! మన కారుకి మనం వేసే తాళం గురించి కాదు. మనం తాళం వేసి వెళ్ళాక పోలీసులొచ్చి కారుకి వేస్తారూ... ఆ తాళం గురించి చెప్తున్నా. ఈ మధ్య ఎడాపెడా వేసేస్తున్నారు తాళాలు.

మన సమాజాన్ని బాగు చెయ్యాలని మన ప్రభుత్వం వారు ఎన్నెన్నో పన్లు చేస్తూ వుంటారు. ప్రజల పట్ల ముఖ్యంగా సామాన్యుడి పట్ల వారికెంతో ప్రేమ... ఏ పని మొదలుపెట్టినా సామాన్యుడి సుఖం కోసమే. మరది ఏం ఖర్మమో అయ్యవారిని చెయ్యబోయి కోతిని చేసినట్టూ తయారవుతుంది ప్రతీ పని...

అన్నీ అంతే... హెల్మెట్ రూలు.. డ్రైవ్ చేస్తూ సెల్‌ఫోన్‌లో మాట్లాడకూడదనే రూలు... ఆటోలో ఎక్కువ మంది పిల్లల్ని ఎక్కించకూడదనే రూలు– అన్నీ వున్నాయి. కాకపోతే ఎవరూ పాటించరు. అలా పాటించనివారిని పట్టుకుని శిక్షించే అధికారం ప్రభుత్వానికి వుంది. అలాగే ఏక్షన్ తీసుకుంటారు కూడాను. ఏ మాటకామాటే చెప్పుకోవాలి మరి. ఆ మాత్రం కఠినంగా వ్యవహరించాల్సిందే.

కాకపోతే అదంతా బొత్తిగా గాలివాటంగా తయారైపోతోంది. తప్పుచేసినవాళ్ళందర్నీ దండించడం ఉత్తమమైన పద్ధతి. అందర్నీ వదిలేయడం మధ్యమం. కొందర్ని పట్టుకుని మరికొందర్ని వదిలేయడం వుంది చూశారూ అదీ అధమం. తప్పుచేసినవారిని వదిలేసి తప్పు చెయ్యని వారిని పట్టుకోవడం అధమాధమం. మన ఖర్మకాలి ఎప్పుడూ ఆ చివరి రెండు పద్ధతులూనే నడుస్తాయి.

ప్రస్తుతం వాహనాలకి తాళాలు వేసే ట్రెండు జోరుగా నడుస్తోంది. అప్పుడెప్పుడో శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఓపెన్ చేసిన కొత్తల్లో మొదటిసారి అక్కడ చూసాను కారు తాళం. భలేగా వుంది అనుకున్నాను. అడ్డదిడ్డంగా వాహనం పార్కు చేసేవారికి ఈ తాళం ఓ గుణపాఠం అనుకున్నా. ఆ తర్వాత ట్రాఫిక్ వారు నగరంలో కూడా తాళం వెయ్యం మొదలుపెట్టారు... శభాష్ మన నగరంలో ట్రాఫిక్‌కి ఈ మాత్రం తాళభయం ఉండాల్సిందే అని సరదాపడిపోయా.

ఏం లాభం? మళ్ళీ గుడ్డేటు వ్యవహారం. ఏ రూలు ప్రకారం తాళం వేస్తున్నారో వాళ్ళకీ తెలీదు... మనకి ముందే తెలీదు. వేసేస్తారు అంతే. మనం ఎంత మొత్తుకున్నా వినరు. తాళం వేసేశాం తన్నుకు చావండి అంటారు. ఈ నేరానికి జరిమానా కూడా భారీగానే వేస్తారు. ఒకసారి తాళం వేస్తే అయిదొందలు సమర్పించుకోవాలి.

అయిదొందలంటే మాటలా... మధ్యతరగతివాళ్ళం... పెట్రోల్‌కి పెట్టినంత తాళాలకి ఎక్కడ పెడతాం?

ఈ మధ్య ఏ వేడుకలోనైనా అందరూ కలిస్తే తాళాల గోలే. ఇదే ప్రస్తుతం బర్నింగ్ టాపిక్. మొన్న ఓ పార్టీకి వెళ్తే అక్కడ ఇదే గొడవ. "రోడ్డు పక్కన కారు ఆపాం. మా ఆయన ఏటియంకి వెళ్ళారు. పోలీసొచ్చి తాళంవేసేసాడు.

రోడ్డుపక్కనే ఆపాం కదా అన్నా వినడు. ఇది నో పార్కింగ్ ఏరియా అన్నాడు అలా అని బోర్డులేదుగా మాకెలా తెలుస్తుంది? అని మొత్తుకున్నాను.

బోర్డు కేబుల్స్ కోసం గుంటలు తీసేవాళ్ళు తీసేస్తుంటారు. బోర్డున్నా లేకపోయినా యిది నో పార్కింగ్ ఏరియానే అంటాడు మొండిగా. చివరికి అయిదొందలు సమర్పించి వచ్చాం- అని తన బాధ వెళ్ల బోసుకుంది ఒకావిడ.

మీరింకా నయం. ఈ హోటల్‌కి వాలెట్ పార్కింగ్ వుంది కదా! బయట కార్లు చాలా వున్నాయి ఇక్కడాపండి. మేము లోపల పార్క్ చేస్తాం అంటే కారాపాను. హోటలు వాళ్ళొచ్చేలోపలే పోలీసులొచ్చి తాళం వేసేసారు. హోటలు వాళ్ళు నేను కూడా బతిమాలాం. వినలేదు. ఫైను కట్టి వస్తున్నా అన్నాడు ఇంకొకాయన.

ఏమోనండీ మరి నేనెప్పుడూ ఇక్కడ పార్కింగ్ ఉందా లేదా అని చూడను. నాక్కావాల్సిన దగ్గర అపుతా. ఒక్కోసారి యూ టర్న్‌కి ఆపోజిట్‌గా ఆపుతా అన్నాడు బోలెడంత బంగారం ఖద్దరు బట్టలు ధరించి భారీగా ఉన్నాయన.

అలా ఆపితే పెద్ద బళ్ళు టర్న్ తీసుకోవడం ఇబ్బంది కదా అన్నాం. ఏమో నేను అదంతా ఆలోచించను అన్నాడు. నీ కారుకి తాళం వెయ్యలేదా ఎప్పుడూ అంటే అబ్బే తాళమా పాడా గౌరవంగా దణ్ణాలు పెడతారు అన్నాడు. అదేలే మరి నీ అవతారం పైగా తెల్ల డ్రెస్సు. నిన్ను చూస్తే కామన్ మాన్‌లాగా కనిపించవు. అందుకే నీకు మినహాయింపు అనుకున్నా మనసులో. పైకి మాత్రం మీది మంచి యోగజాతకం అనేసాం అందరం.

ఇంతలో ఓ ముప్ఫై అయిదు ఏళ్ళ కుర్రాడు వచ్చాడు. ఈ మధ్యనే అమెరికా నించి వచ్చాడట. ఫర్ గుడ్ – ఇదెక్కడి అన్యాయం అండీ.

దార్లో ఓ షాపుముందు ఆగాను. కారు ఇక్కడ పార్క్ చేయొచ్చా అని అక్కడున్న ఒకతన్ని అడిగాను. చేసుకో అన్నాడు. చేసాను. లోపలకెళ్ళొచ్చేసరికి లాక్ చేసేసి ఫైన్

కట్టమన్నారు. అదేమిటి నేను అడిగే పార్క్ చేసాను అంటే ఎవరో ఏట్లో రామనాథం పార్క్ చెయ్యమంటే నువ్వు చేసేయడమేనా? కట్టు ఫైన్ అన్నాడు. కట్టేసాను. కారు స్టార్ట్ చేసి కాస్తదూరం వచ్చేసరికి పోలీసు వాన్ కనిపిస్తే ఆగి కారు దిగి నాకు జరిగిన అన్యాయం  వాళ్ళతో చెప్పాను. వాళ్ళు ఏమీ చెప్పకుండా తలాడించి వెళ్ళిపోయారు. నేను కారు దగ్గరికి వచ్చేసరికి మళ్ళీ లాక్‌చేసి వుంది అని లబోదిబోమన్నాడు పాపం. ఒకటి కొంటే ఇంకోటి ఫ్రీలాగా వుంది ఈ ఆఫరు అనుకున్నాం.

ఉన్న తలనొప్పులు చాలవన్నట్టు ఈ కారు తాళం వొకటీ. ఏం చేస్తాం?? ఇంట్లోంచి బయలుదేరే ముందు దేవుడా బయటికి వెళ్తున్నాం. మా కారుకి తాళం వెయ్యకుండా కాపాడు అని దణ్ణం పెట్టుకుని మరీ బయలుదేరుతున్నాం ఇక ఆయన దయ, మన అదృష్టం. ❑

# బహుమతుల కష్టాలు

**బ**హుమతి ఇచ్చీ పుచ్చుకునీ కూడా ఏడిచే వాళ్లుంటారా అంటే ఎందుకుండరూ? ఉంటారు. అందుకు మనమే గొప్ప ఉదాహరణ. మండిపోయే ధరలతో బతుకు ఈదటమే కష్టం మనకు. అయినా బహుమతుల కోసం బోలెడంత డబ్బు వృథా చేస్తూనే వుంటాం. ఎందుకూ అంటే కాస్త చాదస్తం, మరికాస్త మొహమాటం. అన్నింటినీ మించి వాళ్లిచ్చారు, మనం ఇవ్వకపోతే బాగుండదనే పీకులాట. వెరసి పనికిరానివన్నీ కొని ఎవరికో ఇచ్చి వాళ్ళు అవి అందుకుని, ఇచ్చినవాళ్ళని తిట్టిపోసి... అంతా నానా కంగాళీ వ్యవహారం. మహా మహా వాళ్ళు కూడా ఈ వలయంలో ఇరుక్కుపోయి సుడిగుండంలో చిక్కినట్లు గింగిరాలూ తిరుగుతున్నారు. బయటపడలేక సతమతం అయిపోతున్నారు.

గతంలోనూ పెళ్ళిళ్ళు, పేరంటాలు జరిగేవి. వెళ్లినవారు బహుమతులూ ఇచ్చేవారు. అప్పటికి ఇంతలా లెక్కకు మించి ఉండేవి కావు వస్తువులు. ఏ స్టీలు గ్లాసో ఇస్తే అపురూపంగా వాడుకునేవారు. అదీ ఇవ్వడానికి అవకాశం లేని వాళ్ళు ఏదో సాకు చెప్పి వూరుకునే వాళ్ళు. మనం పిలిచాం వాళ్ళొచ్చారు అనే ఆనందం తప్ప బహుమతుల గురించి పెద్దగా పట్టించుకునేవాళ్ళు కారు. ఇప్పుడలా కాదు... తప్పనిసరిగా బహుమతి ఇచ్చి తీరాల్సిందే.

ఇటీవల మనకు వేడుకలు పెరిగిపోయాయి. వేడుక అంటే మరి వెళ్తూ ఏదో ఒక బహుమతి పట్టుకెళ్లాల్సిందే. ఈ వేడుకలకి మరీ దగ్గరివాళ్ళు డబ్బు ఇచ్చేస్తారు. దూరం వాళ్ళు మాత్రం ఏదో వస్తురూపంలోనో ఇస్తారు. దగ్గరివాళ్ళు పాతిక మంది వుంటే దూరం వాళ్ళే డెబ్భైఐదు మంది వుంటారు. కాబట్టి వస్తువులే ఎక్కువగా వస్తాయి. ఫంక్షన్ అయిన మర్నాడు ఆ వేడుక చేసిన వాళ్ళు వచ్చిన బహుమతులు అన్నీ విప్పి చూసి కుళ్ళి కుళ్ళి ఏడుస్తారు. బహుమతులు చూసి ఆనందించాలి గానీ ఏడవటం ఎందుకు? అంటే... మరి వినాయకుడి బొమ్మలూ, గోడ గడియారాలూ, గాజు వస్తువులూ డజన్ల సంఖ్యలో వచ్చి పడితే ఏడవరా ఎవరైనా?

ఆ సుబ్బారావుకి ఏం రోగం? వాళ్ళింట్లో ఫంక్షన్‌కి నేను ఐదొందలు ఇచ్చాను. నాకీ వంద రూపాయల గోడ గడియారం ఇస్తాడా?

ఆ శ్రీలక్ష్మి మాత్రం తక్కువ తిన్నదా? వాళ్ళ అమ్మాయికి నేను కోటా చీరె పెట్టాను. నాకు ఈ పిచ్చి గాజు గిన్నె ఇచ్చింది– అని తలచుకు తలచుకు ఏడుస్తారు.

ఇటువంటి ప్రమాదాలు జరుగుతూనే బహుమతులు స్వీకరించబడవు... అని శుభలేఖల్లో వేయిస్తారు కొంత మంది అంటే కానుకలొద్దూ డబ్బే ఇవ్వండి... అని ఇన్‌డైరెక్టుగా చెప్పడం అన్నమాట... అయినా కొంతమంది బహుమతులే ఇస్తారు మొండిగా.

ఇవ్వక ఏం చేస్తారు? వాళ్ళింట్లో జరిగిన వేడుకకి వచ్చి వృథాగా పడున్న బహుమతులన్నీ వదల్చుకోవాలిగా మరి... అయినా ఎదుటివాడికి పనికొచ్చే వస్తువు బహుమతిగా ఇచ్చే రోజులు పోయాయి. మనకి పనికిరాని వస్తువు బహుమతిగా ఇచ్చేసే రోజులొచ్చాయి. కొన్ని వస్తువులు అసలు ఎవరికీ పనికిరావు. అయినాసరే కొంటారు, బహుమతిస్తారు. ఈ దండగమారి బహుమతుల్లో అగ్రస్థానం వహించినది జాకెట్టు బట్ట... ఈ రోజుల్లో ప్రతీ చీరె విత్ బ్లౌజ్‌గా వస్తోంది. ఒకవేళ అలా రాకపోయినా మాచింగ్ బ్లౌజ్ కొనుక్కుంటారు గానీ ఎవరో పెట్టినవి పనికిరావు. పనికిరావనీ తెలిసినా జాకెట్టు బట్టలు పెడుతూనే వుంటారు. అవి వాళ్ళు ఇంకొకరికి ఇస్తారు. వాళ్ళు మరొకరికి... అలా ఇల్లిల్లూ తిరిగి చివరికి చెత్తలో చేరిపోతాయి.

మరో వ్యర్థమైన బహుమానం కూడా వుంది. శాలువా... గతంలో ఎప్పుడో పండితులందరూ రోజూ శాలువా కప్పుకు తిరిగే రోజుల్లో ప్రవేశపెట్టబడిన ఆ పాత పద్ధతి ఇంకా కొనసాగుతూనే వుంది... అదో సభా మర్యాదగా చెలామణి అవుతోంది. సభ అనగానే వేదిక మీద వున్న వారందరికీ స్త్రీ పురుష భేదం లేకుండా శాలువాలు కప్పాల్సిందే. అవి వాళ్ళు పట్టుకువెళ్ళి ఓ మూలన పారేయాల్సిందే. అంతకంటే ఏం చేస్తారు? అవి ఎందుకు పనికొస్తాయి? ఏడాదిపొడుగునా మనకి ఎండాకాలమే? మధ్యలో మహా అయితే ఓ పదిహేను రోజులు చలేసినా స్వెట్టర్ తొడుక్కుంటారు గానీ శాలువా ఎవరూ కప్పుకోరు. ఈ మధ్య వస్తున్న తళుకుబెళుకుల శాలువాలైతే మరీ దండగ... కొనేవాళ్ళకి ఖర్చు తప్ప అందుకున్న వాళ్ళకి ఆవగింజంతైనా ఉపయోగం లేదు. అసలే రచయితలకి, పండితులకి ఇంట్లో పెద్దగా విలువా గుర్తింపూ వుండవు,

కాస్తంత చులకన కూడానూ. మీరే ఓ దండగ అని ఏడుస్తుంటే మీకొచ్చే ఈ శాలువాలుకూడానూ... చేతులకి కాళ్ళకీ అడ్డం తగులుతూనూ– అని ఆ సన్మాన గ్రహీతల ఇంట్లోనివాళ్ళు విసుక్కునేందుకు తప్ప ఇంకెందుకూ పనికిరావు.

ఇటీవల మరో రకం బహుమతులు కూడా సంప్రాప్తం అయ్యాయి. వేడుక చేసేవారు వచ్చిన అతిథులకి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడం అలవాటైపోయింది. దానికి బోలెడంత ఖర్చు... అయినప్పటికీ ఏమీ ఇవ్వకపోతే ఏడ్చుకుంటారు. ఏదో ఓటి ఇస్తే వదిలిపోతుంది అని కొంటారు. పేరంటం అయినా పెళ్లయినా ఓ బహుమానం ఇవ్వాల్సిందే.

ఎంతమంది వచ్చినా అందరికీ గిఫ్టులు కవర్లో వేసి ఇవ్వాలి. గతంలో అయితే పండూ తాంబూలం ఇచ్చే వాళ్ళు. మరి ఇప్పుడు అలా ఇస్తే చీప్‌గా వుంటుంది. పని కొచ్చేదో, పనికిరాదో ఏదో ఒకటి ఇవ్వాల్సిందే. ఇప్పుడు అందరూ ప్లాస్టిక్ డబ్బా ఇస్తున్నారు రిటర్న్ గిఫ్ట్‌గా.. కొన్ని డబ్బాలు తన్నుకున్నా మూతలు రావు. కొన్నింటికి యెంత ప్రయత్నించినా మూతలు పట్టవు. ప్లాస్టిక్ కాకపోతే స్టీలు వస్తువులు. అవి పల్చగా గాలికి కొట్టుకుపోయేలా వుంటాయి. అవి కాకపోతే ఎందుకూ పనికిరాని చిత్ర విచిత్రమైన చైనా వస్తువులు ఇస్తారు.

ఎందుకిస్తారో ఇటువంటి గిఫ్టులు అని విసుక్కుంటారు పుచ్చుకున్నవారు. ఇచ్చేవాళ్ళు ఏడుస్తూ ఇవ్వాల్సిందే.. పుచ్చుకునేవాళ్ళు విసుక్కుంటూ పుచ్చుకోవాల్సిందే. కానీ ఆ పద్ధతి మాత్రం మారదు... మార్చుకోరు ఎందుకు అంటే ఏం చెప్తాం మన ఖర్మ. గతంలో ఇంత వేలంవెర్రి లేదు. గొప్పలకిపోయి పళ్ళు రాలగొట్టుకునే పద్ధతి ఉండేది కాదు.

మా తాతయ్యగారు పెద్దవారయ్యాక చక్కగా పట్టులాల్చీ, జరీ ఉత్తరీయం వేసుకుని ఏ పెళ్ళికో వెళ్ళటానికి రెడీ అయితే, వాళ్ళకి ఏం బహుమతి ఇస్తున్నారు అని అడిగేవాళ్ళు మా వాళ్ళు.

నా దగ్గరేంవుందిరా ఇవ్వడానికి? పెద్దవాడిని వెళ్ళి మనసారా ఆశీర్వదించి నాలుగు అక్షింతలు జల్లి వస్తాను అనేవారు. అలా బాగుండదు మేమిస్తాం తీసుకెళ్లి ఇవ్వండి అంటే నవ్వేవారు. మీరు నాకిచ్చి, నేను వాళ్ళకిచ్చి ఎందుకురా ఈ నాటకాలు? నా సంగతి ఎవరికి తెలియదనీ? బహుమతులు కావాలనుకునేవారు నన్ను పిలవరు... అంతేగా అనేవారు.

మా పెద్ద మావయ్యా అంతే. ఏ వేడుకకి పిలిచినా ఒరే ముందే చెప్తున్నా... నేను రిటైరయ్యాను, నేనేం కానుకలు తేలేను. చిరునవ్వు, శుభాశీస్సులు అంతే... అనేవారు. అయ్యో ఎంతమాట– పెద్దవారు మీరొచ్చి ఆశీర్వదిస్తే చాలు మాకు అనే వాళ్ళు. మనం కూడా ఆ సింప్లిసిటీ అలవరచుకుని ఏడుస్తూ కానుకలిచ్చి, ఏడుస్తూ పుచ్చుకునే దుర్దశ నుండి బయటపడితే బాగుండును.

కాదు కూడదు ఇవ్వాల్సిందే అంటే... గిఫ్ట్ కూపన్స్ ఇస్తే వాళ్ళకి కావలసినవి వాళ్ళు కొనుక్కుంటారు.

బహుమతులు ముందు పెట్టుకుని భోరున ఏడిచే బాధుండదు. అటువంటి రోజులొస్తాయా? వస్తే బాగుండును. ❑

# సంగీత గండం

**గు**రువారం మధ్యాహ్నం స్కూల్ నుంచి రాగానే ఏడుపు మొదలుపెట్టింది మా శ్రీపూజిత. అది మాకు మామూలే. మంగళవారం, గురువారం అదలాగే ఏడుస్తుంది. కారణం వున్నా లేకపోయానా ఏదో వంకపెట్టుకుని ఏడుస్తుంది. ఎందుకంటే ఆ రెండు రోజులూ సాయంత్రం నాలుగింటికి సంగీతం టీచరు ప్రహర్షిత వచ్చి పాఠం చెప్తుంది. రెండింటినుంచే ఇది ఏడుపు మొదలుపెడుతుంది. వాళ్ళమ్మ గదమటం, పోట్లాడటం అదింకా శోకాలు పెట్టి ఏడవటం... విసిగిపోతున్నాం.

అదేం ఖర్మమో తరతరాలుగా మాకు సంగీతం అచ్చి రావటంలేదు. మా అందరివీ కోకిల కంఠాలు. త్యాగరాయ కృతులు నేర్పించి కచేరీ ఇప్పించాలని మావాళ్ళ కోరిక. కచేరీ మాట దేవుడెరుగు అసలు పాఠం సాగితేగా!

మా ముందు తరం వాళ్ళూ నేర్చుకున్నారు. సంగీతం మాట ఎలా వున్నా పాఠం మొదలుపెట్టి స్వరజతుల దాకా రాకుండానే పెళ్ళిళ్లయి వెళ్లిపోతున్నారు పిల్లలు– అని మురిసిపోయేవాళ్ళట మా పెద్ద వాళ్ళు.

ఆ తరువాత మాకు శేషమ్మగారని ఓ పెద్దావిడ సంగీతం చెప్పేది. ఆవిడ మాకు దూరపు బంధువు కూడానట. కొద్దిరోజులకే ఆవిడ ఆరోగ్యం పాడై పోయింది. పాట తక్కువ, దగ్గెక్కువగా వుంది. మన వూరు వెళ్లి గుళ్ళో పూజ సామాన్లు తోముకో అని చెప్పి పంపించేశారు తాతయ్యగారు. నేర్చుకున్నవే సాధన చేసుకోండి అన్నారు. మళ్ళీ ఎవరినైనా చూస్తాం సంగీతం చెప్పటానికి అన్నారు. అలాగే సాధన చేసుకునే వాళ్ళం.

మరుసటి నెలలోనే ఓ అబ్బాయి వారం కోసం వచ్చాడు మా ఇంటికి. మాటల్లో అతనికి సంగీతం వచ్చని తెలుసుకుని మరి ఇకనేం? వారాలొద్దు, రెండు పూటలా మనింట్లోనే తిను, ఇక్కడే వుండు. బదులుగా మా పిల్లలకి సంగీతం చెప్పు అన్నారట. అతని పేరు పార్వతీశం. పార్వతన్నయ్యా అని పిలిచేవాళ్ళం.

మళ్ళీ మొదలయ్యాయి మా సంగీతం పాఠాలు. మాది ఉమ్మడి కుటుంబం. బోలెడుమందిమి వుండే వాళ్ళం. ఆపిన దగ్గరనుంచీ మొదలుపెట్టాలి అందరికీ. మాటలు తిన్నగా రాని చెల్లెళ్లు మొదలుకుని పెళ్ళీడుకొచ్చిన అక్కలదాకా అన్ని వయసులవాళ్లూ సరిగమలు మొదలుకొని వర్ణాలదాకా రకరకాల పాఠాలు. దానికి తోడు తరతరాలుగా అచ్చొచ్చిన హార్మనీ పెట్టె. అదీ బస్సు హారనులాగా మోగేది.

అల్లరీ ఎక్కువే. ఎవరికివాళ్లు మా పాఠం వదిలేసి పక్కవాళ్ళకి చెప్తున్నది పాడేవాళ్లం. మా పార్వతన్నయ్యని ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువులనీళ్లు తాగించేవాళ్ళం.

ఆ మాటే మా బామ్మదగ్గర మొరపెట్టుకునేవాడు మా పార్వతన్నయ్య. ఓరి వెర్రిమొహమా? ఈ మాత్రం దానికి ఇంత గొడవెందుకూ? పక్కవాళ్ళ పాఠం వీళ్ళకి చెప్పి వీళ్ళ పాఠం పక్కవాళ్లకి చెప్పేస్తే సరిపోదుట్రా పార్వతీ... అంది మా బామ్మ.

నా ఖర్మ నాకు ఈ సంగీతం పాఠం నుండి విముక్తి లభిస్తే బావుండు– అని తల బాదుకున్నాడు పార్వతన్నయ్య. మరుసటి నెలలోనే అతని కోరిక తీరింది... అదెలాగంటే మా పెద్దక్కయ్యకి పెళ్లి చూపులు.

“పార్వతీ... రారా వేణుగోపబాలా సాధన చేయించరా సీత చేత” అంది బామ్మ. ఆవేళ్టికి అది తడబడితే మీరు అందుకోండి అని మాకూ చెప్పింది.

అల్లాగే జరిగింది. పెళ్లిచూపుల్లో అది తడబడటం మేము అందుకోటం మాతోపాటు మిగిలినవాళ్లుకూడా ఎవరికొచ్చింది వాళ్లు పాడటం నానా ఖంగాలీ అయిపోయింది. పెద్దవాళ్ళు మా అందరినీ గదుమటం చిన్న పిల్లలు ఏడవటం ఇదంతా చూసి మా సీతక్కయ్య కూడా ఏడిచింది. పిల్ల బానే వుంది. గానీ పాట కచేరీతో బెదిరిపోయాడు పిల్లాడు. నాకొద్దని మొత్తుకుంటున్నాడు, మేము నచ్చచెప్పాం. పాట లేకుండా మళ్లీ చూపించండి అని మధ్యవర్తులు చెప్పారట. మావాళ్ళు మమ్మలనందరినీ గదిలో పారేసి పెళ్లిచూపులు చూపించి ఓకే అనిపించుకున్నారు.

ఆడపిల్లలు చక్కగా సంగీతం నేర్చుకుని మనకు పేరు ప్రతిష్ఠలు తెస్తారని ఆశపడ్డాం. ఇట్లా పరువు తీస్తారనుకోలేదు. పాట మనకు అచ్చిరాలేదు. ఇక సంగీతం వద్దులే అని మాన్పించారు. పార్వతన్నయ్యకి వేరే పని చూపించారు. దాంతో మా సంగీత శిక్షణ అటక ఎక్కింది.

మా పెద్ద బావగారు మాత్రం చాలా బెదిరిపోయారు. పెద్దల్లుడి హోదాలో మా అందరి పెళ్ళిళ్లకి నడుము కట్టుకుని నిలబడేవారు. మా ఇంట్లో ఎవరి పెళ్లి చూపుల్లో

అయినా సంగీతం వచ్చా? అని అవతలివాళ్ళు అడగ్గానే ఠకీమని లేచి రాదండీ రాదు. పాడరు. నాదీ పూచీ అని ముందు జాగర్త పడేవారు పాపం.

అలా మా తరం గడిచిపోయింది. పిల్లల తరం వచ్చింది. షరా మామూలే. మా అమ్మాయికి సంగీతం నేర్పించాలని చూసాను. మొదటిసారి అచ్చిరాలేదు. మళ్లీ ప్రయత్నించాను. మా అమ్మాయి చక్కగా పాడుతుంటే సంగీతం నేర్చుకున్నావా అమ్మా... అనేవారు. కొత్త మాస్టారు వద్ద నేర్చుకున్నానండీ. అలంకారాల దాకా నేర్చుకునేసరికి మా మాస్టారికి గుండె పోటొచ్చి పోయారు పాపం... అని చెప్పేది. వాళ్ళ మొహాల్లో రంగులు మారిపోయేవి. మళ్లీవస్తాం అని అదే పోత పోయేవాళ్లు. అలా చెప్పకే, నీకు పాఠం చెప్పటం మొదలుపెట్టాక ముందే ఆయనకి రెండుసార్లు గుండెపోటు వచ్చిందట అని ఎంత చెప్పినా అర్థం అయ్యేది కాదు దానికి. అలా నేను పిలిపించటం, అది వెళ్ళగొట్టటం– ఇక విసుగేసి ఊరుకున్నా.

ఇదుగో ఇప్పుడు మనవరాళ్ళ తరం నడుస్తోంది. అదేవిటో ప్రత్యేకమైన శిక్షణట. నర్సరీనుంచే ఐఐటి కోచింగులాగా మొదటినుంచే టీవీ ప్రోగ్రాములలో పాటల పోటీలకు పాడేలా నేర్పుతారుట సంగీతం. మా పిల్లకీ అదే కోచింగు నడుస్తోంది. రెండు నెలలు అయింది పాఠం మొదలుపెట్టి. పిల్ల ఏడవా... టీచరు ఏడవా... వాళ్ళిద్దర్నీ చూసి తల్లి ఏడవా... ఈగోల తప్పించి సంగీతం అర అంగుళం ముందుకి సాగటం లేదు. పరిచయం దగ్గరే ఆగిపోతుంది బండి.

అందరికీ నమస్కారం. నా పేరు శ్రీపూజిత. నేను గ్లోరి కాన్వెంట్‌లో ఎల్‌కెజి చదువుతున్నా. నేను శ్రీమతి దుర్వాసుల ప్రహర్షిత గారి దగ్గర సంగీతం నేర్చుకుంటున్నాను. మా తాతగారు జన్నాభట్ల యాజ్ఞవల్క్య శర్మ గారి ప్రోద్బలంతో సంగీతం నేర్చుకుంటున్నాను– అని పరిచయం చేసుకోవాలిట. పిల్లసన్నాసికి నోరు తిరగక అఘోరిస్తోంది. భోరున ఏడుస్తోంది.

అదికాదు తల్లీ... ముందు సరళీస్వరాలతో మొదలుపెట్టి సంగీతం నేర్పి ఆ తరువాత అది ప్రోగ్రాము ఇచ్చే స్థాయికి వచ్చాక అప్పుడు ఈ పరిచయ కార్యక్రమం పెట్టుకోవచ్చు కదమ్మా అంటే టీచరు వినదు. సిలబస్‌నే ఫాలో అవుతుందిట.

ఈప్రోగ్రాం గొడవ ఏమిటే మామూలుగా సంగీతం నేర్పించు అంటే తల్లి వినదు. ఇప్పుడు మామూలు సంగీతం నేర్పించి ఆ తరువాత మళ్లీ ప్రోగ్రాం కోసం ట్రైనింగు ఇవ్వాలంటే కష్టం కదండీ. అయినా ఇప్పుడు అంతా ఇదే పద్ధతి నడుస్తోంది అంటుంది.

ఏతావాతా మంగళవారం, గురువారం మా ఇంట్లో మారెమ్మ జాతర. ఆ పాఠానికి నెలకి వెయ్యి. నాకు ఓర్పు నశించిపోయింది. చూడమ్మా, అసలే మనింట్లో సంగీత శిక్షణ అచ్చిరాదు. తరతరాలుగా మొదలుపెట్టటం, మానెయ్యటం తప్పించి కీర్తనలదాకా ఎవరం రాలేదు. పాటలు రేడియోలో విని పాడేసాం... కచేరీలూ గట్రా ఇవ్వలేదు గానీ ఫలాన ఆవిడ బాగా పాడుతుంది అని పేరు తెచ్చుకున్నాం. ఇప్పుడిదీ ఆ మాత్రం పాడలేక పోదు. నేను నేర్పుతాను. సంగీతం సంగతి దేవుడెరుగు ఈ ఏడుపు చూడలేకపోతున్నాను అన్నాను కోడలితో.

అదింకా సణగుతూ వుంటే నేనే కలగచేసుకుని మా గతం అంతా వివరించి చెప్పి ఆ ప్రహర్షితను మర్యాదగా సాగనంపాను. తనకి ఇక ముందు సంగీతం పాఠం ఉండదనీ, పరిచయ కార్యక్రమం ఉండదనీ తెలుసుకుని మా పిల్ల సన్నాసి తెగ సంబరపడిపోయింది. చా లొత్తా లొత్తాలా దావాత్తిత్తా లిత్తాలా?... అని సరాదగా కంఠం విప్పి ఇల్లెగిరిపోయేలా పాడడం మొదలుపెట్టింది. ❑

# మీకెందుకూ నేనున్నాగా...

**అ**ర్ధరాత్రి దాటినా నిద్ర రావటం లేదు. వెధవ జీవితం... విరక్తి వచ్చేస్తోంది. ఎన్నాళ్ళు ఇలా బరువు బాధ్యతలతో కాలం గడపాలి? ఎప్పటికి ఈ జీవితానికి విముక్తి. నాలాంటి ప్రాణులకు మోక్షం లేదా?? అటూ, ఇటూ దొర్లుతుంటే మా బాస్ విసుక్కున్నారు మళ్లీ ఏం ముంచుకొచ్చింది? అన్నారు. చెప్పాలని నోటి దాకావచ్చింది కానీ నా బాధ చెప్పుకున్నా అర్థం కాదు ఎవరికీను. నా సమస్యలు నలకల్లాగా అనిపిస్తాయి. నా బాధ చాదస్తంగా అనిపిస్తుంది.

"ఏమయింది? ఇందాకటినుంచి చూస్తున్నాను, రుబ్బుడు పొత్రంలా దొర్లుతున్నావు. ఎవరైనా ఏమైనా అన్నారా?" అడిగారు. ఈయనకి చెప్పటం కంటే వూరుకోటం ఉత్తమం.

మనకు కష్టం వస్తే పక్కవాళ్లకి చెప్పుకుంటాం గానీ ప్రభుత్వం వారికి ఫిర్యాదు చేస్తామా? అదీ ఇంతే. అందుకే ఆయనకేం చెప్పలేదు. ఏదోలెండి పీత కష్టాలు పీతవి. నా బాధలు నాకుంటాయి కదా... అని అనేసాను.

ఇంతకీ ఏమిటి నీకొచ్చిన కష్టం అంటారా? రేప్పొద్దున టిఫిను ఏం చేయించాలా అని టెన్షన్. ఇంట్లో దోశ పిండీ లేదు, ఇడ్లీ పిండీ లేదు. అవి రెండూ వుంటే కొండంత ధైర్యం. ఇంట్లో ఎవరు ఎప్పుడొచ్చి ఆకలి అన్నా ఏదో టిఫిను పెట్టచ్చు. అతిథులొచ్చినా, అభ్యాగతులొచ్చినా వెతుక్కునే పనుండదు. అసలెప్పుడూ పెద్దగిన్నెడు పిండి రుబ్బి ఫ్రిజ్‌లో ఉంచుకుంటా.

ఏమిటీ ఇంత చిన్న విషయానికి అంత టెన్షన్ పడాలా అని నవ్వుకుంటున్నారా?... సగటు ఇల్లాలిని నాకింతకంటే ఏం సమస్యలుంటాయి?? అయినా ఇదేం చిన్న సమస్య కాదు. అనుభవించే వాళ్ళకి తెలుస్తుంది ఆ బాధ.

అసలు ఇల్లాలి పొజిషన్ అంటేనే చాలా తలనొప్పి వ్యవహారం. బోలెడన్ని బాధ్యతలు... మంచి పనులు చేస్తే మెచ్చుకోళ్ళు వుండవుగానీ ఏ మాత్రం తేడా వచ్చినా

సాధించేస్తారు. తెల్లారి లేస్తే ఇక మొదలు మంగళాక్షతలు, అష్టావధానం. అన్ని పనులూ మనకే పురమాయిస్తారు. కాఫీ మరీ చూరు నీళ్ళలా వుంది... పాలూ కాఫీ పొడి మార్చి చూడు. పేపరువాడు ఆలస్యంగా వస్తున్నాడు... గట్టిగా చెప్పు లేకపోతే వేరేవాడిని చూడు. ఇస్త్రీ బట్టలవాడు ఈమధ్య తిన్నగా చెయ్యటం లేదు మార్చెయ్యి. కేబుల్ వాడు వెధవ ఏ చానలూ తిన్నగా రాదు. వీడిని పొమ్మను... వేరేది పెట్టించు. నెట్ బాగా స్లోగా వుంది. వాడికి ఫోన్ చేసి ఫైరింగ్ ఇవ్వు... ఇలా సాగిపోతూనే వుంటుంది నేను చెయ్యాల్సిన పనుల జాబితా.

ఇక భోజనాల విషయానికి వస్తే దినదిన గండం నూరేళ్ళు ఆయుర్దాయం అన్నట్టు వుంటుంది నా బాధ. ఒకరు తిన్నది మరొకరు తినరు. పులుసూ బెల్లం వేసిన వంటలు పిల్లలకి నచ్చవు. మసాలా వేస్తే పెద్దలకి నచ్చదు. ఆ మాట అంటే మళ్లీ కోపాలొస్తాయి.. మాకేం సూకిరాలు లేవు. నువ్వు గడ్డి పెట్టినా నోరెత్తకుండా తినేస్తాం అంటారు. వొళ్ళు మండిపోతుంది నాకు. పోతేపోయింది ఏ పాలవాడినో అడిగి నాలుగు మోపులు గడ్డి వేయించుకుని అదీ ముందు పడేసి తినండి ఓ వారం రోజుల పాటు అందామనిపిస్తుంది. కానీ భారత నారిని కదా! అంత కఠోరంగా ఉండలేను. అందుకే అందరి ఆటలూ సాగిపోతున్నాయి.

ఏవిటో ఎక్కడో మొదలుపెట్టి ఎక్కడికో పోతున్నాను టీవీ సిరియల్‌లాగా! పాయింటుకొస్తా.

ఈ మధ్యే వారం రోజులుగా బయట పనుల మీద తిరుగుతూ కొంప విషయం గాలికొదిలేశాను. పప్పు నానబొయ్యటం మర్చిపోయాను. ఓ రోజు ఉప్మా, ఓ రోజు పూరీ, ఓ రోజు రవ్వట్టు, ఓ రోజు అటుకుల ఉప్మా, ఓ రోజు మజ్జిగ అట్లూ పోసి బండి లాగేసాను. నిన్న బ్రెడ్ టోస్ చేసే సరికి అందరూ విసుక్కున్నారు. ఎవరికీ జ్వరం? ఏ డాక్టర్ నాన్ రొట్ట పెట్టమన్నాడు? అన్నారు.

హడావిడిలోపడి పప్పు నానబోయటం మర్చిపోయాను. రేప్పొద్దున దోసెలు వేస్తాను అని సంజాయిషీ ఇచ్చాను. మళ్ళీ ఏదో హడావిడిలోపడి మర్చిపోయాను. రాత్రి పదింటికి గుర్తొచ్చింది, అప్పుడు నానబోసాను. అదీ తెల్లారాక రుబ్బితే ఎల్లుండికి అందుకుంటాయి. మరి రేపెలా గండం గడుస్తుంది?

రేపు ఏం చెయ్యాలి ఫలహారం? ఉరి తియ్యరుగానీ బోల్డన్నీ సలహాలూ ఇస్తారు. అసలు ఇంట్లో జరిగే అన్ని పనులకూ నేనే బాధ్యురాలిని అవటం అందరికీ అన్ని

విషయాలకూ నేనే సంజాయిషీ ఇవ్వటం ఇదంతా అన్యాయంగా లేదూ? అయినా ఈ ఏడుపు ఈనాటిది కాదు తరతరాలుగా వస్తోంది. మా అమ్మమ్మ సాయంత్రం పూట కూర తరుక్కుంటూ బోలెడంత బాధపడిపోయేది.

ఏమిటో పొద్దు పొడిచేనమ్మ నారాయణా, పొట్టలకి వేళాయే నారాయణా, పొద్దు కుంకేనమ్మా నారాయణా, పొట్టలకి వేళాయే నారాయణా అని ఎప్పుడూ వండుకోవటంతోనే వెళ్ళమారిపోతోంది జీవితం. ఈ సృష్టి పురుషుడు చేసాడు కాబట్టి ఇలా అఘోరించింది. అదే అమ్మవారు గనక సృష్టి చేసి వుంటే నెలకోమారే ఆకలేసేట్టు ఏర్పాటు చేసి వుండేది. కుటుంబ భారం అంతా ఆడదాని నెత్తినే ఉండకుండా జాగర్త పడేది అని వాపోయేది.

అందరూ నన్నిలా చులకన చేస్తున్నారంటే దానికి కారణం మాకు యూనియన్ లేదు, వుంటే హక్కులకోసం పోరాడొచ్చు. సమ్మెలూ గట్రా చెయ్యచ్చు. ఇన్నాళ్లూ పిచ్చి మొహాల్లాగా వుపోషాలంటూ కొంపలోనే పడి అఘోరించాం. అదే ఏ రోడ్డు పక్కనో ఓ షామియానా వేసుకుని కూర్చుంటే బోలెడంత పబ్లిసిటీ వచ్చి వుండేది. చక్కగా ఏ గొప్పవాళ్ళో వచ్చి నిమ్మరసం అందించి బతిమాలి దీక్ష విరమింపచేసేవాళ్ళు.

అప్పుడు మా డిమాండ్‌లు అన్నీ కాకపోయినా కొన్ని అయినా తీర్చేవాళ్ళు–తీర్చకపోయినా బెంగలేదు. మళ్ళీ శనివారమో, గురువారమో వస్తుంది. మళ్ళీ శిబిరం.... మళ్ళీ నిరాహారదీక్ష... మళ్లీ నిమ్మరసం. ఏదో రాజకీయ నాయకులు 24 గంటల నిరాహారదీక్షకి పూనుకోడం విరమించటం. అయితే ఆటగా వుంది గానీ ఇల్లాళ్ళంతా వారానికి రెండు మూడు రోజులు నిరాహారదీక్ష అంటే దేశం గగ్గోలెత్తిపోదా? యెంతమంది పెద్ద తలకాయలు కావాలి? యెంత నిమ్మరసం కావాలీ? ఏలినవారి తరం కాదు.

అసలు ఇల్లాల్లకి ఆగ్రహంవస్తే ఆపతరమా? ఇన్నాళ్ళూ ఊరుకున్నాం. ఇక ఉపేక్షించకూడదు. నేను ఓ పథకం వేసాను మన కష్టాలు గట్టెక్కే మార్గం ఆలోచించాను. ఇక ఇల్లాళ్లకు అన్నీ మంచి రోజులే. ఇల్లాళ్లకోసం ప్రత్యేకంగా ఓ ప్యాకేజీ రూపొందించాను. ఇంట్లో ఇల్లాళ్లకి ఫుల్ పవర్స్ ఉండాలి. ఇంట్లో వాళ్ళు ఇల్లాలిని... ఆ పని చెయ్యి... ఈ పని చెయ్యి అని దాష్టీకంగా అడక్కుండా ప్లీజ్ నీకు వీలుంటే మాకీ సాయం చేసినట్టు అని వినయంగా అడగాలి. ఇష్టం వుంటే చేసి కష్టం అయితే 'నే చెయ్యను. మీ దిక్కున్న చోట చెప్పుకోండి' అనే హక్కు వుండాలి ఇల్లాలికి. మీ

నాన్న అట్లా చేసాడు. మీ అమ్మ నిన్ను గాడిదలా పెంచింది– అంటూ ఇంట్లో వాళ్లు చులకనగా మాట్లాడితే పోలీసులకి ఒక్క ఫోన్ చేసి యావత్తు కుటుంబాన్నీ జైల్లో పెట్టించే అధికారం కావాలి. ఇంకా చాలా వున్నాయి ఆ ప్యాకేజీలో.

నేను సీఎం అవగానే మొట్టమొదటి సంతకం ఆ ఫైల్ మీదనే పెడతాను. నువ్వేమిటి? సీఎం అవడం ఏమిటీ? ఏవిటా వాగుడూ!! పిచ్చికుక్క గానీ కరిచిందా అంటారా?

ఆ!! ఈమధ్య ప్రతివాళ్ళూ అంటూనే ఉన్నారుగా... మొదటి సంతకం ఆ ఫైలుమీదనే పెడతాం అనీ!!

అలా అన్నవాళ్ళంతా సీఎంలు అవబోయారా! నేను కాకపోయానా? ఏదో మాటవరసకి అన్నాను. అయినా ప్యాకేజీ చూసి మురిసిపోకుండా నువ్వు సిఎం అవుతావా... సింగినాదమా? అంటే నేనేం చెయ్యనూ... ఉరేసుకు చావనా? ❑

# చక్కగా పద్ధతిగా

**మా** శాంతగారు ఫోన్ చేసింది. "ముందే చెప్తున్నా ఫిబ్రవరి మొదటి వారంలో మీరు ఊరొదిలి వెళ్లటానికి వీల్లేదు. అలా వెళ్తే నేనూరుకోను" అంది. పోలీసులు దొంగలకి చెప్పినట్లూ చెప్పేసరికి నాకు భయం వేసింది. "ఎందుకూ నేనేం నేరం చేసానూ?" అని ఆవిడనే అడిగాను. "మా అమ్మాయికి పెళ్లి కుదిరింది. పద్ధతి ప్రకారం అయిదు రోజుల పెళ్లి. మీరు అయిదు రోజులూ రావాలి. ఇంటికొచ్చి పిలుస్తాను. మీరు ఇంకే ప్రోగ్రాం పెట్టుకోకుండా ఉంటారని ముందుగా చెప్తున్నా" అంది. నాకు భయం ఆశ్చర్యం కలిగాయి. భయం ఎందుకంటే ఈ మహా నగరంలో ఎవరైనా పిలిస్తే ఒక్కసారి వెళ్లి రావాలంటేనే తల ప్రాణం తోకకి వస్తుంది. అయిదు సార్లు వెళ్లడం అసాధ్యం.

నా చిన్నప్పుడు మా అమ్మ చెప్పింది అదివరకు ఐదు రోజుల పెళ్లిళ్ళు జరిగేవిట. తరువాత చెయ్యలేక మూడు రోజులకి కుదించారుట.

అమ్మ పెళ్లి మూడురోజులేనట... మొదటి రోజు లగ్నం, స్థాలీపాకం రెండో రోజు సదస్యం బూజంబంతి మూడో రోజు నాగవల్లి అప్పగింతలూ టక టక అయిపోయిందట. ఇక తరువాత క్రమంగా రెండురోజులూ, ఒకరోజు, ఒక పూట అలా మారిపోతుంది మరి. మళ్ళీ ఇప్పుడు అయిదు రోజుల పెళ్లి అంటే పాత పద్ధతులు మళ్ళీ వచ్చాయా? పాతవన్నీ మళ్ళీ ఫాషన్ అయిపోతున్నాయిగా ఇదీ అంతేనేమో! వెళ్లగలిగితే బానే వుంటుంది. కానీ అంత వోపిక ఉండద్దూ?

అనుకోకుండా వో మంచి అవకాశం కలిసి వచ్చింది. మా పిన్ని కొడుకు సింగపూర్ టూర్ పెట్టుకున్నాడు. మా పిన్ని ఒంటరిగా వుండాలి ఇంట్లో. ఆ వారం రోజులూ నువ్వొచ్చి వుంటావా అక్కయ్యా? అని రిక్వెస్ట్ చేసాడు. నేనూ ఇల్లొదిలి వెళ్లి చాలా ఏళ్లయింది. ఈ తలనెప్పి ఓ వారం వదిలినా చాలనుకున్నారేమో ఇంట్లో వాళ్ళూ సంతోషంగా వెళ్లిరా అన్నారు.

మా పిన్ని గారిల్లు శాంత గారింటి దగ్గరే. నడిచి వెళ్ళచ్చు. అటు పెళ్లికి వెళ్లొచ్చు అని పట్టు చీరెలూ గట్రా పెట్లో సర్దుకుని బయలుదేరి వెళ్లాను.

మా తమ్ముడు ఊరికే టెన్షను పడ్డాడు గానీ మా పిన్నికి ఎవరి సాయమూ అక్కర్లేదు. ఆవిడే పది మందికి సాయం చేస్తుంది కావలిస్తే.

ఇలా శాంత గారింట్లో పెళ్లి విషయం చెప్పి వెళ్లనా పిన్నీ అంటే మహారాజులాగా వెళ్ళు కావలిస్తే నేనూ వస్తాను నీకు తోడుగా అంది.

ఆ విషయమే శాంత గారికి ఫోన్ చేసి చెప్పాను అయిదు రోజులూ వస్తున్నా అన్నాను. ఆవిడ చాలా సంతోషించింది. మీ పిన్ని గార్ని కూడా తీసుకురండి అంది.

"అయ్యో వస్తాను పెళ్ళంటే మాటలా! అందులోనూ ఐదు రోజుల పెళ్లి అంటున్నావు. పెద్ద దాన్ని నేనొస్తే వాళ్ళకి మాట సాయమేగానీ తిండి దండగ వుండదు." అంది పిన్ని.

మొదటిరోజున మెహందీ వేడుకట. పెద్ద స్పీకర్లో పెళ్లి పాటలు ఎద్దంత సౌండుతో పెట్టి ఇంటిల్లి పాదీ గోరింటాకు పెట్టించుకున్నారు. పది మంది ప్రొఫెషనల్స్ వచ్చారు. అందరికీ మెహందీ పెట్టడానికి పెళ్లి కూతురికి మోచేతులదాకా మోకాళ్ల దాకా పెట్టారు.

"పాతరోజుల్లో మేజువాణిలో బోగం మేళం పెట్టిన్చేవాళ్ళు. ఇదుగో ఇప్పుడీ మేళం. మరి పద్ధతులు మారుతూ వుంటాయి" అంది పిన్ని.

మర్నాడు సాయంత్రం మగ పెళ్లి వారు కూడా వచ్చారు. వాళ్లదీ ఈ ఊరే అటు వాళ్ళూ ఇటు వాళ్ళూ కలిసి సరదాగా గడుపుతారుట. అంత వరకూ బాగానే వుంది ఇద్దరు జాకీలుట వాళ్ళని పట్టుకొచ్చారు వాళ్ళు మైకులు పుచ్చుకుని చాలా సందడి చేసారు. కొంచెం సేపు డాన్సుచేసి పెళ్లి కూతుర్నీ పెళ్లి కొడుకునీ లాక్కుపోయి వాళ్ళ చేత డాన్సు చేయించారు.

అది మొదలు అటుపక్క వాళ్ళు ఇటుపక్కవాళ్ళు అందర్నీ లాక్కెళ్ళి డాన్సులు చేయించారు. ముందు బలవంతంగా డాన్సు చేసిన వాళ్ళు ఆ తరువాత హుషారుగా డాన్సు చేసారు.

ఆ పూట అన్నీ చాట్ ఐటమ్స్ విందారగించి వచ్చాం. "మండినట్టే వుంది వీళ్ళ సరదా. ఏదో చిన్న పిల్లలు యెగిరినా పిచ్చి గంతులు వేసినా బానే వుంటుంది గానీ ఎద్దులల్లే పెద్దవాళ్ళు గంతులెయ్యటం ఏవిటీ? ఆ అవతారాలూ ఆ లక్షణం నడుములు

తిప్పుకుంటూ వాళ్ళు డాన్సు చేస్తుంటే రుబ్బు రోళ్లు దొర్లుతున్నట్టుగా వుంది" అంది పిన్ని విసుగ్గా.

నాలుగోరోజు సాయంత్రం పెళ్లివారు తరలి వస్తారుట. ఆవేల్టికి రమ్మంటే వెళ్లాం ఓ!!! అదిరిపోయే బ్యాండు. అట్టహాసంగా బాణాసంచా ఆ వెనక గుర్రం మీద పెళ్లికొడుకు.." అదేవిటే పెళ్లి పూటా పాపం ఆ పిల్లాడిని గాడిద మీద ఊరేగిస్తున్నారు?" అంది పిన్ని.. గాడిద కాదు పిన్నీ గుర్రం అన్నా "అదేం గుర్రం? ఇప్పుడా? ఇంకాసేపట్లోనా అనేట్టు వుంది సరే పోనీ గుర్రమే అనుకుందాం అయినా పిల్లాడిని గుర్రం మీద ఎందుకు ఎక్కించారు.?" అంది.

ఇది ఉత్తరాదివారి పద్ధతి అన్నాను." మనం తెలుగు వాళ్లం కదా ఊరేగింపు కావాలంటే మన పద్దతిగా చక్కగా పల్లకీ లోనే వూరేగించచ్చుగా! ఈ బక్క గుర్రం ఊరేగింపు ఎందుకూ అంది.

మాట మార్చేసాను ఆ తరువాత రిసెప్షన్ అంతా డిటో డిటో ఓ యాభై రకాల వంటలతో విందు ఆరగించి ఇంటికొచ్చాం. లాస్ట్ బట్ నాట్ లీస్ట్. అయిదోరోజు ముహూర్తం అప్పటికి నాలుగు రోజుల నుంచి వస్తూ పోతూ వున్నారేమో యాభైమంది కూడా లేరు పందిట్లో. కుర్ర గుంపు బెల్లం జీలకర్ర పెట్టగానే కెవ్వు కెవ్వున కేకలలు వేసి వాళ్లిద్దరికీ షేక్ హ్యాండ్ ఇచ్చి తాళి కట్టేదాకా కూడా ఉండకుండా చక్కా పోయారు.

అందరూ అలిసిపోయి వున్నారు. కానిచ్చెయ్యండి అని పురోహితుడిని తొందరపట్టి తరుముతుంటే ఆయన తలంబ్రాలు సమర్పయామి నాగవల్లి సమర్పయామి అంటూ అరగంటలో వివాహం ముగించేసాడు. ఆపూట పూర్ణం బూరెలు పులిహోరతో తెలుగు భోజనం విందారగించి ఇంటికొచ్చాం.

అయిదు రోజులుగా తిరగటంతో అలసటగా వుంది మంచం మీద అడ్డంగా పడిపోయాను. పిన్ని మాత్రం పడుకోలేదు అలసటగా లేదా కాసేపు నడుము వాల్చు అన్నాను. ఏం కష్టపడిపోయానని అలిసిపోతాను? అంది విసుగ్గా. ఇంతకీ ఈ పెళ్లి ఎలా ఉంది? అన్నాను.

"ఏవిటో అంతా అయోమయంగా వుంది వోట్టొట్టి హడావిడీ ఆర్భాటం. మరదలు పెళ్లి కొడుకు చెప్పులు దాచటం... పెళ్లి కూతురికి మేలి ముసుగు వెయ్యటం వంటి అరువు పద్ధతులన్నీ చేసి అసలు ముఖ్యమయిన మన పద్ధతులు దాటేసారు. లాజ హోమం చేయించలేదు అగ్నికి ప్రదక్షిణం చేయించలేదు అరుంధతీ దర్శనం

చేయించలేదు. పెళ్లి తంతు తూతూ మంత్రంగా మొక్కుబడిగా చేసేసారు. నది వొడ్డున బారలు దాచుకుని ఈది మధ్యలోకి వెళ్లి కాళ్ళు తేలేసినట్టూ ఆ అవసరం వేడుకలకి బోలెడు మంది వున్నారు. తీరా మంగళ సూత్రం కట్టే వేళకి ఎవ్వరూ లేరు. ఇదేం పెళ్లి?.. నీ ఫ్రెండు పద్ధతిగా చేశా పద్ధతిగా చేశా అంటూ ఒకటికి పదిసార్లు చెప్పింది. ఇప్పుడు పెళ్లి హడావిడిలో వుంది కాబట్టి ఊరుకున్నాను. నాలుగు రోజులయ్యాక వెళ్లి ఇది ఎవరి పద్ధతి అమ్మాయ్ అని అడిగి తెలుసుకోవాలి. "పాత కాలం దాన్ని కొత్త విషయాలు తెలుసుకోవాలి కదా" అంది పిన్ని

మా పిన్ని తల్చుకుందంటే వూరుకోదు. అడిగే తీరుతుంది. మా పిన్ని ప్రశ్నకి శాంత ఏం సమాధానం చెప్తుందో చూడాలి మరి పన్లో పనిగా నా సందేహం కూడా తీరుతుంది. ❑

# కొత్త కొత్త వంటలు

**మ**ధ్యాహ్నం పూట టి.వి. పెడితే చాలు. అన్ని చానల్స్ లోనూ వంటల ప్రోగ్రాములే వస్తూ ఉంటాయి. స్వీట్స్, హాట్స్, కూరలు, పచ్చళ్ళు, పులుసులు, సలాడ్స్, కూల్ డ్రింక్స్ ఒకటి కాదు. వందలకొద్దీ వంటలు. ఎన్నెన్నో కొత్త ప్రయోగాలు. మనం కల్లో కూడా ఊహించని చిత్ర విచిత్రమైన పదార్థాలు వండి రుచి చూపించటం రుచి చూసిన యాంకరు "అబ్బ యెంత టేస్టీగా వుందో" అని మెచ్చుకోవటం ఇదంతా మామూలైపోయింది. అవన్నీ చూసి కొత్త రకాలు ప్రయత్నించి చూద్దాం అనిపించినా అదేమంత సులభం కాదు... ఇక మా ఇంట్లో ఆ పప్పులు ఉడకవు. వంట విషయంలో తరతరాల రుచులే కొనసాగుతున్నాయి. ఇప్పటికీ ప్రయోగాలు క్షమించరు. వాళ్ళ భయం అలా వుంచి టి.వి.లో చూపించే వంటలు చూస్తుంటే అవి వండటానికి నాకే ధైర్యం చాలటం లేదు. ఇది వరకు లాగా కుదిరితే కుదిరింది... కుదరకపోతే అవతల పారేస్తాం... అని లైట్‌గా తీసుకునేందుకూ లేదాయెను! అన్ని వస్తువుల ధరలూ మండి పోతున్నాయి.

ముప్పూటలా తినడానికి ఆహారం సమకూర్చుకునేసరికే తాతలు తలపుకి వస్తున్నారు. ఇక ప్రయోగాలు చేసే సాహసం ఎవరికుంటుంది?

ఆ మధ్యన ఓ చానల్లో చూసాను అరటికాయతో పాయసమట దానికి కావలసిన వస్తువులు చేసే విధానం అన్నీ వివరంగానే చెప్పారు. మరి పాయసం అంటే పాలూ పంచదార కోవా జీడిపప్పూ కిస్మిస్ యాలకులూ వంటి ఖరీదైన పదార్థాలు కావాలి.

నాబోటి మహా మేధావి అరటికాయ పాయసం ప్రయత్నించి అదికాస్తా అయ్యవారిని చెయ్యబోతే కోతి అయింది అన్నట్టూ అయిందనుకోండి. అంత ఖర్చు వండిన ఆ పాయసం పారెయ్యాలంటే ప్రాణం ఉసూరుమంటుంది. నేనొక్కతినే తినాలి. దాంతో పాటు ఇంట్లో వాళ్ళ చీవాట్లూ నేనే తినాలి. అంతకంటే చక్కగా సేమ్యా పాయసం అరటికాయ వేపుడూ చేసుకుంటే సేఫ్ కదా!

నావొక్కతెకే కాదు. ఇది అందరికీసమస్యే. ఆడవాళ్ళకి ఆ వీక్‌నెస్ వుంది. ఎక్కడైనా కొత్తరకం చీరె కనిపిస్తే కొనుక్కోవాలనిపిస్తుంది... కొత్తరకం వంట చూస్తే వండుకోవాలనిపిస్తుంది. గతంలో పక్కింటి పిన్నిగారు కొత్తరకం వండి రుచి చూపిస్తే అది మనకు నచ్చితే వెంటనే వండుకునేవాళ్ళం. మధ్యలో ఏదైనా సందేహం వస్తే గోడ దగ్గరికి వెళ్ళి పిన్నిగారిని కేకేస్తే ఆవిడ సాయం చేసేది. మరి ఇప్పుడా వెసులుబాటు ఏదీ? టి.వి.లో చూసి నేర్చుకున్న వంట మొదలెడితే కడ దాకా మనదే భారం... కుదిరితే మన అదృష్టం. తగలడితే మన ఖర్మ. వంట చెయ్యటం ఆషామాషీ కాదు. పాతికేళ్ల కింద కాపరానికొచ్చి అప్పటి నించీ వంట చేస్తున్నా చేస్తూ కమ్మగా పప్పు వండటం చేతగాని వాళ్ళు నాకు తెలుసు. వండిన రీతిన వండకుండా ఏడాదికి మూడొందల అరవై రకాలుగా అన్నం వండగల ఇల్లాలినీ చూసాను.

మరి అటువంటి వాళ్లు కొత్త వంటల జోలికి పోతే ప్రమాదాలు జరిగిపోవూ?? అందులోనూ అవి మామూలు వంటలు కావు కదా!

ద్రాక్ష పండుతో బజ్జీలూ, పుచ్చకాయతో పులిహోరా, పొట్లకాయ హల్వా, పాలకూర పాయసం వంటి విచిత్రమైన వంటల జోలికి పోవాలంటే యెంత గుండె ధైర్యం కావాలీ?

బహుశా ఈ వంటలు భవిష్యత్తులో మనకు బాగా ఉపయోగపడచ్చు. ఎందుకంటే ఈ మధ్య అన్ని సరుకుల ధరలూ మండిపోతున్నా కూరల ధరలు మరీ దారుణంగా వున్నాయి. కూరని కూరగా వండుకునేందుకే కష్టం అయిపోతోంది.

ఇప్పటికే పడిన కష్టానికి ఫలితం దక్కక విరక్తి చెంది అన్న దాతలు పంటలు వెయ్యటం మానేస్తున్నారుట. ఇదిలాగే కొనసాగితే భవిష్యత్తులో కూరలే అపురూపం అయిపోయే పరిస్థితి వస్తుందేమో! కూరలతో హల్వాలు పాయసాలు వగైరా స్పెషల్స్ చేసుకుని రోజూ పప్పు చారుతో సరిపెట్టుకునే రోజులొస్తాయేమో... ఎవరు చూడొచ్చారు? ❑

# భరించలేనంత భద్రత

**మ**నది శాంతి కాముక దేశం. ఇక్కడి ప్రజలందరూ స్నేహపాత్రులు. మనది ఒంటిపిల్లి రాకసిలా పడుండే స్వభావం కాదు. చిలో పోలో మంటూ పది మందితో కలిసి పోవాలనే చూస్తాం. స్వేచ్ఛ స్వతంత్రం లేని చోటికి వెళ్ళాలంటే చాలా మొహమాట పడిపోతాం. ఎవరికైనా మన మీద ఇసుమంతైనా అనుమానం వచ్చిందని తెలిస్తే అక్కడికక్కడే తలకాయ బద్దలు కొట్టుకుని చావాలనిపిస్తుంది.

మరిప్పుడు ఆ పౌరుషం అంతా గాల్లో కలిసిపోయింది. తెల్లారి లేచి పనిమీద బయలు దేరితే ఇంట్లోంచి బయట కాలుపెట్టిన దగ్గరనుంచీ మనం నేరస్తులకిందనే లెక్క. ఎవరు ఎక్కడ ఎప్పుడు ఎవరు మనని నిలబెట్టి తనిఖీ చేసినా నోరెత్తే అధికారం లేదు మనకి. మన స్వేచ్ఛ మన స్వాతంత్ర్యం వొక్క దెబ్బకు ఆవిరై పోయాయి.

2001/9/11 తరవాత ప్రపంచం మొత్తం ఉలిక్కి పడింది. అంతకు ముందుకూడా భద్రత పాటించడం వుండేది కానీ అది పెద్దలకూ ప్రముఖులకూ మాత్రమే పరిమితమై వుండేది.

ఇతరులు లోనికి రారాదు. ఈ హద్దు దాటిన వారు శిక్షార్హులు అని కొన్ని చోట్ల లక్ష్మణ రేఖలు... గీసివుండేవి. ఆ నియమాలు అందరూ పాటించేవాళ్ళు... మిగిలిన చోట్ల మనదే రాజ్యం. సామాన్యులు హాయిగా స్వేచ్ఛగా తిరుగుతూ వుండే వాళ్ళు. అమెరికాపై టెర్రరిస్టుల దాడి తరువాత అంతా మారిపోయింది. భద్రతా వలయంలో చిక్కుకుపోయాం అందరం. అమెరికా వంటి అగ్ర రాజ్యం మొదలుకొని మన లాంటి వెనక బడ్డ దేశం దాకా అన్ని దేశాల్లోనూ భద్రతకే ప్రథమస్థానం.

చెకింగులే చెకింగులు... అడుగడుగునా అన్ని చోట్లా చెకింగు. ఆ చెకింగ్ ప్రాణాంతకంగా మారుతోంది. సామాన్యుల ఓర్పుకు పరీక్ష పెడుతోంది. జీవితంలో సగం సమయం ఈ చెకింగ్ లకే సరిపోతుంది. సరే మరి దుష్టశక్తులు పెచ్చు మీరిపోతున్నప్పుడు దాడులు జరుగుతున్నప్పుడు ప్రజలను కాపాడటం కోసం ఆ మాత్రం

జాగ్రత్త వహించటం మంచిదే. అది వారి బాధ్యత కూడానూ కానీ మిగిలిన అన్ని విషయాల్లోనూ ఏలిన వారి ప్లానింగ్ ఎలా వుంటుందో భద్రతా విషయంలోనూ అలానే తయారయింది.

అయితే అమీరు లేకపోతే ఫకీరు అన్నట్టుగా వుంది. కొన్ని చోట్ల మరీ మితిమీరిపోతోంది. మరికొన్ని చోట్ల నీరుగారిపోతుంది. ఒక దగ్గర అత్యుత్సాహం. మరో దగ్గర నీరసం నిస్ప్రాణ.

ఆ మధ్య ఆగ్రా వెళ్లినప్పుడు చూసాను. తాజమహల్ దగ్గర చాలా పటిష్ఠమైన భద్రతా వ్యవస్థ.

నా హ్యాండ్ బాగ్ చెక్ చేసి రూపాయి క్రేన్ వక్క పొడి పాకెట్, పెన్ తీసి ఇవి లోపలి తీసికెళ్లకూడదు క్లోక్ రూంలో పెట్టండి అన్నారు. ఆ క్లోక్ రూం అక్కడికి ఓ అర కిలోమీటర్ దూరంలో వుంది. మళ్ళీ కాళ్ళీడ్చుకుంటూ అంత దూరం ఏం వెళ్తాను అని అవి రెండూ అక్కడే వున్న చెత్త డబ్బాలో పారేసి లోపలికెళ్లాను.

నా వెనకాల ఓ జంట వున్నారు చేతిలో ఆరునెలల బేబీ. ఆ పాపకి కావలసిన పాలు నీళ్ళు వున్న ఓ చిన్న బాగ్ వుంది వాళ్ల దగ్గర. ఆ బాగ్ తీసికెళ్లటానికి వీల్లేదు అన్నారు. క్లోక్ రూంలో పెట్టమన్నారు. అదేవిటి? పిల్లకి ఆకలేస్తే యెట్లా? అంటే అదంతా మాకు తెలియదు. బాగ్ మాత్రం తీసికెళ్ళనివ్వం అన్నారు. చివరికి వాళ్ళు ఒకరు పాపతో బయటే వుండి ఒకరు లోపలికి వెళ్లి తాజ్ చూసి రావాలని నిర్ణయించుకున్నారు. ఇంకేం చేస్తారు?

అది భద్రతా? లేకపోతే అతి తెలివా?

మనలో వున్న లోపం ఏమిటి అంటే దాహం వేసాక బావి తవ్వటం మొదలు పెడతాం. ఇప్పుడు ఈ భద్రత విషయం కూడా అలాగే అయింది.

అన్ని చోట్ల హఠాత్తుగా భద్రత అవసరం వచ్చిపడింది. మరి సెక్యూరిటీలో శిక్షణ పొందిన నిపుణులు వేల సంఖ్యలో తెల్లారే సరికి తయారు కాలేరుగా? కాబట్టి ఆపద్ధర్మంగా ఎవరినో అక్కడ నిలబెట్టి ఇదుగో భద్రతా పరంగా అన్ని చర్యలూ తీసుకున్నాం అని చేతులు దులిపేసుకుంటున్నారు. ఇక ఆపై సెక్యూరిటీ వారి దయా సామాన్యుడి అదృష్టం.

ఆ సెక్యూరిటీ చూస్తుంటే నవ్వాలో ఏడవాలో అర్థం కాదు. పదిమంది తిరిగే ప్రతిచోట ఓ ఎలెక్ట్రానిక్ తోరణం వుంటుంది. అందులోంచే వెళ్ళాలి. మనిషి దాటి వెళ్లగానే అది కీచు కీచు మంటుంది. ఆ తర్వాత ఓ మనిషి మెటల్ డిటెక్టర్ పట్టుకుని నిలబడి ఉంటాడు. మగవారిని అతను పరీక్షిస్తాడు. ఓ పక్కగా ఆడ వాళ్లకోసం కాస్త మరుగు వుంటుంది. వాళ్ళని అక్కడ పరీక్ష చేస్తారు.

మాల్‌కి వెళ్ళినా గుడికి వెళ్ళినా ఇదే దృశ్యం. ఇక అక్కడి భద్రత ఎలా ఉంటుందో చూసి తీరాల్సిందే. పొద్దున్నే రద్దీలేని సమయాల్లో వెళ్లిన ప్రతి మనిషినీ, పెళ్ళికి తరలివెళ్ళిన పెళ్లికొడుక్కి పెద్ద ముత్తైదు దిష్టి తీసినట్టూ వోపిగ్గా శ్రద్ధగా పరీక్షిస్తారు.

రద్దీ పెరిగిన కొద్దీ శివరాత్రి నాడు శివాలయంలో పూజారి శఠగోపం పెట్టినట్టూ అర నిముషంలో అరవై మందిని చెక్ చేసేస్తారు. ఇదంతా కంటితుడుపు చర్య కాక నిజమైన భద్రతా?

ఇక దేశంలో ఎక్కడైనా ఏదైనా అవాంఛనీయమైన సంఘటన జరిగితే మిగిలిన అన్ని చోట్ల భద్రత ఏర్పాట్ల మీద మరింత శ్రద్ధ వహిస్తారు. అలాంటి సమయాల్లో మామూలు వాళ్లు బయటికి వెళ్తే చుక్కలు కనిపిస్తాయి. మామూలు రోజుల్లో మాత్రం పట్టించుకోరు. మీ వస్తువులకు మీదే బాధ్యత... ఇది చైన్ స్నాచింగ్ ప్రాంతం. జాగ్రత్తగా వుండండి. జేబు దొంగలు వున్నారు జాగ్రత్త– అనేసి మన మీదే భారం మోపి చేతులు దులిపేసుకుంటారు.

ఇవన్నీ మనకూ అలవాటైపోయాయి. కాకపోతే ఒక్కోసారి మాత్రం ఒళ్ళు మండి పోతుంది. మహా నాయకుల కాన్వాయ్ వెళ్ళాలంటే భద్రత కోసం రోడ్లన్నీ ఖాళీ చేయిస్తారు. బారులు దీరిన వాహనాలనూ, ఎండలో నిలబడ్డ పాదచారులనూ చూసినప్పుడూ కోపం వస్తుంది.

ఓట్లు అడగడానికి ఓపెన్ వాన్ మీద నిలబడి రోడ్ షోలో ఆవేశంగా ఉపన్యాసాలు ఇస్తున్నప్పుడు, ఎన్నికలప్పుడు ప్రచారం సమయంలో అందరిళ్ళల్లోకి జొరబడి వాళ్ళ పిల్లలని ఆడించీ, వాళ్లకి కూరలు తరిగిపెట్టి ప్రజల్లో ఒకరుగా కలిసిపోయిన వాళ్లకి ఒక్కసారి పదవి రాగానే ఎందుకటా అంత భద్రత?? మన ప్రాణాలు తోడెయ్యటానికి కాకపోతే!!! ఆఫీసులకి వెళ్ళే వాళ్ళు, వృద్ధులు, పసిపిల్లల తల్లులు, అందరూ ఆగాల్సిందే, అంబులెన్సుతో సహా అన్ని వాహనాలూ ఆగాల్సిందే.

ఏ సినిమాకో వెళ్తామా? టికెట్ కొన్న తరువాత వెంటనే లోపలి పోనివ్వరు. గబ్బిలాల లాగా బయటే వేలాడాలి ఓపిక ఉన్నా లేకపోయినా అలా నిలబడాల్సిందే... కూచునే చోటు కూడా వుండదు.

షోకి అయిదు నిముషాల ముందు వాకిలి తెరుస్తారు. లేడీసుకి చెకింగ్. అక్కడ ఓ పీచు లాటి పిల్లో వయసుడిగి పోయిన ముసలమ్మో వుంటారు చెకింగ్‌కి. ఓసారి అలా బాగ్ చూసేసి పొమ్మంటారు. మీరు కట్టుకున్న చీరే బావుంది అనో మీ పాపాయి బావుంది అనో మెచ్చుకుంటారు.

ఇంతోటి భద్రతకోసం అందర్నీ బయట ఆపేసే బదులు లోపలికొచ్చి కూచోనివ్వచ్చుగా? ఏవిటో ఈ భద్రత. నిజంగా భద్రత కల్పించాలంటే సామాన్య ప్రజల మీద వారికింత ప్రేమ వుంటే శిక్షణ పొందిన నిపుణులని నియమిస్తే వాళ్ళు చేస్తారు చెకింగ్.

అప్పుడు చెకింగ్ వున్నా నిజమైన చెకింగ్‌లాగా వుంటుంది. ప్రజలని కాల్చుకు తినేలా వుండదు. కాదూ ఎదవ పేనాలు. అర్ధణాకి ఆరు అమ్ముతాను అని ముత్యాలముగ్గు సినిమాలో కాంట్రాక్టర్‌లాగా అనుకుంటే అసలు చెకింగ్ చేసే విధానానికే స్వస్తి చెప్తే పీడా పోతుంది. పోన్లే శివుని ఆజ్ఞ లేకపోతే చీమైనా కుట్టదు అనుకుని సామాన్యులం హాయిగా తిరుగుతాం.

ఇదుగో ఇలా వుండీ లేనట్టూ వున్న ఈ భద్రత ఎందుకూ మనకు, నీళ్ళులేని ఫైర్ ఇంజనులాగా??? ❑

# వెతుకుల బతుకులు

**తె**ల్లవారింది "మామ్మా! నా క్రేయాన్స్ చూసావా? నిన్న ఇక్కడే పెట్టాను" అంది నా మనవరాలు. క్రిష్ణాక్షయం!! మొదలూ వెతుకులాట... ఇంకో పదినిముషాలలో దాని స్కూల్ బస్సు వచ్చేస్తుంది. నేను చేతిలోని పని అవతల పారేసి వెతకటం మొదలు పెట్టాను. ఏ మాటకామాటే చెప్పుకోవాలి మా ఇంట్లో మిగిలిన పనుల్లో బద్ధకించినా వెతకటం అంటే మాత్రం అందరూ వెంటనే వచ్చి వాలిపోతారు... అందరం కలిసి వెతికాం. దొరికాయి క్రేయాన్స్. న్యూస్ పేపర్లలో పడిపోయాయి... అమ్మయ్య అనుకున్నాం. మరి అన్నీ అటూ ఇటూ విసిరేసి వెతికాం కదా! అవన్నీ సర్దుకోటం మొదలు పెట్టా. మాకు మరో అలవాటు కూడా వుంది. వెతకటంలో అందరూ తలో చెయ్యి వేస్తారు గానీ సర్దడం విషయానికి వచ్చేసరికి అందరూ చల్లగా జారుకుంటారు. సరే అవసరానికి ఆదుకున్నారు అదే పదివేలు అనుకుందాం అంటే పక్కన కూర్చుని దండకం చదువుతూ వుంటారు.

ఏవిటో వస్తువులన్నీ జాగ్రత్తగా పెట్టుకుంటే ఈ బాధలుండవు. కానీ ఏదీ? ఆమాత్రం డిసిప్లిన్ వుంటే మన జీవితాలు ఇంకోరకంగా ఉండేవి. మా అక్క వాళ్ళింట్లో ఎంత పద్ధతిగా వుంటుందీ అంటే గుడ్డి వాడుకూడా కళ్ళు మూసుకుని మేనేజ్ చేసెయ్యగలడు– అని ఉదాహరణలతో సహా సాగిపోతుంది... ఆ వాక్ప్రవాహం.

అటువంటి కబుర్లు వింటే నాకు ఒళ్ళు మండుతుంది... గుడ్డి వాడు కళ్ళు మూసుకోవడం కూడా ఎందుకూ? అదో అదనపు శ్రమ కాకపోతేనూ అని అడగాలనిపిస్తుంది. అలా కాసేపు ఉదాహరణలు చెప్పి కొన్ని సలహాలు ఇస్తూ వుంటారు. ఈలోగా అన్నీ సద్దటం ముగించి వెళ్ళిపోతాం. ఇంకో వస్తువు వెతుక్కోవడానికి.

అదేం ఖర్మమో మా జీవితంలో సగం సమయం అలా వెతుకులాట లోనే గడిచిపోతుంది. పోనీ ఇల్లు అంతా అయోమయంలా ఉంటుందా అంటే కాదు, అద్దంలా

వుంటుంది. ఇంటికొచ్చిన వాళ్ళు ముందు ఇంటిని చూసి తరువాతే నన్ను చూస్తారు. మెచ్చుకుంటారు కూడాను.

ఒక్కరు సర్ది నలుగురు విరజిమ్ముతారా అంటే అదీ కాదు. ఆడా మగా తేడా లేకుండా అందరం ఇంటిమీద పడి సద్దుతూనే వుంటాం. ఏ ప్లేస్ ఫర్ ఎవ్వెరి థింగ్ ఇన్ ఇట్స్ ప్లేస్ అనేది మా స్లోగన్. మరి తేడా ఎక్కడా అంటే మా ఆలోచనలూ భిన్నంగా వుంటాయి. జనరేషన్ గ్యాప్ ఒకటి ఉందికదా మరి. ఒకరికి ముఖ్యం అనిపించినా వస్తువు ఇంకొకరి కంటికి ఆనదు.

ఉదాహరణకి కరెంటుపోగానే వెతుక్కోకుండా రెండు టార్చ్ లైట్‌లు రెండు కొవ్వొత్తులూ ఓ అగ్గిపెట్టె హాల్లో షో కేసులో వుండాలి అంటారు మా ఆయన. ఇంట్లో ఇన్‌వర్టర్ వుంది. అంతగా అదీ ఆగిపోతే సెల్‌ఫోన్ వెలుగులో స్టోర్ రూం దాకా వెళ్లి తీసుకోవచ్చు కదా ఈ సరంజామా అంతా స్టోర్ రూంలో పెడదాం అంటాడు కొడుకు.

సెల్ ఎక్కడో పడేసి అదెక్కడుందో కనిపెట్టడానికి ల్యాండ్ లైన్ నించీ రింగ్ ఇస్తూ వుంటారు. వీళ్ళనీ వీళ్ళ సెల్ ఫోన్లనీ నమ్ముకుంటే అయినట్టే. వాళ్ళకేం కుర్రవాళ్ళు. పెద్దవాళ్లం చీకట్లో కళ్ళు వినిపించక అవస్థ పడాలి– అవి అక్కడే వుండనీ అంటారు ఆయన.

"ఫోటోలూ వీడియోలు సెల్ తోనే తీసేస్తూ వుంటారు. ఆ భాగ్యానికి హ్యాండీ కేం ఒక వెబ్ కేం రెండు డిజి కేంలు హాల్లో అలమరలో ఎందుకూ? పొరబాటున చెయ్యి తెగిలితే కిందపడి తగలడతా ఏమోనని నా భయం. వాటిని తీసి లోపల భద్రంగా పెట్టవచ్చు కదా?" అంటారు ఈయన.

"పోతే పోతాయి. హఠాత్తుగా ఫోటోలు తీసుకోవాలంటే అప్పుడు ఎక్కడా వెతుక్కుంటాను? కళ్ళెదురుగానే వుండాలి" అంటాడు పుత్రుడు.

మా ఇంట్లో ఇంకో అలవాటు కూడా వుంది. ఇటువంటి విషయాలు ఎవరూ నేరుగా మాట్లాడుకోరు... అందరూ నాదగ్గరే చెప్పుకుంటారు.

ఇలా ఎవరికి వాళ్ళు పక్క వాళ్ళు పెట్టిన వస్తువులు తీసి ఎక్కడో వేరేచోట పెట్టి అక్కడ తమ ఇష్టానుసారం వేరేవి పెట్టటం వల్ల ఏవెక్కడున్నాయో ఎప్పుడూ గందర గోలమే. మా ఇంట్లో అన్నీ వస్తువులూ సమృద్ధిగా వుంటాయి. కానీ ఏం లాభం? అవసరానికి ఎవొక్కటీ దొరకదు డజన్లకొద్దీ పెన్నులు వుంటాయి. ఎవరైనా ఫోన్‌చేసి

వాళ్ళ అడ్రస్ నోట్ చేసుకోమన్నప్పుడు ఒక్క పెన్నూ దొరకదు. దొరికింది రాయదు. ఒక్క పెన్నులనే కాదు. ఏవీ దొరకవు సమయానికి. అబ్బాయికి ఆఫీసు టైం అయిపోతూ వుంటుంది లంచ్ బాక్స్ దొరకదు.

పాలవాడు డబ్బులకోసం వచ్చి వాకిట్లో నిలబడతాడు బీరువా తాళాలు దొరకవు. పిల్ల కిందపడి దెబ్బ తగుల్చుకుంటుంది ఫస్ట్ ఎయిడ్ బాక్స్ కనిపించదు... చాకలి ఇస్త్రీ బట్టలు తెస్తుంది. పద్దుపుస్తకం కనిపించదు. ఫోన్ మోగుతూ వుంటుంది హ్యాండ్ సెట్ దొరకదు. ఇలా చెప్పుకుంటూ పోతే అంతం వుండదు. మళ్ళీ ఎక్కడికీ పోవు. అక్కడే ఎక్కడో పడి ఉంటాయి. కానీ సమయానికి మాత్రం దొరకవు.

కొంపలో చెత్త ఎక్కువై పోతోంది. అదంతా పారేస్తే ఇల్లు నీట్‌గా వుంటుంది. ఇలా ఒకటి కావాలంటే పది తీసి వెతుక్కునే బాధ తప్పుతుంది. అని మా అందరి ఏకాభిప్రాయం.

కానీ ఏదీ చెత్త? అనే విషయంలోనే మళ్ళీ అభిప్రాయాలు కుదరవు మా ఆయన ఎవొక్కటీ పారెయ్యనివ్వరు. “ఉండనీ పడుంటాయి. ఎప్పుడు ఏ వస్తువుతో అవసరం వస్తుందో? అప్పుడు ఎక్కడికి పరిగెడతాం?” అంటారు. మా పిల్లలు పారేసిన సెల్ఫోన్ల చార్జెర్‌లు అన్నీ భద్రంగా దాస్తారు. ఇవ్వాళ ఫోన్లు పారేసిన వాళ్ళు రేపు చార్జెర్లు పారేసుకోరా? అప్పుడు పనికొస్తాయి అంటారు.

మా కోడలు మావగారికి పూర్తిగా అపోజిట్. దాని కంటికి ఇంట్లో అన్నీ అనవసరంగానే కనిపిస్తాయి. వారానికి ఒకసారి నడుము బిగించి ఇవన్నీ పారేద్దాం అని ఓ బండెడు సామాను కుప్ప పెడుతుంది. అది ఇల్లు సర్దుతుంటే నేను ఆ చుట్టు పక్కల ఉండను. నన్నూ చెత్తలో విసిరేస్తుందేమో అని భయం.

నేనే పూనుకుని ఈయన దాచిన వస్తువుల్లో కొన్ని పారేసి,, అదిపారేసినవాటిల్లోంచీ కొన్ని ఏరి భద్రం చేసి సంసారం లాక్కొస్తున్నాను కాబట్టి ఇంతమాత్రంగానైనా వెళ్ళ మారిపోతున్నాయి రోజులు. లేకపోతే ఎప్పుడో మంగళం పాడేసేది మా సంసారం. నేను రహస్యంగా అలాంటి పన్లు చేస్తానని అందరికీ తెలుసు. అందుకే ఏది కనిపించక పోయినా ముందు నన్నే అడుగుతారు.

అదివరకు నాకు మాంచి జ్ఞాపక శక్తి వుండేది, నిద్రలో లేపి అడిగినా ఠకీమని చెప్పేసేదాన్ని. రాన్రాను రాజుగారి గుర్రం గాడిద అయింది– అని సామెత చెప్పినట్టూ తగని మతిమరుపు వచ్చి పడింది.

అన్నీ జాగ్రత్తగా పెడతాను గానీ ఏవెక్కడున్నాయో సమయానికి తన్నుకున్నా గుర్తుకు రావు. పుణ్యకాలం కాస్తా గడిచిపోయి మరో ఏర్పాటు చేసుకున్నాక అప్పుడు బుర్రలో లైటు వెలుగుతుంది. ఇన్ని కారణాల వలన మా ఇంట్లో అందరం ఎప్పుడూ ఏదో ఓ వస్తువు కోసం వెతుక్కుంటూనే వుంటాం. మరి దురదృష్టమో మా ఇంటి వాస్తు దోషమో!

నాకు చాలా మంచిపన్లు చెయ్యాలనిపిస్తుంది. ప్రశాంతంగా ఓ గంట సేపు పూజ చేసుకోవాలనిపిస్తుంది. రామకోటి రాసుకోవాలనిపిస్తుంది. ఓ మంచి పుస్తకం చదువు కోవాలనిపిస్తుంది ఏదీ? పనిమంతురాలా ఏం చేస్తున్నావే అంటే పారబోసి ఎత్తుకున్నాను అందిట వెనకటికి ఓ భాగ్యశాలి. అలాగే రోజంతా ఇల్లు సద్దుకోనూ ఏదో ఒక వస్తువుకోసం వెతుక్కునే ప్రక్రియలో అన్నీ వెదజల్లుకోనూ మళ్ళీ సద్దుకోనూ దీంతోనే వెళ్ళ మారిపోతోంది జీవితం.

మా ఇంట్లో అందరికీ ఏకాభిప్రాయం కుదిరి ఈ వెతుకులాటలు తప్పి ప్రశాంతంగా వుండే రోజులొస్తాయా? ఏమో కాలమే నిర్ణయించాలి. ❑

# ఎంతెంత దూరం?

స్నానం పానం, పూజా పునస్కారం ముగించి తీరిగ్గా కూచున్నా కంప్యూటర్ ముందు. ఇదో వ్యసనం అయిపోయింది. రోజూ పొద్దునో గంట, రాత్రి ఓ గంటా కంప్యూటర్‌తో కాలక్షేపం చెయ్యకపోతే చేతులు ఒకటే దురద పెడతాయి. బుర్ర పిచ్చిగా ఉంటుంది. నాకనేముంది? ఇప్పుడు అందరి జీవితాల్లోనూ అగ్రస్థానం కంప్యూటర్‌దే కదా! మనందరి పాలిట అదో కల్పవృక్షం.

ఎన్నో పనులను తన నెత్తిన వేసుకుని మన భారం ఎంతో తగ్గించింది. ముఖ్యంగా కమ్యూనికేషన్‌ని చాలా సులభతరం చేసింది. ఇదివరకు ఏదైనా శుభకార్యం తలపెడితే ఫంక్షన్ చెయ్యడానికి అయిన ఖర్చుకి రెట్టింపు పిలుపులకి అయ్యేది. ఇప్పుడు నయాపైసా ఖర్చు పెట్టకుండా ఎన్నొందల మందినైనా పిలవచ్చు కంప్యూటర్ ద్వారా. ఒక్క కార్డు తయారుచేసి ఒక్క క్లిక్ చేస్తే చాలు. ఏ మూలకైనా క్షణంలో వెళ్ళిపోతుంది మన ఆహ్వానం. పిలుపు అందలేదు, అందితే తప్పకుండా వచ్చేవాళ్ళం– అని బుకాయించే అవకాశం అవతలి వాళ్ళకు లేదు. పిలవడానికి వచ్చాం, మీరింట్లో లేరు– అని సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం మనకూ లేదు.

ఇకపోతే– గతంలో డిసెంబర్ మొదట్లోనే మొదలయ్యేది గ్రీటింగ్ కార్డుల సందడి. కార్డులు కొని అడ్రస్‌లు రాసి వాటికి స్టాంపులు అంటించి అవన్నీ పోస్ట్ చేయడం బోలెడంత శ్రమ, ఖర్చు కూడానూ. ఇప్పుడా బాధే లేదు. డిసెంబర్ ముప్పైన కూర్చుని మీకూ మీ కుటుంబానికీ అటు ఏడు తరాలకూ ఇటు ఏడు తరాలకూ హ్యాపీన్యూ ఇయర్ అని టైపు చేసి నిముషంలో అందరికీ అభినందనలు అందజేయవచ్చు.

ఇక ఫేస్‌బుక్‌లు వచ్చాక మనవాళ్ళ వివరాలు, వారి యోగక్షేమాలు కనుక్కునే పని కూడా తప్పింది. సాలెగూడులాగా విస్తరించిన ఫేస్‌బుక్‌లో వెతకాలే గానీ మన వాళ్ళందరూ దొరుకుతారు.

నా చిన్నప్పుడు మా ఊళ్ళో ఒక పద్ధతి వుండేది. ఏదైనా సమాచారం ఊళ్ళో అందరికీ తెలియజెయ్యాలంటే ఊరంతా చాటింపు వేయించేవాళ్ళు. ఇప్పుడా బాధ్యత సమర్థవంతంగా నిర్వహిస్తోంది ఫేస్‌బుక్. అందులోకి వెళ్తే మన వాళ్ళ సంగతులన్నీ తెలుస్తాయి.

అందుకే– అందరిలాగే నేనూ కంప్యూటర్‌కి ఆడిక్ట్ అయిపోయాను. ఆన్ చెయ్యగానే ముందు మెయిల్స్ చూసుకుంటాను. అభిమానుల మెయిల్స్‌కి కృతజ్ఞతలు, విమర్శకుల ప్రశ్నలకి సమాధానాలు ఇచ్చాక యు ట్యూబ్‌లోకి వెళ్ళి పాత పాటలు వింటూ మెయిల్ ఓపెన్ చేశా.. నాలుగైదు మెయిల్స్ వున్నాయి. వాటికి రిప్లై ఇచ్చాను. ఫేస్‌బుక్‌లో నాలుగు నోటిఫికేషన్స్ వున్నాయి. "మా ఆయన చాలా మంచివాడు. నాకు వంట చేసి పెట్టాడు" –అని ఒకావిడ పెట్టింది.

"మా సమ్మర్ ట్రిప్ చాలా బాగా జరుగుతోంది" అని ఫోటోలతో సహా ఒక ఫ్రెండ్ పెట్టాడు. ఈ మధ్య మావూళ్లో ఫ్లవర్ షో జరిగింది. చాలా బావుంది అని మరో సమాచారం. వాటన్నిటికీ ఒక్క ముక్కలో కామెంట్ రాసేసి ముందుకు వెళ్ళా. అనూష పెట్టిన విషయం దగ్గర ఆగిపోయా..!

"మా అమ్మకు కుడి చెయ్యి రిస్ట్ దగ్గర ఫ్యాక్చర్ అయింది" – అని రాసింది. నాకు ఆశ్చర్యం వేసింది. అయ్యో పాపం అనిపించింది. వెంటనే వివరాల కోసం ప్రయత్నించాను. అయినవాళ్లందరూ.. అదే ఫేస్‌బుక్ భాషలో చెప్పాలంటే.. ఫ్రెండ్స్ చాలామంది స్పందించారు. అవన్నీ చదివితే వివరాలన్నీ తెలిశాయి.

ఇంట్లోనే జారిపడింది. బరువు అంతా ముంజేతి మీద పడింది. వాపుతో విపరీతమైన నొప్పి. వెంటనే హాస్పిటల్‌కి తీసుకువెళ్ళారు. వాళ్ళు ఎక్స్‌రే తీసి, ఎముక విరిగిందని చెప్పారు. సెట్ చేసి ప్లాస్టర్ వేశారు.

అయ్యో పాపం! చాలా బాధగా వుంది. ఆంటీ అంటే నాకు చాలా ఇష్టం. చిన్నప్పుడు నాకు ఇష్టం అని పిండి పులిహోర చేసి పెట్టేవారు–అని ఒకరు రాసారు.

అవును. పిన్ని దిబ్బరొట్టె బాగా చేసేది–అని మరొకరు రాసారు. ఆవిడనీ, ఆవిడ సేవల్ని తలచుకున్నారు. ఆవిడ త్వరగా కోలుకోవాలని మనసారా కోరుకున్నారు.

అనూష చికాగోలో ఉంటోంది. ఆమె తమ్ముడు సిడ్నీలో ఉంటున్నాడు. వాళ్ళమ్మ రుక్మిణి నాకు బాగా పరిచయం. బంధుత్వం గురించి చెప్పాలంటే చాలా పొడవవుతుంది.

ఒక్కమాటలో అది బీరకాయ పీచు చుట్టరికం. కానీ ఇద్దరం ఒకే వీధిలో పుట్టి పెరగటంతో స్నేహం ఎక్కువ.

కలిసి బొమ్మల పెళ్లిళ్లు చేశాం. చింతగింజలూ, అచ్చనగాయలూ ఆడుకున్నాం. అట్లతద్దికీ, ఉండ్రాళ్ళ తద్దికీ తెల్లవారు జామున వొప్పుల కుప్పలూ, వెన్నెలకుప్పలూ కలిసే ఆడుకున్నాం. రుక్మిణికి అలా జరగటం బాధగా అనిపించింది.

ఈ వయసులో ఇలా ఎముకలు విరగటం వంటి ప్రమాదాలు జరిగితే కోలుకోవటానికి బాగా టైం పడుతుంది. జాగ్రత్తగా చూసే నడుస్తాం కానీ మయసభలా వున్న ఈ కాలం ఇళ్ళలో ఫ్లోర్ మీద నీళ్ళు వున్నా కనబడవు.

కామెంట్స్ బాక్స్‌లోకి వెళ్లి "అనూషా.. అమ్మకి దెబ్బతగిలిన విషయమే తెలియదు నాకు. కుడి చెయ్యి అంటున్నావు. మరి ఇంట్లో వంట పని ఎలా చేసుకుంటోంది? నాన్నగారి ఆరోగ్యమూ అంతంత మాత్రమే. ఆయనకీ ఏ పనీ రాదు. అవస్థ కాదా? సాయంగా నువ్వుగానీ తమ్ముడుగానీ వస్తున్నారా? మామూలప్పుడు ఫరవాలేదు గడిచిపోతుంది, ఇటువంటి సమయాల్లోనేగా మనిషి అవసరం" అని టైపు చేశాను.

ఎంటర్ నొక్కబోతుంటే ఎక్కడో తప్పు చేస్తున్న భావన కలిగింది. మీ బతుకంతా ఇక ఈ యంత్రాలమయమేనా? ఈ తరం వాళ్ళు సరే. పాత తరానికి చెందిన మీరు కూడా పలుకరింపులకూ, పరామర్శలకూ ఇలా యంత్రాలమీదే ఆధారపడాలా? అని అంతరాత్మ నిలదీసింది.

వెంటనే కాన్సిల్ చేసేసి, కంప్యూటర్ కట్టేసి లేచాను. చీర మార్చుకుని ఫ్రిజ్‌లోనుంచి నాలుగు పళ్ళు తీసుకుని చెప్పులు వేసుకుని బయలుదేరాను. ఆటో ఎక్కా.

అసలు విషయం చెప్పనేలేదు. రుక్మిణి వాళ్లిల్లు మాకు చాలా దగ్గరే. ఆటో ఎక్కితే మినిమిం ఛార్జీతో వెళ్ళచ్చు. కానీ ఎప్పుడోగానీ వెళ్ళటం కుదరదు. అంత తీరిక లేనంత పనులూ లేవు చెప్పాలంటే. అదేమిటోగానీ మనుషులం దూరమైపోయాం... నిష్కారణంగా! ❑

# పిచ్చబొట్టు

**మా** రత్న ఓ రోజు చెప్పాపెట్టకుండా పదకొండింటికి వచ్చింది. దానివెంట దాని కూతురు దీప్తి. పద్నాలుగేళ్ళు వుంటాయి దానికి. పిల్ల చక్కగా తేలి చూడ ముచ్చటగా వుంది.

"రత్నా అందంలో నిన్ను మించి పోయేలా వుంది నీ కూతురు." అన్నాను. నేనన్న మాటకి సంతోషిస్తారు ఎవరైనా. పిల్ల బిక్క మొహం వేసింది. తల్లి ఏడుపు మొహం పెట్టింది. ఏదో సీరియస్ విషయమే అనుకుని మంచినీళ్ళు ఇచ్చి, చెప్పు ఏమిటి విషయం అన్నానో లేదో భోరున ఏడిచింది రత్న. తల్లిని చూసి పిల్లకూడా ఏడిచింది. ఏడిచే వాళ్ళని వూరుకోమనే అలవాటు లేదు నాకు. మనం వూరుకోమన్నా ఊరుకోరు మనసులో బాధ తీరిపొయ్యాక వాళ్ళే ఊరుకుంటారు.

ఈ రత్న మాకు దూరపు చుట్టం. వాళ్ళాయన పెద్ద ఆఫీసరు. ఆయన్ని ఆ మధ్య ఓ ఏడాది కోసం నాగాలాండ్ ట్రాన్స్ఫర్ చేసారు. పిల్ల చదువు పాడవుతుందని ఆయనొక్కడే వెళ్ళాడు. నాలుగు నెలలు గడిచేసరికి తిండి సరిగా అమరక ఆయనకీ సుస్తి చేసింది. అత్యవసర పరిస్థితుల్లో పిల్లని అమ్మమ్మ దగ్గర వదిలి రత్న మొగుడిదగ్గరకు వెళ్ళింది. ఈ బాధ్యత నాకొద్దు మొర్రోమని మొత్తుకుంది ఆ అమ్మమ్మ. మరెలా అవసరం కదా అని తల్లికి నచ్చ చెప్పి, పిల్లకి బుద్ధి చెప్పి, వెళ్ళింది రత్న. ఇప్పుడు తిరిగొచ్చింది. వాళ్ళాయన ఇంకో నెల తరువాత వస్తాడు.

ఇంతవరకూ తెలుసునాకు. ఇప్పుడీవిడ ఎందుకేడుస్తోందో మాత్రం తెలీదు. ఏడిచి మొహం కడుక్కుని వచ్చింది రత్న. ఇదేం నిర్వాకం చేసిందో చూడు అత్తయ్యా అంటూ కూతుర్ని గుంజి ముంజేతుల దాకా వున్న దాని డ్రెస్ పైకి లాగి చూపించింది చేతిమీద రన్‌డీర్ అని పచ్చబొట్టు. అదే ఇప్పటి భాషలో చెప్పాలంటే టాటూ.

ఏవిటి ఇదీ అంటే చెప్పింది. దీప్తి అప్పుడెప్పుడో ప్రేమలో పడిందట. తల్లి అటు వెళ్ళగానే పిల్లకి పట్ట పగ్గాలు లేకుండా అయిపోయాయి. పెద్దది అమ్మమ్మ కళ్ళల్లో

కారం కొట్టి పార్కులకి సినిమాలకీ తిరగటం అంతటితో ఆగినా బాగానే వుండేది. అదేదో ఎక్షిబిషన్ వెళ్లి దీని పేరువాడూ వాడి పేరు ఇదీ పచ్చ పొడిపించుకున్నారు.

వొళ్ళు మండిపోయింది. "పిల్ల బొందవి. నీకు అప్పుడే ప్రేమ ఏమిటీ?" అని కోప్పడ్డాను. నా పిచ్చిగానీ ప్రేమకి వయసుతో ఏం పని? ఏ పార్కులో చూసినా బొద్దాడని ప్రేమ జంటలే కనిపిస్తున్నాయి కదా చెట్లచాటున! "ఇప్పుడు సెల్ ఫోన్లో కబుర్లు చెప్పుకుని ప్రేమ వొలకబోసేసుకుంటున్నారుగా. నువ్వూ అలాగే ఏడవలేకపోయావా? పిచ్చి మొహంలా పచ్చబొట్టు ఎందుకు పొడిపించుకున్నావు?" అని అడిగా. ఏడుపు తప్ప ఒక్క మాటా మాట్లాడలేదు.

అసలీ పేరేమిటి/రన్‌డీర్ ఏమిటి? అన్నా.

ఎవరో హిందీ పిల్లాడుట. రణధీర్. వీళ్ళూ తడబడ్డారు. ఆ టాటూ వేసేవాడూ కుర్రాడేట ఇలా రాసాడు... అంది రత్న. బాగానే వుంది పిచ్చివాడి పెళ్ళికి పచ్చి తాగుబోతు సాక్ష్యం అన్నట్టూ వుంది. ఇంతకీ ఆపిల్లాడెవరూ? ఏం చేస్తున్నాడు? చదువా? వ్యాపారమా? అన్నా.

"ఏమో మరి ఇద్దరికీ గొడవలొచ్చి విడిపోయారట" చెప్పింది. ఏ ముహూర్తాన రన్‌డీర్ అని వేయిన్చుకుందో ఆ పేరుని సార్థకం చేసేసాడు కాస్తా లేడిలా పారిపోయాడు.

ఇదీ అత్తయ్యా సంగతీ. ప్రేమ విరగడ అయిపోయింది గానీ ఈ పిల్లా పచ్చబొట్టూ మిగిలారు. ఇంకో నెలరోజుల్లో వీళ్ళ నాన్న వస్తారు. ఆయనసలే దుర్వాసుడు. మా అమ్మనీ నన్నూ దీన్నీ ఉతికి ఎండేస్తారు– అని మళ్లీ ఏడిచింది. ఏడవకు ఏడిస్తే పచ్చబొట్టు చెరిగి పోతుందా? అని ఓదార్చాను.

"పోదు పోదు కనకనే ఈ ఏడుపు నెట్‌లో చూసాను. టాటూలు చెరిపేసుకోవచ్చుట. ఆ క్లినిక్ ఇక్కడికి దగ్గరలోనే ఉందిట. నాకు భయంగా వుంది నువ్వూ తోడు రావా అంది. నాకు ఆశ్చర్యం వేసింది. ఈ రోజుల్లో ప్రతి దానికీ విరుగుడు వుంది. ఇలాంటి కొత్త విషయాలు తెలుసుకోవాలంటే నాకు చాలా కుతూహలం. అదేవిటో చూద్దాం అని బయలుదేరా. ముగ్గురం వెళ్లాం.

క్లినిక్ పేరు రాసివుంది బోర్డ్ మీద– టాటూలు వేయబడును. వేసిన టాటూలు తొలగించబడును అని ఇంగ్లీషులో రాసివుంది. లోపలికి వెళ్లాం. ఏ సీ రూం రిసెప్షనిస్ట్ కుర్చీలు అంతా డాబుసరిగా వుంది. కన్సల్టేషన్ ఫీజు తీసుకుని కూర్చోమంది.

కూచున్నాం గోడ మీద వీపుకీ చేతులకీ కాళ్ళకీ అరంగుళం ఖాళీ లేకుండా టాటూలు వేయించుకుని వొయ్యారంగా నిలబడ్డ అమ్మాయిల బొమ్మలున్నాయి.

కాసేపటికి మమ్మల్ని లోపలికి పంపించారు. డాక్టర్ నవ్వుతూ పలుకరించింది. విషయం తెలుసుకుని దీప్తినీ మమ్మల్ని ముక్క చీవాట్లు పెడుతుందేమో అనుకున్నా. అదేం లేదు నవ్వుతూ విన్నది. అంతేకాదు... కొంతమంది పిల్లలు మెడ మీదా నడుము మీదా వేయించుకుంటారు.

మళ్ళీ రిమూవ్ చెయ్యమంటారు. అక్కడ స్కిన్ సెన్సిటివ్‌గా వుంటుంది. కష్టం. మీ అమ్మాయి చేతిమీద వేయించుకుంది. వెరీ క్లెవర్ గర్ల్ అని మెచ్చుకుంది.

మరి ఈ మేధావి పచ్చబొట్టు తీసేస్తావా అంటే ఈజీగా తీసేస్తా అంది. దానికి యెంత ఫీజు అవుతుందో చెప్పింది నాకు నోరెండి పోయింది రత్నకి మొహం తిరిగి పడిపోయినంత అయింది. ఆవిడే మా ఇద్దరికీ మంచినీళ్ళు ఇచ్చింది.

డబ్బు సరే ఎలాగో తెస్తారు కానీ ఆ పచ్చబొట్టు చెరపటానికి అయిదారు సిట్టింగ్స్ పడుతుందిట ఒక్కో సిట్టింగ్‌కి మధ్య కనీసం పది రోజులు గ్యాప్ వుండాలిట. ఈ లోగా వాళ్ళ నాన్న వచ్చి చాకిరేవు పెట్టిస్తాడు. మళ్ళీ భోరున ఏడిచింది రత్న.

అత్తయ్యా పోనీ ఈ పచ్చబొట్టు చెరిగిపోయే దాకా దీన్ని మీ ఇంట్లో ఉంచుకోగలవా? నేను వీళ్ళ నాన్నకి ఏదో స్టోరీ చెప్తాను– అంది.

నాకు భయం వేసింది. అసలే ఇది తింగరి పిల్ల. మళ్ళీ ఏదైనా నిర్వాకం చేస్తే వీళ్ళ నాన్న అరుంధతి సినిమాలో విలన్లాగా... వదల బొమ్మాళీ అని నావెంట పడితే నేనే గంగలో దూకను? అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మేలు. అందుకే “నావల్లకాదు. ఈ పచ్చబొట్టు వ్యవహారంలో నేను తలదూర్చను” అని చెప్పేసాను. రత్న దిగాలు పడి పోయింది.

డాక్టరు మరో ఉపాయం చెప్పింది. ఆ పచ్చబొట్టు చెరపకుండా డిజైన్ లా మారుస్తాను. అలా అయితే ఖర్చు తక్కువ ఒక్క సిట్టింగ్‌లో అయిపోతుంది. అంది రత్న మొహం వికసించింది. అలాగే కానివ్వ మంది పిల్లని అక్కడ వదిలేసి మేము ఏటియం కి వెళ్లి డబ్బు డ్రా చేసి పక్కనే వున్న హోటల్కి వెళ్లి టిఫిన్ తిని దానికోసం పార్సిల్ చేయించుకుని క్లినిక్‌కి వెళ్లాం. దీప్తి చెయ్యి ఎర్రగా వుంది. మొహం కూడా వాడిపోయింది. చేతిమీద అదివరకు రన్‌ధీర్ స్థానంలో డ్రాగన్ బొమ్మవుంది. ఏమీ

బాగాలేదు. ఆడపిల్ల చేతిమీద ఆ బొమ్మ వికారంగా వుంది.

మా అసంతృప్తి గమనించింది కాబోలు. “నాదగ్గర బ్రహ్మాండమైన డిజైన్లు బోలెడున్నాయి. మరి ఉన్న దాన్ని దిద్దటం కదా. కనీసం పొడి అక్షరాల్లో R.D. అని వేయించుకుంటే ఫ్లోరల్ డిజైన్ అయినా వేసేదాన్ని రన్‌డీర్ కి ఈ డ్రాగన్ మాత్రమే సూట్ అవుతుంది అన్నది. తప్పు మనలో ఉంచుకుని ఎదటి వాళ్ళను ఏమంటాం? డబ్బు చెల్లించి బయటపడ్డాం. వాళ్ళు ఆటోలో వెళ్ళిపోయారు.

నేనూ ఆటోకోసం వెయిట్ చేస్తున్నాను ఓ ఆటో ఆగింది. అందులోంచి ఓ కుర్ర జంట దిగారు. టాటూలు వేసే క్లినిక్ ఎక్కడండీ? అని అడిగారు. చూపించా. వాళ్ళు దిగిన ఆటోలో ఎక్కి ఇంటిదోవ పట్టాను.

ఆ పిల్లలు పిచ్చబొట్టు అదేలెండి పచ్చబొట్టు కోసం కాబోలు వెళ్ళారు. ❑

# మా మహిళాదినోత్సవం

**మా**ర్చ్ నెల వస్తోందంటేనే కాస్త కంగారుగా వుంటుంది.

అప్పట్లో అయితే మార్చ్ వస్తోందంటే పిల్లల పరీక్షలు... ఇన్ కమ్ టాక్స్ కట్టాలి... జీతాల్లో కోతలు... ఆ టెన్షను. అవన్నీ అయిపోయాయి. ఆ రోజుల్లో లేదు గానీ ఆ తరువాత మార్చి ఎనిమిదవ తారీకుని మహిళల దినోత్సవంగా జరుపుకోవడం ప్రారంభం అయింది. జనాభాలో సగం భాగం వున్న మహిళలకు అంటూ ఓ రోజు కేటాయించి ఉత్సవం జరుపుకోడం చాలా ఆనంద దాయకం. దేశం అంతా సందడిగా వుంటుంది ఆ వేళ. మానవజాతి మనుగడకై ప్రాణం పోసింది మగువ... అనుభవాలకి ఆదికావ్యం ఆడదాని జీవితం... ఆలయాన వెలసిన ఆదేవుని రీతీ ఇల్లాలే ఈ జగతికి జీవన జ్యోతీ వంటి పాటలు ప్రతి చానల్లోనూ వినిపిస్తాయి. బోలెడన్ని సభలూ సమావేశాలు జరుగుతాయి.

మరి ఊరంతా సంబరాలు జరుపుకుంటూ వుంటే మనం ఇంట్లో కూర్చుంటే ఏం బావుంటుంది.? అందుకే మేమూ ఏదో ఓ కార్యక్రమం చేస్తాం ప్రతియేడూ. ఇక్కడ మేము అంటే మా బిల్డింగ్ వాళ్ళం అన్నమాట. మా బిల్డింగ్‌లో యాభై కుటుంబాలున్నాయి. అసోసియేషన్ వుంది పండుగలూ పర్వదినాలూ జరుపుకుంటాం. జరుపుకునే ముందు మీటింగ్ పెట్టుకుని ఎలా జరపాలా అని ప్లాన్ చేస్తాం. అలాగే మహిళా దినోత్సవం ఎలా జరుపుకోవాలా అనే విషయం చర్చించడానికి సమావేశం అయ్యాం.

“ఏమాటకామాటే చెప్పుకోవాలి. గతంతో పోల్చుకుంటే స్త్రీల జీవితం చాలా బాగు పడింది. మన రాష్ట్రపతి స్త్రీ, లోక్‌సభ స్పీకరు స్త్రీ, మన రాష్ట్ర గృహ మంత్రి స్త్రీ, ఇందుకు మనమంతా గర్వపడాలి అంటూ అధ్యక్ష స్థానంలో వున్నానేమో నా మాటలతో మీటింగు మొదలెట్టాను.

పార్వతిగారు అందుకుని “ఆ!! ఏం బాగు పడిందీ? నాలుగడుగులు ముందుకి వేస్తే ఆరడుగులు వెనక్కి పోతోంది మన ప్రగతి. అసలు ఆడవాళ్ళకి రక్షణ ఏదీ? మూడేళ్ల పిల్ల మీదా అత్యాచారమే, ముసలమ్మా మీద అత్యాచారమే. ఇక దారుణమైన ఆసిడ్ దాడులు, నేరాలకి అంతు లేకుండా పోతోంది. నేరస్తులని పట్టుకుని శిక్షించే వాళ్ళేలేరు” పార్వతిగారు మాట్లాడ్డం మొదలుపెడితే ఆపటం కష్టం.

అందుకే మొదట్లోనే బ్రేకు వెయ్యాలి. ఆవిడకి ఆవేశం వచ్చేలోగా ఆపకపోతే అసెంబ్లీలో స్పీకరులా తయారవుతుంది నా పరిస్థితి. ఎంత మొత్తుకున్నా వినదు. ఎంత బతిమాలినా కూచోదు. అందుకే “మీరు చెప్పింది నిజమే. కానీ ఇవ్వాళ మహిళా దినోత్సవం గురించి సమావేశం అయ్యాం కాబట్టి పాజిటివ్‌గా మాట్లాడుకుందాం” అన్నా. ఆవిడ శాంతించింది. ఆ తరువాత ఏం కార్యక్రమం చేద్దాం అని చర్చ మొదలు పెట్టాం.

సభ్యులం అందరం తలో రెండు చీరలూ కొని ఏ గుడి దగ్గరకో వెళ్లి ముష్టివాళ్లకు పంచుదామా అనుకున్నాం. అమ్మో అది చాలా కష్టమైన పని. తోపుడు తొక్కిసలాట జరిగితే తట్టుకోలేం. చీరల పంపకానికి పోయి మహా మహా వాళ్ళే చేతులు కాల్చు కున్నారు అంది కుమారి.

ఆమాటా నిజమే మళ్ళీ చర్చించుదాం. ఇప్పుడు సినిమాల్లో స్త్రీల వస్త్ర ధారణ పరమ ఛండాలంగా ఉంటోంది. హీరోయిన్ చేత అయితే మరీ చెడ్డీలు వేయించేస్తున్నారు. టి.వి. సీరియల్స్‌లో స్త్రీ పాత్రలు దారుణంగా ఉంటున్నాయి. అందరూ రాక్షసులూ గయ్యాళి గంగమ్మలూను... ఇది చాలా అన్యాయం కాబట్టి ఓ సభ పెట్టి వాళ్ళని ఏకి పెడదాం... చీల్చి చెండాడుదాం అంది అపర్ణ ఆవేశంగా

“సభ పెట్టొచ్చు కానీ ఏం లాభం? ఆ సినిమాలు సీరియల్సు తీసేవాళ్ళు మన సభకి రారు. ప్రెస్ వాళ్లొచ్చినా ఫలాని వారు సభ పెట్టారు అని టూకిగా రాస్తారు తప్పించి మనం ఏం మాట్లాడామో రాయరు. ఇంతోటి భాగ్యానికి సభ పెట్టుకోడం?” అన్నాను.

ఇలా చాలా విషయాలు చర్చించాం ఏదీ వర్క్ అవుట్ కాలేదు. చివరికి గీత ఓ ఉపాయం చెప్పింది... ఉమెన్స్ డే అంటే పరోపకారమే చెయ్యాలి సభలే పెట్టాలి అని రూలేం లేదుగా. మనం సరదాగా గడుపుదాం అదీ సెలబ్రేషనే. అందరం ఎక్కడికైనా పోదాం పిక్నిక్‌గా అంది. ఇప్పుడా? ఎండలు మండిపోతుంటే ఇప్పుడేం పిక్నిక్ అన్నారంతా ఏదైనా రిసార్ట్‌కి వెళ్దాం అంది గీత. సరే అంటే సరే అనుకున్నాం. నాలుగైదు చోట్లకి

ఫోన్ చేసి ఎక్కడి రేట్లు ఎలా వున్నాయో అడిగి తెలుసుకున్నాం.

ఏదో ఒక చోటు డిసైడ్ చేద్దాం అనుకుంటూ ఉండగానే వాసవి సెల్ ఫోన్ రింగ్ అయింది. అదిరి పడి లేచి నుంచుంది వాసవి." రెండు రోజులా ఎందుకు? ముందు చెప్పలేదేం?" అంది.

ఏవిటీ ఎవరి ఫోన్? అని అడిగాం ఫోన్ కట్ చేసాక. వాళ్ళ పనమ్మాయి శ్యామల ఫోన్ చేసిందిట గురువారం శుక్రవారం రెండ్రోజులూ పన్లోకి రాను వూరెళ్తున్నా అందిట. వెంటనే మరో నలుగురు ఠకీ మని లేచి నుంచున్నారు. వాళ్ళ ఇళ్ళల్లోనూ శ్యామలే చేస్తోంది మీకందరికీ కూడా చెప్పమంది అంది వాసవి. అప్పుడే సీత గారి ఫోన్ మోగింది. వాళ్ళ పనమ్మాయి రాములమ్మ దగ్గర్నించీ అదే కబురు రెండ్రోజులు పన్లోకి రాను అంటూ. అలా ఇద్దరూ ఒకేసారి వూరెళ్ళటం ఏమిటో అనుకుంటూనే వున్నాం పాన్ నములుత్తూ వచ్చింది యాదమ్మ. మా బిల్డింగ్‌లో పనిచేసే వాళ్ళందరికీ లీడరు. పనీ మాటా రెండూ చక్కగా వుంటాయి. యాదమ్మని చూడగానే మాకందరికీ ప్రాణం లేచి వచ్చింది. ఏవిటి యాదమ్మా! శ్యామలా రాములమ్మా వూరెల్తున్నారుట ఎక్కడికి? అన్నాను.

"ఆ మాట చెప్పాలనే వచ్చినా. ఈ అప్పారటు మెంటులోనూ పక్క అపార్ట్ మెంటులోనూ పనిజేసే తోల్లం అందరం ఏడుపాయలు బోతున్నం. ఎనిమిదీ తొమ్మిది తారేకుల్ల పన్లోకి రాం" అంది. అదేవిటి ఏదైనా జాతరా? అడిగాం.

ఏంగాదు అని చెప్పుకొచ్చింది. అందరూ కలిసి ఎక్కడికైనా వెళ్ళాలని అనుకుంటున్నారుట. ఎన్నాళ్ళనుండో అనుకుంటున్నా వీలు కాలేదుట. ఇప్పుడు వెళ్తున్నారట. ఎనిమిది పొద్దున్నే బస్సులో వెళ్ళి రాత్రికి వస్తారుట. మర్నాడు రెస్ట్ తీసుకుని పదోతారీకున పన్లోకి వస్తారట ఆ శుభ సమాచారం మా చెవిన వేసి చక్కా పోయింది యాదమ్మ

మరి మన మీటింగ్ కొనసాగిద్దాం అంది శ్రీలత. నాకు నవ్వొచ్చింది. ఇంకేముంది కొనసాగించడానికీ? ఎనిమిదీ తొమ్మిది పనివాళ్ళు రారు ఇక మనం ఇల్లొదిలి ఎక్కడికి పోతాం ఏట్లోకి? అన్నా అందరూ అవును స్మీ ఎలా అన్నారు. పోన్లే మన బదులు వాళ్ళు వెళ్తున్నారు వాళ్ళూ మహిళలేగా. ఏ మహిళ ఆనందంగా గడిపినా మనందరికీ

పండగే అని తీర్మానించి మా మీటింగు ముగించాం.

వూరెల్తున్నాం అంటే అడ్వాన్సులూ పాత చీరలూ ఇచ్చి పనివాళ్ళను సాగనంపాం. మరి మా మహిళా దినోత్సవం ఎలా గడిచిందీ అంటే బానే గడిచింది. ఆడుతూ పాడుతూ పని చేస్తుంటే అని పాడుతూ అన్ని పన్లూ చేసేసుకుని పండుగ చేసుకున్నాం. ❑

# కావలసిన వస్తువులు

**మా** చిన్నక్కయ్య ఫోన్ చేసింది అమెరికా నించి... "చచ్చిపోతున్నానే మీ బావతో! ఇదెక్కడి చాదస్తమే బాబూ! అక్కడుంటే కాసేపు బయట తిరిగొచ్చేవారు. కాస్త టైం పాస్ అయ్యేది. ఇక్కడేమో చలీ మంచూనూ, యిరవై నాలుగ్గంటలూ ఇంట్లో కూర్చోవడమే కదా నా బుర్ర తింటున్నారు. వద్దండీ మనకు ఈ గ్రీను కార్డూ అంటే అప్పుడు వినలేదు... ఇప్పుడు ఇలా వేపుకు తింటున్నారు" అని వాపోయింది.

గంటసేపు ఏడ్చుకుని ఫోను పెట్టేసింది. దాని కొడుకులు ఇద్దరూ అమెరికా వెళ్ళి అక్కడి సిటిజన్స్ అయిపోయారు. అంతటితో ఆగక మూడేళ్ళ క్రిందట అక్కయ్యకీ బావకీ కూడా గ్రీన్ కార్డు చేయించి వాళ్ళనీ అక్కడికే తోలుకుపోయారు. వాళ్లకి ఓ కూతురుంది. అది మాత్రం ఇక్కడే వుంది. సరే ఇదంతా ఇప్పుడు నడుస్తున్న చరిత్ర. ఇంటింటి రామాయణం.

మరి చిక్కు ఎక్కడ వచ్చిందీ అంటే మా బావకి తగని జిహ్వా చాపల్యం. మన వంటలంటే ప్రాణం. అక్కడా అన్నీ దొరుకుతున్నాయి ఇప్పుడు. ఆమాట నిజమే పచ్చి కొబ్బరి తురుము పూదీనా పేస్టూ అన్నీ దొరుకుతూనే వున్నాయి. కొన్ని మాత్రం దొరకడం లేదు. అక్కడ కాదు ఇక్కడా దొరకవు. ఉదాహరణకి కమ్మగా జిహ్వా లేచి వచ్చేలా అమ్మమ్మ చేసినట్టూ వుండే గోంగూర పచ్చడి చింతకాయ పచ్చడీ దొరకవు.

కమ్మటి మినపసున్ని దొరకదు. కజ్జికాయలూ దొరకవు. విరిచి నోట్లో వేసుకుంటే కరిగిపోయే వడియాలు దొరకవు. దొరికిన వాటితోనే సరి పెట్టుకున్నాం. అలా సరిపెట్టుకోక పోతే రోజులు గడవద్దూ. కొంత మంది మాత్రం అలా సర్దుకోలేక పక్కవాళ్ళని కాల్చుకు తింటున్నారు. కంది పచ్చడి మిక్సీ రుబ్బకు రోట్లో రుబ్బు అని మా బాబయ్య మా పిన్నిని కాల్చుకు తింటాడు. పప్పు కుక్కర్లో వండకు వేయించి కుంపట్లో వండు అని మా నాన్నగారు అమ్మని వేపుకుతినేవారు.

మా చిన్న బావ కూడా ఆ కోవకే చెందుతాడు. ఆయనకి గుమ్మడి వడియాలంటే పంచ ప్రాణాలూనూ. వాళ్లింట్లో మా అక్కయ్య బోలెడన్ని వడియాలు పెట్టేది ఏడాదికి సరిపడా. అయినా సరే ఆయన ఆశ తీరేది కాదు. ఆయనలోని ఆ వీక్నెస్‌ని అలుసుగా చేసుకుని అందరూ ఆయన్ని ఆట పట్టించేవారు.

మా అక్కని పుట్టింటికి పంపుతూ ఓ వారంలో తిరిగి రావాలి లేకపోతే ఇక మీదట నిన్ను పుట్టింటికి పంపను... అని రూలు పెట్టేవాడు. అల్లాగే అని తలాడించి వచ్చేది అక్కయ్య. అదింకా రెండు రోజుల్లో బయలు దేరుతుండగా మా అమ్మ తెలివిగా పొలం నించీ పెద్ద బూడిద గుమ్మడికాయ తెచ్చాడు పాలేరు. కాయ కాస్త వాడు మొహం పట్టాక వడియాలు పెడుతుందిట అమ్మ... ఉండి వడియాలు పట్టుకెళ్ళవే అంటోంది. మరి ఏం చెయ్యమంటారు? అని అక్కయ్య చేత వుత్తరం రాయించేది. మా ఊరికి బావా వాళ్ళ ఊరికి డైరెక్ట్ బస్సు... బస్సు డ్రైవర్‌కి ఇస్తే వుత్తరం అక్కడ ఇచ్చేసేవాడు. మర్నాటికల్లా బావగారి దగ్గరనుంచీ సమాధానం వచ్చేది. మరో పది రోజులు వుండి వడియాలు తీసుకునే రా తొందరేం లేదు... అని రాసేవాడు.

మా చిన్న తమ్ముడికి వుద్యోగం కోసం కాస్త రికమండ్ చెయ్యండి అంటే ఇలాంటివన్నీ నాకు గిట్టవు అన్నాడు చిన్న బావ... నాన్నగారు దిగులు పడితే మీరు బాధ పడకండి నేను చూసుకుంటా అంటూ మా పెద్దన్నయ్య ఓ పెద్ద సంచీడు గుమ్మడొడియాలు పుచ్చుకుని మా తమ్ముడిని వెంట పెట్టుకు వెళ్ళాడు. ఆ దెబ్బతో తమ్ముణ్ని స్వయంగా తీసుకెళ్ళి వుద్యోగం ఇప్పించి ఇంటికొచ్చాడు మా చిన్న బావ. అలాంటి సంఘటనలు కో కొల్లలు.

ఇప్పుడు పాపం వడియాల కోసం ఆరాట పడిపోతున్నాడు అమెరికాలో కూర్చుని!!! అక్కడ ఇండియన్ స్టోర్‌లో గుమ్మడి వడియాలు దొరికితే కొనుక్కుని తిన్నాడుట. పళ్లకి వున్న కేప్‌లు కదిలిపోయి డెంటిస్ట్ దగ్గరికి వెళ్తే బోలెడన్ని డాలర్లు వదిలాయట. పిల్లలు విసుక్కున్నారట.

అమెరికాలో వుండ బట్టి కదా నాకీ దుస్థితి అని బాధ పడుతున్నారట. ఇండియాలో అయినా గుమ్మడి వడియం కొనుక్కు తింటే పళ్ళు రాలిపోతాయి. వడియాల తయారీ విధానం మారిపోయింది. ఆ రోజులు పోయాయి అంటే ఆయన నమ్మటం లేదు.

ఈ గొడవ ఇలా నడుస్తూ వుండగా అక్క కూతురు ఫోన్ చేసింది పిన్నీ నాన్నకి. డెబ్బైయవ పుట్టిన రోజొస్తుంది కదా ఏం కావాలి నాన్నా అంటే కమ్మగా నోట్లో వేసుకుంటే

కరిగిపోయే గుమ్మడి వడియాలు పెట్టి పంపించు అన్నారు. పాపం ఆయన బతుకంతా మాకోసమే కష్టపడ్డారు. ఆయన కోసం ఆ మాత్రం చెయ్యలేనా? పెట్టేస్తాను. పిన్నీ నువ్వు సాయం చేస్తావా? అంది. దాని పితృ భక్తికీ మా బావ దీన స్థితికీ బాధ కలిగింది. అలాగే దానికేం భాగ్యం అన్నా. వడియాలు పెట్టడానికి వస్తువులు ఏం కావాలి పిన్నీ అని అడిగింది.

మినప్పప్పు, బూడిద గుమ్మడికాయ, పచ్చి మిరపకాయలు, ఉప్పు అని కావలసిన సరుకులు చెప్పాను. మర్నాడు పదింటికి ఫోన్ చేసింది సరుకులు కొనేసా పిన్నీ ఎప్పుడొస్తావ్? అంది. రేపు సాయంత్రం వస్తా అన్నాను.

దానికీ మాకు పాతిక కిలోమీటర్ల దూరం. మధ్యాన్నం భోజనం చేసి బయలుదేరి నాలుగింటికి చేరాను. కాఫీ ఇచ్చి తను తెచ్చిన సరుకులు చూపించింది. గుమ్మడికాయ ముదురుగా చెక్కు గట్టి బావుంది. మినపగుళ్ళు బావున్నాయి. ఉప్పూ మిర్చి చూసేది ఏముంది? కిందికెళ్ళి వాచ్‌మెన్ చేత కాయ పగల కొట్టించాను.

కత్తిపీట తేవే అన్నాను. తెల్ల మొహం వేసింది. కత్తిపీట లేదు పిన్నీ కటింగ్ బోర్డు వుంది. చాకు వుంది అంది. బూడిద గుమ్మడికాయ చాకుతో ఎలా తెగుతుంది? ఎవరింట్లోనైనా ఉందేమో కనుక్కోవే అన్నా. పాపం ఆ బిల్డింగ్‌లో వున్న ఇరవై మూడు ఫ్లాట్లల్లోనూ తిరిగి మొహం వేలాడేసుకుని వచ్చింది. లేదుట.

సరే చూద్దాం అని చాకుతో తరగడానికి ప్రయత్నిస్తుంటే అప్పుడు గుర్తొచ్చింది. అవునే అమ్మడూ వడియాలు ఎక్కడ ఎండబెడతావు? అని అడిగాను. బాల్కనీలో బట్టలు ఎండేసుకుంటాం కదా అక్కడే అంది.

వెర్రి పిల్లా! బట్టలు ఎండేసుకునే బాల్కానీలో వొడియాలు ఎండవే. పైన టెర్రస్ మీద ఎండబెట్టాలి అన్నాను. టెర్రస్ మీద జాగా లేదు పిన్నీ పెంట్‌హౌస్ వాళ్ళు రూఫ్ గార్డెన్ వేసుకున్నారు... అంది. మరెలా? వడియాలకి ఫెళ్ళుమనేలా ఎండకావాలి అన్నాను?

వడియాలు పెట్టాలంటే ఏం కావాలి పిన్నీ అంటే గుమ్మడికాయా మినప్పప్పూ అన్నావు తీరా ఆఖరి క్షణంలో కత్తిపీట కావాలి ఫెల్లుమనే ఎండ కావాలి అంటే ఎక్కడి నించి తేనూ??? అని విసుక్కుంది.

నాకూ చిరాకేసింది. "పెళ్ళికి ఏమేం కావాలి అంటే తాళి బొట్టూ తలంబ్రాలూ

అనిచెప్తాం గానీ ఒక పెళ్లి కొడుకూ ఒక పెళ్ళి కూతురూ అని చెప్తారుటే ఎవరైనా" అని కోప్పడ్డా? మరి ఇప్పుడు ఏం చేద్దాం? అంది. ఈ చుట్టు పక్కల బిల్డింగ్ వాళ్ళని ఎవరినైనా అడిగి చూడు అన్నాను.

అంత చనువు లేదు నాకు– అంది. నిజమే ఉద్యోగానికి పొద్దున్న పోయి రాత్రి వచ్చే పిల్ల పక్క బిల్డింగ్ వాళ్లతో టెర్రెస్ అరువడిగే చనువెక్కడుంటుంది? అయినా పాపం అడిగి చూసింది ఫోన్లో. వాళ్ళకి అభ్యంతరం లేదుట గానీ అసోసియేషన్ వాళ్లొప్పుకోరుట మరి. అదీ నిజమే అలా టెర్రస్సు వడియాలకీ అప్పడాలకీ పరాయి వాళ్ళకి ఎలా ఇస్తారు? మా టిర్రెస్ ఖాళీగా వుందేమో అని ఫోన్ చేశా. వారం దాకా ఖాళీ లేదుట. ఎవరిదో గణపతి హెూమం పుట్టిన రోజు లంచ్, అలా వరస పెట్టి వున్నాయి ప్రోగ్రాములు. పై వారం దానికి సెలవు దొరకదుట. ఆపై వారం నావూరు ప్రయాణం... ఇంకెవరినైనా మా వాళ్ళని సాయం అడుగుదామా అనుకున్నాం. కానీ ఆఖరి క్షణంలో ఈ బద్దలు కొట్టిన గుమ్మడికాయతో ఏం పరుగులు పెడతాం?... సరేలే మరోసారి ప్లాన్ చేసి చోటు వెతుక్కుని పెడదాం వడియాలు అన్నా. కోసిన గుమ్మడికాయ ఏం చెయ్యను? అంది తలో ముక్కా పంచి పెట్టు అన్నా. ఇంకా నయం పప్పు నీళ్ళల్లో నాన బొయ్యలేదు పోసి వుంటే అది కూడా పంచలేక చచ్చే వాళ్ళం అంది.

నా వాటా గుమ్మడిముక్కతో ఇంటికొచ్చి మర్నాడు పచ్చి వడియాలు వేయిస్తే అందరూ లొట్టలేసుకుంటూ తిన్నారు. ఏమిటీ స్పెషల్ అన్నారు. ఈ సోది అంతా చెప్పటం ఇష్టం లేక ఏం లేదు ఊరికికే అనేసాను. ఈ అనుభవంతో బుద్ధొచ్చింది ఈసారి ఎవరైనా వచ్చి "వడియాలు ఎలా పెట్టాలి ఆంటీ? కావలిసిన వస్తువులు ఏమిటీ" అని అడిగితే మినప్పప్పూ గుమ్మడికాయతో పాటు చోటూ, కత్తిపీటా, వోచాపా అన్నింటినీ మించి వోర్పు సహనం అని వివరంగా చెప్పాలి. అవన్నీ వుంటే వడియాలు పెట్టుకుంటారు లేకపోతే బజార్లో కొనుక్కుని పళ్ళు రాలగొట్టుకుంటారు. అదీ కాకపోతే తూర్పుకి తిరిగి దణ్ణం పెడతారు. ❑

# నంబికొండా ఏం సాయం?

**మ**ళ్ళీ మొదలుపెట్టాడు మా కాంతం మామయ్య. ఇప్పుడు నువ్వెళ్ళకపోతే ఏం మహానుభావా... అంటే వినడు. రత్ నే వెళ్ళి పరామర్శించాల్సిందే అంటాడు. అసలే వాళ్ళు పీకల్దాకా మునిగిపోయి ఉన్నారు. నువ్విప్పుడు తగుదు నమ్మా అని వెళ్తే వాళ్ళకి ఒరిగిపడేది ఏమీ లేదు. పైగా బోలెడంత తలనెప్పి అని మొత్తుకున్నా వినడు.

ఆయన వెళ్ళాలంటే సామాన్యమా! బోలెడంత మంది కూడా వెళ్ళాలి. స్వయం శక్తితో వెళ్ళలేడు. అసలు విషయం ఏమిటంటే మాకు తెలిసిన వాళ్ళింట్లో ఓ పెద్దాయన ప్రాణాపాయస్థితిలో ఉన్నాడు. ఆయన ఐసియులో ఉన్నాడు. అయినవాళ్ళంతా హాస్పిటల్ లాబీలో ఉన్నారు. ఎటూ తేలకుండా ఉంది. ఇప్పుడున్న ప్రమాదస్థితి చాలక ఇంకా ముందు బ్రెయిన్ హెమొరేజ్ అయ్యే ప్రమాదం కూడా ఉందని, ఏ సంగతీ కచ్చితంగా చెప్పలేమనీ చెప్తున్నారు వైద్యులు. దగ్గరి బంధువులంతా తలలు చేత్తో పట్టుకుని కూర్చున్నారు.

వాళ్ళని మా కాంతం మామయ్య పరామర్శిస్తాడుట. సాటివాడు ఆపదలో వుంటే పక్కవాడు పరామర్శించడం తప్పేంకాదు. చేతనైన సాయం చెయ్యాలి. అక్కడ వాళ్ళకి గట్టివాళ్ళు, జమాజెట్టిల్లాటి వాళ్ళు నిలబడి సాయం చేస్తున్నారు. అలాంటివాళ్ళు వెళ్ళి పరామర్శించినా అందం, చందం. మామయ్య వెళ్తేమాత్రం వాళ్ళకి ఏ మాత్రం సాయం? తనంతట తను నడువలేడు. ఇద్దరు పట్టుకు నడిపించాలి. మరో నలుగురు సాయం వెళ్లాలి. పోనీ వెళ్ళినవాడు ఊరికే వుంటాడా? ఉండడు. ఇదిగో చూడండి. ఎంచక్కా నేనొచ్చి పరామర్శిస్తున్నాను. గానీ ఫలానా రంగయ్య వచ్చేడా? సుబ్బయ్య వచ్చేడా? మరి రావద్దా. ఆ మాత్రం బాధ్యత లేకపోతే ఎట్లా? నేను చూడండి. ఓపిక చేశాను ఎలా వచ్చాను అన్నది కాదు కృష్చిను. అసలు రావటమె గొప్ప. అదీ పాయింటు. అని ఊదరకొడతాడు. వాళ్ళు సరే నాయనా వచ్చావు. నువ్వు చాలా గొప్పవాడివి. కాదనం.

కాకపోతే ఇక త్వరగా దయచేస్తే ఏడుపేదో మేము ఏడ్చుకుంటాం! నువ్వు రావటం కాదుగానీ, మా పన్లన్నీ ఆగిపోయాయి అని లోలోపలే ఏడ్చుకుంటారు.

కాంతం మామయ్య వచ్చాడనీ ఇలా అన్నాడనీ నలుగుదికీ తెలిసిపోతుంది. అప్పటిదాకా ఊరుకున్న రంగయ్య, సుబ్బయ్య, ఎల్లయ్య, పుల్లయ్య అందరికీ పరామర్శలకి. ఇంతమంది వచ్చి పడిపోయి పరామర్శిస్తుంటే అవతలి వాళ్ళు ఉక్కిరి బిక్కిరైపోతారు.

ఊరికే వచ్చి కబుర్లు చెప్పిపోవడం తప్పించి వీళ్ళేమైనా ఆరుస్తారా? తీరుస్తారా? ఇంతమంది విజిటర్స్ ఏమిటని హాస్పిటల్ వాళ్ళూ విసుక్కుంటున్నారు– అని వాపోతారు.

ఎన్ని చెప్పినా కాంతం మామయ్య వినడుగా. వెళ్ళాడు మందీమార్బలంతో. మాకు చిరాకొచ్చేసింది. కాస్త మూడ్ మారుతుందని టివి పెట్టాం.

వరద దృశ్యాలు... మోకాల్లోతు నీళ్ళు... ఓ పెద్ద మనిషి వాహనంమీద నిలబడి ఓదారుస్తున్నాడు. ఉపన్యాసంతోనే ఊదరకొట్టేస్తున్నాడు. చుట్టూ చేరిన జనంలో ఉందో ముసలమ్మ. ఆ పెద్దమనిషికి తోడుగా వచ్చిన బృందంలోని ఓ మనిషిని పట్టుకుని "అన్నం పొట్లం ఎప్పుడిస్తారయ్యా?" అని అడిగింది.

"వీళ్ళు వాళ్ళు కాదమ్మా. అన్నం పొట్లాలు పంచడానికొచ్చిన సంఘాల వాళ్ళని సెక్యూరిటీ వాళ్ళు ఊరిబయటే ఆపేశారు. వీళ్ళు వెళ్ళాక వాళ్లొస్తారు!'' అన్నాడతను.

"మరి వీళ్ళేం చేస్తారు?" అడిగింది.

"ఓదారుస్తారు" అన్నాడతను.

"ముందు అన్నం పొట్లాల వాళ్ళని పంపించాక అప్పుడు వీళ్ళని పంపించవచ్చు కదయ్యా! కడుపు మండుతూ ఉంటే ఓదార్పులేం ఆదుకుంటాయి?" రెండ్రోజులుగా పస్తులు ఉంటున్న ఆ ముసలమ్మ దీనంగా కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

నంబికొండా ఏం సాయం అంటే... అడ్డం పడకుండా వుంటే అదే సాయం అనే సామెత ఊరికే వచ్చిందా మరి?! ❑

❖❖❖

# రచయిత్రి జీవనరేఖలు

**పుట్టిన తేది** : 18-07-1953

**జన్మస్థలం** : యాజలి గ్రామం, గుంటూరు జిల్లా (ఆం.ప్ర.)

**తల్లిదండ్రులు** : కీ॥శే॥ వల్లూరి సత్యవాణి,
కీ॥శే॥ వల్లూరి వెంకటకృష్ణమూర్తి

**వివాహం** : 1970లో. శ్రీవారు శ్రీ పి.వి. శివరావుగారు రైల్వేస్‌లో డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసి 2004లో ఉద్యోగ విరమణ చేశారు.

**సంతానం** : ఇద్దరు పిల్లలు – శిరీష, ప్రవీణ్‌కుమార్.

**రచనా వ్యాసంగం** : 1982లో ప్రారంభం

మొదటి నవల 'ప్రేమలేఖ'– 'శ్రీవారికి ప్రేమలేఖ' సినిమాగా వచ్చింది.

200 కథలు, 20 నవలలు, 3 సినిమాలు, 3 టీ.వీ. సీరియల్స్, రేడియో ప్రసంగాలు, రేడియోలో రచనలు నాటికలుగా ప్రసారమయ్యాయి.

'పొత్తూరి విజయలక్ష్మి హాస్యకథలు', 'చంద్రహారం', 'మా ఇంటి రామాయణం', 'ఆనందమె అందం'– కథా సంపుటాలు; ప్రేమలేఖ, ఆత్మకథ, లక్ష్మీకల్యాణం, కృష్ణపక్షం–శుక్లపక్షం, శంకర్రావు పెళ్ళి, శ్రీరస్తు–శుభమస్తు – నవలలు వెలువడ్డాయి.

**పురస్కారాలు** : 2007 పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి ధర్మనిధి పురస్కారం.

2007 తురగా కృష్ణమోహనరావుగారి స్మారక పురస్కారం.

2009 శేషారత్నం స్మారక హాస్యకథా పురస్కారం.

2011 కేసరికుటీరం, చెన్నయ్‌వారి గృహలక్ష్మి స్వర్ణ కంకణం



## Konchem Ishtam Konchem Kashtam

**by Pothuri Vijayalakshmi**
(A Column Published in Andhra Bhoomi, Daily)

పోలీసుగారూ! పోలీసుగారూ! ఇంకో పొగ బండి వెళ్లిపోతోందండీ ! అన్నాను. అబ్బా! మీరిక వెళ్ళండి మేడం, ఆ బండికి పొల్యూషన్ సర్టిఫికేట్ వుంది. విసిగించకండి...మమ్మల్ని మా వర్క్ చేసుకోనివ్వండి- అని మొహం తుడుచుకుంటూ విసుక్కున్నాడాయన!

✦✦✦

పెళ్ళికి ఏమేం కావాలి అంటే తాళిబొట్టు తలంబ్రాలు - అని చెప్తాం గానీ ఒక పెళ్ళికూతురు ఒక పెళ్లికొడుకు అని చెప్పారుటే ఎవరైనా? అని కోప్పడ్డాను!

✦✦✦

యాత్రికులకు విజ్ఞప్తి: కొలనులో స్నానం చేసేవారు నూనె, సబ్బు, షాంపు వగైరాలు వాడరాదు అని మైకులోంచి అనౌన్సుమెంట్ వినిపించింది. అప్పటిదాకా తిన్నగానే ఉన్న మన మొద్దు మునక వేస్తున్నవాడు ఆగిపోయి “సుబ్బా! ఆ సబ్బిటు పట్రా! “ అన్నాడు !!!

ఇటువంటి సరదా అంశాల సమాహారం ఈ పుస్తకం.

*Sri Rishika Publications*, Hyderabad.